# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక ఫిబ్రవరి, 2012 ₹ 20



విష్ణురూపం విశ్వరూపం

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 23 ఫిబ్రవరి 2012 సంచిక 2**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 3

జ్ఞానాభివృద్ధికి శ్రీ మహాభారతం ........ 5

*- కట్టమంచి రామలింగా రెడ్డి*

చరిత్ర గర్భంలోకి ........ 7

*- నండూరి పార్థసారథి*

భారతీయ నాటకం ........ 12

*- డాక్టరు చాట్ల శ్రీరాములు*

తొలి స్త్రీవాద మహిళ ........ 17

*- అన్య*

తెలుగులో స్త్రీవాద రచనలు ........ 20

*- డాక్టరు వి.త్రివేణి*

ఎందుకీ పయనం-ఎక్కడకీ ప్రయాణం? ........ 26

*- వల్లభనేని అశ్వినీకుమార్*

మేధావి దీనగాథ ........ 31

*- వేదాంతం లక్ష్మీప్రసాదరావు*

కాటమ రాజు కథ (ఆరుద్ర నాటకం) ........ 35

*- డాక్టరు దామెర వెంకట సూర్యారావు*

కలంకారి (శ్రీకాళహస్తి) ........ 40

*- కాండ్రేగుల నాగేశ్వర రావు*

స్వాతంత్ర్య యాత్ర ........ 43

*- దర్భి చెంచయ్య*

ఓదార్పు ........ 46

*- ఏనుగుల వీరాస్వామి*

తెలుగులో గ్రంథమాలలు ........ 48

*- డాక్టరు వెలగా వెంకటప్పయ్య*

నేల తల్లి కథ - సుధా చౌహాన్ ........ 55

*- డాక్టరు దేవరాజు మహారాజు*

అభ్యుదయ సూత్రాలు-గూడవల్లి రామబ్రహ్మం చిత్రాలు .... 57

*- మిసిమి*

సృజన - నేటి ఆవశ్యకత ........ 65

*- కె. బాలకృష్ణా రెడ్డి*

రాబందుల సందడి ........ 72

*- ఎ.కె.*

సంజీవదేవ్ స్వీయచరిత్ర ........ 74

*- మిసిమి*

చదవండి (పుస్తక పరిచయం) ........ 76

నవ్వులు ........ 78


| | | | |
|---|---|---|---|
| *ముఖచిత్రం* : | భారత్ | *- చిత్రకారుడు* : | గిరిధర గౌడ్ |
| *రెండవ అట్ట* : | విష్ణురూపం | : | కలంకారీ కళ |
| *మూడవ అట్ట* : | అందానికి అలంకారం | : | కలంకారీ కళ |
| *నాల్గవ అట్ట* : | అమ్మ | - చిత్రకారుడు : | గిరధర గౌడ్ |

చరిత్రలో ఎన్నో సిద్ధాంతాలు-వాదాలు మానవజాతి పురోగమనానికి దోహదం చేశాయి. కొన్ని తిరోగమనానికీ సహకరించాయి. అయితే ఏదీ శాశ్వత పరిష్కారం చూపలేదు. చర్చకు, ఆచరణ సాధ్యానికి మధ్య ఎంతో అగాధం వుంటుంది. వాదాలన్నీ ఏకరవు పెట్టే సందర్భం కాకపోయినా మానవీయ సంబంధాలను ఎక్కువగా ప్రభావితం చేసిన స్త్రీ వాద మూలాలెక్కడ అని చూడబోతే కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలే వెలుగులోకి వచ్చాయి. అలాగే తెలుగులో స్త్రీ వాద రచనల తీరుతెన్నులు స్పృశించి వివరించారు త్రివేణి.

భారతీయనాటకం ఎలావుందో-ఎలావుండేదో-ఎలావుండాలో ఎంతో సాంకేతికంగా విపులీకరించి లోతుపాతులను తెలియజేశారు తెలుగునాట నాటకానికి ఊపిరులూదు తున్న చాట్ల శ్రీరాములు.

ఈ నాటి క్లిష్టపరిస్థితుల్లో 'మేధావి' ఏమిచేయాలి? ఏమిచేయగలడు? ఎందుకు ఇంత దీనావస్థలో మిగిలిపోతున్నాడు? ఇది ఎంతో ఆందోళన కలిగించే విషయం. ఈ చర్చకు తెర తీసినవారు వేదాంతం లక్ష్మీప్రసాదరావు.

మనకు కలంకారి అంటే పెడన-బందరు. కాని శ్రీకాళహస్తి కలంకారీ కళ ప్రత్యేకతను, ఆధునీకరించిన తీరును వివరించాము ఈ సంచికలో.

దగ్గర బంధువులో, మిత్రులో తమ సన్నిహితులను కోల్పోతే-మనకు ఓదార్చేందుకు మాటలే దొరకవు. ఈ ఓదార్పు ఉత్తరం చదవండి.

ఈనాటి అభివృద్ధి పేరుతో జరిగే విధ్వంసానికి మూలాలెక్కడ? మనిషికి ఇంత హింసా ప్రవృత్తి ఎందుకు పెరిగి పోతున్నది? ఎన్నో కారణాలు. కాని సృజనాత్మకత అనే వ్యాపకం పెంపొందించుకోగలిగితే కొంత వరకైనా హింసను అడ్డుకోవచ్చేమో?

'రూపాయిల లెక్కలు చూసుకునే వ్యాపారస్తుల చేతుల్లోనుంచి సినిమాను విడిపించాలి. మన అభ్యుదయ ఆలోచనలకు ఆశ్రయమిచ్చే సంపన్నుల అండతో ఇదే సినిమాను ప్రచార సాధనంగా ఉపయోగించాలి. జనాభ్యుదయానికి, సంఘశ్రేయస్సుకు, దేశ సంస్కరణకు సినిమాను సాధనంగా వాడుకోవాలి' అని రామబ్రహ్మం ఎంతో స్పష్టమైన అభిప్రాయంతో సినీరంగంలో అడుగు పెట్టి గాంధీ ఆశయాలకు ప్రచారం కల్పించారు. అటువంటి వైతాళికుని పరిచయం చదవండి.

ఆలపాటి రవీంద్రనాథ్ 16వ వర్ధంతికి మా శ్రద్ధాంజలి.

– సంపాదకులు



# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'అంతర్వీక్షణం'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

---

★ "***మిసిమి*** చందాదారుడిని కొన్ని సంవత్సరాలుగా.. మూడు నెలల నుండీ పత్రిక అట్టమీద బొమ్మ లేకుండా వస్తోంది. మొన్న తెలిసిన వాళ్ల పెళ్లికి వెళ్లాను. పెళ్లి కూతురికి వచ్చిన బహుమతి ఒకటి చూశాను. అది ఫ్రేము కట్టిన ***మిసిమి*** బొమ్మ. మరీ పీటల మీదే అడగలేము కదా– తర్వాత ఎవరిచ్చారని అడిగితే పెళ్లికూతురు సిగ్గుపడిపోయింది. మావూళ్లోనే ఎవరో అట్టలు దొంగిలించి ఫ్రేములు కట్టించి మరీ బహుమతులుగా ఇస్తున్నారు. అదండీ సంగతి..."

– **జి. అశోక్,** కరీంనగర్ (వాయిస్ మెయిల్).

★ "...నేతాజీ ఉత్తరాలు, అమ్మగార్కి, అన్నయ్యగార్కి వ్రాసినవి చదువుతుంటే కన్నీరు, జలజల రాలాయి. "తల్లిఎల్లప్పుడు స్వార్థపరురాలు కాలేదు" పవిత్ర గంగాతీరంలో వేదఘోష వినబడుట లేదు. మళ్ళీ ప్రకాశవంతం చేయడానికి మన సోమరితనాన్ని వదల గొట్టడానికి ఆశాదేవి ఆవిర్భావం మన మధ్యకు వచ్చేసింది. ఆమె ఆవిర్భావం స్వామి వివేకానందుని రూపంలో వచ్చింది... ఇంత గొప్పగా నేతాజీ, వివేకానందుని కొనియాడటం మన అదృష్టం. భగవంతుడు తన అయస్కాంత శక్తితో మనలను తనవైపుకు లాక్కుంటున్నట్లు నామటుకు అలా అనిపిస్తోంది. ఇది చాలా బాగా పోలిక కలిగియున్నది. అనువాదకులు జె.లక్ష్మీరెడ్డి గార్కి నమస్కారములు..." – **చింతా మల్లికార్జున రావు,** పార్వతీపురం.

★ "...అన్నట్లు ***మిసిమి*** సెప్టెంబరు 2011 సంచికలో శ్రీ సూర్యదేవర రవికుమార్‌గారు రచించిన *కర్షక కవి ఏటుకూరి వెంకటనరసయ్య* అనే వ్యాసం కూడా 'నవకవిబ్రహ్మ' సాహితీ విశేషాలను వివరించింది...

*...మా తెలుగు తల్లికి మల్లెపూదండ* అనే జాతీయ గీతాన్ని అమృతగళంతో ఆలపించి తెలుగు గుండెల్ని మాతృభక్తితో నింపిన టంగుటూరి సూర్యకుమారి గారి 86వ జయంతి సందర్భంగా స్త్రీ స్వేచ్ఛకు ప్రతీకగా ఆమె ప్రదర్శించిన బహుముఖ ప్రతిభను ***మిసిమి*** సంపాదకీయం ప్రస్తుతించటం అవశ్యం అభినందనీయం... తెలుగు వచన రచనకు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు చేసిన అపూర్వ సేవ, *రాయలసీమ వేమన* విశేషాలు, *రాగోపనిషత్తు* మొదలైన ఎన్నో ముఖ్యాంశాలను మన ***మిసిమి*** ద్వారా పాఠకలోకానికి అందిస్తున్న మీకు హృదయపూర్వకమైన అభినందనలు...

...డిసెంబరు 2011 సంచిక ముఖచిత్రం *డొమినో కో వాడిస్,* రెండవ అట్ట *సూర్యకుమారి ఎల్విన్,* మూడవ అట్ట *సెయింట్ పెడ్రో బెసిలిక,* నాల్గవ అట్ట *మేరి* కావటం సమయోచితంగా ఉన్నది. చిత్రకారులు అభినందనీయులు... ***మిసిమి*** పత్రిక ఆద్యంతం అందులోని రచనలు, ముఖచిత్రాలతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఇవి కూడా నూతన కాంతులతో ***మిసిమి*** ని సార్థకం చేస్తున్నాయి..." – **'సాహిత్యబ్రహ్మ' డా॥వి.వి.ఎల్.నరసింహారావు,** హైదరాబాదు.

★ "...జనవరి ***మిసిమి*** సంచిక వడ్డాది పాపయ్య గారు వేసిన బొమ్మలతో కొత్త రూపును సంతరించుకున్నది. ఒక్క బొమ్మ పదివేల పదాల పెట్టు అన్న ప్రభావితమైన మాటలోని నిజం వడ్డాది పాపయ్య బొమ్మలకు అతికినట్టు సరిపోతుంది. మూర్తిని కాకుండా, స్ఫూర్తిని, కళాకారున్ని గాక వారి సృజనను అభిమానించమన్న వడ్డాది పాపయ్య మాటలు విలువైనవి.

డబ్బు ఖర్చుపెట్టి ప్రచారం చేసుకొనే కీర్తి ఖండూతి మనుషులు దండిగా ఉన్న నేటి సమాజంలో ఎలాంటి ఆర్భాటాలకు, సన్మానాలకు, ప్రచారాలకు చోటివ్వని అతి సామాన్య జీవితాన్ని గడిపిన గొప్ప చిత్ర కళా తపస్వి వడ్డాది పాపయ్య. నిత్య యశస్వి. వారిని గురించి ఎన్నో తెలియని విషయాల్ని మాకు తెలిపినందుకు మీకు అభినందలు..."

**– పి.నారాయణరెడ్డి,** నాగార్జునసాగర్, గుంటూరు జిల్లా.

★ "...98 సంవత్సరాల ఒక వృద్ధ అధ్యాపకుని కృషిని ఈ విధంగా నలుగురి దృష్టికి తీసుకు వచ్చినందుకు ముందుగా మిమ్మల్ని అభినందిస్తున్నాను. *వీరులపాడు* 13 సం॥ల నాడు– 1998లో– వారి గ్రామనివాసి వట్టికొండ రంగయ్యగారి సంస్మరణ సభ సందర్భంగా వెంకటపతిరాయలు గారు గుంటూరు వచ్చినప్పుడు వారితో మాట్లాడే అవకాశం లభించింది. రంగయ్యగారు ఒకనాటి సుప్రసిద్ధకవి. 'ప్రజావాణి' సంపాదకులుగా నలుగురికీ తెలిసినవారు..."

**– ముక్కాల రాజగోపాలరావు,** గుంటూరు.

★ "...ముందుజన్మలో నేనేదో సుకృతం చేసికొని ఉంటాను. అందుకే నా వ్యాసము *పితృవాక్యం* ***మిసిమి*** డిసెంబరు సంచికలో *సురవరం ప్రతాపరెడ్డి* గారిపై ***మిసిమి*** వారే వ్రాసిన ప్రశంసాంజలి ముందు పేజీలో అచ్చుయ్యింది. 1966లో నేను ప్రవాసాంధ్రుడిని– ఒకానొక విశ్వ విద్యాలయములో పరిశోధన నిమిత్తం లండన్ లోని YMCA (Fitzroy square) లో 4 రోజులున్నాను. అక్కడ రిసెప్షన్ హాలులో పనికి రాని పుస్తకాలని కొన్ని పడేశారు. అక్కడ కనిపించింది నాకు *ఆంధ్రుల సాంఘిక చరిత్ర,* రచయిత సురవరం ప్రతాపరెడ్డి. రెండు పేజీలు చదివాక, వెల ఎంత అని అడిగా అక్కడున్న మళయాలీ రెసెప్షనిస్ట్‌ని. కావాలంటే తీసుకెళ్ళమంది. నేను పుస్తకం మాత్రం తీసుకొచ్చా. అప్పటికి నాకు ప్రతాపరెడ్డి గారి గురించి ఏమీ తెలియదు...

...ఆ పుస్తకం చదివాక ఆయన గురించి తెలియాల్సిందంతా తెలిసింది. ఆయన మహానుభావుడు. అప్పుడు మరాఠ్వాడా లోని పైఠణ్ నుంచి తంజావూరు దాటే వరకు ఉన్న జనాభా అంతా తెలుగువారే. తెలుగు మా భాష అనే గొప్ప గౌరవమే తెలంగాణ అని ఆయన వల్లే తెలిసింది...

...డిసెంబరు 25 జీసస్ పుట్టిన రోజనడం సరిగాదు. ఆ మహనీయుడు, జనవరి 6, క్రీ. పూ0004 పుట్టాడు. రోమనుల ప్రాపకమార్జించడానికి సూర్యారాధకులైన రోమను చక్రవర్తులు (కాన్‌స్టంటైన్)ను తమ మతమన్న దానిలోకి మార్చడానికి కొంతమంది క్రీ.శ. 360 ప్రాంతములో చేసికొన్న ఒడంబడిక ప్రకారము జీసస్ పుట్టిన రోజు డిసెంబరు 25కు మార్చబడింది. ఆ రోజు సూర్యుడు ధనుస్సులో ప్రవేశించి, తిరుగ ఉత్తరాయణము మొదలు పెడుతాడు కనుక సూర్యుడు పుట్టిన రోజని అప్పటి సూర్యారాధకులైన రోమనుల భావము. దీనిననుసరించటము వలన డిసెంబరు 25 వచ్చింది. Eastern Orthodox Church ఇప్పటికీ జనవరి 6నే జీసస్ జన్మదినము జరుపుతారు... **– ఆచార్య సముద్రాల,** విశాఖపట్నం.

★ "...అక్టోబరు 2011 **మిసిమి** మాసపత్రికలో తిరుమల నీరజ వ్రాసిన *నాకు తెలిసిన మా నాన్నగారు,* వ్యాసం మనసులను కరిగించినది. తిరుమల రామచంద్రగారి రచనలలో నేను ప్రతిరోజు మరువక తలచే *ఆమ్రపాలి* ధారావాహిక గురించి ఆమెను అడుగుదామనుకుంటే ఆమె చిరునామా తెలియదు. క్షేమేంద్రుని *బృహత్కథా మంజరి* వలె రామచంద్రఠాకూర్ గారి రచన *ఆమ్రపాలి* కూడా ఆంధ్రపత్రికలో ధారావాహికంగా ప్రచురించారు. తిరుమల రామచంద్రగారి అనువాదం...

...ఆ దినాలలో *ఆమ్రపాలి* భగవానునికి శిష్య సమేతంగా భిక్షనిస్తూ ఒక బాలుని దగ్గరకు రాగానే తను ఆ బాలుని (శ్రమణుని) చూస్తూ వడ్డిస్తున్న పాత్ర జార విడుస్తుంది. దూరం నుండి చూచిన భగవానుడు అతడు అర్హతుడు అని అంటారు. అంతవరకు చదివిన తర్వాత ఆ సీరియల్ ఇక నాకు చదవడానికి ఎందుచేతనో కుదరలేదు. బహుశా 1967 సం॥ ఆంధ్రపత్రిక సీరియల్. తిరుమల నీరజగారి వద్ద కాని ఆంధ్రపత్రిక వారి వద్ద కాని ఆ అనువాదం ఉంటే మరలా ఎవరయినా ధారావాహికంగా కాని పుస్తకరూపంలో కాని ప్రచురిస్తే బాగుంటుందని నా ఆశ..."

**– ఉపాసిక, ఎస్. పైడితల్లి,** సర్పవరం.

జ్ఞానాభివృద్ధికి

# శ్రీ మహాభారతం

– కట్టమంచి రామలింగారెడ్డి

"నిజంగా విజ్ఞానం అలవర్చుకోవటానికి భారతం తప్పకుండా తెలుసుకోవాలి. భారత, రామాయణాలు చదువని చదువు, చదువుకాదని నా నమ్మకము. దానికి మించిన జ్ఞానాభివృద్ధి మరి లేదు. మీరు కుట్టుపనులు, అట్టపనులు మున్నగువాటిలో ఎంత అభిరుచి కన్పరుస్తున్నారో అట్టి ఉత్సాహమే భారతపఠనములో కూడ చూపి విజ్ఞాన మలవరుచుకోవాలి.

మనహిందూజాతిలో ఎందరెందరు ఎన్ని సిద్ధాంతాలు చెప్పారో అన్నీ భారతములో ఉన్నాయి. సుమారు 4 వేల యేండ్లనుంచి వేయి సంవత్సరముల పర్యంతము చేసిన పనులూ, ఆధ్యాత్మికవిషయాలూ, వాళ్ల ప్రతిభావిశేషాలూ అన్నీ మిళిత మయినయి భారతంలో.

ఇంకా మనుష్యునికి ప్రయత్నాల్లో ఉత్సాహమూ కలిగేటట్టూ, ఆపదలలో ఉపశమనము కలిగేట్టుకూడా చిత్రించే భారతం! దాన్ని మీరంతా వచనంలోనైనా తప్పక చదివి విజ్ఞానాభివృద్ధి చేసుకోవాలీ" అని శ్రీ రామలింగారెడ్డిగారు భారతకాలక్షేపం చేస్తూ చెప్పారు.

**మహాభారతం ఒక సంహిత:**

పిమ్మట రెడ్డిగారు ఈ క్రిందివిధమున ప్రసంగించిరి: "సాధారణముగా మన కేదైన సంభవించినప్పుడు కాలం, ఖర్మం బాగాలేదు'' అంటాం. ఇది తరచు ఉపయోగి స్తూంటారు. దీన్ని గురించి భారతంలో బాగా వివరించి ఉంది. అసలు భారతం మహా ఉత్కృష్ట గ్రంథం.

దానిలో విశేషం ఏమంటే అది కావ్యం కాదు. రామాయణం కావ్యం. ఒకే కవి ఒక అంశాన్నే కథావస్తువుగా తీసికొని చిత్రించాడు. రామాయణాన్ని అందు ఉపాఖ్యానాలు మున్నగునవి ఉండవు. కాని మహాభారతంలో అన్ని ఉన్నవి. దీన్ని సంహిత అంటాం. దీనిలో అన్ని విషయాలూ, క్రోడీకరించిన అంశాలూ మిళితమయి ఉంటాయి.

**పరస్పర విరుద్ధ విషయాలు:**

ఒకచోట ఒకఅభిప్రాయము, వేరొకచోట ఇంకో అభిప్రాయము ఉంటాయి భారతంలో, వేదాలుకూడా ప్రమాణాలు కావనీ భారతంలోనే కలదు. అది వింటే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. మనపూర్వులు అమానుషులు. వారు అనేక విషయాలను ఎట్టెట్లువాడినదీ భారతం తెలుపుతుంది. కర్మను గురించి వివరిస్తూ కొంతకర్మపూర్వ జన్మ సంప్రాప్తమనీ, మరికొంత సంచితమని అంటారు. ఇంకోచోట పురుషప్రయత్నం ఉండాలని ఉంది.

అంటే మనజీవితంలో సర్వమూ ప్రారబ్ధంనుంచి వచ్చేదే అనేది నిజమయితే యిక పురుషప్రయత్నానికి తావెక్కడుంది. కర్మము అనేది మన యావజ్జీవితమూ నిర్ణయించే ఒకవిధమైన శక్తి అంటాడు.

దాని ఫలితం సత్కర్మయితే దేవత్వమూ లేకుంటే నరకమనిన్నీ. జీవుడు అందరి యందు ఉన్నాడు. జీవునికి చావు లేదు. "విను జీవుండు... సుఖదుఃఖములుకనున్" అని ఉంది. ఇలా కర్మఫలములు వివిధములుగ వర్ణింపబడినవి.

ఇవికూడా వ్యతిరేకములులేని సిద్ధాంతములు కావు ఇంకొకచోట సత్కర్మ ఆచరించిన వాండ్రు స్వర్గలోకానికి వెళతారు అని చెప్పబడింది. అచట కర్మముగియగానే మళ్లా మొదటికి పోతారు. అంటే స్వర్గంలోనికి పోయినవాడు అచట సుఖమనుభవించవలసినదే గాని మళ్ళీ అచ్చట మంచి కర్మలు చేయటానికి అవకాశంలేదు. అనగా పుణ్యం వలన స్వర్గ సుఖం–పాపంవల్ల నరకమును, స్వర్గంలో మనం జేసుకున్న పుణ్యం చెల్లిపోతే మరల నరకానికి పంపుతారు. లేకపునర్జన్మో,

విశాఖపట్నం స్త్రీల సభలో డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డి 'భారత కాలక్షేపం' (డిసెంబరు 1940)

ఈ జన్మలో చేసే పుణ్యపాపఫలం నేను నరకం లోనూ స్వర్గంలోనూ అనుభవిస్తే నాకు మళ్లా జన్మ ఎందుకు అనేదే ప్రశ్న, స్వర్గంలో ఉండే సుఖాలు భూలోకంలోని వాటికంటె అధిక తుల్యమైనవి. అని ఒక వ్యాఖ్య. అందులో యింత దూరం స్వర్గలోకంపోతే అక్కడకూడ యీ శారీరక సుఖమేనా అన్న సందేహం వచ్చింది. దానికి అక్కడ మనుష్యసంబంధమైన సుఖాలే ఉండవన్నాడు.

ధర్మజుడు స్వర్గానికి రమ్మన్నప్పుడు తెల్పిన కుక్క కథ మీకందరికీ తెలుసు. ధర్మనందనుడు స్వర్గంలో మా తమ్ముల్ని చూపమంటే స్వర్గ లోకంలో భూలోక సంబంధాలుండవన్నాడు. కాని ధర్మజుడు ఎట్లా గయినా నాసోదరుల్ని చూపాలని వారులేకుంటే నాకెందుకీ స్వర్గసుఖమనీ తెల్పినమీదట దేవనదిలో మునిగిన తక్షణం దేవత్వంపొంది ఒక ప్రక్క అర్జునుడు, కృష్ణుడు, నరనారాయణులు గాను, కర్ణుడు వేరొకవంక; ద్రౌపది మరియొక మూల చూచి ఆశ్చర్య పడుతాడు. ఈ విధంగా స్వర్గం చిత్రింపబడిఉంది, నిజమైన మన జీవితం అనుభవాలకూ, తత్వ సిద్ధాంతాలకు చాల భేదం ఉంది.

సుఖాలకు మంచి ఫలం, కష్టాలకు చెడు ఫలితం వస్తుంది అనే తత్వం కూడా ఉంది. ద్రౌపది అనేక కష్టాలు పొందింది. దుశ్శాసనుడు జుట్టుపట్టు కొని యీడ్చుకొని వచ్చాడు. ఆమె ఏమి కర్మం చేసిందని యీ కష్టాలు రావాలి? నాకు చూడగా జీవకళ ఏదో విధంగా నడుస్తుంది. దాన్ని సహేతుకంగా ఉండాలని ఈ కవులు మున్నగువారు అంతా ఏవోచిత్రిస్తారు. కర్మవలనకలుగు దేహము, ఆ ఫలితం సవ్యాఖ్యానం కాజాలదని యింకోచోట కాలం అన్నారు.

**జడశక్తి – జ్ఞానశక్తి:**

కాలానికి మార్పులులేవు. అది జడశక్తి. ఈ థియెరీ ఎందుకొచ్చిందంటే ఖర్మంవల్లనే, మనం అనుకొనేది ఒకటి, చేసేదొకటి. అయేది ఒకటి. కారణశక్తి–జ్ఞానశక్తి–ప్రధానమా, ఏమియు లేని జడశక్తి ప్రధానమా? అని ఒకయోగికి తోచింది. అన్నీ దైవంవల్లనే కలుగుతాయి. దైవం కరుణాశాలి, సర్వశక్తిసంపన్నుడూ–అని. కాని అంతకరుణామూర్తి కీడుచేయడం ఎందుకు అని తలపోశాడు. అందుకొరకు "కాలం" ముందు అని నిర్వచనం చేశాడు. కాలాన్ని శాంతికి మూలంగా నిర్ధారణచేశాడు. ఒకచో సర్వమూ కాలమే అన్నాడు. కాలాన్ని నమ్మినవాడు దూషణ భూషణ తిరస్కారముల చేయడు. అతడు దానికి అతీతుడు, నిర్వికారుడు. దేవేంద్రుడు బలి చక్రవర్తిని రాజ్యచ్యుతుని జేసి వైచిన పిమ్మట ఒక రోజున గాడిదరూపంలో ఉండగా చూచి హేళనచేశాడు. అందుకు బలి ఏమీ కినియలేదు, చలించలేదు.

ముఖములో ఎట్టి క్రోధమూ ప్రదర్శించలేదు "శాంతంగా బలికి జవాబు చెబుతూ" నీ శక్తి చేత నీకు రాజ్యము రాలేదు. నాకర్మచేత నాకు గార్ధభరూపం రాలేదు. కాలమే దాన్ని నిర్ణయించింది. అని సమాధాన మిచ్చాడు.

**కాలమే ముఖ్యం. అయితే యీ రెండూ కలిపిన మూడవసిద్ధాంతం కూడా ఉంది. పౌరుషం-దైవం కూడా ఉండాలన్నారు. విత్తు లేకుంటే భూమినుంచి చెట్టురాదు. అలాగే దైవానికి కాలానికి సంబంధం ఉంది. కాలం జడ శక్తి; అది మనం చెపితే వినేది కాదు. కాబట్టి దైవం అనే ఇంకోశక్తిని సృష్టించినారు. దాన్ని మనుష్యులు వశపర్చు కొనేందుకు రెండు సూత్రాలు చెప్పారు. అవే దేవతల్ని మనుష్య జీవితానికి అనుకూలింప చేసినవి. "స్వాహా" అంటే ఏవైనా వశమైపోవలసినదే.**

**పౌరుషం–దైవం:**

కాలం యెట్టిదంటే పగలు రాత్రిని, రాత్రి పగలును అనుసరించి నట్లు వస్తుంది. ఈ రెండు తత్వాలు భిన్నాలు ఇట్టి తత్వమే గ్రీకుల్లో కూడా ఉంది. పురుషప్రయత్నం లేకుంటే జీవయాత్ర జరుగదు. అది ప్రధాన మంటే ఖర్మతత్వం జరుగదు. కాలమే ముఖ్యం. అయితే యీ రెండూ కలిపిన మూడవసిద్ధాంతం కూడా ఉంది. పౌరుషం–దైవం కూడా ఉండా లన్నారు. విత్తు లేకుంటే భూమినుంచి చెట్టురాదు. అలాగే దైవానికి కాలానికి సంబంధం ఉంది. కాలం జడ శక్తి; అది మనం చెపితే వినేది కాదు. కాబట్టి దైవం అనే ఇంకోశక్తిని సృష్టించినారు. దాన్ని మనుష్యులు వశపర్చు కొనేందుకు రెండు సూత్రాలు చెప్పారు. అవే దేవతల్ని మనుష్య జీవితానికి అనుకూలింప చేసినవి. ''స్వాహా'' అంటే ఏవైనా వశమైపోవలసినదే. కుమారిలభట్టు దైవాన్ని కర్తగా కాకుండా సాక్షిగా తీసుకున్నాడు. వైష్ణవసిద్ధాంతంలో కరుణప్రధానం. ఇట్లాగే అన్నీని. పౌరుషం ఒకచో ముఖ్యం. మరొకచో దైవం ప్రాధాన్యం. కాలము దైవసంబంధము; కర్మము పురుషప్రయత్నము అన్నారు.

(సేకరణ : కుర్రా జితేంద్రబాబు)

# చరిత్ర గర్భంలోకి..

– నండూరి పార్థసారథి

ఉత్తర భారత శాస్త్రీయసంగీతాన్ని హిందూస్థానీ సంగీతమనడం అన్యాయమనీ, దాన్ని 'ఇస్లామిక్ మ్యూజిక్' అనాలనీ పాకిస్తానీ ప్రొఫెసర్ ఒకరు తన గ్రంథంలో ఒక వాదన లేవదీశారు. తన వాదనకు ఆయన చూపించిన ఆధారాలు ఇవి:

1. ఇప్పుడు ఉత్తర భారతీయ సంగీతంలో, వాడుకలో వున్న సితార్, సరోద్, సారంగి, షెహనాయ్, తంబూర, రబాబ్, దిల్రుబా వంటి వాద్యాల పేర్లన్నీ పర్షియన్ పేర్లే. ఆ వాద్యాలన్నీ ఇరాన్, టర్కీ వంటి మధ్యప్రాచ్య ఇస్లామిక్ దేశాలకు చెందినవే. (అంటే హిందూస్థానీ సంగీతానికి సొంత–భారతీయ– వాద్యాలేవీ లేవన్నమాట!)
2. 13వ శతాబ్దంలో ఉత్తర భారతమంతా ఖిల్జి వంశీయుల ఏలుబడి క్రిందకు వచ్చాక అల్లా ఉద్దీన్ ఖిల్జీ మంత్రి, ఆస్థాన విద్వాంసుడు, పర్షియన్ మహాకవి అయిన అమీర్ ఖుస్రో ప్రవేశ పెట్టిన నూతన పద్ధతులతో భారతీయ సంగీతం రెండుగా చీలిపోవడం, ఉత్తర పద్ధతి హిందూస్థానీ సంగీతంగా, దక్షిణ పద్ధతి కర్ణాటక సంగీతంగా వ్యవహారంలోకి రావడం తెలిసిందే. ఈ ఉత్తర పద్ధతి అంతకు పూర్వం నుంచి వున్న సంగీత పద్ధతికి, దక్షిణ పద్ధతికి భిన్నమైనది. ఇది పూర్తిగా పర్షియన్– అనగా ఇస్లామిక్– పద్ధతికి చెందినది.
3. ఖుస్రో తర్వాత కాలంలో హిందూస్థానీ పద్ధతికి చెందిన గొప్ప గాయకులంతా ముస్లిమ్ ఉస్తాదులే. హిందూ గాయకులెవరైనా వుంటే వారు ముస్లిమ్ ఉస్తాదుల శిష్యులే.
4. హిందూస్థానీ సంగీతానికి సంబంధించిన అన్ని ఘరానాలు (గురుపీఠాలు) ముస్లిమ్ ఉస్తాదులవే. హిందూ గాయకులంతా ఆ ఘరానాలలో తయారైన వారే.

కాబట్టి ఇది 'హిందూస్థానీ' కాదు 'ఇస్లామిక్' సంగీతం. ఇదీ పాకిస్తానీ ప్రొఫెసర్ వాదం. ఇందులో నిజం ఎంత? పరిశీలిద్దాం.

ఉత్తర భారతీయ వాద్యాల పేర్ల గురించి ప్రొఫెసర్ గారు చెప్పినదంతా నిజమే. ఒక జాతికి, మతానికి, దేశానికి చెందినవారు మరొకదేశంపై దండెత్తి, ఆక్రమించుకొని, కొన్ని శతాబ్దాల కాలం పరిపాలించినప్పుడు తమ భాషను, మతాన్ని, కళలను వెంట తీసుకు రాకుండా వుండరు. మధ్య ఆసియా నుంచి వచ్చి భారత దేశాన్ని పాలించి ఇక్కడ స్థిరపడిన వారు కూడా చేసిన పని అదే. కాని, వారు రాకముందు ఇండియాకు సంగీతం కాని, ఇతర కళలు కాని లేవనుకోవడం పొరపాటు. వారు ఇక్కడి సంస్కృతిని తుడిచి పెట్టారనుకోవడం కూడా పొరపాటే. నిజానికి వారు మార్చిన దానికంటే మారినదే ఎక్కువ. నేర్పిన దానికంటే నేర్చుకున్నదే ఎక్కువ.

అమీర్ ఖుస్రో రంగ ప్రవేశం చేయడానికి కొన్ని శతాబ్దాలముందే భారతీయ సంగీత శాస్త్రానికి సంబంధించిన గ్రంథాలు–'నాట్యశాస్త్రం', 'దత్తిలం', 'బృహద్దేశి' వంటివి–ఎన్నో వున్నాయి. అన్నింటిలో ముఖ్యంగా భారతీయ సంగీత విజ్ఞాన సర్వస్వం అనదగిన 'సంగీత రత్నాకరం' కూడా అప్పటికే సిద్ధంగా వుంది.

ఆ గ్రంథాల ద్వారా, అప్పటికి ప్రయోగంలో వున్న రాగాల ద్వారానే ఖుస్రోకు భారతీయ సంగీతం పట్ల అవగాహన కలిగింది. రాగాల సౌందర్యానికి ముగ్ధుడై తానూ కొన్ని రాగాలను పర్షియన్ ఫణితుల ధోరణిలో సృష్టించి, వాటికి పర్షియన్ పేర్లు పెట్టాడే గాని భారతీయ సంగీత మౌలిక స్వరూపాన్ని అతడు మార్చలేదు. గజల్, కవ్వాలీ వంటి కొన్ని పర్షియన్ ప్రక్రియలను ప్రవేశపెట్టాడు గాని, అవి శాస్త్రీయ సంగీత పరిధిలోనివి కావు. పర్షియన్ పేర్లతో వచ్చిన

నండూరి పార్థసారథి, ఫోన్: 9959734534

హిందూస్థానీ వాద్యాల వంటివి అంతకు ముందు మనదేశంలో లేకపోలేదు. 'సంగీత రత్నాకరం'లోని వాద్యాధ్యాయంలో శార్ఙ్గదేవుడు ఎన్నో రకాల వాద్యాలను పేర్కొన్నాడు. శాస్త్రీయ సంగీతంలో, జానపద సంగీతంలో, గిరిజన సంగీతంలో దాదాపు 500 రకాల వాద్యాలు మనదేశంలో వాడుకలో వుండేవి.

సితార్ వాద్యాన్ని ఖుస్రోయే సృష్టించాడన్న మాట అబద్ధం. దాన్ని తానే సృష్టించినట్లు ఖుస్రో తన గ్రంథాలలో ఎక్కడా చెప్పుకోలేదు. 18వ శతాబ్ది ఉత్తరార్ధంలో ఖుస్రోఖాన్ అనే మరో విద్వాంసుడు వీణలో కొన్ని చిన్న మార్పులు చేసి సితార్‌ను సృష్టించాడు. 'సితార్', అనే పేరు మాత్రమే పర్షియన్ పేరు.

సరోద్ వంటి వాద్యం రెండు వేల సంవత్సరాల క్రిందటే మనదేశంలో వుంది. శాత వాహనుల కాలంలో దాని పేరు 'చిత్రవీణ'. నాగార్జున కొండ వద్ద, అమరావతి వద్ద జరిపిన త్రవ్వకాలలో యిప్పటి సరోద్‌ను పోలిన వాద్యాల శిల్పాలు బయల్పడ్డాయి. 'సరోద్' అనే పేరు మాత్రమే పర్షియన్ శబ్దం.

సంతూర్ కూడా పేరులో మాత్రమే పర్షియన్ వాద్యం. స్వరమండలం, విపంచి, యాళ్, హార్ప్, లైర్... ఇలా ఎన్నో పేర్లతో, రూపాలతో ఇటువంటి వాద్యాలు కొన్ని వేల సంవత్సరాలుగా ఎన్నో దేశాలలో వున్నాయి. పర్షియా (ఇరాన్), అరేబియా (ఇరాక్), ఈజిప్టు (ఆఫ్రికా), గ్రీస్, రోమ్ (ఇటలీ) నాగరకతలకు, భారతీయ నాగరకతకు మధ్య కళా, సాంస్కృతిక, వ్యాపార రంగాలలో కొన్నివేల సంవత్సరాలుగా సంబంధాలున్నాయి.

ఈ దేశాల సంస్కృతుల మధ్య ఎన్నో పోలికలు కనిపిస్తాయి. ఇందుకు ఒక ముఖ్యకారణం వీరి భాషలు ఒకే భాషాకుటుంబానికి– అనగా ఇండో యూరోపియన్ భాషా కుటుంబానికి– చెందినవి. వీటన్నింటికీ మూల భాష ఒకటే. దీనిని మాట్లాడేవారు ఆర్యులని చరిత్రకారులు భావించారు.

ఈ ఆర్యజాతిలోని వేర్వేరు శాఖలవారు ఒకే మూల స్థానం నుంచి బయలుదేరి యూరప్, ఆసియా ఖండాలలోని వేర్వేరు ప్రాంతాలకు వలసపోయి స్థిరపడ్డారు. కాల క్రమంలో ఆయా ప్రాంతాలకు స్వతంత్ర నాగరకతలు, సంస్కృతులు రూపు దిద్దుకున్నాయి. మళ్ళీ ఆ సంస్కృతుల మధ్య ఆదానప్రదానాలు జరిగాయి. వివిధ జాతుల మధ్య, దేశాలమధ్య సాంస్కృతిక, వినిమయం (కల్చరల్ ఎక్స్ఛేంజ్) ఎటువంటి సందర్భాలలో జరుగుతుంది? పరిశీలిద్దాం. ఈ పరిశీలనకై చరిత్రగర్భంలో కొన్ని వేల సంవత్సరాల లోతుకు వెళ్ళాల్సి వుంటుంది.

ఈజిప్టులోని నైలునదీలోయ; మెసొపొటేమియాలోని యూఫ్రటిస్, టైగ్రిస్ నదుల మధ్యప్రాంతం; ఉత్తర భారతదేశంలోని గంగా సింధునదుల మధ్య ప్రాంతం; చైనాలోని హోయాంగ్‌హో, యాంగిట్జి నదుల మధ్యప్రాంతం–

ఇవి ప్రపంచంలోకెల్ల అతి ప్రాచీన నాగరకతా నిలయాలుగా ప్రసిద్ధి కెక్కాయి. వీటి తర్వాత చెప్పుకోదగిన ప్రాచీన నాగరకతా కేంద్రాలు– పర్షియా, గ్రీస్, రోమ్. వీటిలో మిగిలిన వాటికంటె సింధునాగరకత గొప్పదనీ, ప్రాచీనమైనది కూడా కావచ్చుననీ మొహెంజొదారో (సింధు), హరప్పా (పంజాబ్)లలో బయల్పడిన అవ శేషాలను పరిశీలించిన చారిత్రక పరిశోధకులు భావించారు. ఇక్కడి త్రవ్వకాలలో బయల్పడినవి సుమారు ఐదువేల సంవత్సరాల నాటివి.

మొహెంజొదారో వద్ద బయల్పడిన పురాతన నగరం ఆరుసార్లు నిర్మితమయిందట. వాటిలో మొదటిది క్రీస్తుపూర్వం 3750 సంవత్సరాల క్రిందటిది. క్రీస్తుపూర్వం 2500–2000 సంవత్సరాల మధ్యకాలంలో ఆ నాగరకత అంతరించింది. మెసొపొటేమియాలో వర్ధిల్లిన సుమేరియన్ నాగరకత క్రీస్తుపూర్వం 3000–2600 సంవత్సరాల మధ్య కాలానిది.

సింధు నాగరకతా కాలంనాటి ప్రజలకు సుమేరియన్ ప్రజలతో వాణిజ్య సంబంధాలుండేవనీ, సింధుప్రాంతపు వ్యాపారులు యూఫ్రటిస్, టైగ్రిస్ నదీప్రాంతాలలోని విపణు లకు తమ సరకులను తీసుకువెళ్ళి విక్రయిస్తూ వుండేవారనీ, తిరిగి వచ్చేటప్పుడు సుమేరియన్ వస్తువులను తెచ్చుకునే వారనీ కొందరు పరిశోధకుల అభిప్రాయాలను ఉటంకిస్తూ జవాహర్‌లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' (Discovery of India) గ్రంథంలో రాశారు.

ఆ కాలపు వాణిజ్యం ఎక్కువగా వస్తువినిమయ పద్ధతిలోనే జరిగేది. మెసొపొటేమియాలో ఒకచోట ఇండియన్ వర్తకుల కాలనీ కూడా ఉండినట్లు ఆధారాలు దొరికాయట. అప్పటి వాణిజ్యంలో సింధు, సుమేరియన్ సంగీత వాద్యాల

వినిమయం కూడా జరిగివుండవచ్చు. ఏ దేశంలోనైనా ఒక రాజ్యం మహావైభవంతో వెలిగిపోతుంటే ఆ వైభవాన్ని ప్రత్యక్షంగా చూసి తరించడానికి, వీలైతే వాణిజ్య, సాంస్కృతిక, సంబంధాలు కుదుర్చుకోడానికి విదేశీ ప్రముఖులు వస్తూ వుంటారు.

అలా వచ్చేవారు రకరకాల బహుమతులను రాజా వారికి సమర్పించుకుంటారు. అలాంటి బహుమతులలో సంగీత వాద్యాలతో పాటు వాటిని వాయించే వారు, ఆటవెలదులు, పాటవెలదులు కూడా వుంటారు. వారు రాజావారిని తమ ప్రదర్శనలతో ఖుషీ చేసి రాజాస్థానంలో కొలువు సంపాదించుకుంటారు.

స్వదేశాలకు తిరిగి వెళ్ళే ప్రముఖ అతిథులు కూడా– సంగీతాభిలాష గల వారైతే – వాద్యాలను బహుమతులుగా అందుకొని వెడుతూ వుంటారు. విభిన్న సంస్కృతుల మధ్య వినిమయానికి ఇదొక కారణం.

ఒక దేశపు పండితుడు మరొక దేశపు సంగీత గ్రంథాలను అధ్యయనం చేసి, తమ భాషలోకి అనువదించడం మరోకారణం. క్రీస్తుపూర్వం 580–500 సంవత్సరాల మధ్యకాలంలో భారతదేశాన్ని సందర్శించిన గ్రీకు పండితుడు పైథాగరస్ మనదేశపు సంగీత విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తన దేశానికి వెళ్ళిన తర్వాత అక్కడి సంగీతంలో ఈ సూత్రాలను ప్రవేశపెట్టాడు.

సామగాన సప్తస్వరాలను గురించి, ఇరవైరెండు శ్రుతులను గురించి అతడు తన రచనలో పేర్కొన్నాడు. గ్రీస్‌లోని వాద్యాలు భారతదేశపు వాద్యాలను అనుసరించి నిర్మించినవేనని పరిశోధకులు అంటున్నారు. తర్వాత కాలక్రమంలో పైథాగరస్ సూత్రాల ఆధారంగానే గ్రీక్ 'మోడ్'లు రూపుదిద్దుకున్నాయి.

'మోడ్' అంటే యించుమించు 'మేళకర్త' లాంటిది. క్రీస్తుపూర్వం 1వ శతాబ్దినాటికి ఏడుస్వరాలు ఆరంభ స్వరాలుగా ఏడు 'మోడ్' (mode) లు తయారైనాయి.

అవి పియానో కీ బోర్డు తెల్లమెట్లమీది–

1. *సి* నుంచి *సి* కి (అనగా భారతీయ సంగీతంలోని *స* నుంచి *స* కి)– లిడియన్ మోడ్– ఇది హిందూస్థానీ సంగీతంలోని బిలావల్‌కు, కర్ణాటక సంగీతంలోని ధీర శంకరాభరణానికి సమంగా వుంటుంది.
2. *డి* నుంచి *డి* కి (*రి* నుంచి పై *రి* కి)– ఫ్రిజియన్ మోడ్– ఇది హిందూస్థానీ సంగీతంలోని కాఫీ థాట్‌కు, కర్ణాటక సంగీతంలోని ఖరహరప్రియ మేళకర్తకు సమానంగా ఉంటుంది.
3. *ఇ* నుంచి *ఇ* కి ( *గ* నుంచి *గ* కి)– డోరియన్ మోడ్– ఇది హిందూస్థానీలోని భైరవి థాట్‌కు, కర్ణాటక సంగీతంలోని హనుమత్తోడి మేళకర్తకు సమానంగా వుంటుంది.
4. *ఎఫ్* నుంచి *ఎఫ్* కి (*మ* నుంచి *మ* కి)– హైపో లిడియన్ మోడ్– ఇది హిందూస్థానీలోని యమన్‌కు, కర్ణాటక సంగీతంలోని మేచకల్యాణి మేళకర్తకు సమానంగా వుంటుంది.
5. *జి* నుంచి *జి* కి (*ప* నుంచి *ప* కి)– హైపో ఫ్రిజియన్ మోడ్– ఇది హిందూస్థానీలోని జింఝూటికి, కర్ణాటక సంగీతంలోని హరికాంభోజికి సమానంగా వుంటుంది.
6. *ఎ* నుంచి *ఎ* కి (*ద* నుంచి *ద* కి)– హైపోడోరియన్ మోడ్– ఇది హిందూస్థానీలోని ఆసావరికి, కర్ణాటక సంగీతంలోని నటభైరవికి సమానంగా వుంటుంది.
7. *బి* నుంచి *బి* కి (*ని* నుంచి *ని* కి)– మిక్సోలిడియన్ మోడ్– దీనికి సమమైన భారతీయ మేళకర్తలు లేవు.

ఇక్కడ ఒక్క విషయం జ్ఞాపకం పెట్టుకోవాలి గ్రీక్ మోడ్‌లు ఏర్పడిన నాటికి అనగా క్రీస్తుపూర్వం 1వ శతాబ్దినాటికి భారతీయ సంగీతంలో 'రాగం' అవతరించలేదు.

రాగాలకు పూర్వరూపాలైన, ఆదిమ దశలోని 'జాతులు' మాత్రమే వున్నాయి. భరతముని రచించిన నాట్యశాస్త్రానికి, మతంగుని 'బృహద్దేశి'కి మధ్యకాలంలో అంటే క్రీస్తుశకం 3–5 శతాబ్దుల మధ్యకాలంలో రాగాలు అవతరించాయి.

కాలక్రమంలో చాలా ఆలస్యంగా శాస్త్రరూపం దిద్దుకున్న పాశ్చాత్య సంగీతానికి– అనగా యూరోపియన్ సంగీతానికి– గ్రీక్ మోడ్‌లే ఆధారమైనాయి.

అంటే– భారతీయ సంగీత పద్ధతి పైథాగరస్ ద్వారా కొన్ని వడపోతలతో యూరోపియన్ సంగీతంలో ప్రవేశించిం దన్నమాట.

*మిగతా వచ్చే సంచికలో....*

# అతి ప్రాచీన వాద్యాలు



*హార్ప్ వంటి వాద్యాన్ని వాయిస్తున్న స్త్రీ వర్ణచిత్రం సుమారు 3600 సంవత్సరాల క్రిందటిది. ఆ కాలంలో ఈజిప్టును పరిపాలించిన ఒక రాజు సమాధి (పిరమిడ్) లోపలి గోడమీది చిత్రం ఇది. ఇందులోని వాద్యానికి తొమ్మిది తీగలు, వాటిని బిగించుకోడానికి అవసరమైన బిరడాలు (Pegs)కూడా వుండడం గమనించవచ్చు.*

**సుమేరియన్ లైర్:**



ప్రపంచంలో ఇప్పటి వరకు త్రవ్వ కాలలో బయల్పడిన అతి ప్రాచీన వాద్యం ఇది మెసొపొటేమియా (ఇప్పటి ఇరాక్) లోని యూఫ్రటిస్, టైగ్రిస్ నదుల మధ్య ప్రాంతంలో గల ఉర్ పట్టణం వద్ద 1927లో పురాతత్త్వ పరిశోధకులు నిర్వహించిన త్రవ్వకాలలో ఇది దొరికింది. త్రవ్వకాలు జరిగిన చోటు క్రీస్తుపూర్వం 2450 సంవత్సరాల క్రిందటి (అంటే సుమారు 4500 సంవత్సరాల క్రిందటి) సుమేరియన్ రాజవంశీకుల స్మశానం. అక్కడ 73 మానవాస్థిపంజరాలు దొరికాయి. వాటి వద్దనే దొరికిన ఎన్నో బంగారు ఆభరణాలను బట్టి అవన్నీ రాజకుటుంబాల వారివేనని పరిశోధకులు భావిస్తున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న వాద్యం వంటివి అక్కడ మూడు దొరికాయి. వాటిలో ఒకదాన్ని బాగ్దాద్ మ్యూజియంలోనూ, మరొకదాన్ని లండన్ మ్యూజియం లోనూ, మూడోదాన్ని ఫిలడెల్ఫియా (అమెరికా)లోని పెన్సిల్వేనియా యూనివర్సిటీ మ్యూజియంలోనూ భద్రపరిచారు. లైర్ వంటి ఈ వాద్యానికి ముందు వైపు అలంకారంగా అచ్చమైన బంగారంతో చేసిన ఎద్దుతల బొమ్మ వుంది. ఆ ఎద్దుకి పొడుగాటి గడ్డం వుంది. ఆ కాలపు సుమేరియన్ ప్రజలు పూజించిన సూర్యదేవుని ప్రతీక అది. మనుషుల పాపపుణ్యాలను నిర్ణయించేది ఆ దేవుడేనని ఆ ప్రజల విశ్వాసం. ఆ దేవుడి పేరు షమష్.

* * *



ఫిలడెల్ఫియా మ్యూజియంలో ఈ వాద్యం తాలూకు బంగారు ఎద్దు తల, దాని క్రింద కొన్ని చిత్రాలున్న భాగం మాత్రమే వున్నాయి. తీగలు, వాటిని బిగించే బిరడాలు వుండే ఫ్రేమ్ లేదు. ఎద్దుతల క్రింద మూడు వరుసలలో వున్న చిత్రాలు ఆ రాజ వంశీయుల మత విశ్వాసాలకు సంబంధించినవి. బంగారు ఎద్దుతల ధగధగ మెరిసిపోతోంది.

బాగ్దాద్ మ్యూజియంలో భద్రపరచిన వాద్యానికి ఫ్రేమ్, తీగలను బిగించే బంగారు బిరడాలు వున్నాయి. త్రవ్వ కాలలో దొరికినప్పుడు తీగలు లేకపోయినా బిరడాల సంఖ్యను బట్టి ఎన్ని తీగలుండేవో ఊహించి అన్ని తీగలు బిగించారు. ఈ వాద్యం కొలతలు 106×116×120 సెంటీ మీటర్లు. కూర్చున్న మనిషికంటే ఎత్తుగా వుంటుంది. వాద్యం మీది తీగలను రెండు చేతులతోనూ మీటుతారు. పొట్టి దండం వాదకుని ఛాతీకి దగ్గరగా వుంటుంది. ఎద్దుతల వుండే పొడుగు దండం అవతలి వైపు వుంటుంది. వాద్యానికి తొమ్మిది లేక పదకొండు తీగలుంటాయి.



సుమారు 4500 సంవత్సరాల క్రిందటి ఒక పిరమిడ్ లోపలి వర్ణ చిత్రం ఇది. ఇందులో గాయకులు ప్రార్థనలు గానం చేస్తుంటే ఒక వేణు వాదకుడు పొడుగాటి వెదురు వేణువుపై వాద్య సహకారం అందిస్తున్నాడు.

ఫిలడెల్ఫియా మ్యూజియంలో ఈ వాద్యపు ఎద్దుతల పక్కనే ఒక పెట్టెను వుంచారు. దాని మీద వున్న ఎర్రని వలయం పై మెల్లగా తట్టితే 15 సెకన్ల తర్వాత అక్కడ అమర్చిన స్పీకర్లలో నుంచి సన్నగా స్వరాలు వినిపిస్తాయి. ఆ వాద్యం మీది తంత్రులు ఏడు స్వరాలు (టోన్స్) పలక గలిగేవని పరిశోధకులు భావిస్తున్నారు. ఇప్పుడు ప్రపంచంలోని అన్ని సంగీత పద్ధతులలోనూ 12 స్వరాలు (7 శుద్ధ స్వరాలు + 5 వికృత స్వరాలు; లేక 7 Full Tones + 5 Semi Tones) ప్రయోగంలో వున్నాయి. వాటిలో ఈ లైర్ మీద ఏ ఏడుస్వరాలు పలికేవో వూహించి రికార్డు చేయడం జరిగింది. ఈ పెట్టెలో నుంచి వినిపించేది ఆ 'ఊహా'గానమే.




ఆ బంగారు లైర్ వాద్యాలు ఒక సుమేరియన్ రాకుమార్తెకు చెందినవని పరిశోధకుల భావన. త్రవ్వకాలలో ఒక సమాధి వద్ద 73 అస్థిపంజరాల అవశేషాలు దొరికాయంటే వారందరూ ఒకేసారి హత్యగావింపబడి వుంటారనీ, లేదా అందరూ ఒకేసారి ఆత్మహత్య చేసుకొని వుంటారనీ పరిశోధకులు భావిస్తున్నారు. త్రవ్వకాలు జరిగి ఎనభైయేళ్ళు దాటిపోయినా అక్కడ దొరికిన వస్తువుల గురించి పరిశోధనలు యింకా సాగుతూనే వున్నాయి.



ఫిలడెల్ఫియా మ్యూజియంలో భద్రపరచిన మరొక అపురూప వాద్యం ఇది. లైర్, హార్ప్ రెండింటి లక్షణాలతో తయారైన ఈ వాద్యం కూడా ఉర్ వద్ద త్రవ్వకాలలోనే దొరికింది. వెండితో తయారైన ఈ వాద్యం ముక్కలైన స్థితిలో దొరికింది. దాని పూర్వ రూపం వచ్చేటట్లుగా అమర్చారు. బాగా కిలుము పట్టిన ఈ వాద్యాన్ని-పాలిష్ పెట్టకుండా ఎలా దొరికిందో అలాగే వుంచారు. దీని కుడివైపు దండం పొట్టిగా, ఎడమ వైపు దండం పొడుగ్గా వున్నాయి. పొడుగువైపు కొమ్ముల జింక బొమ్మ వుంది. మొత్తం వాద్యం పడవ ఆకారంలో వుంది. ఇది పదమూడు తీగల వాద్యంగా పరిశోధకులు గుర్తించారు.



# భారతీయ నాటకం

- చాట్ల శ్రీరాములు

బ్రిటీష్ పరిపాలకులు దేశాన్ని ఇండియా-పాకిస్తాన్ అని రెండు ముక్కలుగా విభజించారు. ఆ తరువాత మన భారతదేశం, పంజాబు, బెంగాలి, గుజరాతు, మద్రాసు, ఆంధ్రా, కేరళ, కన్నడ-ఇలా ప్రాంతీయ రాష్ట్రాలుగా విభజింపబడినా దేశం ఒకటిగానే నిలబడింది. ప్రతి రాష్ట్రం దేనికదే ప్రత్యేకతతో కూడుకున్నది. సంస్కారభారతి అధ్యక్షుడైన శైలేంద్రనాథ్ శ్రీవాత్సవ ఒక మాట అన్నారు.

ఆయన ఒకసారి ఒక విదేశీయుణ్ణి ఇండియా పర్యటిస్తుండగా కలిసినపుడు "మా ఇండియా ఎలా అనిపించిందీ" అంటే భారత దేశమంతా తిరిగాను కానీ ఒక్క భారతీయుడు కనపడ లేదు" అన్నాడు. అదేమంటే నేను ఎవరితో మాట్లాడినా "నేను పంజాబీననో, గుజరాతీననో, మరాఠీననో అంటున్నాడే గానీ నేను భారతీయుణ్ణని ఏ ఒక్కరూ అనలేదు" అన్నాడు. ఇది ఆయన వెలిబుచ్చినటువంటి అభిప్రాయం.

ఈ భారతీయ నాటకం కూడా అంత విభిన్నమయినది. విభిన్నజాతుల, విభిన్న సంస్కృతుల మేలు కలయికే మన భారతదేశం అయినట్లుగా మన భారత నాటకం కూడా అనేక జాతులు, భాషలు, ప్రాంతాలుగా చీలివుంది. మనందరి దృక్కోణం ఒకటే అయినా భారతీయులుగా మనకున్నటువంటి భాషలు అనేకమైనవి. మనకున్న జాతులు అనేకమైనవి. మనకున్న మతాలు అనేకమైనవి. మనకున్న ఐడియాలజీనూ, మనకున్న పాస్టైమ్స్ ఇవి అనేకమైనవి. కనుక మనకు ఒక నేషనల్ థియేటర్ అని కాకుండా ప్రాంతీయ నాటకాలే ఉన్నాయి.

ఒకనాటి USSR ఈనాడు ముక్కలుగా విడిపోయింది. USSR పదిహేను వివిధ భాషల సంస్కృతుల సమ్మిళిత మైనటువంటి యూనియన్. ఆ 15 భాషల్లో ఏ భాషలో నాటకానికి, సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు వచ్చినా సరే అవన్నీ ముఖ్యమైన రష్యన్ భాషలోకి అనువదింపబడి అందరికీ అందుబాటులో ఉండేవి. కనుక అందరిదీ అని చెప్పదగిన ఒక సంస్కృతి, ఒక జీవనవిధానం వాళ్ళు అలవాటు చేసుకోవడానికి వీలైంది.

అయితే మనకి ఈనాడు భారతీయ భాషల్లోని, వివిధ భాషల్లో వస్తున్నటువంటి సాహిత్య గ్రంథాలు గాని నాటకానికి సంబంధించిన సాహిత్యము గాని ఏదీ అందరికీ అందుబాటులో లేని కారణంగా మనం సాంస్కృతికంగా విడి విడిగానే ఉండి పోతున్నాం.

ఉదాహరణకి ఈనాటి దినపత్రికలు కూడా ఎక్కడికక్కడ ప్రాంతీయంగా విభజింపబడి అమీర్‌పేట జోన్ అనీ, చిక్కడపల్లి జోన్ అనీ ప్రచురించబడుతున్నాయి. చిక్కడపల్లిలో జరుగు తున్నది సరూర్‌నగర్‌లో ఉన్నవాళ్లకి తెలీని పరిస్థితి ఏర్పడి- ఎక్కడికక్కడ మనం న్యూస్ పరంగానూ, సాహిత్యపరంగానూ, ఒకటి కాలేక విడివిడిగానే ఉండి పోతున్నాం. ఈ కారణంగా ఒక అవగాహన లేక, ఒకే ప్రసార మాధ్యమం లేకుండా మన ప్రయాణం సాగుతోంది.

రెండేళ్ళ క్రితం ఇక్కడ ఆంధ్రదేశంలో ప్రైవేట్ యాజమాన్యం తరఫున సంస్థ ఒకటి బహుభాషా నాటకోత్సవం జరిపింది. ఆ వెనువెంటనే సంగీత నాటక ఎకాడమీ కూడా ఒక నాటకోత్సవం ఇక్కడ నిర్వహించారు. అప్పుడు ప్రజల నుంచి కొంచెం వైవిధ్యంతో కూడు కున్నటువంటి స్పందన వచ్చింది. కొన్ని నాటకాలు అందరికీ అర్థమయ్యాయి. కొన్ని నాటకాలు కొందరికి అర్థం కాకుండా పోయాయి. ఆ ప్రాంతీయతలో ఉన్నటు వంటి సంస్కృతిని, సభ్యతని మనకి అందుబాటులో చేయగలిగినటువంటి సాహిత్యంగానీ,

డాక్టరు చాట్ల శ్రీరాములు, ఫోన్ : 9885819100

ప్రచారంగాని లేకపోవటమే దీనికి కారణం. ఉదాహరణకి ఒక మహారాష్ట్ర ప్రాంతానికి సంబంధించి నటువంటి ఒక ఫోక్ ఇడియమ్ 'తమాషా'లో ఒక నాటక ప్రదర్శన జరిగింది. ఆ ప్రదర్శనలో ఉన్న గొప్పతనాన్ని, ఆ నటుల్లో ఉన్నటువంటి ప్రదర్శనా పాటవాన్ని ప్రేక్షకులు అందుకోగలుగుతారు కాని, అందులో ఉన్నటు వంటి సునిశితత్వాన్ని అందుకోవడానికి కష్టపడవలసి వస్తోంది. ఎందుకంటే ఆ ప్రాంతంలో జరుగుతున్నటువంటి సంస్కృతి, సభ్యతతో మనకు ఏ విధమైన సంబంధం లేక పోవటమే.

మనదేశంలో పదహారు ప్రధాన భాషలు ఉన్నాయి. ఏడువందల మాండలికాలు ఉన్నాయి. ఆరు వివిధమైనటు వంటి మతాలు, కులాలు, కులాల వర్గాలు, ఉప కులాలు ఉన్నాయి. ఇవన్నీ మనదేశంలోనే ఉన్నాయి.

ఒక భాషలో ఉన్నటువంటి నాటకాన్ని మరొక భాషలోకి అనువాదం చేస్తే తప్ప, ఆ ప్రాంతపు సంస్కృతిని, అలవాట్లనీ, వాళ్ళ తాలూకు పూర్వ చరిత్రని తెలుసుకోవడం మిగిలిన వారికి కష్టం అవుతుంది. ఇంతకు ముందు ఇలాంటి అనువాదాలు కొన్ని వచ్చాయి. విజయ్ టెండూల్కర్, గిరీష్ కర్నాడ్, మోహన్ రాకేష్ లాంటి వాళ్ళు చేసిన నాటకాల అనువాదాలు వచ్చాయి. కాని ఇవాళ ఇలాంటి అనువాదాలు రావడం కాని ఇతర భాషల్లో జరుగుతున్నటు వంటి వ్యవహారాల్ని మనం తెలుసుకోవడం కాని కొంచెం తక్కువౌతోంది.

మనం ఆధునిక నాటక మూలాల గురించి ఆలోచిద్దాం. ఆధునిక నాటకాన్ని మన దేశంలోనికి ప్రవేశపెట్టిన వాడు ఆంగ్లేయుడే. అయితే ఆ ఆంగ్లేయుడి చేతుల్లోంచి మనం ఆధునికతను అయితే పుణికి పుచ్చుకున్నాం గాని ఆ ఆధునికత నుంచి బయటికి రాలేని పరిస్థితుల్లో మన ఆంధ్ర దేశం ఉందేమో అన్న భావన కలుగుతోంది. ఆధునిక నాటక యుగం 19వ శతాబ్దం మధ్యలో భారతదేశంలో ఆరంభం అయినప్పటికీ వంద ఏళ్ళ వరకూ బహుశా మనం మన నాటకం తాలూకు Originకి వెళ్ళలేదేమో అన్న భావన కలుగుతోంది. భారతదేశంలో అనేక ప్రాంతాల్లో ఆధునిక నాటక ప్రయోగం జరిగింది. కాని నాటక రంగపు మూలాలకు వెళ్లలేక పోవటం జరిగింది.

1968వ సంవత్సరంలో కొట్టాయంలో జరిగిన ఒక నాటక రంగస్థల ఉత్సవాలలో శ్రీ సి.ఎన్. శ్రీకాంతన్ నాయర్ అనే ఒక మలయాళీ నాటకకర్త ఒక పత్రాన్ని సమర్పించారు. పాశ్చాత్య పద్ధతుల్లో జరుగుతున్నటు వంటి నాటక ప్రయోగానికి విభిన్నంగా నాటకాన్ని ప్రయోగించా లనేటటువంటి ఉద్దేశాన్ని అందులో వెళ్ళబుచ్చారు. మన సంస్కృతిని, సభ్యతని ప్రతిబింబించగలిగిన జానపద కళారూపాన్ని నాటకంలో ఉపయోగించాలనేటటువంటి ఒక ఉద్దేశ్యంతో 1967వ సంవత్సరంలో కేరళలోని సాస్టమ్‌కోట అనే ఒక థియేటర్ వర్క్‌షాప్‌లో అనేక మంది నాటకరంగంలో ఉన్నటువంటి ప్రబుద్ధులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చడం జరిగింది. ఇలాంటి ప్రయత్నాలు భారత దేశంలోని అనేక ప్రాంతాల్లో జరిగాయి.

మన ఆంధ్రదేశంలో కూడా ఆంధ్ర నాటక కళాపరిషత్తు 1944 నాటికి ఒక రూపం దిద్దుకున్నా, పాశ్చాత్య పద్ధతుల్నించి మనం వేరు కావాలనేటువంటి భావన మనకు ప్రస్ఫుటం కాలేదు. మనం ఆంధ్రదేశంలో నాటకం ద్వారా ప్రస్తుత సాంఘిక సమస్యల్ని చర్చిస్తున్నామే కానీ మన కళారూపాల్ని మన మూలాల్లోకి తీసుకొనివెళ్ళి ఆ కళా రూపాలతో నేటి ఆధునికతను కలిపి, మేళవించి మనం నాటకం తయారు చేయడ మనేటటువంటి ఒక వ్యవహారాన్ని ఇంతవరకూ చేయలేక పోతున్నామనేది ద్యోతకం అవుతోంది.

తమ తమ భాషా సంస్కృతుల గొప్పతనాన్ని చాటి చెప్పడానికి దక్షిణ భారతదేశంలో అనేక భాషల్లో మనకి అనేక మంది మహామహులుద్భవించారు. నాటక రంగంలో ముఖ్యంగా మలయాళదేశంలో కావాళం నారాయణ ఫణిక్కర్, శంకర్ పిళ్ళే, సి.యన్. శ్రీకంటన్ నాయర్ లాంటి వాళ్ళు వచ్చారు.

తమిళంలో మంచి నాటక ప్రయోగం చేయగలిగినటు వంటి వ్యక్తులు యస్. రామానుజన్, ఎస్.పి, శ్రీనివాసన్, గుణశేఖరన్ తరువాత ఆర్ముగం లాంటి వ్యక్తులు ఆవిర్భవించారు. కన్నడంలో గిరీష్ కర్నాడ్, చంద్రశేఖర్ కంబార్, బి.వి. కారంత్ లాంటి ఆద్యులు ఉద్భవించి ఆయా ప్రాంతపు నాటకం, ప్రాంతీయత వేళ్ళూనేట్టుగా చేసి ప్రజలకి ఆ భాష తాలూకు తత్వాన్ని వాళ్ళ తాలూకు సంస్కృతిని, సభ్యతని దేశానికి చాటి చెప్పే ప్రయత్నం చేశారు.

ఇలాంటి ప్రయత్నం తెలుగులో చాలా తక్కువగా చేశామేమో అనిపిస్తుంది. సురభి నాటకరంగం ద్వారా ఒక గొప్ప నాటక కళారూపం, ఒక కుటుంబ వృత్తి నాటకం మనకి ఉన్నాయని చెప్పాం. ఆ సురభి నాటక రంగాన్ని మనం

దేశపటం మీద పెట్టడానికి కావలసిన ప్రయత్నం చేశాం. బి.వి.కారంత్ లాంటి మహానుభావుణ్ణి తీసుకువచ్చి ఆయన ద్వారా మూడు నాటకాలు–చండీప్రియ, భీష్మ, బస్తీ దేవత యాదమ్మ నాటకాల్ని ప్రయోగం చేసే ఏర్పాటు చేశాం. కొంతవరకు ఒక భారతీయ కళారూపాన్ని మన తెలుగు నాటకానికి ఇవ్వడానికి మనం ప్రయత్నం చేశాం. ఇలాంటి ప్రయత్నం ఆధునిక నాటకంలో చాలా తక్కువగా మనం చేశామేమోనన్న భావన కలుగుతోంది.

మన ఆధునిక నాటక ప్రయోగం ఎక్కువగా పరిషత్తులకే పరిమితమైంది. పరిషత్తుల్ని మించిన వేదికలు మనకు లేవు. దాదాపు 50 పరిషత్తులు రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్‌లో నాటకాలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రదేశంలో జరుగుతున్న నాటక పరిషత్తులు భారతదేశంలో మరెక్కడా లేవు. లేవని ఘంటా పథంగా చెప్పగలను.

దాదాపు ఈ 50 పరిషత్తులు 3 నుంచి 4 కోట్ల రూపాయల దాకా ఖర్చుపెడుతున్నారు. ఇంత ఉధృతమైనటువంటి చైతన్యం మనదేశంలో మరెక్కడా జరగడం లేదు. బహుశా ఈ చైతన్యం కారణంగా ఇతర చైతన్యం రాలేదు అని నేను అనలేను కానీ మనం ఒక ప్రత్యామ్నాయం గురించి ఆలోచించడం జరగలేదు.

ప్రభుత్వం నంది నాటకోత్సవాలు అనే పేరుతో సంవత్సరానికి ఒకసారి నాటకోత్సవాలు జరిపి పద్యనాటకంలోనూ, సాంఘిక నాటకంలోనూ, నాటికలోనూ అనేక బహుమతులు సమాజాల వారికి అందజేసి చేతులు దులుపుకుంటోంది, తప్పిస్తే నాటక సర్వతోముఖాభివృద్ధి కోసం ఏ విధమైనటువంటి పాటుపడ్డంలేదు. తెలుగులో మంచి నాటకం పుట్టలేదు అని నేనంటే, తెలుగులో అసలు నాటకమే పుట్టలేదని దాన్ని వక్రీకరించి నా పైన నా నాటక మిత్రులు, నా శిష్యులు కత్తులు దూశారు తప్పిస్తే దాన్ని సరైన దృక్కోణంలో అర్థం చేసుకున్నట్టుగా కనపడలేదు.

తెలుగులో నాటకం బాగుండాలి అనే ఉద్దేశ్యంతో విమర్శ చేస్తాం తప్పిస్తే తెలుగు నాటకాన్ని చిన్నబుచ్చటం తెలుగువాడి ఉద్దేశ్యం కాజాలదు. అది మాతృ ద్రోహమే అవుతుంది. అలా అనుకునే అనేకమంది నా గురించి "తెలుగు నాటకం బావులేదని రాష్ట్రేతర ప్రాంతాల్లో శ్రీరాములు ప్రచారం చేస్తున్నాడని," ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్లుగా మాట్లాడారే తప్ప నన్ను సరైన దృష్టిలో అర్థం చేసుకునే ప్రయత్నం చేయలేదు. ఉదాహరణకి బెంగాల్లో ఉత్పల్‌దత్, బాదల్ సర్కార్‌లాంటి మహానుభావులు చేసినటువంటి ప్రయోగాలు జాత్రా థియేటర్‌లోగాని, వీధినాటకాలలో గానీ మనం తప్పకుండా మన భాషల్లోకి తీసుకు రావలసి వుంటుంది.

మనం భారతీయులం, భారతీయ భాషల్లో వచ్చినటువంటి నాటకాల్ని, వాళ్ళ ప్రయోగాల్ని మన తెలుగులోకి తీసుకువస్తే తప్పులేదు అని నేను భావిస్తాను. హిందీలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో ఒక దర్శకుడు 'అల్కాజీ' మహోన్నత మైనటువంటి చరిత్ర భారతదేశానికి ఉందని గ్రహించాను. భారతదేశంలో భారతదేశానికి సంబంధించని నాటకాలు ప్రదర్శించి, భారత నాటకరంగానికి గొప్ప పేరు తీసుకు వచ్చాడు.

ఆయన మనం ఇతర దేశాల్లో ఉన్నటు వంటి నాటకాల్ని తీసుకురాక పోతే కింగ్ లియర్ లాంటి పాత్రలు, హామ్లెట్ లాంటి పాత్రలు మనకి ఎక్కడ నుంచి వస్తాయి, ఇలాంటి పాత్రల్ని మనం సృష్టించక పోయినట్లైతే మన నటుల్లో ఉన్నటువంటి ప్రతిభనీ, వ్యుత్పత్తినీ మనం బయటికెట్లా చూపించగలం అని ప్రశ్నిస్తాడు. అల్కాజీ లాంటి వాణ్ణి కూడా ఈనాడు అతను భారతీయుడు కాదు, అతను అరబ్బు. అతను భారత నాటకరంగంలో చేసిన నూతన ప్రయోగాలన్నీ మనదేశానికి సంబంధించినవి కావు అని మనవాళ్ళు తప్పుపట్టారు. అంతటి మహానుభావుణ్ణి కూడా ఈ రోజున వేలెత్తి చూపేవాళ్ళు అనేకులున్నారు.

హబీబ్ తన్వీర్ గొప్ప సంప్రదాయ వాది. ఆయన ఒక ఆధునిక బ్రెష్టియన్ టెక్నిక్‌ని ఉపయోగించి బ్రహ్మాండమైన సంగీత ప్రక్రియని నాటకంలోకి తీసుకువచ్చి, ఛత్తీస్‌ఘడ్ యాసని ఉపయోగించి నాటకాలు ప్రదర్శించి ప్రయోగాన్ని విజయవంతం చేశాడు. కావాలం నారాయణ్ ఫణిక్కర్, కూత్తు కూడియాట్టం విధానాలను వుపయోగించి మనిషి తాలూకు శరీరాన్ని మాధ్యమంగా ఉపయోగించి కలరీ మార్షల్ ఆర్ట్స్‌ద్వారా దాదాపు ఒక డజను నాటకాల్ని ఈ మీడియంలో ఉపయోగించడం జరిగింది.

ఒక ఆధునిక నాటక ఉద్యమాన్ని కేరళలో వాళ్ళు ప్రయోగించడం జరిగింది. తమిళదేశంలో రామానుజం,

శ్రీనివాసన్, గుణశేఖరన్‌లతో పాటు ఆర్ముగం అనే యువకుడు కరుంజిచి అనే నాటకం ద్వారా ఒక నూతనోత్సాహాన్ని అక్కడ నిలిపాడు. ఒక ఫిజికల్ థియేటర్, ఒక Props Theatre ఎలా ఉండాలో చూపించాడు.

బి.వి.కారంత్‌లాంటి కర్ణాటకలో ప్రసిద్ధి చెందినటువంటి నాటక దర్శకుడు, సంగీత దర్శకుడు, (ఒకప్పటి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా డైరెక్టర్ రంగమండల్ భోపాల్ దర్శకుడుగా వ్యవహరించిన వ్యక్తి) ఈ ఆర్ముగం చేసినటువంటి నాటకాన్ని చూసి ఈ కుర్రవాడి దగ్గర నుంచి నేను కూడా నేర్చుకోవలసినది చాలా ఉందని అన్నాడంటే, ఒక తమిళుణ్ణి చూసి ఒక కన్నడిగుడు ఇట్లా మాట్లాడాడంటే అది ఒక భాషకు, ప్రాంతానికి సంబంధించిన వ్యవహారం కాదు అన్న విషయం మనం అర్థం చేసుకోవచ్చు.

నాటకానికి ఎల్లలు లేవు. సంగీతం, నృత్యము, వీటి తాలూకు ప్రాముఖ్యత నాటకంలో గమనించి ఆ రెండిటినీ నాటకంలో ఒక అంతర్భాగంగా నిలిపాడు కారంత్. గిరీష్ కర్నాడ్ నాటకాలకి ఎనలేని ఖ్యాతిని సంపాదించి పెట్టిన మహానుభావుడయ్యాడు.

ఇలా మన నాటకంలో సంగీతాన్ని నృత్యాన్ని కూడా మిళితం చేసి నాటకాన్ని మన ప్రేక్షకుల దగ్గరికి తీసుకు వెళ్ళడానికి ఎంత ప్రయత్నం చేశామో ఒక సింహావలోకనం చేసుకొమ్మని ప్రస్తుత పరిస్థితులను గమనించమని నాతోటి నాటక కళాకారుల్ని నేను కోరుతున్నాను.

నాటకంలో విధానం ముఖ్యమా విషయం ముఖ్యమా? అంటే మన ప్రయోగ విధానం ముఖ్యమా? వస్తువు ముఖ్యమా? నాటకంలో లిటరరీ వాల్యూస్ ప్రధానంగా ఉండాలా? థియేట్రికల్ వాల్యూస్ ప్రధానంగా ఉండాలా అనే ఆలోచనకు వస్తే నాటకంలో– తెలుగు నాటకంలో గత 60 ఏళ్ళుగా రూపంలో పరిణామం రాలేదనే చెప్పాలి.

కొత్త సీసాలో పాత సారా వేసి ప్రయోగించడానికి ప్రయత్నిస్తున్నారు తప్పిస్తే మరేవిధమైన మార్పులు రాలేదనే చెప్పాలి.

సాహిత్య విలువలు నాటకంలో తప్పకుండా ఉండాలి. అయితే దానితోబాటుగా థియేట్రికల్ వాల్యూస్ కూడా ఉన్నప్పుడే అది గొప్ప నాటకం అవుతుంది. ఇటు నాటకాన్ని వ్రాసేటటువంటి రచయిత లెవరైతే ఉన్నారో వాళ్ళు సాహితీ విలువలని విస్మరించి నాటకం రాయడంతో దానికి కావలసిన పరిణతి రావడం లేదు. కేవలం థియేట్రికల్ వాల్యూస్ ఉన్నంత మాత్రాన అది గొప్ప నాటకం కాదు.

అది కాలానికి నిలబడేది కాదు. కాలానికి నిలబడాలంటే ఆ నాటకంలో సాహిత్య విలువలుండాలి. తెలుగులో ఇట్లా ఒక కాలేజీ స్థాయిలో గాని, విశ్వవిద్యాలయ స్థాయిలో కాని, పాఠ్యపుస్తకంగా ఉపయోగించ గలిగినటువంటి నాటకం ఏదైనా వచ్చిందా అని ప్రశ్నిస్తే చాలా నిరాశాపూరిత మైనటువంటి సమాధానం దొరుకుతుంది. దీని గురించి యోచించవలసిన అవసరం ఉంది.

ఇరవైఏళ్ళ క్రితం సంగీత నాటక ఎకాడమీ ఒక క్రొత్త ప్రతిపాదన చేసింది. నవ్యనాటకానికి దన్నుగా ఒక కొత్త ప్రణాళిక మొదలుపెట్టి పది సంవత్సరాల పాటు ఆ పథకాన్ని అద్భుతంగా నడిపింది.

అందులో మన ప్రాచీన గాథల్ని ఆధారంగా చేసుకొని మన సంస్కృతిని, సభ్యతని, ఆధారంగా చేసుకున్నటువంటి గాథల్నించి ఒక ఆధునికతని సంతరించుకో గలిగినటువంటి రూపాన్ని ప్రతిపాదించేటటువంటి నాటకాన్ని ప్రయోగించ వలసిందిగా యువదర్శకుల్ని కోరింది. పది సంవత్సరాలపాటు దేశవ్యాప్తంగా అనేకమైనటువంటి అందమైన ప్రయోగాలు వచ్చాయి.

మన రాష్ట్రం నుంచి కూడా కొన్ని మంచి ప్రయోగాలు జరిగాయి. అందులో సత్యానంద్– *బొమ్మలాట,* ఉదయభాను *మరీచిక,* తల్లావఝ్ఝల సుందరం, తనికెళ్ళ భరణి *గోగ్రహణం,* కె.జి.ఆర్. గాంధీ *ముద్రారాక్షసం* అనే నాటకాలు కొన్ని ప్రదర్శితమయి మంచి ఫలితాల నిచ్చాయి.

అయితే ఈ కార్యక్రమాన్ని కొంత మంది నాటకరంగ పెద్దలు మధ్యలోనే భ్రష్టు పట్టించడం, దాంతోటి ఆ కార్యక్రమం పది సంవత్సరాల తర్వాత ఆగిపోవడం జరిగింది.

ఈ వివిధ కళారూపాల్ని ఒక రాష్ట్రంలో ప్రయోగించ బడినటువంటి మంచి నాటకాల్ని మరో రాష్ట్రం తీసుకువెళ్ళి చూపించాలనే టటువంటి ఒక ప్రయోగం చేద్దామనే సంగీత నాటక ఎకాడమి సంకల్పానికి కూడా వారు అడ్డుకోవడం జరిగింది. దాంతో ఆ ప్రణాళిక అక్కడితో ఆగిపోయింది.

మహేష్ ఎల్‌కుంచ్‌వార్ లాంటి మహారాష్ట్ర నాటక రచయితలు కొంతమంది ఈ కేంద్ర సంగీత నాటక అకాడమీ చేసినటువంటి ప్రయోగాల్ని ఒక విధంగా తప్పుపట్టడం జరిగింది. ఒక గ్రామస్థాయిలో ఉన్న పాటలు, పద్యాలు, నృత్యాలు, రంగుల మేళవింపు– ఇవన్నీ తీసుకొని పట్టణస్థాయి ప్రేక్షకుల ముందుకు తీసుకురావటం అవి విమర్శలకు గురి కావటం జరిగింది.

మణిపూర్ నుండి రతన్‌కుమార్ ధియ్యామ్ చేసిన ప్రయోగాలను ఈ సందర్భంలో ప్రస్తావించడం అసంబద్ధం కాదని అనుకుంటాను. ఆయన తన నాటకాలను ఒక మేధో పరమైన కళారూపంగా సూచించారు.

తన నాటకాల ప్రయోగం ద్వారా సంప్రదాయబద్ధమైన సంకీర్తనను లయపరంగా, అంగ విన్యాస పరంగా చక్రవ్యూహ్ లాంటి నాటకాలతో చాలా గొప్ప ప్రయోగాలు చేసి, నాటకానికి ఒక కొత్త రూపు రేఖా విలాసాన్ని అందించారు. ఇలాంటి ప్రయోగాలు దేశవ్యాప్తంగా అనేక చోట్ల జరుగుతున్నాయి. ఉదాహరణకి మన ఆంధ్రదేశంలో వీధి నాటకం ఉంది.

ఆధునిక వీధి నాటకం–మా దగ్గర పుట్టింది బాదల్ సర్కార్ దీని సృష్టికర్త అంటారు బెంగాలీలు. అది చాలా పొరపాటు అని ఈ సందర్భంలో నేను మనవి చేస్తున్నాను. మనకి 1943లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి మొదటి సారిగా ఆహార్యంతో హిట్లర్ భాగవతం అనే వీధి నాటకాన్ని ప్రదర్శించారు. అయితే మొదటి ఆధునిక వీధి నాటకం తిరునగరి రామాంజనేయులు వ్రాసినటువంటి *వెట్టిచాకిరి* అనే నాటిక. (1949లో ప్రదర్శించబడింది.) చరిత్రలో ఒక వీధినాటకం మొదటిసారిగా వందసార్లకు పైగా ఆహార్యంలేకుండా ప్రదర్శించబడటం ఇదే దీని ప్రత్యేకత. బాదల్ సర్కార్ గొప్ప ప్రయోగాలు చేసి వీధినాటకాన్ని ముందుకు తీసుకు వెళ్ళాడు. అతని *జులూస్* ప్రసిద్ధి చెందిన నాటిక.

Theatre of protest form లో *జులూస్* ద్వారా అతను నాటకానికి ఒక రూపాంతరాన్ని కలుగజేశాడు. ఆయన ఒక్కమాట చెప్పాడు. వీధి నాటకం అన్నటువంటి పదంలో రెండు పదాలున్నాయి. వీధి మరియు నాటకం అని. కానీ చాలా నాటకాలు వీధుల్లోనే వేస్తున్నారు. వాటిల్లో నాటకీయత లోపిస్తోంది. Theatre అన్నటువంటి పదం తాలూకూ అర్థాన్ని పూర్తిగా తెలుసుకోకుండా వీధిలో నాటకాన్ని ప్రదర్శించడం మూలంగా, అది నిజమైన వీధి నాటకం కాలేక పోతున్నది. దాని అవసరం కంటే అవహేళన ఎక్కువగా ఉందని నేను భావిస్తున్నాను. బాదల్ సర్కార్, సఫ్దర్ హష్మీ ఈ వీధి నాటకాన్ని ఒక ప్రయోజనానికి ఉపయోగించడం జరిగింది. వీధి నాటకంలో ఉన్నటువంటి శక్తిని మనం మరచిపోకూడదు. అది ఒక బలీయమైన మాధ్యమం. వీధులలో తిరుగాడే సామాన్య జనమే దీని ప్రేక్షకులు. వాళ్ళని దృష్టిలో పెట్టుకొని ఈ వీధినాటకాన్ని మనం ప్రయోగించాల్సిన అవసరం ఉంది. ప్రయోగం అనేది నాటకంలో బలవంతపు బ్రాహ్మణార్థం కాకూడదని నా ఉద్దేశ్యం.

దాన్ని కేవలం ప్రయోగాత్మకంగా ప్రేక్షకులపైన రుద్దడం అనేది ఎప్పుడూ ఒక ప్రయోక్త తాలూకు అభిమతం కాకూడదు. ఏ ప్రయోగమైనా ఆరోగ్యవంతంగా ఉండాలి అనేది నా ఉద్దేశ్యం. భారతీయ నాటకరంగంలో సామాన్య ప్రేక్షకుడిని రంజింపచేయటమెలా అని ఆలోచిస్తే నాకు కొన్ని విషయాలు తోస్తున్నాయి.

మొట్టమొదటగా భారతీయ నాటకరంగంలో ప్రముఖత సంతరించుకున్న నాటకాలను గుర్తించి వాటిని అన్ని దేశభాషలలోకి అనువాదం చేయవలసి నటువంటి ఆవశ్యకత ఉన్నది. దీని గురించి మనం జాతీయ పరంగా ఆలోచించాలి. రెండవది సాంస్కృతిక ఆదాన ప్రదానం. ఒక భాషలో జరుగుతున్నటు వంటి ప్రయోగాలు ఇతర రాష్ట్ర భాషలలోకి అనువాదం చేసి ప్రయోగిస్తేనే కాని మనకు దేశాంతరంగా ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి.

ఈ విధంగా అన్ని ప్రాంతాలకు ఈ ప్రయోగాలు విస్తరిస్తాయి. ఈ ప్రయోగాలు దేశవ్యాప్తంగా ప్రదర్శించ గలిగి నటువంటి అవకాశం కలగాలి. నాటకం విషయంలోనూ, రూపంలోనూ, వస్తువులోనూ ఒక సమతూకాన్ని ఆలోచించి రచయిత రచన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

జాతీయ దృక్పథంతో నాటకాన్ని గురించి ఆలోచించినట్లే మనం ప్రాంతీయ దృక్పథంతో కూడా నాటకాన్ని గురించి ఆలోచించాలి. కేవలం ఒక్క ప్రాంతీయ దృక్పథంతోనే నాటకం గురించి ఆలోచిస్తే సరిపోదు. పైన చెప్పిన విషయం చిన్న సంఖ్యలో ప్రదర్శించబడే నాటకాలకు, నాటక సంస్థలకూ వర్తిస్తుంది. ●

# తొలి స్త్రీవాద మహిళ

- అన్య



మేరీ క్రాఫ్ట్

స్త్రీవాదమనేది ఎప్పుడో ఎక్కడో ప్రత్యేకంగా ప్రారంభం కాలేదు. వివక్షను ప్రతిఘటించే ప్రతి స్త్రీ ఆ క్షణంలో స్త్రీ వాదే. ఇంగ్లండులో, పందొమ్మిదవ శతాబ్ది చివరిదాకా భూస్వామ్య సంబంధాలే వైవాహిక జీవితాన్ని కూడా శాసించాయి. అంటే, భార్య, భర్తకున్న ప్రైవేటు ఆస్తిలో భాగమే. ఆనాటి ఒక సామాజిక ఉద్యమకారిణి బార్బరా లైస్మిత్ బోడిచాన్, 1854 నాటి చట్టాల గురించి యిలా రాసింది.

“భార్యాభర్తల్ని యిద్దరు వ్యక్తులుగా కాక, ఒకే వ్యక్తిగా గుర్తిస్తుంది, రాజ్యాంగం. వివాహం తర్వాత, స్త్రీకి ప్రత్యేకమైన హక్కులంటూ వుండవు. భర్త జీవితంలో ఆమె ఒక భాగం మాత్రమే. ఆమె చర్యలన్నిటికీ అతడే బాధ్యుడు. అతడి రక్షణలోనే వుంటుందామె.” స్త్రీ శరీరం భర్త స్వంత ఆస్తి. వివాహానికి పూర్వం ఆమెకున్న డబ్బు, నగలు, దుస్తులు, ఇంటి వస్తువులు అన్నీ, వివాహం తర్వాత భర్తకే చెందుతాయి. అతడు, వాటినేం చేసినా అడిగే హక్కు ఆమెకు లేదు.

పిల్లల మీద హక్కు కూడా తండ్రిదే. (పాలిచ్చే వయసులో శిశువులు ఆమె వద్ద వుండవచ్చు.) భర్త మతిస్తిమితం కోల్పోతే తప్ప, పిల్లల మీద ఆమెకే హక్కులూ వుండవు. ఆమె యిష్టానికి వ్యతిరేకంగా, భర్త, పిల్లల్ని తన అధీనంలో వుంచుకోవచ్చు. ఈ రాజకీయ, సామాజిక నేపథ్యంలో 1759లో జన్మించింది మేరీ వుల్‌స్టన్ క్రాఫ్ట్. తండ్రి ఎడ్వర్డ్ ఒక ధనిక రైతు, తాగుబోతు, క్రూరుడు. ఏడుగురు సంతానంలో రెండవది మేరీ. తల్లి ఎలిజబెత్, భర్త పెట్టిన మానసిక, శారీరక హింసతో బెదురు గొడ్డులా తయారైంది. పైగా, అనారోగ్య పీడితురాలు. ఆడ పిల్లల్లో పెద్దది గనక చెల్లెళ్లను, తమ్ముళ్లను చూసుకునే బాధ్యత మేరీ మీద పడింది. మగపిల్లల చదువు కోసం ధారాళంగా ఖర్చు చేసిన తండ్రి, కూతుళ్లను స్కూలుకైనా పంపలేదు. వాళ్లేమైనా నేర్చుకున్నారంటే అది స్వయంకృషి ఫలితమే. తాత మరణంతో, మేరీ అన్నయ్యకు ఆస్తి కలిసి వచ్చింది. అయినా, అతడు చెల్లెళ్లకు కనీస సాయం కూడా చెయ్యలేదు. మగవాళ్ల దాష్టీకంతో, యింటి చాకిరీతో, కట్టుబానిసల్లా బతికిన మేరీ, ఆమె తల్లి ఐర్లండుకు పారిపోయి గవర్నెస్‌లుగా పనిచేసారు. త్వరలోనే తల్లి మంచం పట్టింది. మేరీ ఆమెకు నిరంతరం సేవ చేసినా, చివరిరోజుల్లో “కొడుకు చేతుల్లో కళ్లు మూయటానికి” ఇంగ్లండుకు తిరిగి పయనమైందావిడ. ఆమె మరణం తర్వాత, తండ్రి ప్రవర్తన మరింత వికృతంగా మారింది.

రోజూ ఏదో ఒక ఘర్షణ. ఎంత అణిగిమణిగి పడివున్నా, మేరీని అత్యంత కిరాతకంగా హింసించారు, తండ్రీ, కొడుకులు. ఈ నిత్యనరకం భరించలేక, పంధొమ్మిదో ఏట శాశ్వతంగా యిల్లు వదిలింది మేరీ. ఉద్యోగాన్వేషణ ప్రారంభించి, చిన్న చిన్న ఉద్యోగాలు చేసి చివరికి ఒక పత్రికలో రచయిత్రిగా స్థిరపడింది. (1787). అక్కడు న్నప్పుడే, సమాజంలోని స్త్రీ పురుష సంబంధాలను, స్వీయా నుభవంతో విశ్లేషించి, ఫెమినిస్టు మేనిఫెస్టోగా ఖ్యాతినీ, అపఖ్యాతినీ మూటగట్టుకున్న ‘విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ వుమన్’ ప్రచురించింది. ఆమె స్వతంత్ర వ్యక్తిత్వాన్ని గుర్తించిన పత్రికాధిపతి జోసఫ్ జాన్సన్, ఫ్రెంచి విప్లవాన్ని రిపోర్టు చెయ్యమని పారిస్‌కు పంపాడు. అక్కడ అభ్యుదయవాది, విప్లవాభిలాషి, దిగుమతి వ్యాపారంలో లాభాలార్జిస్తున్న యువకుడు గిల్బర్ట్ ముర్రేతో ప్రేమలో పడింది మేరీ. నిజానికి అతడు జూదరి, ఆయుధాలు దొంగరవాణా చేసే స్మగ్లర్. మేరీ గర్భం దాల్చింది. ఓ ఆడపిల్ల

**స్త్రీలకు ఓటు హక్కు**

| | | |
|---|---|---|
| ఇండియా | - | 1950 |
| పాకిస్తాన్ | - | 1956 |
| అమెరికా | - | 1920 |
| ఇంగ్లండ్ | - | 1928 |
| ఫ్రాన్స్ | - | 1930 |
| స్పెయిన్ | - | 1931 |
| కెనడా | - | 1917 |
| సౌదీ అరేబియా | - | 2015 (వచ్చును) |
| దుబాయి | - | 2011 (వచ్చినది) |

పుట్టిన తర్వాత ముర్రే ఆమెను వదిలేసి మరో బ్రిటిష్ నటీమణితో ప్రేమాయణం కొనసాగించాడు. మేరీ, ఆత్మహత్యకు ప్రయత్నించి లాడానం (నల్లమందు) మింగింది.

పరిచయస్తుల ప్రమేయంతో బతికి, పారిస్‌లో వుండలేక, కూతురితో స్కాండినేవియా వెళ్లిపోయింది. తిరిగి వచ్చేనాటికి ఆ మహానుభావుడు, నటీమణి బాహాటంగానే కాపురం పెట్టారు. మేరీ, ఈసారి థేమ్స్ నదిలో దూకి ప్రాణం తీసుకోవాలనుకుంది. మళ్లీ ఎవరో రక్షించారు. 1796లో అనార్కిష్టు, తాత్వికుడు, రచయిత అయిన విలియం గాడ్విన్‌తో పరిచయం పెంచుకుంది మేరీ. త్వరలోనే ఇద్దరి మధ్యా ప్రేమ చిగురించి పెళ్లి చేసుకున్నా, యిద్దరూ వేర్వేరుగానే జీవించారు.

మేరీ తన చివరి రచన 'మారియా or the wrongs of woman' ప్రారంభించింది. ఈ నవలను పూర్తి చెయ్యకుండానే, మరో కూతురు మేరీ (తల్లిపేరే)కి జన్మనిచ్చి ఆగష్టు 30, 1797 నాడు మరణించింది. ఈ కూతురు మేరీ, తరువాత ప్రసిద్ధ కవి పి.బి.షెల్లిని వివాహం చేసుకుని మేరీ షెల్లీగా, అత్యంత పాఠకాదరణ పొందిన హారర్ నవల 'ఫ్రాంకెన్‌స్టీన్' రచయిత్రిగా కీర్తి గడించింది.

యూరోప్‌లో కొనసాగిన భావజాల పరిణామ క్రమంలో, ఎన్‌లైటెన్‌మెంట్ (జ్ఞానోదయం) ఆదర్శాలను ప్రచారం చేసిన ఫ్రెంచి తాత్వికులు వోల్టేర్, దిదెరో, రూసోల రచనలతో ప్రేరణ పొందింది మేరీ. థామస్ పెయినీ రాసిన దిరైట్స్ ఆఫ్ మాన్ చదివి, మనుషులందరికీ (అంటే పురుషులకు) వున్న హక్కులు స్త్రీలకెందుకు లేవని ప్రశ్నించింది.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, వ్యక్తిత్వ వికాసం స్త్రీలకు అవసరం లేదా? అప్పటికి, ఫ్రాన్సులో కొత్త రాజ్యాంగ రచనకు సన్నాహాలు జరుగుతున్నాయి. మానవజాతిలో సంఘం–అంటే స్త్రీలు–వివక్షకు గురవుతున్నారని వాదించిన రాయబారి టాలీరాండ్‌ను బాధ్యతలనుండి తొలగించారు. దేశంలో అత్యంత పేదవాడికి కూడా ఓటు హక్కు కావాలని ప్రచారం జరిగింది. అవును పేదవాడికి కల్పించిన ఆ హక్కు స్త్రీలకెందుకు వర్తించదని మేరీ ఆక్రోశం. 'విండికేషన్' పుస్తకాన్ని ఆమె టాలీరాండ్‌కే అంకితమిచ్చింది. దాని సారాంశం యిది. "స్వేచ్ఛా ప్రియులైన పురుషులందరూ తమ ఉజ్వల భవిష్యత్తుకోసం ఆశయసాధనకోసం ముందడు గేస్తున్నారు. కాని, మీరే స్త్రీలను గురించిన నిర్ణయాలూ తీసుకోవటం న్యాయం కాదు. వాళ్లకు హేతుబద్ధంగా ఆలోచించగలిగే వివేకం లేదని ఎందుకనుకుంటున్నారు."

విండికేషన్, ఒక ప్రణాళిక ప్రకారం రాసిన పుస్తకం కాదు. వేదనా భరితమైన ఆలోచనలను యథాతథంగా ఖండికలుగా, చిన్న వ్యాసాలుగా రాసిన సంకలనం అన్నారు కొందరు. దీన్ని చదవాల్సింది రచయిత్రి అభిప్రాయాల కోసమేగాని సాహిత్య సౌరభం కోసం కాదు. "ఇది నా వ్యక్తిగత అవసరాలకోసం చేస్తున్న వాదన కాదు. స్త్రీ జాతి తరఫున ప్రశ్నిస్తున్నాను." అంటూ ప్రారంభమవుతుంది 'మేనిఫెస్టో' "అన్ని సుఖాలకూ, ఆనందాలకూ మూలం స్వేచ్ఛ. స్త్రీ, పురుషుడి ఆజ్ఞలకులోబడి, అతడి ఆజమాయిషీలో ఎందుకు బతకాలి? ఈ పురుషాధిక్యత బైబిల్లోనే తొలిసారి తన వికృత రూపాన్ని ప్రదర్శించింది. 'ఆడాం పక్కటెముకల్లో ఒకటి ఈవ్' అంటుందా పవిత్ర గ్రంథం.

ఈ వాదన అంగీకరించిన తర్వాత, యిక స్త్రీ, తన స్వతంత్ర ప్రతిపత్తి కోసం ఎలా కృషి చెయ్య గలుగుతుంది. పురుషు లంటే నాకిష్టమే. కాని, అతడి చేతిలోని కొరడా నన్ను భయపెడుతుంది. వాదించి, చర్చించి నన్ను ఒప్పించటానికి బదులు, పశుబలంతో, చట్టం యిస్తున్న ఆధిపత్య హక్కులతో నన్ను లొంగదీసు కోవాలను కుంటాడు పురుషుడు. స్త్రీకన్నా పురుషుడు బల వంతుడే. కాని, స్త్రీ అతడికి లొంగి పడుండటానికి అదొక్కటే కారణమా? అతడి అవసరాలు తీర్చటం తప్ప స్త్రీకి వేరే లక్ష్యాలు, ఆశయాలు వుండ కూడదా? రాజులు దైవాంశ సంభూతులనే భావన యిప్పుడు నశించింది. కాని, భర్తలలో మాత్రం ఆ లక్షణాలు యింకా చెక్కు చెదరకుండా వున్నాయి. పెంపుడు జంతువుల్లా బతుకీడుస్తున్న స్త్రీలగురించీ, కావ్యనాయికల గురించీ నేను మాట్లాడటం లేదు. ఇంగిత జ్ఞానం, విచక్షణ వుండి, హేతుబద్ధంగా ఆలోచించగలిగిన వాళ్లను గురించే నాబాధ. స్త్రీలకు విద్య అవసరమని ఎవరైనా గుర్తించారా? అక్కడక్కడా, మొక్కుబడిగా నడుపుతున్న విద్యాలయాలు లేవనిగాదు. కాని వాటివల్ల స్త్రీలు ఏ మాత్రం లాభపడటంలేదు. అక్కడ విద్యకు



మేరీ షెల్లీ




1912లో న్యూయార్క్ నగరంలో ఓటు హక్కుకోసం జరిగిన స్త్రీల ప్రదర్శన

బదులు, పురుషాధిక్యతను అంగీకరించమని బోధిస్తారు. స్త్రీలను చపలచిత్తులుగా, స్వంత నిర్ణయాలు తీసుకోలేని అపరిపక్వ జీవులుగానే వర్ణించి అనేకమంది ప్రముఖ రచయితలు పాఠకుల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నారు.

మరో వాస్తవం కూడా నేను అంగీకరించక తప్పదు. అంతో, యింతో చదువుకున్న స్త్రీలు కూడా అలంకరణలకు, ఫాషనబుల్ దుస్తులకు, నగలకు, బానిసై పురుషుల 'ఆస్తి'గా మారటానికే యిష్టపడుతున్నారు. వివాహమే జీవితానికి పరిపూర్ణత చేకూర్చుతుందనీ, భర్త యింట్లో రాణివాసమే అంతిమ లక్ష్యమనీ నమ్ముతున్నారు. దేవుడి దృష్టిలో, స్త్రీ పురుషులు సమానమే అనుకున్నా, వీళ్లు మాత్రం ఐచ్ఛికంగా, అసమానతను పురుషుల పాదాల చెంత సమర్పించుకొని తృప్తి పడుతున్నారు. ఇలాంటి వాళ్లు పిల్లల్ని మాత్రం ఎలా పెంచుతారు? తల్లుల అజ్ఞానమే పిల్లలకూ సంక్రమిస్తుంది. భార్యలంటే పురుషులకు బానిసలు, ఆటబొమ్మలు.

శారీరకమైన అవసరాలు స్త్రీ, పురుషులిద్దరికీ వుంటాయి. అంత మాత్రాన, పురుషుల కోర్కెలు తీర్చటం కోసమే తన శరీరాన్ని అలంకరించు కోవాలా స్త్రీ? పొగడ్తలకు పొంగిపోయి తమ జీవితాలను పురుషులకు అంకితం చేసే స్త్రీలంటే నాకు గౌరవం లేదు. క్షణిక సుఖంకోసం, చేజేతులా బానిస జీవితాన్ని కొని తెచ్చుకోవటమెందుకు? పురుషులు చేసే చిన్న చిన్న సేవలు స్త్రీలను నిర్వీర్యులను చేసి లొంగతీసుకునే ప్రయత్నమా? స్త్రీలు బలహీనంగా వుండటమే పురుషులకిష్టం. అబలలనిపించు కోవటం స్త్రీలకూ యిష్టమే. అంటే, పరాన్న భుక్కులుగా బతకటానికి సిద్ధపడ్డారన్న మాట. పురుషులు వాళ్ల రక్షకులు, బల్లిని చూసి భయ పడుతుంది స్త్రీ. ఎలుకను చూసి గంతేస్తుంది. బొద్దింకను చూసి కెవ్వుమంటుంది. పురుషుడు ఆమెకు ధైర్యం చెప్పాలి. ఎంత నీచం! ఎంత అవమానకరం!



ఓటు హక్కుకోసం

స్త్రీలలోని లైంగిక బలహీనతను కూడా విమర్శించింది మేరీ. "పురుషుడికి కావలసింది మేధో పరిణితి చెందిన, వ్యక్తిత్వం వున్న స్నేహితురాలు కాదు. అణిగిమణిగి వుండే, స్త్రీ జంతువు అతడి అవసరాలు తీరుస్తుంది. నా ప్రతిపాదనలకు కొందరు నవ్వుకోవచ్చు. కాని, ''ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో స్త్రీల ప్రతినిధులుండాలని కోరుకుంటున్నాను. స్త్రీ పురుష సమానత్వానికి తొలిమెట్టుగా, బాలబాలికల సహవిద్య అమలు చెయ్యాలి."

అచ్చయిన తొలి సంవత్సరాలలో, 'విండికేషన్'ను అందరూ విస్మరించినా, ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో, స్త్రీవాద ఉద్యమం బలపడుతున్న క్రమంలో, ఉద్యమ కారులకు ఈ పుస్తకం కరదీపికగా మారింది. ఈ నాటి స్త్రీవాదుల సమరశంఖారావంతో పోల్చితే మేరీది సామరస్యధోరణే. అయినప్పటికీ, 1792లో 'విండికేషన్' ప్రచురణతో, స్త్రీ పురుష సమానత్వం దిశగా తొలిఅడుగు వేసిందామె.

మేరీ అసంపూర్తి నవల Maria or the wrongs of woman.' ఈ పేరులో శ్లేషవుంది. స్త్రీలు చేసిన అన్యాయలూ, స్త్రీల పట్ల జరిగిన అన్యాయాలు అని కూడా అర్థం వస్తుంది. నవలలో రెండు రకాల పాత్రలూ వుంటాయి. "నరకాన్ని మనం మరో లోకంగా వూహించుకుంటాం. కాని మారియాకి, పెళ్లైన తర్వాత భర్తయిల్లే నరకంగామారింది. అంటూ ప్రారంభ మవుతుంది.

ఇదే బహుశా, తొలి స్త్రీవాద నవల.

# తెలుగులో స్త్రీ వాద రచనలు

- వి.త్రివేణి

మనిషి సంఘజీవి. సంఘంలోని రాగ ద్వేషాలు, ప్రతిస్పందనలు అతనిని పూర్తిగా ప్రభావితం చేస్తాయి. తన చుట్టూ వున్న పరిస్థితుల పైన అతనికి ఒక అవగాహన కలుగుతుంది. ఈ క్రమంలో తన సలహా సహకారాలతో సమాజతత్త్వం వెల్లడించే నేర్పు అతనికి ఏర్పడుతుంది. సమాజాన్ని చైతన్య పరిచే దిశలో అతని ప్రయత్నం విస్తృతమౌతుంది. తత్ఫలితంగా అతనిలో మానవీయత ద్యోతక మౌతుంది. దీనిని ప్రదర్శించడానికి వివిధ కళా సాహిత్యాల ఆశ్రయం పొందుతాడు. సమాజ ప్రయోజనాన్ని ఆశించి, తన సృజనాత్మకత దృష్టితో సాహిత్యాన్ని ఒక గొప్ప సాధనంగా అలవరుచుకొన్నవాడే రచయితగా గుర్తింపు పొందుతాడు. సృజనాత్మకత కారణంగానే అతనిలో కరుణ, దయ, జాలి, ఆప్యాయత, అనురాగం, మమకారం వంటి మానవతా విలువలు పెంపొందుతాయి. అందువల్ల సాహిత్యం, సృజనాత్మకత, సామాజిక చైతన్యం పరస్పర అవినాభావ సంబంధాన్ని కలిగి ఉంటాయి.

ఇదే విధమైన సృజనాత్మకత దృష్టితో రచయిత్రులు కొత్త కోణంలో తమ భావాలను వెల్లడించారు. సామాజిక ప్రయోజనాన్ని ఆశించే దిశలో కథాసాహిత్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకొన్నారు. బండారు అచ్చమాంబతో ప్రారంభమైన కథాసాహిత్యానికి వందేళ్ళకు పై బడే చరిత్ర ఉంది. నాటి నుంచి నేటి వరకు అనేక వాదాలను సృష్టించుకొని రచయిత్రులు తమ కథల్లో నూతనమైన భావజాలాన్ని ప్రదర్శించి సామాజిక చైతన్యానికి పూనుకొంటున్నారు. ఈ విధంగా ఏర్పడినవే సంస్కరణవాదం, జాతీయవాదం, కాల్పనికవాదం, అభ్యుదయవాదం, విప్లవవాదం, అస్తిత్వవాదం, స్త్రీవాదం, దళిత స్త్రీవాదం, మైనారిటీ స్త్రీవాదం, బహుజన స్త్రీవాదం.

**సంస్కరణ వాదం:** అనాదిగా మూసపద్ధతిలో కొనసాగుతున్న స్త్రీల జీవితాలలో మార్పును ఆశిస్తూ ఒక సమిష్టి ప్రాతిపదిక దృష్టితో 'సంస్కరణవాదం' ఆరంభం అయింది. స్త్రీలలో అంతర్గతంగా ఉన్న అసంతృప్తులకు, అణగారి ఉన్న ఆలోచనలకు ఒక చక్కటి అవకాశాన్ని కలిగించింది. స్త్రీల సమస్యలను గుర్తిస్తూ, స్త్రీల అభివృద్ధిని కాంక్షిస్తూ సంస్కరణ వాదం బలోపేతమైంది. కుటుంబం ఒక సామాజిక రంగంగా పరిణమిస్తున్న ఆ క్రమంలో స్త్రీలను సమాజంలో అంతర్భాగంగా, స్త్రీలలో చైతన్య స్థాయిని పెంపొందించడానికి స్త్రీ విద్యావశ్యకతను నిర్ణయించడం జరిగింది.

తెలుగుదేశమంతటా విస్తరించి ఉన్న బాల్య వివాహాలు, బాల వితంతువులు, సాంఘిక పరమైన కట్టుబాట్లు, కన్యాశుల్కం, అవిద్య మొదలైన అంశాలు స్త్రీల జీవితాలను దుర్భరం చేశాయి. ఈ బాల్య వివాహాల పద్ధతి వల్ల కన్యాశుల్కం ఏర్పడి, దాని వల్ల వైధవ్యం, వ్యభిచారం వంటి అవినీతి చర్యలు, శిశుహత్య వంటి క్రూర చర్యలు ప్రారంభం అయ్యాయి. స్త్రీల అభ్యుదయాన్ని కాంక్షిస్తూ అభివృద్ధి పథంలో నడుస్తున్న సంస్కరణ భావాలు వాస్తవిక జీవితాల్లో మార్పు తీసుకొని రావాలన్న ఆకాంక్షతో ఆచరణలో కార్యరూపాన్ని అనుసరించాయి. భారత దేశ చరిత్రలో సంస్కరణోద్యమానికి ప్రముఖ స్థానం ఉంది. 19వ శతాబ్దంలో ఆరంభమైన సంస్కరణోద్యమం ద్వారా మత, సాంఘిక, రాజకీయ పరిణామాలు ఏర్పడ్డాయి. తొలి దశలో సతీసహగమనాన్ని, కన్యాశుల్కాన్ని తీవ్రసమస్యలుగా భావిస్తూ వ్యతిరేక ఉద్యమాలు బయలుదేరాయి. సతీసహగమనం నిషేధ చట్టం వరకు కొనసాగితే; కన్యాశుల్కం-దాని కాలం అంతరించేంత వరకు ఉద్యమించింది. ఇటువంటి సంస్కరణ భావాలను కథా రచయిత్రులు చాలా స్పష్టంగా వెల్లడించారు. బండారు అచ్చమాంబ 19వ శతాబ్దాంతంలో, 20వ శతాబ్ది ప్రారంభంలో స్త్రీల జీవితాలను సంస్కరణాత్మక దృష్టితో ప్రతిబింబిస్తూ దాదాపు 12 కథలు రచించారు. అచ్చమాంబ

డాక్టరు వి.త్రివేణి, ఫోను : 9951444803

ప్రాచీనమైన సతీ ధర్మాలతో పాటు నవీన పాశ్చాత్య విద్యా సంస్కారాలను కలబోసి ఒక నూతనమైన పద్ధతిలో రచనా వ్యాసంగాన్ని ఆరంభించారు. కందుకూరి వంటి సంస్కర్తల భావాలతో ప్రభావితమైన అచ్చమాంబ స్త్రీ చైతన్యం కోసం "బృందావనీ స్త్రీ సమాజము" పేరుతో స్త్రీల సమాజాన్ని స్థాపించారు. సంఘ సేవకురాలిగా, కథారచయిత్రిగా పేర్గాంచిన అచ్చమాంబ *అబలా సచ్చరిత్ర రత్నమాల* అనే గ్రంథాన్ని రచించి ప్రసిద్ధ భారతీయ స్త్రీల ప్రగతిని, ప్రతిష్టను కీర్తించారు. ఆదర్శ మహిళగా మాటలో సూటిదనం, దయాగుణం, జాతీయభావం అభివ్యక్త మౌతాయి.

1902 సం॥లో హిందూ సుందరి పత్రికలో ప్రచురించబడిన *స్త్రీ కథ* స్త్రీ విద్యావశ్యకతను తెలుపుతుంది. భార్యాభర్తల సంవాదరూపంలో ఉండే ఈ కథలో స్త్రీలు చదువుకోకపోతే అజ్ఞానాంధకారంలోనే ఉంటారని, మూఢత్వంలోకి నెట్టివేయబడతారని ఒక పురుష పాత్ర ద్వారా రచయిత్రి చెప్పిస్తుంది. స్త్రీల విద్యాభివృద్ధి కోసం పురుషుల ప్రోత్సాహం చాలా అవసరమని తెలియజెప్పే కథ ఇది. *జానకమ్మ* కథ కూడా దాదాపు స్త్రీ విద్యావ్యాప్తికి సంబంధించింది. చదువుకొన్న స్త్రీలకి వివాహ సమయాల్లో ఎటువంటి ఇబ్బందులు కలుగవని, కట్నకానుకలు లేకుండానే వరుడు లభిస్తాడని రచయిత్రి ఈ కథ ద్వారా సందేశాన్ని అందించారు. తల్లిదండ్రులు కూతుళ్లను బరువుగా భావించకుండా విద్యాబుద్ధులు నేర్పించాలన్నది అచ్చమాంబ అభిప్రాయం.

ఈర్ష్య, గర్వం, దురభిమానం వంటి దుర్గుణాలను వదిలి సద్గుణాలను అలవరచుకోవాలని, స్వయంకృషితో సోమరితనాన్ని వదిలి సద్గుణాలను అలవరచుకోవాలని, స్వయంకృషితో, సోమరితనాన్ని వదిలి దారిద్ర్యాన్ని అధిగమించాలని, పొదుపును పాటించి సంసారాలను సంరక్షించుకోవాలని, భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని అన్యోన్యంగా జీవించాలని, కుటుంబం మొత్తం సామరస్య పూర్వక వాతావరణాన్ని కల్పించుకోవాలని రచయిత్రి తన కథల ద్వారా ఉపదేశించారు. ఈ కథల నేపథ్యమంతా సామాజిక చైతన్యాన్ని ఆశిస్తుంది. వ్యక్తిత్వ నిర్మాణానికి (వికాసానికి), జీవితార్థానికి పనికి వచ్చే విషయాలను నీతి బోధకాలుగా, జీవిత సత్యాలుగా వెల్లడించారు. కథా సాహిత్యం ద్వారా సామాజిక ప్రయోజనాన్ని అభిలషించారు.

"విద్య వలన బుద్ధి వికసించును. అనేక సద్గ్రంథములలోని యమూల్యంబులగు నుపదేశ వాక్యంబులు మనసున నాటి మనుజుల నుదాత్తవంతులనుగా జేయును. వారి యందలి దుర్గుణ పుంజములు పోయి సద్గుణ పరంపర లాస్థానముల లంకరించును. లోకానుభవమును గనుటకు వారలు విశేష యోగ్యులగుదురు. అనేక లోక వార్తల నెఱుగ గలిగిన వారలగుదురు. కొన్ని పుస్తకముల పఠనము వలన మనమునకాహ్లాదము కలుగును. ఇందువలన సంసారము నందలి యసంఖ్యాకము లగు దు:ఖముల నొక్కింత మఱిచి జనులానందింపగలరు. విద్యవలన నిట్టి లాభములింకను బెక్కులు కలవు. నీవు పట్టుదలతో జదువు నేర్చి కొంత చదువుకొనిన పిదప భోజన శయనాదులనైన నొల్లక చదువునందే యభిరుచి కలిగియుందువని నేను దృఢముగా జెప్పగలను. అన్ని యానందములలో విద్యానందమే శ్రేష్టమనిన వాక్యము నిజమని నీవే తెలిసికొనెదవు. ఇది యిటుండనిమ్ము ప్రపంచము నందెల్లప్పుడును పత్ని పతికి సహాయురాలై యుండవలయును...

ప్రస్తుతము పురుషుల కంటెను స్త్రీలు విశేష జ్ఞాన సంపన్నులగుట యధిక యావశ్యకము, ఏలన నికముందు పుట్టబోవు వారి నున్నత పదవికి తెచ్చుట స్త్రీలయధీనము లోనిదై యున్నది. తల్లి విద్యాహీనయు దుర్గుణవతియునైనచో నామె సంతాన మంతయు నటులనే యగుటయు, తల్లి విద్యావతియు సద్గుణవతియునైనచో నామె సంతానము మిక్కిలి యోగ్యతను గాంచగల్గుటయు సహజము" (స్త్రీ విద్య – బండారు అచ్చమాంబ)

**జాతీయవాదం:** భారతదేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా సమానంగా భాగం పంచుకొన్నారు. మన ప్రప్రథమ ప్రధాని పండిత జవహర్ లాల్ నెహ్రూ ఒకానొక సందర్భంలో–

"భారత స్వాతంత్ర్య సముపార్జనలో ధైర్య సాహసాలతో, సడలని ఆత్మవిశ్వాసంతో పురుషులతో సమానంగా చేయి భుజాలు కలిపి ఇల్లు వాకిళ్ళని సంసారాలని వదిలి, ఎన్నో త్యాగాలు చేసి, స్వాతంత్ర్య ఫలాలని మనకి అందించారు" అని భారత మహిళా లోకాన్ని ప్రశంసించారు. అన్ని ప్రాంతాల్లోలాగే ఆంధ్రప్రదేశ్‌లో దువ్వూరి సుబ్బమ్మ, సంగెం లక్ష్మీబాయి, కనుపర్తి వరలక్ష్మమ్మ, యల్లాప్రెగడ సీతాకుమారి,

నందగిరి ఇందిరాదేవి, ఆరుట్ల కమలాదేవి వంటి వీర నారీమణులు స్వాతంత్ర్యోద్యమంలో భాగం పంచుకొన్నారు. వారిలో దేశభక్తి, సేవానురక్తి అచంచలమైనవి. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం దేశమంతటా ఎంతో మంది స్త్రీలను ఆకర్షించింది. భారతీయ స్త్రీలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, వారి వారి గృహసంబంధిత బాధ్యతలను వదులుకోకుండా పాల్గొన్నారు. తరతరాల భారతీయ స్త్రీమూర్తి వ్యక్తిత్వం, శాంతి సహనాలు, మౌనంగా కష్టాలను భరించడం, తనను తాను ఆత్మార్పణ చేసుకోవడం, ఎన్ని సవాళ్ళనైనా ఎదుర్కోవడం వంటి సహజ గుణాలతో జాతీయోద్యమానికి భారతీయ స్త్రీలు సిద్ధపడ్డారు. విద్యావంతులైన కొంత మంది స్త్రీలు, సంస్కర్తల ఉమ్మడి కృషి, ప్రోత్సాహంతో జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. సభలకు, సమావేశాలకు వెళ్ళడం రాజకీయ సమస్యల మీద, జరుగుతున్న ఉపన్యాసాలను, చర్చలను వినడం వల్ల స్త్రీలలో సామాజిక చైతన్యం కలిగింది. దర్శి అన్నపూర్ణమ్మ, డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి, తలారి చంద్రమతీదేవి వంటి స్త్రీలు రాజకీయ రంగ ప్రవేశం చేయకపోయినా వెనుక ఉండి సహాయ సహకారాల ద్వారా తమవంతు సేవలను దేశానికి అందించారు. కందుకూరి రాజ్యలక్ష్మమ్మ, రుక్మిణి లక్ష్మీపతి, పొణకా కనకమ్మ వంటి వారు ఆంధ్రులకి ప్రత్యేక రాష్ట్రం లాంటి విషయాలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.

సాంస్కృతిక రంగాల ద్వారా చాలా మంది తెలుగు స్త్రీలు తమ జాతీయ వాదాన్ని ప్రదర్శించారు. స్త్రీల సమాజాలు, విద్యాలయాలు, ముద్రణాలయాలు స్థాపించి, తమ ఆశయాలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించారు. ఇరవైయవ శతాబ్దపు మొదటి రెండు దశకాల్లో *హిందూ సుందరి, సరస్వతి, గృహలక్ష్మి, వివేకవతి, తెలుగు జనానా* వంటి పత్రికలు వెలువడ్డాయి. ఇందులో స్త్రీలు అనేక రచనలు చేశారు. చాలా ప్రతిభావంతమైన కథలు ప్రచురించబడ్డాయి. ఈ కథల్లో ఎక్కువ శాతం దేశభక్తి స్వతంత్ర పోరాటాల్లో స్త్రీలకృషి, స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాలు వంటి ఇతివృత్తాలు ప్రవేశపెట్టబడ్డాయి. భర్తలను అర్థం చేసుకొని, వారి అడుగు జాడల్లో నడుస్తూ, వారి ఆశయ సిద్ధికి స్ఫూర్తిగా నిలిచిన స్త్రీలు ఈ కథల్లో పాత్రలుగ నిలిచారు. కనుపర్తి వరలక్ష్మమ్మ *ఐదు మాసముల ఇరువది దినములు* అన్న కథలో జాతీయోద్యమంలో భాగంగా స్వదేశీ ఉద్యమానికి సంబంధించిన ఇతివృత్తాన్ని కల్పించారు. ఈ కథలో రుక్మిణి భర్త గోపాలరావు విదేశీ వస్త్ర బహిష్కరణ చేసి జైలుకు వెళతాడు. ప్రసవానికి వెళ్ళి పండంటి బిడ్డతో పుట్టింటి నుంచి అత్తింటికి వచ్చిన రుక్మిణి ఏమాత్రం అధైర్య పడకుండా భర్త ఆశయాలకు తగినట్లు నడుచుకొంటుంది. "ఏమి? మన దేశపు గుడ్డ మనము కట్టుకొనుటగూడ తప్పేనా? నేడిదైనది. రేపు మీకు గావలసిన ఆహారపదార్థములను మేమే పచనము చేసి పంపెదము గాని మీరు తయారు చేసికొనరాదనినచో మన పొయ్యిలు తవ్వివేసికొన వలసినదేనా? ఎంత అధమపు బ్రతుకు. నా పెనిమిటి నాతో మాట్లాడలేదని యెంతో వేదన పడితిని. కాని కారణము తెలిసికొనలేక పోతిని.

నేను, పిల్లవాడు ధరించియున్న విదేశీ వస్త్రములే వారికి అసహ్యాకారణమై యుండవలయును. విదేశ వస్త్రములలో నైసూ, నాజూకూ ఉన్నదనుకొనుచుంటిమి గాని వాటిలో ఇంత పరాధీనత యున్నదని గమనించలేదు. ఛీ! నా పతికి అప్రియములగుటయేగాక శిక్షా హేతువులైన ఈ విదేశ వస్త్రములు నాకేల?" అని యోచించి తక్షణమే రుక్మిణి తన చీని చీనాంబరములకు సెలవొసంగినది. ఆమె ఇప్పుడు ఖద్దరు వస్త్రధారిణి. ఏ హార్మోనియము వాయిద్యమో, ఫిడేలు వాయిద్యమో వినబడుచుండెడిది రుక్మిణి మేడ మీది గదిలో మునుపు. ఇప్పుడు ఎల్లవేళల రాట్నపు నినాదము.

కొడుకును స్వాతంత్రోద్యమంలోకి పంపడం కోసం తాను అడ్డంగా ఉండరాదని ఆత్మత్యాగం చేసిన తల్లి కథ *త్యాగిని*లో మైదవోలు పద్మావతి పేర్కొన్నారు. 1931 గృహలక్ష్మి పత్రికలో ప్రచురించబడిన ఈ కథలో రావు స్వాతంత్రోద్యమంలోకి వెళితే తన తల్లి దిక్కులేనిదౌతుందని ఉద్యోగం చేస్తుంటాడు. కాని ఆ తల్లి– "నాయనా! అందరును సత్యాగ్రహ పోరాటమున పాల్గొనుచుండ నీవు ఆడదాని వలె ఇంట కూర్చొని యున్నావేమి? ఆ భరత పుత్రుల ఘోష నీ చెవికెక్కలేదా? మహాత్ముని యాజ్ఞయనిన లక్ష్యము లేదా? భారతీయుల పాట్లు చూడ ముదుసలినగు నాకు రోష పౌరుషములు పైకుబికి జాలి చేత గుండె నీరగుచున్నదే. నీ మనసేమి పాషాణమా? ఇనుమా? ఏల కరుగదు? నీవును ఒక మనిషివేనా? ఈ దేశమున జనించిన వాడవేనా? అని నిలదీస్తుంది. చివరికి నాయనా! భారతీ యుడవనిపించుకొనుము. నీవు సత్యాగ్రహమునందు పాల్గొన కుందుటకు నేనడ్డమని తలచి, నాకన్న దేశమాతయే ముఖ్యమని యెంచి, నే సజీవముగానున్న

వెనుకంజ వేయుదువని నేను నా జీవితము త్యజించితిని," అని మరణిస్తుంది. తర్వాత రావు గాంధీజీ స్వరాజ్య సమరంలో పాల్గొని వీరస్వర్గం పొందుతాడు. అదే విధంగా గుమ్మడిదల దుర్గాబాయి *నే ధన్యనైతిని,* బసవరాజు వెంకట రాజ్యలక్ష్మి *ఎవరిదదృష్టం,* తాడి నాగమ్మ *కథకాదు,* చంద్రకళ *ప్రేమవేదిక మీద* వంటి కథలు స్వాతంత్రోద్యమ స్వరూపాన్ని తెలుపుతాయి.

**కాల్పనిక వాదం:** సృజనాత్మకత, భావుకత, వ్యక్తిగతానుభూతి వంటి అంశాలకు ప్రాధాన్యత వహిస్తూ రసానుగుణమైన రచనా ధోరణికి, ఒక నూతనమైన చైతన్యానికి కాల్పనిక వాదం ఊపిరిపోసింది. ప్రకృతి పట్ల ఆరాధన, నాగరికతకు దూరంగా ఉన్న గ్రామీణ జీవితం పట్ల ఆకర్షణ, బాల్యం గురించి, ప్రేయసి గురించి, సంఘ దురాచారాల గురించి కాల్పనిక రచయితలు తమ కల్పనల్లో, ఊహల్లో రచనలు చేస్తూ వచ్చారు. నిజాయితీని, సృజనాత్మకతను సరళమైన మాటలతో చెప్పడం వీరి వాదానికి ప్రమాణంగా నిలిచింది. స్వేచ్ఛా స్పందనలకు అవకాశం లభించింది. వ్యక్తిగత భావ తీవ్రతకు, ఆనందాతిశయానికి, విషాదానికి, భయంకరమైన అనుభవాలకు, సున్నితమైన సన్నివేశాలకు చోటు కల్పింప బడింది. యాంత్రికతను తొలగించి భావుకతను ప్రదర్శించింది. నిస్సారమైన సంప్రదాయాలపై తిరుగుబాటు చేసి సృజనాత్మక స్వేచ్ఛకు ప్రాధాన్యతనిచ్చి సమాజ హితోధిక చైతన్యానికి కారణమైంది.

రియలిజం నుంచి రొమాంటిజమ్‌లోకి తీసుకొని వెళ్ళే కథలు కథారచయిత్రుల కలాల నుంచి జాలువారాయి. ఆర్తి, ఆరాధనా, ప్రకృతి పరవశం వంటి సన్నివేశాలు చాలా స్పష్టంగా వీరి కథల్లో ప్రతిఫలించాయి. శైలిలో వచ్చిన మార్పులతో సరికొత్త కథా వస్తువును ఎన్నుకొని తెన్నేటి హేమలత, సౌరీస్, కోడూరి కౌసల్యాదేవి, ఆచంట శారదాదేవి, శివరాజు సుబ్బలక్ష్మి వంటి రచయిత్రులు కథలు రచించారు. "వంశీమోహనుని సుందరనేత్రాలు ఏ అనంతంలోనో ఉద్దేశ రహితంగా చూస్తున్న సమయంలో తను పోయి అతని మీద వాలిపోయింది. తన బంగారు వర్ణపు మృదుకేశాలు అతని నీలవర్ణం ప్రతిఫలించి కాబోలు కొన్ని క్షణాలు నల్లబడినయ్" అని హేమలత తన *వంశీకుంజం* కథలో పేర్కొన్నారు. చక్కటి మనోవైజ్ఞానిక విశ్లేషణకు సంబంధించిన పాత్రలు రచయిత్రుల కథల్లో ప్రవేశపెట్టబడ్డాయి. ఇదే రీతిలో సామాజిక స్థితిగతులపై స్పందించి సంఘ దురాచారాలను ఖండించి స్వేచ్ఛా పూరిత ధోరణిలో కథలు రచించారు.

కాల్పనిక సాహిత్య ఉద్యమంలో వచ్చిన కథలు అంతకు ముందున్న స్త్రీపరమైన అభిప్రాయాన్ని మార్చాయి. స్త్రీని భోగ దృష్టితో గాక అటువంటి సాంప్రదాయానికి స్వస్తిపలికి ఒక ఆదర్శ వనితగా ప్రతిష్టించడం జరిగింది. స్త్రీ శరీర సౌందర్యం కంటే ఆత్మసౌందర్యానికి ఎక్కువ విలువ నివ్వడం జరిగింది. కోడూరి కౌసల్యాదేవి *తపోవనం,* సౌరీస్ *ఉష,* శివరాజు సుబ్బలక్ష్మి *మనోవ్యాధికి మందుంది,* ఆచంట శారదాదేవి *ఒక్కరోజు* వంటి కథల్లో స్త్రీ పాత్రలు చాలా ఆదర్శవంతంగా తీర్చిదిద్దబడ్డాయి.

సహనానికి ప్రతీకలుగా నిలిపి కుటుంబ వ్యవహారాల్లో చక్కని నేర్పు కనబరిచే విధానాన్ని స్త్రీ పాత్రల ద్వారా ప్రతిబింబింపజేశారు. తమ గుణ శీలాలతో భర్తను, పిల్లలను ఉన్నతమైన విలువలను, భావాలను పెంపొందింప జేసేవిధంగా ఆదర్శదాయకంగా స్త్రీలు కనిపిస్తారు.

**అభ్యుదయ వాదం:** "అభ్యుదయం అంటే పురోగమనం, ప్రగతి అనే అర్థాన్ని స్వీకరిస్తున్నాం. కాల్పనిక వాదానికి తిరుగుబాటుగా, సామాజిక చైతన్యమే పర్యవసానంగా అభ్యుదయ వాదం ఏర్పడింది. మార్క్సువాదాన్ని పునాదిగా ఏర్పరుచుకొని వస్తుప్రాధాన్యతతో, వాస్తవిక దృక్పథంతో, మానవతావాదంతో, ప్రగతి శీలకమైన మార్పుతో అభ్యుదయ రచయితలు తమ రచనలు ఆరంభించారు. "అభ్యుదయ రచయితలు తెచ్చిన విప్లవం రసావిష్కరణకు రసాస్వాదనకు సంబంధించినది.

సాహిత్యం ఒక భోగవస్తువుగా పరిగణించే దృక్పథం మీద వారు తిరగబడుతున్నారు. నేటి రచయితకు ప్రజలే ప్రమాణము. కొన్ని కారణాల వల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్ళీ సారస్వ తోన్ముఖంగా తిప్పటానికి నేటి రచయితలు పాటుపడు తున్నారు." అని శ్రీశ్రీ తృతీయ అభ్యుదయ రచయితల మహాసభలో పేర్కొనడం జరిగింది. సామాన్య మానవునికి ప్రాధాన్యత నివ్వడం, గతాన్ని (కాల్పనికత) నిరసించడం, వర్గ సంఘర్షణ ప్రోత్సహించడం, విప్లవాన్ని ప్రబోధించడం, వీరగాథలను కీర్తించడం, యుద్ధం పట్ల విముఖతను ప్రకటించడం, శాంతి ప్రియత్వాన్ని ప్రదర్శించడం, సమ సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించడం వంటివి అభ్యుదయ రచయితలు తమ రచనల్లో ప్రవేశ పెట్టారు. అభ్యుదయ వాదాన్ని తమ కథల్లో సూచించిన తెలుగు కథారచయిత్రులు

చాలామంది ఉన్నారు. అందులో చాగంటి తులసి, ముదిగొండ సుజాతారెడ్డి వంటివారిని పేర్కొనవచ్చు. చాగంటి తులసి (చాసో చిన్నకూతురు) చిన్నప్పటి నుంచి చాసో, రోణంకి అప్పలసామి, శ్రీరంగం నారాయణ బాబు, శ్రీశ్రీ వంటి వారి చర్చలను వాదోపవాదాలను విన్నారు.

అభ్యుదయ సాహిత్యాన్ని గూర్చి పూర్తిగా అవగాహన చేసుకొన్నారు. ఈ ప్రభావంతోనే మానవ సంబంధాల్లో వస్తున్న మార్పులను తన కథల్లో స్పష్టం చేశారు. చాలా కథల్లో మధ్య తరగతి కుటుంబాలలో స్త్రీ పురుషుల సంబంధాల మధ్య వస్తున్న ఆర్థిక సంబంధాలు స్త్రీ పురుష అసమానత్వాన్ని సృష్టిస్తున్న తీరును చిత్రించారు. స్త్రీల పెంపకం, చదువు, ఉద్యోగం, పెళ్ళి, ప్రవర్తన వంటి అంశాలలో మధ్య తరగతి ఆర్థిక సాంఘిక పరిమితుల ప్రభావం, దాన్ని ధిక్కరించడానికి స్త్రీలు చేసే ప్రయత్నాలు తన కథల్లో ప్రదర్శించారు.

ఒక కుటుంబ జీవితం ఆధారంగా మొత్తం మధ్య తరగతి జీవితాన్ని ప్రదర్శించే కథ *వలయం*. మధ్య తరగతి జీవితాల్లోని వ్యక్తులు పలాయన వాదులుగా రక్తసంబంధాలను తెంచుకొని, బాధ్యతారహితమైన జీవితాలను గడిపే స్థితిని ఈ కథ వివరిస్తుంది. ఈ కథలో ప్రధాన పాత్ర రాజును సృష్టించి, మధ్య తరగతి అనుబంధాలను చిత్రించారు.

రాజుకు తల్లి, తండ్రి, బామ్మ, ఇద్దరు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు ఉంటారు. పి.జి. పాసై స్కాలర్‌షిప్‌తో రీసెర్చ్ చేసే రాజు స్వాతంత్ర్యానంతర వలసవాద విద్య. మధ్య తరగతి ఆర్థిక స్థితి తన వాళ్ళందరినీ తన వాళ్ళు కాకుండా చేశాయి. రాజు భార్య కూడా ఈ *వలయం* లో ఉండలేక మర్నాడే వెళ్లి పోవాలనుకుంటుంది. ఈ సందర్భంలోనే రాజు పెద్ద తమ్ముడు (కృష్ణుడు) ద్వారా రచయిత్రి ఉపదేశం చేస్తారు. వలయం లాంటి సమాజాన్ని చూచి భయపడి పారిపోకూడదని, సమాజాన్ని కదిలించాలనీ, అందుకు అందరు కట్టుబడి ఉండాలని పేర్కొంటాడు. పరిస్థితులను మార్చాలనే దృష్టితో విప్లవం వైపు మొగ్గుచూపే కృష్ణుడు ఉద్యమాల ద్వారా సమాజాన్ని మార్చాలి గాని, బాధ్యతా రాహిత్యం, పలాయన బుద్ధి మంచివి కావని చెబుతాడు. సామాజిక చైతన్యాన్ని అభ్యుదయ పంథాల్లో చెప్పిన తులసి *వలయం* వంటి కథలను అనేకం రచించారు. తల్లిదండ్రుల మీద తిరుగుబాటు చేసి చదువు కోవాలని నిర్ణయించుకొన్న *చిన్నదేవేరి* కథ; అవకాశవాదంతో మగాడు రెండో మనువుకు సిద్ధపడితే అందుకు స్త్రీ సిద్ధంగా లేదని చెప్పే కథ *యాష్-ట్రే*; మధ్య తరగతి జీవితాల్లోని స్త్రీ పురుష సబంధాల్లో మార్పును చిత్రించే కథ *మనువు*; స్త్రీలు చదువుకొని ఆధునికులు కావాలని ఒక స్త్రీ ప్రబోధించే కథ *బోధ* వంటవి చాగంటి తులసిలో గల అభ్యుదయ భావాలను వెల్లడిస్తాయి. మరొక అభ్యుదయ కథా రచయిత్రి ముదిగొండ సుజాతారెడ్డి సమాజంలో స్త్రీల పట్ల చూపబడే వివక్షతను నిరశించారు.

స్త్రీలలో ఆత్మగౌరవం, ధైర్యం, వ్యక్తిత్వం, అంతశ్శక్తి, సామర్థ్యం వంటివి పెంపొందించడానికి ప్రయత్నించారు. *విసుర్రాయి, మింగుతున్న పట్నం, వ్యాపార మృగం*, వంటి కథా సంపుటాలు రచించి సామాజిక చైతన్యానికి తోడ్పడ్డారు. అన్ని వర్ణాలకు, వర్గాలకు, రంగాలకు చెందిన స్త్రీల జీవితాలను, వారి బాధలను, వ్యథలను వర్ణిస్తూ పరోక్షంగా స్త్రీ అభ్యుదయానికి ప్రాధాన్యతను ఇస్తూ *విసుర్రాయి* కథా సంపుటిని రచించాడు.

సామాజిక, రాజకీయ పరిణామాల ఫలితంగా జనుల జీవితాల్లో వచ్చిన ప్రకంపనలు, మానవసంబంధాల కుంటుబాటు వంటివి పేర్కొంటూ *మింగుతున్న పట్నం* కథా సంపుటిని, వ్యాపార యుగాన్ని, దానికి అనుసరణ దాయకంగా ఉన్న ప్రపంచీకరణ పరిణామాలను చిత్రిస్తూ *వ్యాపార మృగం*, కథా సంపుటిని చాలా సూక్ష్మదృష్టితో రచించారు. పారిశ్రామికీకరణం వల్ల ఫ్యాక్టరీల్లో తయారైన వస్తు జాలంతో బహుళ జాతి సంస్థలు మార్కెటు రంగ ప్రవేశం చేయడం, దేశీయ కళానైపుణ్యాన్ని కోల్పోవడం వంటివి ఈ కథల్లో ఉన్నాయి.

**విప్లవ వాదం:** స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆర్థిక అసమానతలు, అధికార బడుగు బలహీన వర్గాలు దేశమంతా వ్యాపించాయి. ఇటువంటి స్థితి వర్గ దృక్పథంతో ఆర్థిక పునాదిని సమూలంగా మార్చాలని ఆకాంక్షిస్తూ వచ్చినదే విప్లవోద్యమ సాహిత్యం. ఇది నక్సల్బరీ ఉద్యమ పరిణామ ప్రభావాల నుండి ఉద్భవించింది. క్రమక్రమంగా పెరిగి పోతున్న భూసంబంధాల లోని అసమానతలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, పారిశ్రామిక రంగం పూర్తిగా పెట్టుబడి దారీ వ్యవస్థ పటిష్ట పరచడం వంటి వాటిపై తిరుగుబాటుగా ఆ విప్లవ సాహిత్యోద్యమం బయలు దేరింది. 1969 నాటికి శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. దీని

ప్రతిఫలంగా 1970 జూలై 4న విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. ఈ రకంగా ప్రారంభమైన ఉద్యమం నుంచి నిమగ్నత, నిబద్ధత అన్న రెండు పార్శ్వాల నుంచి విప్లవ సాహిత్య సృజన కొనసాగింది. 1940 నాటికే తెలంగాణ సాయుధ పోరాట కేంద్రమైన నల్లగొండ జిల్లాలో సూర్యాపేట్ తాలూకు కుక్కడం గ్రామానికి చెందిన రత్నమాల తన కథల్లో విప్లవ వాదాన్ని ప్రతిబింబించారు. బాల్యం నుంచే అభ్యుదయ భావాలు గల రత్నమాల మార్క్సిజమ్–లెనినిజమ్–మావో ఆలోచనా విధానంపట్ల నిబద్ధతతో ఎదిగి విరసం సభ్యురాలైంది. ఆమె మొదటి కథ *ముగింపు*. నిరాశా నిస్పృహలకులోనై బ్రతుకు మీద విరక్తి చెందిన ఒక స్త్రీ అంతరంగకల్లోల చిత్రణ ఈ కథాంశం.

1973 అక్టోబరులో ఉదయం పత్రికలో అచ్చు అయింది. 1979లో తానే నడిపిన 'నూతన' పత్రికలో అచ్చు అయిన కథ *భార్య*. కాపురాల మీదా, కుటుంబంలో భార్య మీద జరిగే లైంగిక దాడి, అమలయ్యే హింస, స్త్రీల అర్థాంతరపు అసహజ మరణాలు, పురుష పశుప్రవృత్తి అన్నీ ఈ చిన్న కథలో ప్రతిఫలింపచేశారు. పితృస్వామిక అధీన సంస్కృతిలోనే బలౌతున్న స్త్రీలను ఆదుకొనే వారిని గూర్చి వెదికే సందర్భం ఈ కథ కల్పించింది.

చైతన్య వంతులైన ఒకరిద్దరు వ్యక్తులు పీడితులైన ఒకరిద్దరి స్త్రీలకు రక్షణగా ముందుకు రావచ్చు గానీ ఆ సంస్కరణ దృక్పథం స్త్రీల జీవితంలో మౌలికమైన మార్పును తీసుకొని రాలేదని ఈ కథ తెలుపుతుంది. "మనిషి మనిషిపై చేసే ఆధిపత్యానికి మూలం ఏమిటో తెలుసుకొని స్త్రీలపై అణచివేత మొత్తం దోపిడి రూపంలో ఒక భాగమేనని గుర్తించి ఆ దోపిడీని సమూలంగా కూల్చి సమసమాజ స్థాపనకు జరిగే మహోన్నత పోరాటంలో భాగం కావడమే అంతిమ పరిష్కారం" (భార్య–రత్నమాల) అని పోరాటాన్ని చిత్రించడమే గాక పోరాటంలో స్త్రీల భాగస్వామ్యాన్ని కథ ఆశిస్తుంది.

విప్లవ వాదాన్ని తన కథల్లో చూపిన కథా రచయిత్రి *తాయమ్మ కరుణ*. అసలుపేరు పద్మ. కలం పేర్లు కరుణ, టుంబ్రి. నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ మండలంలోని తాటికల్లు గ్రామానికి చెందిన ఆమె 1990వ దశకం నుంచి కథలు రచిస్తున్నారు. విప్లవోద్యమ కార్యకర్తగా కొత్త ప్రాపంచిక దృక్పథంతో ఉన్నత లక్ష్యంతో పనిచేస్తూనే రచయిత్రి తెలంగాణా గ్రామీణ స్త్రీ జీవిత పరిణామాలు, పరివేదనలు వస్తువుగా స్వీకరించారు. ఆమె రచించిన మొదటి కథ *రేపటి గెరిల్లాలు*. ఊరికి తరుచుగా వచ్చిపోయే దళం, తద్వారా ఊళ్ళలో కలిగిన పోరాట చైతన్యం, పిల్లలను సైతం ఏవిధంగా పోరాట వీరులుగా తీర్చి దిద్దిందో తెలిపే కథ. అదే విధంగా *కొత్త చిగుళ్ళు, సంఢ్ల తుసామ్, మీ చరిత్రను చెబుతాం, పోరాడ్డంలో తేడా* వంటి కథలు పైఇతివృత్తాన్ని అనుసరించి సాగుతాయి.

కరుణ రాసిన కథల్లో *ముదనష్టపు రోజులు, లాభం–నష్టం, మానవ సంబంధాల బలి* వంటి వాటిలో డబ్బులు లేక చితికిన బతుకులను గూర్చి డబ్బుల మీద తరగని ఆశతో మానవ సంబంధాలను దూరం చేసుకోవడం గూర్చి తెలియజేయబడింది. *క్రూరత్వం, నేటి మహిళ* అనే కథలు స్త్రీ సమస్యకు సంబంధించిన కథలు. ఆడపిల్లల కదలికల మీద, ఉద్యోగాలు చేస్తున్న ఆడవాళ్లపైన అమలవుతున్న నిబంధనలను ఈ కథలు తేట పరుస్తాయి. స్త్రీ అభ్యున్నతికి అవరోధంగా ఉన్న మూఢవిశ్వాసాలను ప్రతిఘటిస్తాయి.

స్త్రీల జీవిత సమస్యలను మరింత విస్తృతంగా పారదర్శకంగా చిత్రించిన కథలు *తాయమ్మ కరుణ, కవులమ్మ ఆడిదేనా?* ఈ రెండు కథలు వ్యక్తి కేంద్రంగా కొనసాగుతున్నా మొత్తం మీద పితృస్వామిక ఆర్థిక అధికార కుటుంబ వ్యవస్థలో స్త్రీల హింసాయుత జీవితాలను చిత్రిస్తాయి. *తాయమ్మ కరుణ* కథ అత్యంత కరుణరసార్ద్రంగా సాగుతుంది. పేదరికంలో పుట్టిన తాయమ్మ తండ్రి లేక పోవడంతో తల్లితో సహా మేనమామ ఇంటికి వచ్చింది. అక్కడ చాకిరి చేసి ఇంటి పనంతా చేసి బాల్యాన్నే కోల్పోయింది.

పెళ్ళయిన తర్వాత భర్త వివక్షతకు గురై, అత్తింటి వారి వేధింపులకు, చిత్రహింసలకు లోనైంది. నలుగురు పిల్లలను కన్న తాయమ్మ వాళ్ళను పెంచి పెద్దచేసి ప్రయోజకులను చేసింది. కాని వృద్ధాప్యంలో వారి నుంచి ఆదరాభిమానాన్ని పొందలేక పోయింది. ఒక ప్రాంతంలో, ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలో మారుతున్న సామాజిక సంక్లిష్ట జీవన సందర్భాన్ని, దాదాపు నాలుగు దశాబ్దాల స్త్రీ జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించిన కథ *కవులమ్మ ఆడిదేనా?* ఈ రెండు కథల్లో కుటుంబం, సమాజం రెండూ వ్యక్తి జీవితంలో పెనవేసుకొని సజీవమైన వస్తు రూపాన్ని ప్రదర్శిస్తాయి. స్త్రీ విముక్తికి, విప్లవ ఉద్యమానికి మధ్య సంబంధాలను గుర్తించి, వాటిని తన కథల్లో సూచించిన రచయిత్రి గీతాంజలి. మి

*మిగతా వచ్చే సంచికలో....*



# ఎందుకీ పయనం? ఎక్కడికీ ప్రయాణం?

– వల్లభనేని అశ్వినీకుమార్

దేశంలో, విదేశాలలో యాత్రలకు వెళ్లేందుకు ఉవ్విళ్ళూరుతుంటాం. ఒకసారి వెళ్లివచ్చిన తరువాత, మళ్లీ వెళ్ళాలని కోరుకుంటాం.

మనం ఎందుకిలా ప్రయాణాలు చేస్తుంటాం? పరదేశాలు, పరాయి ప్రజల పరిస్థితులను చూడాలని వేడుక పడతాం? చాలామందిని అదే అడిగాను, నన్ను నేను ప్రశ్నించుకున్నాను! ఏమయినా సమాధానాలు దొరుకుతాయా?

మన ప్రతి ప్రయాణం–'మన' నుంచి మనం దూరంగా వెళ్లిపోదామనే.... మళ్లీ మనం పరుగులెత్తేది–మనల్ని 'మనం' కలుసుకోవటానికి తెలుసుకోవటానికే! కనుల్తోపాటు మన హృదయాలను తెరచుకుని–ప్రసార మాధ్యమాలు తెలుపగలిగే విషయాలకంటే ఎక్కువగా 'చూడాలనే' తపనతో ప్రయాణిస్తాం. మనతోపాటు–మన అజ్ఞానాన్ని–జ్ఞానాన్ని ప్రకృతి వనరులు పరచుకున్న ప్రపంచపు నలుమూలలకు తీసుకుపోవాలని తాపత్రయపడతాం.

పరుగెత్తే కాలాన్ని ఆపాలని, తిరిగి తిరిగి, చిలిపి చిన్నారులవ్వాలని, మన నుంచి మనం దూరమై, తర్వాత మెల్లమెల్లగా మనమేమిటో తెలుసుకోవాలని ప్రతి క్షణాన్ని ఆనందించాలని–ప్రదేశాల ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాలని ఉవ్విళ్లూరుతాం!

**ఆటవిడుపు:**

ఒక గమ్యంలేని సువిశాల అనంత ఏకాంతం లోనికి, ఏ బంధాలు లేని ఆటవిడుపు మైదానంలోనికి పరుగులెత్తి ఉరకలెత్తి, అలసిపోవాలని ఆరాటపడతాం. ఎక్కడికి ఎందుకీ ప్రయాణం? కొద్దిగా ఆగి, కొంచెం ఆలోచిద్దామా?

ఏ యాత్రలోనైనా ఒక గొప్ప సుఖం, సంతోషం, మన బరువు బాధ్యతల్ని, నమ్మకాల్ని అపనమ్మకాలను ఇంటి దగ్గర వదిలివేసి, మనకు 'తెలుసు' అనుకున్నదానిని వింతగా భిన్నంగా చూడ ప్రయత్నించటం! ఇప్పుడే మనకి ప్రయాణపు (యాత్రలోని) సర్వస్వాతంత్ర్యత మనల్ని బొంగరంలా త్రిప్పి, తలక్రిందులు చేసి, మనం క్షుణ్ణంగా ఎరిగిన విషయాలను, సరికొత్తగా దర్శింప చేస్తుంది. మొట్టమొదటిసారిగా మన్‌హాట్టన్‌లో అడుగు పెట్టినప్పుడు నాకెదురైన అనుభవం ఇటువంటిదే.

మొట్టమొదటిగా మనం గుర్తించేది ఈ యాత్రల్లో మనం సర్వసాధారణమూ–ప్రాపంచికమూ అనుకున్న విషయాలన్నీ, అవి ప్రాదేశికమూ–ప్రాంతీయమూ అయి కూర్చోవటం! లూయివిల్లిలో యాభయి సంవత్సరాల సంసార జీవితాన్ని నిరాఘాటంగా సాగించిన దంపతులకు ఊరేగింపు పండగ జరుపుతున్నారు. మనకిది మామూలు విషయమే కదా!

అంతేకాదు–మనం ఇంటి దగ్గర–మన దేశంలో–మన ప్రదేశంలో సర్వసాధారణమనుకుంటున్న ఎన్నో విషయాలు ఆ దూరదేశంలో–లేక మారుమూల ప్రదేశంలో వారికి సాంఘిక–రాజకీయ సంఘర్షణలుగా, చావు బ్రతుకుల సందిగ్ధ సమస్యలుగా మనముందు నిలబడతాయి!

ఆఫ్రికాలో, అజర్‌బైజాన్‌లో మత రాజకీయాలు, పాలస్తీనా–ఇజ్రాయిల్‌ల నిత్య ఘర్షణలు ఇందుకు తార్కాణం.

అంతేకాదు–మనకెప్పుడో మరుగున పడిపోయిన వార్తా శీర్షికలు–ఒక 'కొత్త' దేశంలో పతాక శీర్షికలై దర్శనమిస్తాయి. మనం నిన్నకి, రేపటికి మధ్యలోని అగాధంలో ఉన్నామా అనే సందేహంతో ఉక్కిరి బిక్కిరి అవుతాం.

ఈ వ్యత్యాసం ఎక్కువగా ధనిక పేద దేశాల సరిహద్దులు దాటినప్పుడు-మీకు ఒక యాత్రా విశేషంగా అనిపిస్తుంది.

ఇంకా మనం 'ఇంటర్‌నెట్', వన్ వరల్డ్, వగైరా భ్రమలన్నీ-సరిచేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

ప్రదేశాలను-ప్రజలను చూసినకొలది, మనమేర్పరచు కున్న అగమ్యత, పరధ్యానం, మార్మిక భావనలన్ని పటాపంచలైపోతాయి.

మన యాత్రల ద్వారా-అక్కడి ప్రజలతో కలయిక పర్యవసానం పరస్పరం పరంపరాగత విషయాలు, సంస్కృతీ చిహ్నాలు-పారంపర్య దుస్తులు-సంగీతం, అక్కడివారికి-సరికొత్త అనుభూతి నివ్వడమే కాకుండా ఓ క్రొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంటాయి.

**కదిలే వార్తలు:**

ఇంకొంచెం లోతుగా ఆలోచిస్తే-మనతోపాటు మన జీవన విలువలు-నమ్మకాలు, మన దేశపు తాజా వార్తలు మోసుకుపోతుంటాం.

అంటే-మనం ఒకరకంగా 'లైవ్' టీవీగా, కదులుతున్న వార్తా పత్రికల్లా వ్యవహరిస్తాం. ప్రపంచంలోని ఎన్నో మారుమూల దేశాల్లో పూర్తిగా స్వాతంత్ర్యపు కిరణాలు ప్రసరించని చీకటి దేశాల్లో-మనలాంటివారే-మనలాంటి యాత్రికులే వారికి-ప్రపంచాన్ని తెరిచే చిన్న చిన్న కిటికీలు!

అంటే- మన ప్రయాణాల ద్వారా- ఒక రకంగా మనం కనే కలల్ని ఎగుమతి చేస్తుంటాం- అక్కడి వారి స్వప్నాలను ఇటుగా దిగుమతి చేస్తుంటాం-ఎంతో సున్నితంగా స్నేహపూర్వకంగానే.

“ఏమిటి, మీ పెద్దలే మీ పెళ్ళి నిర్ణయిస్తారా?” అని ఆశ్చర్యపోతుంటారు.

ఇప్పటికే మీకు అర్థమయి వుంటుంది. ఇప్పటి యాత్రలు, కొత్త ప్రదేశాలను దర్శించటంలో ఎంత ప్రాముఖ్యం ఉందో-అంతకు మించి కొత్త కోణంలో- అక్కడి జనజీవన సరళిని-వారి విశ్వాసాలను, స్వప్నాలను-భయాలను పరిశోధించటం లో ఎక్కువ అవకాశం-అవసరం ఉందని.

మనం కలిసిన వారికి మనమెంత కొత్తగా-వింతగా అపురూపంగా పరిచయమవుతామో, అలాగే ఒకసారి మీరు



ఇంటికి చేరేసరికి, మీకు బాగా పరిచయంలో ఉన్న మీ స్వంత ప్రదేశాలు, పరివారం, మీ సుదూర మిత్రుని ఆశ్చర్యంలో నుంచి కనపడతారు కూడా.

*నాకు ఇన్ని యాత్రల తర్వాత ఇప్పుడు ఎవ్వరిమీదా కోపం రావడం లేదు!*

అంటే మీ విహార యాత్రలు, మళ్లీ మిమ్మల్ని, మీ పరిసరాల్ని మీకు సరికొత్తగా పరిచయం చేస్తాయి - ఒక కొత్త వెలుగుతో నింపుతాయి.

అంటే-మన యాత్రలు-రెండు విధాలుగా మనకు ప్రయోజనకారిగా ఉంటాయి. ఒకటి, మామూలుగా మనం పట్టించుకోని ప్రదేశాలు, విలువలు, ముఖ్య విషయాలు అన్ని మన ముందుకు వస్తాయి.

రెండు, అదే సమయంలో-మనలో నిద్రాణమై-అంతగా పట్టించుకోని కోణాలెన్నో-వెలుగు చూస్తాయి.

ఈ ప్రయాణాలు తప్పనిసరిగా మన సుప్తమైన-అవ్యక్తమైన మానసిక దశలను స్పృశిస్తాయి. నిద్ర లేపుతాయి.

ఒక ప్రదేశంలో-సహారా ఎడారిగాని, చెట్లులేని ఐస్‌లాండ్ గాని దర్శించినపుడు-మన మానసిక స్థితి-ఒక్కసారిగా అంతర్ముఖమై మనలోని ఒంటరితనాన్ని, ఏకాకి స్థితిని ఒక్కసారిగా ముందుకు తెస్తుంది!

యాత్రికులుగా మనం ఒక క్రొత్త దేశం వెళ్తే- మనం ఎంత ఫ్రీగా ఉంటాం! మన కులం, మతం, జాతి, ఎవ్వరికీ పట్టదు కదా!

అలాగే మనకు ఒక పేరుగాని, ఒక 'టాగ్'గాని ఉండాల్సిన అవసరం రాదు కదా-మనల్ని ఎవ్వరూ 'గుర్తించ'నపుడు మనం దేన్ని గురించి 'జాగ్రత్త' తీసుకోవాలి?

**అనంతవాదులు:**

అందుకని-ఒక్కసారిగా, మనముందు మనం నిలబడతాం-మనం ఏమిటో చూసుకోవాల్సిన అవసరం, అవకాశం వస్తుంది. ఇందుకు మనకు ఉండే రోజువారీ వత్తిడులు లేకపోవడం కూడా ఒక కారణం!

దూరదేశాల్లో-మనకు ఎక్కువసేపు నిద్రపట్టక-రాత్రిళ్లు మెలకువగా ఉంటాం. అందుకే కనులు తెరుచుకుని సీలింగ్ వంక చూస్తూ... ఆశ్చర్య పోతుంటాం-ఏమిటి క్రొత్తగా ప్రేమలో పడినట్లు నిన్న, రేపు గురించి ఆలోచన లేకుండా, ఆ కాస్సేపు-ఆ క్షణంలో జీవిస్తాం.

మనల్ని మనం విశ్లేషించుకుంటూ విలువైన సమయాన్ని గడిపేందుకు అవకాశం దొరుకుతుంది! మన మనసులోని మర్మాలన్ని మన కనుల ముందు కదులుతాయి-

సరిగ్గా ఇప్పుడే ఎక్కడ బయలుదేరాం? ఎక్కడ ఉన్నాం-ఎక్కడకు వెళ్తున్నాం? అన్నీ ఒక మిస్టరీలా కలగలసిపోతాయి! అనంతవాదులుగా మారిపోతాం!

మనకు 'తెలియకుండా' మనం ఎంత దూరం వెళ్లగలం? కుదరదు కదా! అది జరిగే పని కాదు కదా!

ఇందులో ఒక ప్రమాదం పొంచి ఉంది కూడా! అన్ని రకాల స్వేచ్ఛలకు ఉన్నట్లుగానే- కాని ఇక్కడ ఉన్న ఒక గొప్ప అవకాశం-మనం మళ్లీ 'జన్మించటం'!

అంటే-చిన్ననాటి కాలానికి, ఇంకా విశాలమైన ఆలోచనలోనికి అంతర్ముఖులై ఒక రకమైన మానసిక స్థితిలోకి వెళ్లగలగటం, కాలాన్ని ఒక్క క్షణం ఆపగలగటం!

**తెలియని భయం:**

ఇంకా మన చుట్టూ ఎన్నో పరిచయం లేని పరిసరాలను చూసి చిన్నపిల్లల్లా ఆశ్చర్యపోవటం!

మాటలు రాని, భాష తెలియని చిన్నారుల్లా కలిసిన వారితో మట్లాడగలగటం! మనల్ని మనం తెలియపరచు కోవటం.

ప్రయాణం మనల్ని తెలియని ప్రదేశాలకు తీసుకుపోతుంది. మనకు ఏమి తెలియదో కనువిప్పు కలిగిస్తుంది.

ఒక తెల్లకాగితంలా మనం ఉంటాం – ఒక 'బయోడేటా' ఎవరూ రాయరు-'నువ్వు' ఫలానా అని ఎవరూ 'ఫిక్స్' చేయ్యరు-అందుకని ఒక కొత్త స్వేచ్ఛ, కొత్త స్వరూపం సంతరింప చేసుకుంటాం. మన 'అనన్యతను' ప్రక్కనపెట్టి ఒక కొత్త మూసలోని మీకు మరింత దగ్గరగా వుండే మీలోకి చూడగలుగుతారు! మీరు తీసుకువెళ్ళే రెండు మూడు బట్టలతో తేలికగా 'సింపుల్'గా ఏదో 'సాహసా'నికి సిద్ధంగా కదులుతుంటారు!

న్యూయార్క్, బ్రాంక్స్‌లో నాకంటే అడుగు ఎత్తుండి కనీసం వంద కిలోల బరువున్న ఒక హిస్పానిక్‌లేడీ "హే, డిడ్ యూ స్టార్ట్ యువర్ ఎడ్వంచర్...." అంటూ నవ్వింది.

ఇక్కడే ఆల్‌బర్ట్ కామూ అన్న మాటలు గుర్తుకు వస్తాయి. "తెలియని 'భయంలోనే' ప్రయాణానికి విలువ పెరుగుతుంది! ప్రతి ప్రయాణంలోని నిగూఢమైన భయమే దాని విలువను పెంచుతుంది....."

పరిసరాల నుంచి పరిస్థితుల ప్రభావం నుంచి విముక్తులవటమే కాకుండా, మన అవసరాలన్ని అస్తవ్యస్తమైపోతుంటాయి. కారణం మన అలవాట్లన్ని అర్థం లేని ముసుగులేనని అర్థమవుతుంది. మనకు ప్రొద్దున్నే కాఫీ అలవాటుంటే, అది మన ప్రయాణాలలో దొరకకపోతే కొంపలంటుకు పోవు...

మనకు జరిగే అవమానాలను పెద్దగా పట్టించుకోము. ఎడిసన్‌కి దారి-రూట్ అడిగితే ఒక రెడ్‌నెక్ "ఏమిటి? బ్రైడ్ కోసం వెళ్తున్నావా?".... ' అంటూ ఎగతాళి చేశాడు.

ఒక సిగ్నల్ లైట్ దగ్గర ప్రొద్దున్నే ఒక తెల్లజాతివాడు మా కారు విండ్‌స్క్రీన్ మీద కోపంగా కాఫీ పోసి పోయాడు. మేము అరక్షణం ఆలస్యం చేశామని!

అందుకని మనం ఏదో 'తెలుసు'కోవాలని దేనికో సమాధానం దొరుకుతుందని పరుగులెత్తం! కాని మనకు ఎదురయ్యేది ఒక కఠోరసత్యం. అరే ఇది ఇలా జరుగు తుందా? దీనిలో ఎంతవరకూ న్యాయం ఉంది?' అన్న ప్రశ్నలే మోసుకువస్తుంటాయి.

ఇక్కడ, మనం రాత్రిళ్లు ఏ భయమూ లేకుండా వీధులన్నీ తిరుగుతుంటాం. అదే న్యూయార్కులో- చీకటి పడితే అంతా భయమే- రోడ్లన్నీ కర్ఫ్యూ పెట్టినట్లే.

థాయ్‌లాండ్‌లో ఫిలిప్పిన్స్‌లో ఎందరో యువతులు తమ కుటుంబాలను పోషించటానికి వళ్లమ్ముకోవటానికి వెనకాడరని ఒక 'నగ్న' సత్యాన్ని గుర్తించేసరికి బాధ, ఆశ్చర్యం కలుగుతుంది. ఇంకా కొన్ని ప్రదేశాలలో మన ప్రయాణం ఒక డిటెక్టివ్ క్రైం కథలా సాగినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఆ కథకు ఒక ముగింపు ఉండదు! అట్లాంటా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో నాతోపాటు వచ్చిన ఒక స్నేహితుడు ఇమ్మిగ్రేషన్‌లో మాయమై పోయినపుడు నాకంతా అయోమయం – క్రైం కథలా అన్పించింది.



అలాగే హాంగ్‌కాంగ్ ఎయిర్ పోర్ట్‌లో, నా మిత్రుడు తెచ్చిన, మనం రోజూ తినే "గన్‌పౌడర్" చూసి కస్టమ్స్ వాళ్లు "స్నిఫ్‌డాగ్స్"తో అతనికి చెమటలు పోయించారు.

**ప్రేమకథ:**

ఒక నెలరోజులు ఐరోపా, అమెరికా అంతా తిరిగి తిరిగి ఇంటికి చేరిన తర్వాత ఎన్ని రాత్రులు నిద్రలేకుండా పడివున్నాను?

చూసినవి గుర్తు చేసుకుంటూ, తీసిన ఫోటోలు మళ్లీమళ్లీ చూసుకుంటూ రాసుకున్న నోట్సులు తిరిగి తిరిగి చదువుకుంటూ కలసిన వాళ్లను, నాకు సహాయం చేసిన వాళ్లను, తోసివేసిన వాళ్లను, పగటి రెస్టారెంట్లను, నైట్ క్లబ్‌లను, మహోద్భుత నయాగరా హోరును, నెవెడా ఎడారి నిశ్శబ్దాన్ని, అలాస్కా నిర్జీవ హిమశీతల మృత్యు సామీప్యాన్ని, ఆస్ట్రియాలోని ఆత్మహత్యల ఆల్ఫ్స్ పర్వతాలను, సబ్‌వే రైలు శబ్దాలు–జెట్ విమానాల నిశ్శబ్ద వేగాలు ఎన్ని–ఎన్ని నన్నిలా– క్రొత్త ప్రేమికునిలా నిద్ర లేకుండా పడవేసినాయి!

ఇంత పునరుజ్జీవన శక్తి ఈ ప్రయాణాలకు ఎలా వస్తున్నది? ఒకరకంగా ప్రతి విదేశయాత్ర ఒక ప్రేమ వ్యవహారమే అనిపిస్తుంది! ఏం మాట్లాడాలో తెలియదు! ఎక్కడికి ఎలా వెళ్లాలో అగమ్యంగా ఉంటుంది. వెళ్లినకొలదీ లోతుగా పాతుకుపోతుంటాము. ఎవరిని ప్రేమిస్తున్నామో తెలియక, ఎలా తెలియజేయాలో భాష రాక ఒక తీయని భయం! ఒక మాయని ఆశ్చర్యం. ఈ విదేశీ యాత్రలన్నీ అద్భుతమైన ప్రేమకథలే అనిపిస్తుంది! ఇంకా మనం కలలు కని కళ్లలో తారలు నింపుకుని వెళ్లే ప్రదేశాలు హాలీవుడ్ లాంటివి, మన కలల్ని ఎగతాళి చేస్తూ తళుకు తారలన్నీ జలతారు తోరణాలని తెలియజేస్తూ నమ్మశక్యం గాని మాయాజాలమని మన కళ్లు తెరిపిస్తాయి. కాని ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత అవే మనకు మళ్లీ కలల్లా, కలల తీరాల్లా అనిపిస్తుంటాయి. మనం కలల్ని నమ్మటానికి కలల్లో నడవటానికి ఇష్టపడతాం కదా!

మనం ఇంటి దగ్గర ఎంత నిరాశా నిస్పృహలతో ఉన్నా ఒక క్రొత్త ప్రదేశానికి, విదేశానికి వెళ్లగానే ఎనలేని ఎనర్జీ అంతులేని 'ఆశా' వేశం మనల్ని చుట్టుముడతాయి. ఒక్క క్షణం ఖాళీగా ఉండనివ్వవు. అంటే మన కదలికలోనే కలల దర్పణం, ప్రయాణంలోనే అంతులేని 'ఆనందం' దాగి ఉన్నాయి? ఇంటి దగ్గర ఉండే స్తబ్ధతలో నుంచి దూరంగా జరిగిపోవటమే ఒక చైతన్యం!

ప్రపంచపుటంచులు చూడటం, దిగంతాల తీరాలను తాకడం, ప్రయాణం కాదు. ఒక రకంగా "ఎండ్ ఆఫ్ ది ఎర్త్" ఎక్కడ ఉంటుంది? మళ్లీ నిన్ను నువ్వు చేరటంలోనే కదా!' ప్రపంచమంతా ఒక అపరిచితునిగా పరదేశస్తుడుగా 'అన్యుడు'గా (సంస్కృతి పరంగా) ఆయా ప్రజల మధ్య తిరిగి, వారి అలవాట్లను, తినుబండారాలను రుచిచూసి, ఒక్కసారిగా 'ఇంటికి' తిరిగివస్తే ఉండే అలసట, ఆనందం, 'స్వీయ'దనం మనల్ని ఎంతో ఆశావాదులుగా మార్చివేస్తుంది!

కంపూచియాలో వారం రోజులు అంకుర్‌వాట్ చూపేందుకు నా గైడ్ గా వున్న 'చాన్' ఇరవయ్యేళ్లవాడు నన్ను తండ్రిలా చూసుకుని, నీడలా వుండి నేను తిరిగి వచ్చేందుకు ఎయిర్ పోర్టుకు వచ్చిన తర్వాత వీడ్కోలు చెప్తుంటే – నన్ను కౌగలించుకుని బోరున ఏడ్చాడు! లావోస్‌లో మాతోపాటు తిరిగిన మాయి తన యింటికి తీసుకు వెళ్లి కుటుంబ సభ్యులందర్నీ పరిచయం చేసింది. ఆ రాత్రి టౌన్ హాలులో పెళ్లికి తీసుకు వెళ్లింది. అందరితో నృత్యం చేయించింది.

పట్టాయలో నా గైడ్ తప్పతాగి పడిపోతే– మేమే జాగ్రత్తగా ఆసుపత్రికి చేర్చాం! ఫూకెట్‌లో మంగోలియా సేనలతో తలపడి పోరాడి ప్రాణాలు పోగొట్టు కున్న 'కమలా' అక్క చెల్లెళ్ళ విగ్రహాలు చూసి ఆశ్చర్యపోయాం. గోవాలో ఉదయం ఏడుగంటలకే అరేబియా సముద్రంలోని డాల్ఫిన్‌లను చూడటానికి వెళ్లినపుడు బోటు కుర్రాడు నడిసముద్రంలో డాల్ఫిన్‌లతోపాటు బోటును గిరికీలు కొట్టించి– అంకుల్ దూకండి– బాగుంటుంది అన్నాడు! తిరుగు ప్రయాణంలో అతను కేరళ నుంచి వచ్చి యిక్కడ ఎందుకు బోటు నడుపుతున్నాడో చెప్పాడు.

**కదలిక అంతరికం:**

అసలు కదలిక అనేది మనకు ఉయ్యాల రోజుల నుంచే మొదలయ్యిందేమో? అలాగే ప్రతి కదలిక అంతరికమే అనిపిస్తుంది. ఒక పుస్తకం చదివినపుడు, ఒక సినిమా చూసినపుడు, ఒక క్రొత్త పరిచయం ఏర్పడినపుడు ఈ కదలిక ఫీలవుతాం. మనకు తెలుస్తుంటుంది. ఒక మంచి నవల చదివితే అది ఒక యాత్ర! ఇది మరింత లోతుగా పరిశీలించితే. మన ప్రతి ప్రయాణం ఒక అపురూపమైన యాత్ర. మనం తిరిగి దర్శించిన ప్రదేశాల ప్రత్యేకతను మనలోని మారుమూల కోణాలతో నింపుకుని మనం సంపూర్ణు లయ్యేందుకు దోహదపడతాయి. మనం దర్శించిన వాటితో మన ఊహాపోహలను రంగరించి, ఒక నూతన సత్యాన్ని సృష్టించుకోవటమనేది ఒక అసాధారణ ప్రక్రియ!

మనం బయట ప్రపంచంలో మనకు కనిపించే సత్యాలు మనలో నుంచి వెలికి తీయగలగాలి. మన హృదయాలలోనే మనం బయట వెదికేవెన్నో వున్నాయి.

సుందర నందన వనాలు, ఎల్లలు లేని ఎడారులు, చీకటి కీకారణ్యాలు, మంచుకొండల అంచులు, అన్నీ మన మనసు మారుమూలల్లో దాగి వున్నాయి.

అంటే మనం ఎక్కడకు వెళ్లినా మనము, మన ఇంట్లో మనవాళ్లు, మనలోనే ఉంటారు కదా! అలాగే మనం వెళ్లాలనుకున్న స్థల, ప్రదేశాలను మనతో మోసుకుపోవాలి.

ఎన్నో ప్రముఖమైన సుదూర తీరాలు, మరెన్నో సువిశాల ప్రదేశాలు, తరచూ మన ప్రక్కన నిదురపోతున్న వ్యక్తిలోనే ఉండవచ్చు! హృషీకేష్, బదరీనాథ్‌లలో మంచులాంటి గంగలో స్నానం చేసి అక్కడ ఆలయ ప్రాంగణంలో నిద్రపోయే సాధువులను చూస్తే అదే అన్పించింది!

**జాగృతి:**

ఇప్పుడు ప్రయాణాలు, యాత్రలు, బాహిరికమూ, అంతరికమూ కూడా. మనల్ని చైతన్యంతో నింపేవిగా జాగరూకుని చేసేవిగా ఉంటాయి! ఒక తెలియని విషయాన్ని తెలుసుకోవటంలో ఒక విజ్ఞత ఉంది. అది బుద్ధి కుశలతను పెంచుతుంది. దురభిమానాన్ని రూపు మాపుతుంది, హాస్యప్రియత్వాన్ని పెంచి పోషిస్తుంది.

జర్మనీలో 'నడివేసవి'లో ఒక మిట్టమధ్యాహ్నం నడి రోడ్‌లో నడుస్తూ గజగజ వణుకుతుంటే, 'ఇది సమ్మర్, ఎంజాయ్' అంటూ సలహా ఇచ్చాడు ఓ పెద్దాయన. ముస్సోరీలో కారులో నుంచి కాలు కింద పెడితే కసుక్కున కరిచింది చలి! "ఇవాళ చాలా తక్కువ, దిగండి" తొందర పెట్టాడు డ్రైవరు!

అంటే open eyes తో ఉండాలి అని, బౌద్ధభిక్షువులు ఎప్పుడూ తిరుగుతుంటారు–అంటే జాగరూకులై, ప్రపంచాన్ని దర్శిస్తూ, తమని తాము తెలుసుకుంటూ... గీతాచార్యుడు అన్నట్లు మనిషి "ఎప్పుడూ జాగరూకుడై" ఉండాలి! మనం ముందు అనుకున్నట్లు ట్రావెల్–ప్రేమలాంటిదే అయితే, దానికి కారణం మనల్ని నిద్ర పోనివ్వకుండా, ఒక విచిత్ర మానసిక స్థితిలో ఉంచటమే!

ఆ స్థితిలో మనం వింటాం, చూస్తాం, తెలిసిన విషయం అని దేనినీ అశ్రద్ధ చెయ్యం, ఉపేక్షించం! ఇంకా– మార్పుకు సిద్ధంగా ఉంటాం!

అందుకనే–ఎన్నో యాత్రలు, మంచి ప్రేమకథల్లాగానే అలా సాగుతూనే ఉంటాయి! సత్యాసత్యాల నిరంతర సమ్మేళనం, ఊహాపోహల అపూర్వ సంగమం, మన జీవన యాత్ర! ◼

# మేధావి దీనగాథ!

- వేదాంతం లక్ష్మీప్రసాదరావు.

**ఈ** నాటి దినపత్రికల పుణ్యమా అని- మేధావులుగా లాయర్లు, డాక్టర్లు, యాక్టర్లు - ఇంకా! ఐఏయస్., ఐపియస్., అధికారులు చలామణి అవుతున్నారు. వీరిలో మేధావులు ఉండవచ్చు. కాని, వృత్తిరీత్యా మేధావులుండరు కదా! తెలుగు నేలపై చాలామంది మేధావులు జనించారు. మన దురదృష్టం- మిగతా విద్యాధికులు, ఎవ్వరినీ మేధావిగా గుర్తించరు. అందుకని మనకు కవులు, కథకులు, రచయితలు మేధావులుగా మిగిలిపోయారు. చివరికి ప్రతి రచయిత మేధావిగానే పరిగణించ బడటం అందరి దురదృష్టం-

అసలు ఈ చర్చ ఎందుకంటే- మేధావులనండి- దార్శనికులనండి. వీరికి ఒక మేధోపరమైన బాధ్యత వుంటుంది. అది సమాజం బాగోగులు. సమాజం ఎప్పడూ క్లిష్ట పరిస్థితులనే ఎదుర్కొంటుంది. వ్యక్తులకు దుఃఖం తప్పనిసరి- ఇక ఘర్షణ అనునిత్యం.

ఉదయం ఇల్లు వదిలిన దగ్గర నుండి- రాత్రి మళ్ళీ గూటికి చేరే వరకు మనం పోరాటం చేస్తూనే వుంటాం. శత్రువు కనపడడు- ఒక చోట ఉండడు. ఒక రకంగా ఉండడు. ఏ ఆయుధంతో - ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియదు. కాని పోరాటం జరుగుతూనే వుంటుంది. మన దెబ్బలు శత్రువుకు తగులుతాయో లేదో - మన వళ్లు హూనం అయి, అలసి పోవడానికి కారణం మన దినచర్య!

అదిగో అలాంటి పరిస్థితులు ఎందుకు వచ్చాయి. ఎలా నివారించాలి. ఇది మేధావి ఆలోచన-నిజానికి పోరాటం అతనిది కాదు. కాని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దిగుతాడు ఎక్కువ మందికి మేలు జరిగాలని ఆలోచిస్తాడు, తాపత్రయపడతాడు... మరి ఈనాటి మేధావి ఏం చేస్తున్నాడు?

- ఎ.కె.

**లో**కంలో దు:ఖం, అసమానత్వం, అసహ్యం వున్నాయి. సున్నితమైన మనసుగల వాళ్ళు, సామాజిక బాధ్యతవున్న వారు అన్యాయాలను గురించి స్పందించకుండా వుండలేరు. మేధావులైన రచయితలు, కళాకారులు తమ కళారూపాలద్వారా సమాజంలోని పరిస్థితులను విశ్లేషించి అసమానతలను నిర్మూలించటానికి తమదైన కృషి చేస్తుంటారు. కొందరు మేధావులు కార్యరంగంలోకి దిగుతారు. అయితే మేధావుల భావాలు, ఆలోచనలు ఏమీ మంత్రదండాలు కాదు. అసమానతలను తొలగించటంలోనూ, అన్యాయాల్ని ఎదిరించటంలోనూ మేధావుల పాత్రను ఎక్కువగా అంచనా వేసే పొరపాటు మనం చేయకూడదు. సామాజికాంశాలు వున్న రచనల ఉద్దేశం సంఘంలో జరిగే దుర్మార్గాలను, పీడలను ప్రజలకు తెలియపరచటమే. ప్రజల్లో స్పందన కలిగించి, భావోద్రేకాలను రగిలించి ప్రజలను కార్యోన్ముఖులను చేయగల రచయితలు, మేధావులు ప్రజల జీవితాల్లో మార్పుకు అంకురార్పణ చేయగలరు. వీరి రచనలతో సామాజిక న్యాయం ఎడల ప్రజల అవగాహన పదునెక్కుతుంది. ఏ కారణం వల్లనైనా అధికారంలో వున్న రాజకీయపక్షం తమ అభిప్రాయాలను స్వీకరించిందంటే, మేధావి తాను సమాజానికి ఎంతో మేలు చేస్తున్నానని భ్రమపడతాడు. రాజకీయాలు అవకాశవాదం. రాజకీయ పరిష్కారం ఏదికూడా శాశ్వత పరిష్కారం కాదు. అదే అంతిమ నిర్ణయమూ కాదు. ప్రత్యక్ష కార్యాచరణలో లెక్క లేనన్ని అవరోధాలు. రాజకీయ సమాధానం ఎప్పటికెయ్యది ప్రస్తుతం లాంటిది. అందుకని కొందరేమంటారంటే మేధావి అయిన రచయిత రాజకీయాలకు దూరంగా వుండాలని. కాని ఒక పౌరుడిగా రాజకీయాలలో పాలు పంచుకోవడం రచయిత

వేదాంతం లక్ష్మీప్రసాదరావు, ఫోన్ : 9848054288

బాధ్యత కాదా? అంటారు ఇంకొందరు. ప్రతి మేధావి ఎప్పుడో ఒకప్పుడు తన జీవితంలో యిలాంటి సంకట పరిస్థితిని ఎదుర్కొనాల్సే వుంటుంది.

నేటి సాంకేతిక యుగంలో ధన బలంతో పత్రికలు, దృశ్యామాధ్యమాలు సామాన్య మానవుడిని అయోమయం చేస్తుంటే, నోటు-ఓటు ప్రజాస్వామ్యంలో అధికార పక్షం యొక్క ప్రచార సవాళ్ళను, ప్రలోభాలను ఎదుర్కొనటం మేధావులకు తలకు మించిన పనిగా కన్పడుతోంది. నేలవిడిచి సాము చేసే మల్లయోధులుగా మిగిలి పోతున్నారు ఈ మేధావులు. నూటికి నూరుపాళ్ళు సంపూర్ణత్వాన్ని, సంఘంలో పెనుమార్పులు కోరుకునే మేధావులు స్వాప్నికులే!

ఆర్థిక సంక్షోభం, రాజకీయ అనిశ్చితి, సాంఘిక అభద్రత, నైతిక పతనం దేశంలో రాజ్యమేలు తున్నపుడు, తనలోని అసంతృప్తిని, అసహనాన్ని తొలగించుకోవటానికి, వామపక్ష రాజకీయాలలోకి ప్రవేశి స్తారు కొందరు మేధావులు. యౌవన దశలో విప్లవాత్మక భావాలు, అధికా రాన్ని సవాలు చేసే ఉద్యమాలు వీరిని విశేషంగా ఆకర్షిస్తాయి. కొందరు ఫ్రెంచి మేధావి జూపాల్ సార్త్ లాగ సాహిత్య ప్రస్థానం వదలి, పత్రికా రంగంలో ప్రవేశిస్తారు. ఏది ముఖ్యం అని ఎవరు నిర్ణయించాలి?

తమ మేధస్సునీ, కళనీ రాజకీయాలతో సంబంధం కలపటం వలన తాము యింతకు ముందు ఊహించని పరిస్థితి ఎదురవుతుంది. రాజకీయ సుడిగుండంలో దిగిన తరువాత, కుడి, ఎడమల్లో ఏ రాజకీయమైనా కుళ్ళుగానే వుంటాయిని తెలిసొస్తుంది. ఈ పరిస్థితుల్లో, మేధావి తనలక్ష్యాలను కాపాడుకోవటం కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుంది. తనకు యిష్టం లేని రాజకీయ నినాదాలను సమర్థించాల్సి వస్తుంది. తన చుట్టూ ఉన్న మద్దతుదార్లను సంతృప్తి పరచటం కొరకు తప్పుడు భావాలను ప్రచారం చెయ్యాల్సిరావచ్చు.

తాను జీవితంలో ఎన్నో సంవత్సరాలుగా నమ్మిన సిద్ధాంతాలకు వింత భాష్యాలు తయారు చెయ్యటం జరుగుతుంది. సోదర భావాన్ని, మానవతా దృక్పథాన్ని పెంచడానికి తాను చేసిన కృషిని తానే గండి కొట్టే పరిస్థితి దాపురిస్తుంది. తన నిజాయితీని తానే నీరుగార్చాల్సి వచ్చినందుకు లోలోపల ఎంతో మథన పడతాడు. కాని క్రమశిక్షణ అన్న మిషతోనో, ఉద్యమ ద్రోహి అన్న ముద్ర పడకూడదనో మౌనం దాల్చాల్సిన దుస్థితిలో వుంటాడు. ఎటూ పోలేని దిగ్బంధం. ఇంతా చేస్తే తన అసలు భూమిక ఏదయితేవుందో- అదే రచనలో- సృజనాత్మకతను పోగొట్టు కుంటాడు. అతని రచనలు కేవలం నినాదాలుగా మిగిలిపోతాయి.

కృత్రిమమైన ఉద్వేగం, సమాజం త్వరగా మారిపోవాలన్న ఆత్రం, గతం మీద అసహనంతో- చేసే రచనలు ఏకపక్షమై చదువరులలో నిరుత్సాహం కలిగిస్తాయి. రచనల ద్వారా సమాజానికి మార్గనిర్దేశం చేయగలనన్న ధీమా మేధావిలో క్రమంగా క్షీణిస్తుంది. అతను ఇక రచయిత కాదు. రాజకీయ పక్షాలకు ప్రచారకునిగానే మిగిలి పోతాడు.

ఎంత సానుభూతిపరులైనా మధ్యతరగతి మేధావులకు సామాన్య ప్రజలకు మధ్యా పూడ్చలేని అంతరం ఎప్పుడూ వుంటుంది. అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన మేధావి కూడా యిందుకు మినహాయింపు కాదు. మేధావికి అంతర్మథనం వుంటుంది. వాదోపవాదాల మీద మక్కువ ఎక్కువ. ఇలాంటి వారిని ప్రత్యక్ష రాజకీయ నాయకులు అనుమానంతోనూ, అసహనంతోనూ చూస్తారు. రాజకీయనాయకులది "గుంపు" మనస్తత్వం.

వారు మూతాల ఆధారంగా పనిచేస్తుంటారు. రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలి కాబట్టి వారి ఆలోచనా సరళి, పునాది వేరుగా వుంటుంది. ఒక దశలో వారు ఆలోచనను విరమించి కార్యరంగంలో దిగుతారు. లాభనష్టాలు భరిస్తారు. మేధావి అలాకాదు. అతని ఆలోచనలు, మరింత ఆలోచనలకు దారితీస్తాయి. వీరికి ఆలోచన అనేది ఒక జాడ్యం. ఎక్కువ ఆలోచన చేసేవారు కార్యరంగంలో చురుకుగా వుండలేరు. వీరు పూర్తి నిబద్ధతకు దూరం.

ముఖ్యంగా అతివాద రాజకీయాలలో తల దూర్చిన మేధావికి ఎన్నో సమస్యలు చుట్టుకుంటాయి. నిర్భాగ్యులు, దైవోపహతుల కోసం పోరాడుతున్నామన్న 'అహంకారం' ప్రత్యర్థులను ఓడించాలన్న 'కసి' వుండటంతో ఆదర్శాలతో రాజీపడతారు. అది యుద్ధంలో వ్యూహం అని భ్రమకు లోనవుతారు. విలువలను పలుచన చేయటానికి వెనుకాడరు. విజయానికి దగ్గరదోవగా భావించి, చివరకు ఫలితమేమంటే మేధావి రాజకీయనాయకుని చేతిలో మోసపోయి కీలు

బొమ్మలాగ మారతాడు. ఈ స్థితిని తప్పించుకొన్న మేధావి నిరాశా, నిస్పృహలకు లోనై, దగా పడిన తమ్ముళ్ళలాగ జీవితం గడపాల్సివస్తుంది. మేధావులకు ప్రత్యక్ష కార్యాచరణ అనర్థకం అని ఆలస్యంగా అనుభవంలోకి వస్తుంది.

మేధావికి ఈ విషయం తెలియదా? తెలుసు. కాని తాను వీటిని అధిగమించగలనని, సమాజంలోని సమస్యలకు తన రచనలద్వారా పరిష్కారం చూపగలనన్న ధీమా అతడిని కార్యాచరణవైపు పురికొల్పుతుంది. రాజకీయాలు, స్వతంత్ర భావాలు భిన్న ధృవాలని, ఒక దానికొకటి పొసగవని తెలుసుకొని భంగపడ్తాడు మేధావి.

పందొమ్మిదవ శతాబ్దపు మధ్య భాగంలో కార్మికులు, కర్షకులు, చరిత్రగతిని మార్చగలరని, కామ్రేడ్లు నిజమైన నాయకులని ఎందరో మేధావులు కీర్తించారు. ఆనాడు రెండు మార్గాలుండేవి. ఒకటి సోషలిజం, రెండవది ఫాసిజం.

ఆ పరిస్థితుల్లో రచయిత ఏమీ పట్టనట్టు వ్యవహరించడం ఆత్మ లోకంలో దివాలానే. ఫాసిజాన్ని వ్యతిరేకించడం చారిత్రక విధి. ఫాసిజం పరాజయమైన తరువాత పెట్టుబడిదారి విధానాన్ని తిరస్కరించటం ప్రగతిశీలుర ధర్మం.

సంఘజీవనం యావత్తు ఆర్థిక సూత్రాల పైనే ఆధారపడి వుందన్న సిద్ధాంత నేపథ్యంలో రచయిత నిశ్శబ్దంగా రచనలు చేసుకోవటం, యదార్థస్థితిని కొనసాగించడానికి మద్దతు నిచ్చినట్లవుతుంది. ఎన్ని మంచి ఆలోచనలున్నా, కార్య నిబద్ధతవున్నా, మేధావులు తమ మధ్య తరగతి మూలాల నుండి విముక్తులు కాలేకపోయి నారు. కార్యశూరులు కాలేక పోయారు. మేధావి, నాయకుల వద్ద సహాయకుడుగా వుండిపోయాడు. అధికారంలో వెనుకవరుసలో నిల్చుండి పోతాడు. ప్రచార ప్రభావం ఎక్కువగా వున్నవారి రచనలను ప్రభుత్వాలు ఎంత ఊదరగొట్టినా, చదువరుల్లో ఉత్సాహాన్ని నింపలేవు.

సమాజం మారుతున్నా మారని వీరి పడికట్టు పదజాలం, ఏళ్ల తరబడి ఒకే రకం సమస్యల్ని ఏకరువు పెట్టడం ప్రజల్లో ఉత్సాహం నింపలేని ప్రచార సాహిత్యంగా మారిపోయింది తమ సమస్యలకు సమాధానం కోసం ఎదురు చూసే సామాన్యుణ్ణి వీరి ఉపన్యాసాలలో అన్నీ ప్రశ్నలే ఉండటం– అతనిని నిరాశతో నింపి వేస్తుంది.

మూలాలను అర్థం చేసుకో కుండా సంప్రదాయాన్ని తల క్రిందులుగా వేలాడగట్టాలన్న వీరి ఆలోచనతో సాహిత్య గమనం మధ్యలో ఆగి పోయింది. సాహిత్య ప్రయోజనం మసకబారింది.

రచన వేరు, పార్టీ సిద్ధాంతాలు వేరు అని ఎదురు నిల్చిన వారు రెండింటికీ చెడ్డ రేవడులయినారు. అవమానాలకు గురికాబడ్డారు. కొందరు విమర్శకులేమన్నారంటే తన భావాలతో నల్గురినీ ప్రభావితం చెయ్యటమేగా మేధావి రచయిత లక్ష్యం. అతడు కూడా ప్రచారకుడే మరి! ఏదయినా వర్గానికి సేవచేస్తే తప్పేమిటి? రాజకీయ మైన నవల, ప్రతిఘటనల కథలు, కవిత్వం వ్రాయవచ్చు.

దాని వలన సాంఘిక వ్యవస్థ మారుతుందా? పాతుకు పోయిన నమ్మకాలు, వ్యాపిస్తున్న శూన్యాన్ని నవలలు, కథలు, సాహిత్య శిల్పాలు, మార్చగలవా? కొద్ది రోజులు కొంత సంచలనం కలిగించవచ్చు. ఇంతలో ఇంకొక సంచలనం వస్తుంది. వేగవంత మవుతున్న సమాచార వెల్లువలో సాహిత్యం కొట్టుకు పోతోంది.

జార్జి ఆర్వెల్ అన్నట్లు రాజకీయ ప్రచారం అన్నిటికంటే ప్రమాదకరమైనది. సమాజాన్ని ఎన్ని గుంపులుగా చీల్చ కలిగితే అంతగా రాజకీయ ప్రయోజనాలు పొందగలమని భావించే నాయకులుండగా, వారి మధ్య మేధావి ఎలా యిమడ గలడు?

ప్రజాస్వామ్యం పేరిట మనుషుల మధ్య విద్వేషాలు పెంచి, ఆ ద్వేషాగ్ని చల్లారకుండా వుండటానికి ఎన్నో కుతంత్రాలు చేసే రాజకీయ నాయకుల మధ్య మేధావి విపక్షానికి కొమ్ము కాస్తాడు! నవ సమాజనిర్మాణం పేరుతో భిన్నాభిప్రాయం కలవారిని నిర్దాక్షిణ్యంగా కనుమరుగు చేసే అధికార విన్యాసంలో మేధావి ఎవరిని సమర్థిస్తాడు? అందుకని

**జార్జి ఆర్వెల్ అన్నట్లు రాజకీయ ప్రచారం అన్నిటికంటే ప్రమాదకర మైనది. సమాజాన్ని ఎన్నిగుంపులుగా చీల్చ కలిగితే అంతగా రాజకీయ ప్రయోజనాలు పొందగలమని భావించే నాయకు లుండగా, వారి మధ్య మేధావి ఎలా యిమడ గలడు? ప్రజాస్వామ్యం పేరిట మనుషుల మధ్య విద్వేషాలు పెంచి, ఆ ద్వేషాగ్ని చల్లారకుండా వుండటానికి ఎన్నో కుతంత్రాలు చేసే రాజకీయ నాయకుల మధ్య మేధావి విపక్షానికి కొమ్ము కాస్తాడు!**

కొందరి ఉద్దేశంలో నవలగాని, కళలు గాని సిద్ధాంతాలకు అతీతంగా, శుద్ధమైనవిగా వుండాలని రచయితకు స్వేచ్ఛ వుండాలి.

**సంఘంలో వివిధ విషయాల గురించి స్పందించడం మేధావి బాధ్యత, కర్తవ్యం, అది అతడి హక్కు అని, ఛార్లెస్ డికెన్స్ తన నవలల్లో ఇంగ్లండులో పీడనకు గురికాబడుతున్న కార్మికులను, పేదవారి కష్టాల గురించి స్పందించి, రచనలు చేశాడు. ఆయన సోషలిస్టు భావాలను ఎక్కడా కనబరచలేదు.**

**మానవ సమాజం నైతికంగా మార్పుచెంది ఒకింత దయాగుణం, మరింత మంచితనం వుంటే సమాజం మారుతుందని నమ్మాడు. మామూలు పరిభాషలో 'డికెన్స్' విప్లవ రచయిత కాదు. విప్లవం అంటే మొత్తం సమాజాన్ని తలక్రిందులు చెయ్యటం అని కదా!**

కాని కళలు, రచనలు అసం కల్పితంగా ముందస్తు ప్రణాళిక లేని అమాయకపు ప్రవాహాలు. టి.ఎస్. ఎలియట్ అన్నట్లు "న్యాయాధికారి తీర్పులాగ రచయిత తన ఆశయాలను ఏకరువు పెట్టకూడదు. తనకు నిపుణత లేని అంశాల జోలికి రచయిత పోకూడదు". హెర్మన్ హెస్ "రచయిత నైతిక ఉపన్యాసాలు యివ్వకూడదు. లేదా, ఫిర్యాదుల జవాబు కోసం ప్రయత్నించకూడదు" అంటాడు.

**కళలు, రచనలు అసంకల్పితంగా ముందస్తు ప్రణాళిక లేని అమాయకపు ప్రవాహాలు. టి.ఎస్. ఎలియట్ అన్నట్లు "న్యాయాధికారి తీర్పులాగ రచయిత తన ఆశయాలను ఏకరువు పెట్ట కూడదు. తనకు నిపుణత లేని అంశాల జోలికి రచయిత పోకూడదు". హెర్మన్ హెస్ "రచయిత నైతిక ఉపన్యాసాలు యివ్వకూడదు. లేదా, ఫిర్యాదుల జవాబు కోసం ప్రయత్నించ కూడదు" అంటాడు. తివోతి చెప్పిందే సరియైనది. స్పందించండి! శ్రుతి చేయండి! మౌనం దాల్చండి**

రచయిత, మేధావి ముందుగా తెల్సుకోవాల్సిన విషయమేమంటే తాను సమాజం మీద ఏ రకమైన శాశ్వత ప్రభావం చూపించలేనని. తాము మొదటి నుంచీ పరాజితులమేనని. ఒంటి స్థంభం మేడలో ఒంటరివాడే మేధావి. బహుశా తివోతి చెప్పిందే సరియైనది. స్పందించండి! శ్రుతిచేయండి! మౌనం దాల్చండి!

ఈ 21వ శతాబ్దపు సాంకేతిక పురోగమన సమయంలో "రచయిత సామాజిక బాధ్యత ఏమిటి? అన్న ప్రశ్న ప్రాచీనమైనదైనా, వింతగా ధ్వనిస్తోంది.

కారణం- విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థలో ఒకరికొకరు సంబంధం లేకుండా వుండటం జరుగుతోంది. సంఘం యావత్తూ నిరపేక్షంగా (Impersonal) నాటకీయంగా మారిపోతోంది. మేధావి తన రచనలు ఈ పరిస్థితుల్లో ఎవరికోసం రచించాలో గుర్తించలేక పోతున్నాడు.

ముంచుకొస్తున్న పర్యావరణ ప్రమాదం, నిత్యయుద్ధ వాతావరణం, సామ్రాజ్యవాదులు మానవహక్కుల పేరిట సాగించే దమనకాండ, ప్రపంచాన్ని అతివేగంతో కుగ్రామంగా మారుస్తున్న ప్రపంచీకరణం- యివన్నీ రచయిత లను, మేధావులను విలువ లేని వారినిగా తయారు చేస్తున్నాయి.

మేధావి, సాంకేతిక నిపుణుని కంటే తక్కువ స్థాయిలో పరిగణింప బడుతున్నాడు. దార్శనికుడు అయిన మేధావి. సంఘానికి ఏమాత్రం సాయం చేయలేని ఆరవ వేలుగా మిగిలి పోతున్నాడు నేటి మేధావి. నైతిక నాయకత్వాన్ని మేధావి కోల్పోవటం విచారకరం.

ఈనాడు రాజకీయాలు, ప్రభుత్వా ధికారం సగటు మానవుని జీవితాన్ని శాసిస్తున్నాయి. మానవ జీవితం రాజకీయాల చుట్టూ తిరుగుతోంది.

ఆల్బర్ట్ కావెూ అన్నట్లు "రాజకీయ ప్రమేయం ఎక్కువై ప్రతి వ్యక్తిని రాజకీయ బొమ్మగా మారు స్తున్నాయి.'' పోటీ ప్రపంచంలో నిపుణతే ముఖ్యం. దీని వలన సంఘంలో సున్నితత్వం పోయి, క్రూరత్వం పొంగుతోంది. స్పందనలేని జీవితాలలో సాహిత్యానికి ఏం పని? రమణీయకతకు చోటేది?

మానవీయ విలువలను పటిష్టం చేస్తూ శాంతి, కరుణలను మూలాలుగా భావించి, సమసమాజ స్థాపనతో తన పాత్రకు మేధావి తిరిగి ప్రయత్నించ గలడా? రాజకీయాలకు అతీతంగా స్వేచ్ఛగా తన భావాలను వ్యక్తీకరిస్తూ, సమాజంలో చైతన్య స్పృహను పెంచగలడా మేధావి?

**"మంచి రచయిత కంటే మంచి నాయకుడు ప్రపంచానికి అవసరం."**

ఆరుద్ర నాటకం

# కాటమ రాజు కథ

*– దామెర వెంకట సూర్యారావు*

జానపద విజ్ఞానంలో వీరగాథలు ఒక విలక్షణమైన ప్రక్రియ. వాస్తవంగా జరిగిన సంఘటన చూసిగాని, వినిగాని భావోద్వేగంగల జానపదులు లయాత్మకంగా పాడుకుంటే అవి దేశవ్యాప్తమై జనాదరణ పొందుతాయి. వీరగీతాలు, వీరపూజాభినివేశకాన్ని చాటి చెప్పే విశిష్టమైన రచనా వైఖరి కలిగి ఉంటాయి. *పల్నాటివీరచరిత్ర, కాటమరాజు కథలు* ఆంధ్రదేశంలో ప్రసిద్ధమైన వీరగాథలు. శ్రీనాథుడు *పల్నాటి వీరచరిత్ర*ను ద్విపదలో రచించాడు. కాటమరాజు కథ చక్రాన్ని కూడా శ్రీనాథుడు ద్విపదలో రచించినట్లు జన శ్రుతే కాకుండా కొందరు గాథాకవుల వాక్యాలు కూడా సాక్ష్యమిస్తున్నాయి.

గుత్తుంవాడ భక్తవత్సల కవి కాటమరాజు కథను పద్య ప్రబంధంగా రాశాడు. అతడు "పినయెల్లయను వాదు ప్రియము దీపింపవలనొప్ప, శ్రీనాథు వచన పద్ధతిని", యదుశాస్త్ర చరిత్రమంతా పాడాడని రాయడం వల్ల శ్రీనాథుని అనుసరించి పినయెల్లయ కాటమరాజు కథ చెప్పాడని తెలుస్తుంది. శ్రీనాథుని పేరుతో వున్న కాటమరాజు వీరగాథ చక్రంలో ఒక్క గాథ నేడు లభించడం లేదు. కాని గంగుల పినయెల్లయ రచించిన ఎఱ్ఱగడ్డ పాటి పోట్లాటను వేటూరి ప్రభాకరశాస్త్రి గారు పరిష్కరించారు. ఇందులో మూడు వీరగాథలు ఉన్నాయి. అవి *భట్టు రాయబారం. కోటపాటి తాటివృక్షం* తెచ్చే కథ, *ఎఱ్ఱగడ్డ పోట్లాట.* తెలుగు వీరగాథల్లో అతిపెద్ద వీరగాథ వృత్తాంతం కాటమరాజు కథ అని, ఇందులో 32 వీరగాథలు ఉన్నాయని తంగిరాల సుబ్బారావు పరిశోధించి నిరూపించారు.

ఈ సుదీర్ఘ వీరగాథ చక్రంలో కాటమరాజు పితామహుడైన ఆవుల నటరాజునుండి కాటమరాజు వరకు– మూడు తరాలకు చెందిన గాథలు ఉన్నాయని సుబ్బారావు వివరించాడు. ఈ వీరగాథలన్నీ పరస్పర సంబంధం కలిగి వరుసక్రమంలో ఒకపెద్ద ఇతిహాస రూపాన్ని సంతరించు కున్నాయి. ఈ కథను మాదిగల్లో 'కొమ్ముల' తెగవారు, యాదవుల్లో పికిలి వారు పాడుకుంటారని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తెలుపగా, యాదవుల్లో సుద్దుల గొల్లలు, తెరచీర భక్తుల అనే శాఖల వారు ఈ కథలను గానం చేస్తారని తంగిరాల వారు పేర్కొన్నారు.

తెలంగాణా ప్రాంతంలో ఎర్రగొల్లలవారు, మందచ్చువారు ఈ వీర గాథలను గానం చేస్తారని బిరుదు రాజు రామరాజు వివరించారు. యాదవుల కులదైవం గంగ. దర్శి, కనిగిరి ప్రాంతాల్లో వైశాఖ పూర్ణిమ నాడు గంగ జాతర జరుగుతుంది. అయ్యలరాజు నారాయణామాత్యుడు *హంస వింశతిలో కొమ్మలు వీరగణాలు...* అనే పద్యంలో గొల్లలు కాటమరాజును దైవంలా భావిస్తూ అతని వీరగాథలను గానం చేస్తారని తెలియజేశాడు.

జానపద వాఙ్మయంలో ఇంతటి విశిష్టమైన, విలక్షణమైన వీరగాథను ఆరుద్ర నాటకంగా మలిచారు. ఆరుద్ర అభ్యుదయ కవీ, గొప్ప పండితుడు, విమర్శకుడు, నిరంతర పరిశోధకుడు, ప్రయోగశీలి. ఆరుద్ర ఈ నాటకాన్ని సినీనటులు, రంగస్థల నటులు జె.వి. రమణమూర్తి, పి.జె. శర్మల కోరికపై రాసినట్లు తెలుస్తోంది. నటరాజ కళాసమితి శ్రీకాకుళం వారు పది పన్నెండు చోట్ల ప్రదర్శించారని రామలక్ష్మి ఆరుద్ర పేర్కొన్నారు.

ఆరుద్ర ఈ నాటకాన్ని 1961లో రచించినా, ఈ నాటకం, 1999లో ప్రచురితమైంది. ఐతే 1969లో *ప్రగతి* వారపత్రికలో ధారావాహికంగా ప్రచురితమైంది. సుదీర్ఘమైన ఈ గాథావృత్తాన్ని నాటకీకరించడం కష్టసాధ్యం. ఆరుద్ర కథాచక్రంలోని అత్యంత ఉత్సుకత కలిగించే ఎర్రగడ్డ పాటి పోట్లాటను మాత్రం ప్రధానంగా గ్రహించి నాటకం రచించారు.

*భట్టురాయబారం* అనే వీరగాథనూ చేర్చుకొన్నారు. *దక్షిణాది ఆవులమేపు* అనే కథను కొంతమేరకు స్పృశించారు.

నాటకం ప్రదర్శనయోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కొన్ని ఘట్టాలను ఎత్తివేయడం, చిన్నచిన్న కల్పనలు చేయడం అనివార్యమవుతుంది. ఈ పద్ధతిలో ఆరుద్ర కూడా కొద్దిపాటి

డాక్టరు దామెర వెంకట సూర్యారావు, ఫోన్ : 9885188431

మార్పులు చేశారు. నాటికలలో 34 రంగాలు ఉన్నాయి.

ఈ కథలో ఇద్దరే చారిత్రక వ్యక్తులు నల్లసిద్ధిరాజు, ఖడ్గతిక్కన, కాటమరాజు, యాదవరాజు. ఇతడు విష్ణుమూర్తికి 74వ తరంవాడని, శ్రీకృష్ణునికి 23వ తరంవాడని ఈ వీరగాథలోని వంశవృక్షం వల్ల తెలుస్తోంది. కాటమరాజు పూర్వీకులు విశాఖపట్నం జిల్లాలోని ఎలమంచిలికి చెందిన వారని, పశుగణాల మేతకు నెల్లూరు మండలం వెళ్ళి స్థిరపడ్డారని ఆరుద్రగారు భావించారు. ఎలమంచిలిని పాలించే కవులావుల గంగరాజుకు గంగమ్మ అనే భార్యవల్ల వలరాజు, హరిపాలుడు, నందగోపాలుడు, గోవర్ధనుడు అనే నలుగురు పుత్రులు కలిగారు. వీరందరూ కలభూత గంగరాజుతో యుద్ధంచేసి మరణించారు.

వలరాజు భార్య వల్లమ్మ. ఈ దంపతుల సంతానం సింహాద్రిరాజు, పెద్దిరాజు, ఎరనూక రాజు, నలనూక రాజు, పోలురాజు అనే ఐదుగురు కుమారులు. కొమరక్క అనే కుమార్తె. జ్యోతిష్యుల సలహాల మీద సింహాద్రిరాజుకు బదులుగా ద్వితీయ పుత్రుడైన పెద్దిరాజు సింహాసనమెక్కాడు. పెద్దిరాజు ఎలమంచిలిని 7 సంవత్సరాలు పాలిస్తాడు. తర్వాత పంపాద్రి వచ్చి అక్కడ ఏడేళ్ళు పాలించాడు. పెద్దిరాజుకు తప్ప తక్కిన సోదరులందరికీ సంతానం ఉంటుంది. పెద్దిరాజు, అతని భార్య పెద్దమ్మ సంతానం కోసం కళ్యాణ పట్టణంలో ఉన్న సోమేశ్వరుని సేవించారు.

వారికి కడిమరాజు అనే పుత్రుడు, పాపనూక అనే పుత్రిక జన్మిస్తారు. పాపనూక దుష్టనక్షత్రంలో జన్మించింది. పెద్దిరాజు వాలికేతువు రాజుతో యుద్ధంలో మరణిస్తారు. పెద్దిరాజు సోదరులు కూడా వేర్వేరు యుద్ధాల్లో మరణిస్తారు. ఏడేళ్ళ కాటమరాజు శత్రువు మీద దండెత్తి చంపి తండ్రి పగతీర్చుకుంటాడు.

కాటమరాజును యాదవులు విష్ణురూపుడుగా భావించి తమ గోగణానికి రాజుగా అభిషేకిస్తారు. కాటమరాజు శ్రీశైలం ప్రాంతంలోని అడవుల్లో ఆవులను మేపుతూ ఉంటాడు. పాపనూక దుష్టనక్షత్రంలో జన్మించిందని ఆమెను దొనకొండ ఊరి వెలపల ఒక భవనంలో ప్రత్యేకంగా ఉంచుతారు. ఆమె ఇందుకు దుఃఖిస్తూ యాదవులందరినీ శపిస్తూ ఉంటుంది. కాటమరాజు శ్రీశైలం దగ్గర ఆవుల్ని మేపుతున్న రోజుల్లో ఒకసారి భయంకరమైన కరువు వచ్చి ఆవులు నీరు లేక అల్లాడి పోయాయి. కాటమరాజు ప్రక్కరాజ్యం నెల్లూరు తెలుగు చోడరాజ్యం ఈ రెండు వంశాలకూ చిరకాల వైరం ఉంది. ఐనా కాటమరాజు నెల్లూరు నల్లసిద్ధిరాజుతో పుల్లరి ఒప్పందం చేసుకొని కొంతకాలంపాటు ఆ రాజ్యంలో ఆవులు మేపాలని నిర్ణయిస్తాడు. నల్లసిద్ధికూడా అంగీకరిస్తాడు. కాటమరాజు ఆలమందలు నెల్లూరులో ఉన్న కాలంలో పుట్టిన కోడెదూడలను నల్లసిద్ధికి ఇచ్చేటట్లు, నల్లసిద్ధిరాజు వాటికి రక్షణ కల్పించేటట్లు ఒప్పందం జరిగింది. కాటమరాజు ఆలమంద పెద్దది కావడం వల్ల పచ్చికబయళ్ళ ప్రక్కనగల పంటపొలాల్లో కూడా అవి అప్పుడప్పుడు మేసేవి.

పంట నష్టపోయిన రైతులు నల్లసిద్ధిరాజు రాజ్యంలో లేని సమయంలో అతని ఉంపుడుగత్తె కుందమాదేవికి ఫిర్యాదు చేస్తారు. కుందమాదేవి పెంపుడు చిలక తప్పించుకొని వచ్చి యాదవుల ఆలమంద దగ్గరకు వచ్చి గట్టిగా కూస్తుంది. బెదిరిన ఆలమందలు చెల్లాచెదుర వుతాయి. కాటమరాజు మిత్రుడైన పద్మరాఘవుడు ఆ చిలుకను బాణంతో కొట్టి చంపుతాడు. ఇది తెలిసిన కుందమాదేవి కోపంతో బోయలను పంపి ఆలమందను హతమారుస్తుంది.

తమ ఆలమందకు నష్టం వాటిల్లడం వల్ల పుల్లరి ఇవ్వవలసిన అవసరం లేదని, తాము ఇవ్వవలసిన కోడెదూడలను నల్లసిద్ధిరాజుకు ఇవ్వకుండా పద్మరాఘవుడు ఆలమందలను ఎర్రగడ్డపాడు తరలిస్తాడు. నల్లసిద్ది రాజ్యానికి వచ్చాక విషయం తెలుస్తుంది. తన ప్రియురాలు చేయించిన గోహత్య విషయం ఆయనకు తెలియదు.

కాటమరాజు కావాలని పుల్లరెగవేశాడని భావిస్తాడు. కాటమరాజు, నల్లసిద్ధిలకు ఎర్రగడ్డపాడు వద్ద యుద్ధం జరుగుతుంది. ఈ యుద్ధంలో కాటమరాజు జయించినట్లు గాథ చెబుతుంది. చరిత్రకారుల్లో ఎక్కువమంది కాటమరాజును దోషిగా చిత్రించారు. ఎమ్.ఆర్. నాగేశ్వరరావు నల్లసిద్ధిదే దోషమన్నారు. తెలుగువారి జానపద ఇతిహాసాల్లో ధర్మమే గెలిచిందని జానపద కవులు వర్ణించారు.

మన రామాయణ, మహాభారతాల్లోనూ ధర్మపక్షమే జయిస్తుంది. పల్నాటి వీరచరిత్రకు సంబంధించిన స్థానిక చరిత్రల్లో నలగాముడే జయించినట్లు రాశారు. బ్రహ్మనాయుడు రాయబారి అలరాజు విషప్రయోగం వల్ల మరణిస్తాడు. యుద్ధంలో బాలచంద్రుడు మరణించాడు. వారి పక్షంలో

బ్రహ్మనాయుడే మిగిలాడు. అంటే అక్కడ అధర్మం జయించినట్లు భావించాలి. కాటమరాజు కథలో కూడా విజయం అస్పష్టమే. ఆరుద్ర నాటకంలో చివరగా యాదవుల ఆస్థానకవి కొమరు బంగరు భట్టు చేత...

**"ధర్మ పక్షమెప్పుడు జయమందు**
**భరతభూమి ధర్మ బద్ధమై మనుగాక**
**వసుధలోన శాంతి కలుగుగాక!"** ..అను శాంతి సందేశం విని పిస్తాడు.

యుద్ధ పర్యవసాన్ని స్పష్టంగా చెప్పలేదు. శాంతి కాముకుడైన కవి ఏ యుద్ధమైనా దాని పర్యవసానం సర్వనాశనమే అనే అంశాన్ని నాటక సందేశంగా కాటమరాజు చేత చెప్పిస్తాడు. కాటమరాజు యాదవుడు. యాదవులు ఆ నాటికి వెనుకబడిన సంచార తెగ. దేశసంపదకు గోగణాన్ని వృద్ధి చేసే జాతి. నల్లసిద్ధి క్షత్రియుడు, నాగరికుడు. వంశపారం పర్యంగా రాజ్యాధికారం అనుభవిస్తున్నవాడు. ఎన్నో యుద్ధాల్లో ఆయన చరిత్రగల రాజవంశీకుడు. ఆరుద్ర ఈ నాటకంలో నాగరిక జాతి ఒక వెనక బడిన ఆమాయక జాతిని మోసం చేసిందనే భావాన్ని వ్యక్తం చేయడంలో ఆయన పీడిత జన పక్షపాతం ద్యోతకమవు తుంది. కాటమరాజు నల్లసిద్ధిల సంభాషణలు దీనికి దోహదం చేస్తున్నాయి. కాటమరాజుతో నల్లసిద్ధి ''ఆధునిక పరికరాలతో, అధునాతన యంత్రతంత్రాలతో పోరాడిన వాడికే విజయం" అని, విధానం ఏదైతేనేం విజయం నాకు ముఖ్యమని అంటాడు. ఆధునిక సామ్రాజ్యవాదదేశం కుటిలత ఇందులో ఆరుద్ర ధ్వనింప జేశారు. నల్లసిద్ధి గోహత్యా పాతకమేగాక నాటి ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమైన గోవ్యవస్థను నాశనం చేశాడని భావించాలి. ఆరుద్ర ఈ నాటకాన్ని గంగ గుడితో ప్రారంభించి గంగగుడి దగ్గరే ముగిస్తారు. యాదవుల దృష్టిలో గోగణం ఉనికికి గంగమ్మ ప్రాణాధారం. ఆరుద్ర చూపించిన ఈ శిల్పం అర్థవంతమైనది. ఈ నాటకంలో ఖడ్గతిక్కన పాత్ర ఆరుద్ర విలక్షణంగా చిత్రించారు. ఖడ్గతిక్కన వృత్తాంతం తెలిపే కైఫియత్తులు, గుండ్ల పాలెం శాసనం, కొన్ని చాటు పద్యాల వల్ల, ఖడ్గతిక్కన వల్ల కొన్ని విషయాలు తెలుస్తున్నాయి. ఖడ్గతిక్కన, కవి తిక్కన అన్నదమ్ముల పిల్లలు. కవి తిక్కన మనుమసిద్ధికి మంత్రి అయితే, ఖడ్గతిక్కన మనుమసిద్ధి కొడుకు నల్లసిద్ధికి సైన్యాధిపతి. ఖడ్గతిక్కన తండ్రి సిద్ధనమంత్రి నల్లసిద్ధికి మంత్రి. ఖడ్గతిక్కన మహావీరుడు. యాదవవీరులు అతనిని ఎంతో గౌరవించారు. కాటమరాజు కథ గానం చేసిన జానపద కథకులు ఖడ్గతిక్కనను మహోన్నతవ్యక్తిగా చిత్రించారు. ఆరుద్రకూడా దీనినే అనుసరించారు. ఖడ్గతిక్కనకు తెలియకుండా నల్లసిద్ధి కొలువులోని రామశృంగార భట్టు లంచం పుచ్చుకొని తిక్కనను నెల్లూరు ప్రజలు అనుమానించి, అవమానించేలా చేస్తాడు. ఆరుద్ర చేసిన ఈ కల్పన మనోహరం. ఖడ్గతిక్కన పాత్రకు మరింత ఔన్నత్యం చేకూర్చింది. సిద్ధిరాజు ఉంపుడు గత్తె పేరు వీరగాథల్లో కుందమాదేవి అని ఉంటే ఆరుద్ర కన్నమదేవిగా మార్చారు. అయితే చాలా చోట్ల చిలకసాని అనే ప్రయోగించారు. *పల్నాటి చరిత్ర*ను *పల్నాటి భారతం* అంటారు. కాటమరాజు కథను ఆరుద్ర రామాయణంగా పోల్చి చిత్రించటం సహేతుకంగా ఉంది. కాటమరాజును శ్రీరాముడుగాను, సిరిదేవిని కైకగాను, అయితమ రాజును భరతుడుగాను, దక్షిణాది ఆవుల మేపును అరణ్యవాసంగాను, ఎర్రయ్యను లక్ష్మణునిగాను, చిలకసానిని శూర్పణఖగాను, ఎద్దులను వానరసైన్యంగాను, భట్టురాయ బారాన్ని అంగద రాయబారంగాను, సిద్ధిరాజును రావణుని గాను, ఖడ్గతిక్కనను ఇంద్ర జిత్తుగాను, ధ్వనింప జేశారు. కొన్నిచోట్ల సహజత్వం కోసం వీరగాథల్లోని కొన్ని పంక్తుల్ని వచనంగా మార్చి రాశారు.

జనవ్యవహారంలో ప్రసిద్ధమైన చాటుపద్యాలను కొన్నింటిని యథాతథంగా ఉపయోగించుకోవడం కూడా నాటకానికి వన్నె తెచ్చింది. రసవంత మైన పద్యాలు రాశాడు. ఆరుద్ర ఈ నాటకం రాసేనాటికి తెలుగునాట పద్యనాటకాల ప్రాభవం తగ్గలేదు. వీరి రసపోషణకు అనువైన సంభాషణలు పొదిగారు. నాటకంలో ఆరుద్ర ఎన్నో జాతీయాలు, నుడికారాలు, సామెతలు ప్రయోగించారు. 'నారుపోసిన వాడు నీరు పోయ్యడా?' 'కష్టాలు నిరతమ్ము కాపురముందునా', 'తమ్ముడు తనవాడైనా తగవూ ధర్మం సరిగ్గా చెప్పమన్నారు', 'మాణిక్యం మహారాజు శిరసునుండాలి గాని మసిపాత నుంటే ఏంలాభం?', 'ఉలవలెత్త మంటే ఊళ్లడగడం', 'తెడ్డడిగినప్పుడే కొయ్యడిగినట్లు', 'పడుచు వాళ్ళు పకపకలాడకపోతే ముసిలి వాళ్ళు ముసిముసిలాడేదీ' వంటి ప్రయోగాలు జనవ్యవహారం సన్నిహితమై అలరిస్తాయి.

తెలుగు జాతి సంస్కృతిని చాటి చెప్పే జానపద ఇతిహాసం కాటమరాజు కథలోని పతాకసన్నివేశాన్ని గొప్ప రచనాశిల్పంతో ఆరుద్ర నాటకీకరించి నాటక రంగానికి మహోపకారం చేశారు. మి

# ఇదంతా నా కడుపు మంట

మాఅమ్మ కలుపు తీసేసి ఇంటికి వచ్చేసరికి తిరుమల కొండమీద పాల బల్బులు సోలుపుగా మండుతా వుంటాయి. దీపం వెలిగే మా ఇల్లు నా కంటికి బలే వుండేది.

మా (కాడిమాను) దండెం మీద చీలికా పేలికా నీడలు దీపపు వెలుగులో ఎదురు గోడ మీద పొడుగ్గా పడేవి. మా అమ్మ నీడ నా కంటికి దిగులు దిగులుగా కనబడి బయం వేసేది. రెండు మానికల బియ్యం కూడును మా అమ్మ వార్చగానే, నులక మంచం మీద అలుపు తీర్చుకునే మా నాయిన, "ఏమే, అన్ని చిట్టుడుకు నీళ్ళు" యివ్వమనేవాడు. బలే లోగొంతు మనిషి మా నాయిన.

అప్పుడు మా అమ్మ కూర చెయ్యడానికి రడీ అవతా వుండేది. మా అమ్మ మా నాయినకు సమాధానమైనా చెప్పకుండా పని చేసుకుంటూ పొయ్యేది. మా అమ్మ నిష్ఠూరానికి మా నాయిన గుండెల్లోంచి మాటలు రానిచ్చి, "లోకమంతా ఎండలో వొంగి పని చేసినట్టు, నేను మాత్తరం పచ్చని చెట్టుకు ఉయ్యాల కట్టుకోని ఊగినట్టు" అనేవోడు.

మా అమ్మ మా నాయిన మాటకు పొగుగ్గా గాలి వొదిలి అన్ని గంజినీళ్ళను ముంతలో పోసి మంచినీళ్ళను జోడీ చేసి తగుమాత్రంగా వుప్పు వేసి మా నాయిన మంచం కింద పెట్టి వచ్చేది. మా వాళ్ళంతా నీళ్ళు పోసేకునేసరికి కూటేళ అయిపోయేది. ఆ పాటికి మా అమ్మ కూరచట్టి దించి రోలు మీద పెట్టి గుత్తి కట్టితో కూరను ఎనిపేది. అది– వుత్తి మిరపకాయ కూర! దోసిడు మిరపకాయల్ని రెండు దోసిళ్ళ నీళ్ళల్లో వేసి వుడకబెట్టడం, తరవాత వుప్పు వేసి పామెయ్యడం, అదీ ఆ కూర కత.

కూరైపోయినాక మా అమ్మ నేనూ పెళ్ళోకిపోయి గుడ్డలిప్పేసి వుడుకుడుగ్గా నీళ్ళు పోసుకొనే వాళ్ళం. పొగులంతా పనిజేసి మా అమ్మ ఒళ్ళు అలిసిపోయి వుంటుంది. వుడుకునీళ్ళు ముంతను పైన కుమ్మరించుకొని మా అమ్మ ముంత ముంతకూ మూలిగేది. అందరమూ అన్నాలకు కూచ్చుంటాం. సత్తు గిన్నెలో కూడూ కూరా వేసుకుని కూర్చొని నేను మా అమ్మకల్లా మార్చి మార్చి చూసేవాడ్ని. ముందూ యెనకా సూడకుండా మా అన్నా, మా అక్కా ఒకరికి మించినట్లు ఒకరు ముక్కులు సీదుకుంటా, నోళ్లల్లోకి గాలిని ఎగపీల్చుకుని, కారాన్ని అణసర చేసుకుంటా తింటా వుంటారు. నేను నానస్తావుంటే మా అక్క పెద్దరికాన్ని నెత్తినేసుకుని, "సెడిదీ బడిదీ కడుపు నిండికీ తింటే గదా, బిడ్డి పెరిగి పెద్దోడయ్యేది" అని అంటింది మా అక్క. "నేను తిన్నుబో" అనేసి నా చేతుల్లో గిన్నిని (బయం బయంగా) తోసేస్తాను. నేను మా నాయిన కల్లా జూసి, "అయ్యా, అయ్యా, బలే కారింగా వుండాది గదా కూడు" అనడగతాను. దానికి మా నాయిన, "ఏమోనయ్యా, రుచులు మాకేం తెలుసు? కారిం గీరిం అంటే వినేదానికి నాకు నీ మాదిరి అమ్మా, అయ్యా లేరే!" అనేవాడు. "తినురే కన్నా నువ్వు తినకుంటే రేపు పొద్దు మొలవదురే నాయినా", అని ఎగతాళిపడే మా అక్కను సైగచేసి చిన్న దెబ్బ ఒకటి మా అమ్మ కొట్టి నాకు అన్నం తినిపించేది. నేను తినేసేవాడ్ని. చాపల మీద చేరేవాళ్లం. మా అమ్మకు నిద్దరతో కండ్లు మూతలు పడతా వుంటాయి. నాకు మాత్రం నిద్దర పట్టదు.

రాత్తిరంతా మా అమ్మను వులిక్కి పడేటట్టు పైకి లేపి, "అమ్మా అమ్మా మంట, అమ్మా అమ్మా కడుపు మంట, అమ్మామ్మే. కడుపులో కలబెట్టినట్టు వుండాది" అనేవోడ్ని. ఆ మాటలంటూనే మంట పెట్టే వుసురుకాయని చేతుల్లో నలిపేసేవాడ్ని. మా అమ్మ నా చేతుల్ని చేతుల్లోకి తీసుకొని, "నలుపుకోవద్దు నాయినా, నలుపుకోవద్దు" అని మదన పడేది. "అమ్మా కడుపులో కారింగాని, మంటగాని, వుసురుకాయ బగ్గుమని మండతా వుండాదమ్మా" అనేవోడ్ని. నిద్దర్లోకి పోతావుండే మా అమ్మతో ఆ మాటను గుక్కతిప్పుకోకుండా లచ్చసార్లు అనాలనిపించేది.

"కడుపు నిండికీ నీళ్లు తాగీ కొడకా! వుడుకూ గిడుకూ వొదిలిపోతింది నాయినా" అనేది మా అమ్మ నిదర మొహంతో. "అమ్మా అమ్మా నిజ్జింతో కడుపు మంటగాని, కడుపులో ఎండగాసినట్టు వుండాదమ్మా" అనేవాడ్ని. ఈ మాట మా అమ్మకు బలే బాద గలిగించేదిగా వుండాది. ఆ మాట అనిన నన్ను మా అమ్మ రెండు చేతుల్తో జవురుకుని, "ఈ దీనురాలి కడుపులో ఎందుకు పుడితివిరా అష్టదరిద్రపు కొడకా! వుత్తి మిరపకాయ కూర యేసినందుకు మంటకు వోర్చుకోలేక నిన్న మన బిడ్డల్లాడి పోయినాడే– అనేసి, నేను రేపు నీకు పెరుగూ కూడు పెట్టబోతానా నాయినా!" అనేసి మా అమ్మ నిద్దర కండ్లలోకి నీళ్లను తెచ్చుకొని ఎక్కిళ్ళతో అదిరిపోయ్యేది.

మా అమ్మ నా గురించి అట్లా ఏడవటం నాకు బలే నాయంగా అనిపించేది.

"అమ్మా, వొంటికి వొచ్చినట్టుగా వుండాది. అమ్మామ్మే మాటిమాటికీ వొంటికి వొచ్చినట్టుగా వుండాది. కడుపులో అలివిగాని మంట" అని ఆ చీకట్లో ఆ రాత్తిరంతా నేను మా అమ్మ కండ్ల నీళ్లను దప్పిక తాగేసే వాడ్ని.

– నామిని



# ఆలపాటి రవీంద్రనాథ్

(1922–1996)

**యు**వతకు అవకాశాలు వాటంతట అవి మన ముంగిటకు రావు. కనుక యువతే అవకాశాలను సృష్టించుకొని ఎదగాలి. ఈ సూక్తి తాలూకు స్ఫూర్తిని చిన్ననాటే రవీంద్రనాథ్‌గారు ఆకళింపు చేసుకుని, అనుసరించారు. గుంటూరు జిల్లా, గోవాడ గ్రామంలో జన్మించారు. తమ తండ్రిగారు తమ గ్రామంలో 1918లో ప్రారంభించిన రాజరాజనరేంద్ర గ్రంథాలయంలోని పుస్తకాలను ఔపోసన పట్టారు. సహజంగా సంపన్నమైన కుటుంబంలో జన్మించినందున తాను ఎన్నో పుస్తకాలు, పత్రికలు, కొని చదివి ప్రపంచ పోకడలు అర్థం చేసుకున్నారు. తన జీవితానికి తానే బాట ఏర్పరచుకున్నారు. అభిరుచి గల అంశంపై స్వేచ్ఛా జీవితం కొనసాగించాలనే ఉద్దేశ్యంతో సొంత పెట్టుబడితో, తెనాలిలో 1943 జాకోబిన్ ప్రింటర్స్ ప్రారంభించి, అందులో పుస్తకాలు ముద్రించడంలో నేర్పు సంపాదించారు.

1946లో తెనాలి నుంచే జ్యోతి పక్షపత్రికను, (వడ్డాది పాపయ్య మొట్టమొదటిసారిగా రవీంద్రనాథ్ నడిపిన *జ్యోతి* పత్రికకు పనిచేశారు.) తదుపరి రేరాణి, కినిమా మాస పత్రికలను నిర్వహించి – పత్రికా రంగంలో కొత్త ఒరవడి సృష్టించారు. ప్రజానీకంలో చదివే అలవాటు పెంచారు. వీరు ఎంత అందంగా ఉంటారో, తాను అంత అందంగా గ్రంథాలను ముద్రించేవారు. గ్రంథం గెటప్‌లో వారు చూపే శ్రద్ధ అపూర్వం. పాఠ్య గ్రంథాలను చూడముచ్చటగా ప్రచురించేవారు. 1952లో ప్రభుత్వం హైస్కూలు స్థాయిలో పాఠ్య గ్రంథాలను జాతీయం చేశాక, మకాం హైదరాబాదుకు మార్చారు. అచట కళాజ్యోతి ప్రాసెస్ పేరుతో ముద్రణాలయం ప్రారంభించి, అభివృద్ధి చేశారు. తదుపరి వీరి కుమారులు బాపన్న, దేవేంద్రనాథ్‌లు ఈ ప్రెస్‌ను ఆకాశమే హద్దుగా పెంచారు. ఎక్కడైనా అందంగా ముద్రించిన గ్రంథం కనుపిస్తే అది కళాజ్యోతిలో అచ్చయిందే కావాలి అనుకుంటారు! అదీ వారి ప్రత్యేకత.

*– డాక్టరు వెలగా వెంకటప్పయ్య.*

**ఈ నెల 11వ తేదీ ఆలపాటి రవీంద్రనాథ్ 16వ వర్ధంతి.**



# శ్రీకాళహస్తి కలంకారి

*- కాండ్రేగుల నాగేశ్వర రావు*

కలంకారీ ఇది రెండు పదాలు కలసిన ఒక జంటపదం.

కారీ అంటే పని. ఇది హిందీ, ఉర్దూ భాషలలో ఉపయోగించబడే ఉమ్మడి పదము. పదవ శతాబ్దంలో పర్షియన్ భారతీయ వర్తకుల సంబంధ నేపథ్యంనుండి ఈ పదం వచ్చింది. కలం అంటే వెదురుతో చేయబడ్డ కలం లేదా పెన్ను లాంటి వ్రాయడానికి ఉపయోగించ బడే ఒక ఉపకరణం. దాని నుంచి జాలువారే రంగుతో ఒక చిత్రం బట్టపై వేయడాన్ని కలంకారీ చిత్రకళ అంటారు.

హరప్పా నాగరికతలో వెండి పాత్రమీద చిత్రాలు వేయబడ్డ ఒక వస్త్రం లభించింది. దాని ఆధారంగా ఇది క్రీ॥పూర్వం నుంచీ ఉన్నట్లు తెలుస్తుంది. ఈజిప్ట్‌లో జరిగిన తవ్వకాలలో భారతదేశంలో తయారయిన కలంకారీ వస్త్రాలు లభ్యమయ్యాయి.

అలెగ్జాండర్ కలంకారీ వస్త్రాలను సేకరించి, తనతో తీసుకొని వెళ్ళాడని చరిత్ర చెబుతుంది. ఇది చాలా ప్రాచీనమైన కళ. ఇటువంటి కళ ప్రపంచంలో చాలా దేశాల్లో ఉంది. పోర్చుగీస్ వారు దీనిని పింటాడ్ అని, డచ్చివారు నిట్జ్‌ని, బ్రిటిష్ వారు షింజి అని పిలుస్తారు. భారతదేశంలో ఇంచుమించు అన్ని రాష్ట్రాలలోను ఇటువంటి చిత్రకళ ఉన్నా ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రత్యేకస్థానం ఉంది. కలంకారీ కళలో మన రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుంది. కలంకారీ కళకు సంబంధించి మనకి రెండు ముఖ్యకేంద్రాలున్నాయి. మొదటిది కృష్ణాజిల్లా లోని పెడన. ఈ కళను ఆదరించినది తొలి గోల్కొండ సుల్తాన్ కులీ–కుతుబ్‌షా. ఇది కలంకారీ కళ అని వాడుకలో పిలువబడుతున్నా నిజానికి ఇక్కడ జరిగేది అద్దకపు పని.

మొదట ఒక చెక్క దిమ్మెను తీసుకొని దానిపై కొన్ని డిజైనులు, హంసలు, చిలకలు, లతలు, పువ్వులు లాంటివి వేసి వాటిని చెక్కి రంగులో ముంచి, పరచిన బట్టపై అద్దకం చేస్తారు.

ఇక్కడ చెక్కలో డిజైనులు మొదలైనవి చెక్కుడు చేయటంలోనే నైపుణ్యం అంతా దాగుంది. ఆ చెక్కుడు, మరీలోతుగా కాకుండా అలా అని మరీ పైపైన కాకుండా, రంగు బట్టకు సరైన పాళ్ళలో అంటుకునేటంత సమ పాళ్ళుగా ఉండాలి. అలా లేనప్పుడు డిజైనులు ముద్దలు ముద్దలుగానో లేక కనీకనిపించకుండా రంగుపడటమో జరుగుతుంది.

చెక్కదిమ్మెపై నున్న చెక్కుడు, రంగులు కలపటంలోని సాంద్రత, అద్దినప్పుడు చేసే వత్తిడిపై ఈ కళ అందం ఆధారపడి ఉంటుంది. దీని నైపుణ్యం అంతా అనుభవంతో వచ్చేదే. అభ్యాసం కూసువిద్య కదా. ఈ తరహా చిత్రాలలో నున్న ముఖ్యమైన లోపం ఇవి మూస చిత్రాలు కావటం.

ఇది ఇంచుమించు పుస్తకం అచ్చేయటం లాంటి ప్రక్రియ. తక్కువ శ్రమతో ఎక్కువ పరిమాణంలో రంగుల బట్టలు తయారు చేయగలగటం దీని ప్రత్యేకత. ఇందులో వాడబడే కలంకారీ రంగులన్నీ ప్రకృతిలో నుంచి వచ్చినవే. ఇక రెండవ ముఖ్యకేంద్రం శ్రీకాళహస్తి.

ఇక్కడ జరిగే కలంకారీ పని చాలా కష్టంతోనూ శ్రమతోనూ కూడినది. ఇది పూర్తిగా చిత్రకారుని నైపుణ్యం

కాండ్రేగుల నాగేశ్వర రావు, ఫోన్ : 9948083387

మీద ఆధారపడి ఉంటుంది. ప్రతిబట్టమీద కలంతో ఒక చిత్రాన్ని చిత్రించటం లాంటిది. ప్రతీదీ ఒక పెయింటింగే.

ఇందులో ఒక కళాఖండం పూర్తి కావడానికి 17 దశలున్నాయి. మొట్టమొదటగా వేయబోయే చిత్రం యొక్క నమూనాను బట్టపై రేఖామాత్రంగా చిత్రిస్తారు. రేఖలను వస్త్రంపై గీయడానికి ఉపయోగించే కలం మనం అనుకునే ఫౌన్‌టెన్ పెన్ కాదు. సిరాబుడ్డిలో మాటిమాటికి కలాన్ని ముంచి వ్రాసే పాతకాలపులాంటి వ్రాతకు పనికి వచ్చే కలం ప్రక్రియ కాదు.

ముందుగా ఒక దారపు కండెను తీసుకొని అరచేత గుప్పిటలో ఇమిడే పరిమాణంలో దారపు బంతిని తయారు చేసి దాని మధ్యనుంచి సన్నటి పుల్లను అమరుస్తారు. దారపు కండెను కావలసిన రంగులో ముంచినపుడు అది ఆ రంగును పీల్చుకుంటుంది. దానిపై ఒత్తిడి తెచ్చినపుడు అది ఆరంగును పుల్ల ద్వారా విసర్జిస్తుంది. ఆ పుల్లను చిత్రకారుడు తాను అనుకున్న రీతిలో వంపుతూ, ఒత్తుతూ చిత్రాన్ని గీస్తాడు.

ఇందుకు ఎంతో ఏకాగ్రత అవసరం. దారము పైనున్న రంగు ఆరేలోపునే ఆ పీల్చిన రంగు అయిపోయేంత వరకూ రేఖా చిత్రాలు ఆటంకం లేకుండా గీస్తూనే పోవాలి. కాళహస్తి కలంకారీ కళలో చిత్రకారునిదే పైచెయ్యి. ఇందులో ప్రతి దానిలో సృజన, చిత్రకారుని ప్రతిభ మనకు కనిపిస్తుంది. పెడన, కాళహస్తి ఈ రెండు చోట్ల మొట్టమొదటగా దళసరిగానున్న చేనేత బట్టను ఎంపిక చేసుకుంటారు.

దీనిని నదీతీరంలోకి తీసుకువెళ్ళి, ఆ ప్రవహిస్తున్న నదిలో ఈ గుడ్డను ముంచి నానబెట్టి దానిపైనున్న గంజి, పిండి పోయేంత వరకూ ఝాడించి శుభ్రం చేస్తారు. ఈ పనిచేస్తున్నపుడు సబ్బునుకానీ, వేరే విధమైన డిటర్జంట్‌ను గానీ, వాడరు. అందువల్ల పర్యావరణానికి ఏవిధమైన హాని జరుగదు. శుభ్రపడిన ఈ బట్టను గేదెపాలు, కరక్కాయ రసం కలిపిన మిశ్రమంలో ముంచి ఎండలో ఆరబెడతారు. ఆరబెట్టిన తరువాత అది కలంకారీ పనికి సిద్ధమవుతుంది.

చింత బొగ్గు కణికతో దీనిపై తమకు కావలసిన చిత్రం యొక్క ప్రాథమిక రూపాన్ని గీస్తారు. ఆ తరువాత 'అన్నభేది' అనే ద్రావకంలో ముంచి నల్లరంగు శాశ్వతంగా, చెరిగి పోకుండా ఉండేలా చేస్తారు. చరిత్ర పరంగా చెప్పాలంటే 13 నుంచి 19 శతాబ్దాల మధ్య కోస్తా తీర ప్రాంతాలలో మరీ ముఖ్యంగా మచిలీపట్నం, మద్రాసు రెండూ ముఖ్యమైన నౌకాకేంద్రాలు కావటంతో వస్త్రవ్యాపారం పెద్ద ఎత్తున జరిగింది. శ్రీకాళహస్తి పట్టణానికి ఆనుకుని ఉన్న స్వర్ణముఖీ నదిలో స్వచ్ఛమైన పారేనీరు వల్ల ఈ కళ అక్కడ అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడింది. అంతే కాకుండా శ్రీకాళహస్తి పేరెన్నికగన్న దేవాలయం కూడా. తిరుపతి కూడా దగ్గరగా ఉండటంతో పుణ్యతీర్థాలు దర్శించే యాత్రికుల ద్వారా వ్యాపారం సుగమం అయ్యే అవకాశాలు ఇక్కడ ఎక్కువగా ఉండేవి.

కలంకారీ చిత్రాలకు రామాయణం, మహాభారతం, భాగవతం, శివపురాణం లోని ఘట్టాలే కథావస్తువులు. పర్షియన్‌లు అనగా ఇప్పటి ఇరానియన్‌లు కలంకారీ దుస్తులను ఎక్కువ ఇష్టపడటంతో అక్కడికి ఎక్కువగా ఎగుమతయ్యేవి. వాటిలో ప్రార్థనా వస్త్రాలు ముఖ్యమైనవి.

జంతు, పక్షి, డిజైనులలో ఉన్నవి అరబ్, ఐరోపా దేశాలకోసం ప్రత్యేకంగా చేయబడ్డవి. ఇప్పుడు కలంకారీలో ఏసుక్రీస్తు చర్చికి సంబంధించిన కొన్ని బైబిల్ గాథలను కూడ చిత్రించబడి కలంకారీ మతాతీత భావాలకు ప్రతీకగా నిలబడింది. గోడకు వేలాడదీసే హిందూ దేవతా మూర్తులు, రామాయణ భాగవత గాథలు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతి అవుతూ ఉంటాయి. పూర్వకాలంలో సుగంధ ద్రవ్యాల వ్యాపారస్తులు వస్తు మార్పిడి ద్వారా కలం కారీ





దుస్తులకు వెల నిర్ణయించే వారు. ఆనాటి నుండి ఈనాటి వరకూ ఈ కళను ఆశ్రయించి జీవిస్తున్న వారిలో ఎక్కువ మంది బలిజ కులస్తులు. వీరు వ్యవసాయం, కుటీర పరిశ్రమల మీద ఆధారపడి జీవించే వారు. ఇప్పటికీ శ్రీకాళహస్తి చుట్టు పక్కల సుమారు 300 మంది చిత్రకారులు ఉంటారని అంచనా. ఒకానొక కాలంలో దీని ఆదరణ తగ్గి ఇది అంతరించి పోయే ప్రమాద మేర్ప డింది. 1950 సం॥లో కమలాదేవి ఛటో పాధ్యాయ ఉద్యమ కృషితో ఇది ప్రభుత్వ దృష్టిని ఆకర్షించి పునర్జీవం పొందింది. గత 20 సంవత్సరాల నుంచీ ప్రపంచీ కరణ నేపథ్యంలో ఇది తిరిగి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

21వ శతాబ్దంలో దీనిని తిరిగి నిలదొక్కుకునేలా చేసినవారు కైలాసం, లక్ష్మీదేవిరాజ్, సూరయ్యప్ప, ఉగ్రమ్మ. వీరు వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇప్పుడీ కలంకారీ, పెడన, శ్రీకాళహస్తి ప్రాంతాలకే కాదు మరి కొన్ని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించింది. ఈ మధ్య కాలంలో శ్రీమతి మమతారెడ్డి ఈ పద్ధతి స్వయంగా నేర్చుకొని తిరుపతి కేంద్రస్థానంగా కలంకారీకి కొత్తరూపం ఇచ్చి దీని విస్తృతికి మరింత దోహదం చేస్తున్నారు. కలంకారీ తయారీలో సంప్రదాయానికి విలువనిస్తూ కొన్ని కొత్త పోకడలను ప్రవేశపెట్టారు. ఈ నాడు ఈమె కింద 40 మంది చిత్రకారులు పని చేస్తున్నారు. సంప్రదాయంగా వస్తున్న గుమ్మపు తెరలు, దిండు గలేబులతో పాటుగా కలంకారీ పల్లు ఉన్న చీరలు, సల్వార్ కమీజులు, దుపట్టాలు కొత్తగా చేర్చి ఒక వర్క్ షాప్‌ను కూడా ప్రారంభించారు. 30 మంది చొ॥న ఒక బ్యాచ్‌గా అమ్మాయిలకు శిక్షణ ఇస్తూ వారికాళ్ళపై వాళ్ళు నిలబడే అవకాశం కల్పిస్తున్నారు. మంగళగిరి కాటన్, ఖాదీలను, రాజస్థాన్ నుంచి కోటా, కచ్ నుంచి బందనీ, చంపా నుంచి టస్సార్ లాంటి వివిధరకాలైన బట్టలను ఉపయోగిస్తున్నారు.

ఇంతకు పూర్వం లేని కొత్త వర్ణమిశ్రమాలను ప్రవేశపెట్టారు. అందులో ఒక విధానంగా 24 రోజులు బెల్లంని నానబట్టి పులిసిన తరువాత దానిలో ఇనుప రజనును కలిపి నలుపురంగు తయారు చేస్తారు. ఎఱుపు రంగు వేయ వలసిన చోట పటికను రుద్ది ఒకరోజు పాటు దానిని పక్కన పడేసి వుంచుతారు. నీటితో కడిగినప్పుడు అది ఎఱుపు రంగుగా మారుతుంది. సురుడు చెక్కను మెత్తని చూర్ణంగా చేసి గుండచేసి దానిలో ఉడక బెట్టిన తరువాత అందులో గుడ్డను ముంచుతారు. మందారపువ్వులను పింక్‌రంగుకు, బ్రౌన్ రంగుకు కాచును, తేయాకు ఆకులను లైట్ బ్రౌన్ కలర్‌కు వాడుతున్నారు.

ఇలా తయారైన కలంకారీ చీరల ఖరీదు రు. 4500 నుంచి 15 వేల వరకు ఉంటుంది. పెళ్ళికుమార్తె చీరగా ఒక చీరను లక్షా యాభైవేల రూపాయలకు అమ్మారు. ఈ కలంకారీ కళలో ప్రసిద్ధి గాంచిన మరొకరు ఎమ్. కైలాసం దంపతులు. 1982వ సంవత్సరంలో Master Kalamkari Artist గా కేంద్రప్రభుత్వం నుంచి బహుమతి నందు కున్నారు. ఈయన తన కలంకారీ పనులను హైదరాబాద్ నుంచే చేస్తారు. కలంకారీకి నిరంతరం ప్రవహించే నది కావాలి–దానికీయన గండిపేటను ఉపయోగిస్తున్నారు. ఆధునిక చిత్రకారులలో కలంకారీ శైలిని ఆధారంచేసుకొని ఎక్రిలిక్ రంగులను వాడుతూ చిత్రకళా ప్రపంచంలో కొత్త అందాన్ని తెచ్చినవాడు రమేష్ గురజాల. ఈ నాడు ఇతను వేసిన చిత్రాలు భారత దేశాన్ని దాటి ప్రపంచమంతా ప్రయాణి స్తున్నాయి. ఈనాడు కలంకారీ కొత్త అందాల తో, కొత్త టెక్నాలజీతో అలరారుతూ తన అస్తిత్వాన్ని నిలబెట్టు కుంటుంది.

**ఈనెల రెండు, మూడు అట్టమీది బొమ్మలు శ్రీకాళహస్తి కలంకారి హస్తకళ.**



**మమతా రెడ్డి**

# స్వాతంత్ర్య యాత్ర

– దర్శి చెంచయ్య

మోక్షం కొరకు ఎన్నో యాత్రలు చేస్తారు. జీవితంకూడా ఒక యాత్రే! దైవభక్తి, దేశభక్తి మానవసేవలే కదా! ప్రజలు ప్రశాంతంగా జీవించాలనే కదా వీటి ఆదర్శం. "సర్వేజనా సుఖినో భవంతు" మానవులు వాస్తవమైన మానవుల్లాగా అనగా సర్వశక్తులను అభివృద్ధికి తెచ్చుకొనుచూ జీవించుటకే కదా ఈ సాధనాలు; ఇతరుల సేవకొరకు, దాస్యం కొరకు కాదు మానవులు జీవించేది.

స్వార్థం ఒక దశలో మానవునికి అవసరం; జీవితమంతా కూడ కొంతవరకు అవసరమే అయితే, మానవునిలోని మానవత్వం చక్కగా వికసించాలంటే నానాటికి పదార్థం పెరుగుతూ వుండాలి. తన కష్టసుఖాలు సోదర మానవుల కష్టసుఖాల్లో లీనంకావాలి. స్వార్థపరుడే దోపిడిగాడు గాను, రాక్షసుడు గాను, చివరకు భస్మాసురుడు గాను పరిణామం పొందుతాడు.

ఆదిలో మానవుడు మోక్షం కొరకు ఎన్ని ప్రయాసలు పడ్డాడు! తిరుపతిలో ఏడుకొండలు ఎక్కాడు. అడవుల్లో, కొండల్లో, భీకరమృగాలచే, దొంగలు, దోపిడిగాంద్రవల్ల ఎందరో చచ్చిపోయారు. చివరకు మానవుడు కష్టాలను జయించి, తాను ఆరాధించే దేవతను దర్శించాడు. సర్వజనులు తనవలెనే మోక్షం పొందాలనే ఆదర్శం కొరకు సోపానాలు కట్టాడు, సత్రాలు నిర్మించాడు, కోనేరులు త్రవ్వించాడు, గుళ్ళు గోపురాలు కట్టాడు. అందరిని మోక్షం పొందమన్నాడు. అంతవరకు తన ఆత్మకు శాంతి, సుఖము, మోక్షము కలుగవనే ధర్మాన్ని గుర్తించాడు.

కాలానుగుణ్యంగా మానవుని అభిప్రాయాలు మారుతాయి. దైవభక్తే మానవసేవ అవుతుంది. అదే దేశభక్తిగా పరిణమించుతుంది. ప్రస్తుత కాలంలో దేశసేవే మోక్ష సాధనము. 1900 సంవత్సరం నుండి స్వాతంత్ర్యం కొరకు, విముక్తి కొరకు, దేశం సుభిక్షంగా వుండుట కొరకే, నలభైకోట్ల భారతీయులూ సుఖంగా జీవించుట కొరకే, మన తాతలూ, తండ్రులూ ఎంతో ప్రయాసపడ్డారు. స్వాతంత్ర్య దేవత ఎక్కడో వున్నది. ఆమెను దర్శనం చేసుకోవాలి. వరాలు సంపాదించు కోవాలి. మోక్షం సాధించాలి. అందుకు ఎన్నో కష్టాలు పడాలి. నలభై కోట్ల భారతీయులు సుఖసంపదలతో జీవించాలి! అదే దేశభక్తిలోని సారం.

1900 సంవత్సరంలో యువకులు స్వతంత్ర యాత్రకు బయలు దేరారు. పెద్దలు అడ్డుపడ్డారు. అయితేనేమి? కొందరు యువకులు సాహసించే ప్రయాణం సాగించారు. కొండల్లోను, అడవుల్లోను వుండే భయంకర మృగాలకన్న క్రూరమృగాల కన్న క్రూర మానవులున్నారు. తెల్ల రాక్షసులు వారిని కొట్టి జైళ్ళలో వేశారు. చివరకు చంపారు.

అయితేనేమి? పెద్దల హితబోధను చెవిని పెట్టలేదు. ఉద్యోగము, దాస్యము, ద్రవ్యము మోక్షసాధనాలు కావని యువకులకు తెలుసు. తెల్ల రాక్షసులతో పోరాడి ఎందరో నశించారు. అయితేనేం? ఏ కొద్దిమంది యువకయోధులో మొదటి కొండ ఎక్కారు. అలసిపోయారు. స్వాతంత్ర్య దేవత ఆలయమైనా కనుపించలేదు. "టెర్రరిస్టు"లని తిట్లు తిన్నారు.

వారి అగచాట్లు చూస్తూ కొందరు జీవచ్ఛవాల్లాగ వుండలేక పోయారు. తమ తండ్రులు, తాతలు, ముత్తాతలు ఎన్నో యుద్ధాలు చేసిన వారే! అట్టి సంతతివారు అయినందుననే ఇట్టి పౌరుషం కలిగింది.

టెర్రరిస్టుల సహాయానికి, స్వాతంత్ర్య దేవత దర్శనానికి వెళ్ళారు. ఎందరో నశించిపోయారు. కాని తమ యాత్రను వదల్లేదు. మరొక కొండనెక్కారు. స్వాతంత్ర్య దేవత దర్శనం

దర్శి చెంచయ్య (1951)

మాత్రం లభించనే లేదు కాని, ఆ గదరు వీరులలో చాలామంది ఆహుతి అయ్యారు.

"భయపడవద్దు; నిరాశ చెందవద్దు; ఇదిగో వస్తున్నాము లక్షలకోట్ల మందిమి! సంపూర్ణ స్వాతంత్ర్య దేవత దర్శనం అయ్యేవరకు మా సంకల్పము విడువము. రాక్షసులను, దోపిడిగాండ్రను నాశనం చేస్తాము. ధనము, సౌఖ్యం, విజ్ఞానం అందరికీ కలిగేలా చేస్తాము" అని గర్జిస్తూ ముందుకు నెట్టుకుంటూ గుంపులు గుంపులుగా, తండోపతండాలుగా వచ్చారు జాతీయ యోధులు, గదరు వీరులను రెండో కొండ శిఖరంమీద కలుసుకొన్నారు.

మూడవకొండ ఎక్కడం ప్రారంభించారు. ఎంత దూరం! ఎంత ఎత్తు! అయితేనేం? రాక్షసిమూకను ధ్వంసంచేస్తూ ముందుకు సాగిపోయారు. కొంతమంది పారిపోయారు. కొందరు దాసులయ్యారు. జాతీయ యోధులకు తోడ్పడుతామని ప్రమాణం చేస్తున్నారు.

అదిగో నాల్గవకొండ! ఆ కొండమీద స్వాతంత్ర్య దేవత దేవాలయం వున్నది చూడండి. అయితే ఆ కొండపై కెక్కడం సాధ్యం కాదు. నిటారుగా వున్నది. చాలా ఎత్తు, జారుతుంది అని ప్రజాద్రోహులు, దోపిడిగాండ్రు భయపెట్టారు. జాతీయయోధులు ముసలివారయ్యారు. ముప్పయి సంవత్సరాల పోరాటంవల్ల నీరసించిపొయ్యారు. ఇక కొండ ఎక్కలేరు. మనోబలంకూడ క్షీణించిపోతున్నది. చివరకు శత్రువులనే మిత్రులుగ భావించి మోసగింపబడుతున్నారు. మూడవకొండ శిఖరము మీదనుండే గుడివైపు తిరిగి సాష్టాంగ నమస్కారం చేశారు.

"ఓ దేవతా! మేము నీవద్దకు రాజాలము. నీవే మా వద్దకు వచ్చి నీ భక్తులమైన మాకు దర్శన మివ్వాలి" అని ప్రార్థించుతున్నారు. వస్తుందని భక్తులు కలలు గంటున్నారు.

అయితే, ఈ యోధుల బిడ్డలు, మనుమలు మోస పోలేదు. నాల్గవ కొండ ఎక్కవలసిందేనని సంకల్పించారు. ఎక్కడం ప్రారంభించారు, జారిపడిపోతున్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ముందుకు దూకుతున్నారు.

కొండలు, లోయలు, అడవులు, భీకర మృగాలు యువకయోధుల ధైర్య సాహసాలకు తాళలేక భయపడిపోతున్నాయి. ఏమి సంకల్పదీక్ష! ఏమి సాహసం? ఏమి త్యాగం? ఎంతమంది నశించినా ముందుకాలు ముందే ఉంటున్నది. అదిగో! గుడిలో జ్యోతి వెలుగుతున్నది. అరుణ కాంతులు విరజిమ్ముతున్నది. ఆ దీపం ఉన్నది వీరాధి వీరుల దేశభక్తుల రక్తం!

అబ్బ! లోయ ఎంతలోతు! శిఖరం ఎంత ఎత్తు! అయ్యో! నేను దూకలేను. అయ్యో! నేను ఎక్కలేను అన్నాను కాళ్ళ నొప్పులతో. "తాతగారూ! ఇంతదూరం వచ్చారు. భయపడవద్దు. ఆ బరువు మోయలేవు! ఆయుధాలు మాచేతికి యివ్వు. మా చేతులు పట్టుకో. మా భుజాలమీద కూర్చో. దేవతాదర్శనం చేయిస్తాము. రా! తాతా! రా! అన్నారు యువకయోధులు.

"36 సంవత్సరాల సాధన, తపస్సు జ్ఞాపకముంచుకో! ధైర్యం చెయ్యి! ఒక్క దూకు దూకు!" అన్నారు. మనుమలు, మనుమరాండ్రు. "యువకుల్లారా! యోధుల్లారా! మీరు ముందుకు సాగిపోండి! మీ వేగాన్ని కుంటుపరుస్తున్నాను. నా కొరకు కాచుకోవద్దు. నేను విశ్రాంతి తీసుకోవాలి. వెళ్ళండి నాయన్లారా వెళ్ళండి!" అని వేడుకున్నాను.

"యువకుల్లారా దేవతను ఏమేమి వరాలడగుతారు? సంపూర్ణ స్వరాజ్యం మాత్రమే చాలదు. కేవలం ప్రజా ప్రభుత్వం కూడా చాలదు. అందరికి అన్నం, ఇండ్లు, బట్టలు, మందులు, చదువు, సంస్కృతి కావాలని అడగండి.

మన నలభై కోట్ల భారతీయులకే కాదు! సర్వమానవ జాతికి కావాలని కోరండి... చాలదు... చాలదు! అందరికి రేడియోలు, కార్లు, ఏరోప్లేనులు కావాలని అడగండి.

సంశయించవద్దు సుమా! దోపిడి తనం పోతే, పదవీ వ్యామోహం పోతే అందరికీ అవి లభిస్తాయి! యుద్ధాలు నశిస్తాయి! అందరం బాగుపడతాం! సమృద్ధిగా వుంటాయి అన్నీ" అని దీవించాను.

"తాతయ్యగారూ! అలాగే అడుగుతాం. మీరు కోరిన వరాలన్నీ లభించేవరకు మా పట్టుదల వదలం. ముమ్మాటికీ వదలం. అప్పటికి మీరు జీవించి వుంటే విమానంలో తీసుకెళ్ళి దేవతాదర్శనం చేయిస్తాము" అన్నారు.

అలాగే, నాయన్లారా! తప్పక జీవిస్తాను!

(సేకరణ: జె.యస్.ఆర్. చంద్రమౌళి)

# విలుకాడు

మీ పిల్లలు మీ పిల్లలు కారు
జీవితం కొనసాగాలనే కోరికకు కలిగిన ఫలాలే
కూతుళ్ళు కొడుకులు.
వాళ్ళు మీద్వారా లోకంలోకి వస్తారు కానీ మీ నుంచి కాదు
వాళ్ళు మీతో వున్నప్పటికీ వాళ్ళు మీకు చెందినవారు కాదు
వాళ్ళకి మీ ప్రేమను యివ్వవచ్చు కాని మీ భావాలను కాదు
ఎందుకంటే వాళ్ళకి వాళ్ళ స్వంతభావాలు వుంటాయి
వాళ్ళ శరీరాలకు మీరు మూలం కావచ్చు
కాని వాళ్ళ ఆత్మలకు కాదు
ఎందుకంటే వాళ్ళ ఆత్మలు భవిష్యత్తులో నివసిస్తాయి
ఆ భవిష్యత్తును మీరు కలల్లో కూడా చూడలేరు
వాళ్ళలా వుండటానికి మీరు ప్రయత్నించ వచ్చు కాని
వాళ్ళని మీలా తయారు చేయాలని ఆరాట పడవద్దు
ఎందుకంటే జీవితం వెనక్కు మళ్ళదు, గతంలో నిలబడదు
మీరు ధనుస్సులు, వాటి నుంచి పిల్లలనే
బాణాలు వెలువడుతాయి
విలుకాడు అనంతమైన మార్గం పైన గల
ముద్రను వీక్షిస్తాడు
ఆయనే తన శక్తితో విల్లు వంచి తన బాణాలు వేగంగా
దూరంగా పోయేటట్లు చేస్తాడు

**(ఖలీల్ జీబ్రాన్)**




**మిసిమి**
మాసపత్రిక
చందాదారులుగా చేర్పించండి

**బహుమతి**
పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు ***మిసిమి*** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹240** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

**(మీరు అయిదు సంవత్సరాల చందా కట్టి *మిసిమి* 12 నెలల (2010 జూన్ - 2011 మే) అందమైన బైండు ఒకటి, 6 నెలల (2011 జూలై - 2011 డిసెంబరు) బైండు ఒకటి ఉచితంగా పొందండి)**



ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 3. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 4. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 5. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 6. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 6. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 7. | సిద్ధార్థ " " | 50.00 |

మీ చందా ***మిసిమి*** పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

**మిసిమి**
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi

# ఓదార్పు

**నా** భార్య కనకమ్మ మరణం నన్ను ఎంతగానో క్రుంగదీసింది. నేను చాలా రోజులు మంచంలోనే ఉండిపోయాను, నెల్లూరులో. ఈ దుఃఖం నుంచి బయటపడటం నా శక్తికి మించిన పనిగా తోచింది. కనక ఎంతో సౌందర్యవతి! ఎంత సమర్థురాలు! నన్ను ఎంతగా ప్రేమించింది. పిల్లల్ని ఎంత బాధ్యతగా పెంచింది. తన మీద ఆధారపడినవారిని ఎంతగా ఆదుకుంది! బంధువర్గంలోను, స్నేహితులకు ఆమె తలలో నాలుకగా వుండేది. ఇంటి వ్యవహారంలో ఎంతో సమయపాలన పాటించేది. ఎంత చక్కగా, తెలివిగా మాట్లాడేది. ఆమె సలహా సంప్రదింపులు నాకెంతగానో ఉపయోగపడేవి. ఈ జ్ఞాపకాలతో ఆమె మరణం నన్ను పీల్చి పిప్పి చేసింది. ఈ సత్యాన్ని జీర్ణించుకోలేక నాకు మతిస్థిమితం తప్పే దుస్థితి వచ్చింది. ఇంటి పట్టునే ఉంటే ఓదార్పు లేదని దక్కన్‌లోని గుళ్ళుగోపురాలు సందర్శించడానికి 1 అక్టోబరు 1831 తేదిన బయలుదేరాను. ముందుగా శ్రీకాళహస్తి (కాళేస్త్రి) చేరాను. అక్కడ పవిత్ర శివమూర్తిని దర్శించాను. తరువాత త్రిపుట్టి (తిరుపతి) వెళ్ళాను. స్వామి శ్రీవెంకటేశ్వరుని దర్శించాను. అప్పటికే నా ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంది. అక్కడ కలరా వ్యాపించి ఉంది. అందుకని ఇష్టం లేకపోయినా నెల్లూరు తిరిగి వచ్చేశాను. అప్పుడు ఈ ఉత్తరం చూశాను. (11 అక్టోబరు 1831).

ప్రియమైన సుబ్బరావ్,

నిన్ను ఒకే నిట్టూర్పుతో ఓదార్చుతూ ఆ వెంటనే అభినందించటం కొంచె ఇబ్బందికరంగానే ఉంది.

ఇది ప్రపంచం సుబ్బరావ్. ఇందులోకి మన ప్రమేయం లేకుండానే వచ్చిపడినాము. ఈ విచారణలో అన్ని మతధర్మాలు ఏకగ్రీవంగానే ఉన్నాయి.

ఇక్కడ మనం ఏవి సంతోషసందర్భాలని మురిసిపోతామో అవి నిజానికి అనర్థాలే. మన ధర్మజ్ఞానలేమి మనల్ని తప్పుమార్గం పట్టిస్తుంది. ఒక్కవిషయం ఆలోచించు. మనం పుట్టాము కాని, గిట్టకుండా ఉండిపోతామా? కాని మనకు మరణమంటే ఎందుకు భయం? మన బంధువుల, స్నేహితుల మరణానికి దుఃఖిస్తుంటాము వాళ్ళు చనిపోతారని తెలుసుకదా! నాశనమయ్యే దాని కోసం విచారించటం వలన ప్రయోజనం ఏముంది? అవన్ని నశించేవే కదా!

నీవు కనకమ్మ మరణాన్ని త్వరలోనే మర్చిపోతావని ఆశిస్తాను. ఆమె తన పేరును సార్థకం చేసుకుంది. ఆమె సౌందర్యంలోను, స్వభావంలోను పూర్తిగా సార్థకనామధేయురాలు. ఈ మిగతా జీవితాన్ని నెమ్మది మనసుతో, దేవుడు ప్రసాదించిన నీ క్రొత్త జీవితభాగస్వామితో గడుపుతావని ఆశిస్తాను. వారి కుటుంబం గురించి నేను వినేయున్నాను. ఇప్పటి నీ భార్య ఎందులోను ముందువారికి తీసిపోదని విన్నాను. నీకు పుత్రోదయ సందర్భంగా చిరంజీవికి దీర్ఘాయుష్షును ప్రసాదించాలని దీవిస్తూ నిన్ను అభినందిస్తున్నాను.

నీవు చోకపా చిట్టికి వ్రాసిన ఉత్తరంలో 'నేను అది పోగొట్టుకున్నప్పుడు, దీనివలన ఏమి ఉపయోగం?' అన్నావని తెలిసింది. ఇది ఎంత అజ్ఞానం. ఆ విశ్వవిధాత తీర్పులో పొరపాటు ఉంటుందా? మన నుంచి ఏమి తీసుకోవాలో, మనకు ఏమి ఇవ్వాలో ఆయనకంటే బాగా ఎవరికి తెలుసు?

---

ఆంగ్లం నుంచి తెలుగు : వి.అశ్వినీకుమార్




**ఏనుగుల వీరాస్వామి కాశీయాత్ర : 1830లో మే నెల 18వ తేదీన మద్రాసులో బయలుదేరి, 1830 సం॥ అక్టోబరు 27వ తేదిన బుధవారం కాశీ చేరారు. 1831 సెప్టెంబరు నెల 3వ తేదీన కాశీయాత్ర పూర్తిచేసి ఇంటికి చేరారు.**

జ్ఞానులు ఎప్పుడూ సంతృప్తితోనే ఉంటారు, వారికి ఉన్నదానితోనే. వారు చేయిజారిన వాటి గురించి ఆలోచించరు. నీ విద్యను, విజ్ఞానాన్ని ప్రోదిచేసుకునే సమయం ఇది. ఈ కష్టకాలంలో అవి తప్పక నీకు సహాయపడతాయి.

నీవు మనశ్శాంతికోసం కర్ణాటక వెళతానని వ్రాసావట. అలా చేయకు. నీకు ఆ విధంగా మనశ్శాంతి లభిస్తుందా? ముందు బుద్ధిని స్థిమిత పరుచుకో, నీవున్నచోటునే. ఇప్పుడు నీకు ఒక పసికందు ఉన్నాడు. చిన్నారి భార్య ఉంది. వారి ఆలనా పాలనా చూడు. వారికి న్యాయం చెయ్యి. నీవున్నచోటునే ఉండు. పవిత్రగ్రంథాల సారాన్ని ఆస్వాదించి సాంత్వన పొందటానికి ప్రయత్నించు. తప్పకుండా నీకు మనశ్శాంతి లభిస్తుంది.

నీవు పూర్తి ఆరోగ్యంతో ఆనందంగా ఉండగలవని ఆశిస్తూ...

అక్టోబరు 1831 ఏనుగుల వీరాస్వామి
మద్రాసు.

(మద్రాసు సుప్రీంకోర్టు న్యాయమూర్తికి తెలుగు తర్జుమాదారు–ఏనుగుల వీరాస్వామి. వీరి కాశీయాత్ర బహుళప్రచారం పొందిన గ్రంథం.)

## 'వెన్నెలకంటి సూబ్‌రావ్' (1784-1839) తన స్వీయ కథను ఆంగ్లంలో వ్రాశారు.

వుంగూర్ గ్రామంలో (ఇది ఒంగోలుకు దక్షిణంగా 20 మైళ్లదూరంలో ఉంది) 28 నవంబరు 1784లో వెన్నెలకంటి జోగన్న, వెంకమ్మలకు జన్మించిన సూబ్‌రావ్ మద్రాసు సదర్ కోర్టులో అనువాదకునిగా, దుబాసీగా 1815 నుంచి 1829 వరకు సేవలందించారు. వీరి కుమారుడు వెంకట గోపాలరావ్ (జిల్లామున్సిఫ్ – త్రివెల్లోరు) ఇంగ్లీషులో వున్న ఈ స్వీయకథను మద్రాసులో 1873లో సి. ఫాస్టర్ అండ్ కో ద్వారా ప్రచురించారు. ఒకే ఒక ప్రతి V.S. రామచంద్రరావు (వీరు నెల్లూరులో ప్రిన్సిపాల్‌గా చేసి రిటైర్ అయినారు) వద్ద నుంచి మాకు సన్మిత్రులు, సాహితీ బాంధవుడు అయిన జుజ్జువరపు చంద్రమౌళి గారి ద్వారా అందినది. ఇది అపురూపమైన ప్రతిగా ఎంచి ఇప్పుడు ముద్రించే ప్రయత్నం చేస్తున్నాము. ఇందులో ఎన్నో చరిత్ర సత్యాలు దాగివున్నాయి. వాటిని ***మిసిమి*** పాఠకులకు వీలు వెంబడి అందించే ప్రయత్నం చేస్తాము. - ఎ.కె.



# తెలుగులో గ్రంథమాలలు

- వెలగా వెంకటప్పయ్య

గ్రంథమాలలో గ్రంథాలు ప్రచురించడం ఒక సత్సాంప్రదాయం. తెలుగు గ్రంథాలు వరసగా ప్రచురించిన సుమారు యాభై గ్రంథమాలలలో ఎన్నో విలువైన గ్రంథాలు వెలుగు చూశాయి. భాషా సాహిత్య ప్రగతికి దోహదం చేశాయి.

తెలుగు ప్రజానీకంలో గ్రంథ పఠనాసక్తి పెంపొందటానికి సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, రాజకీయ పరిజ్ఞానం వ్యాప్తి చేయటానికి ఆంధ్రదేశంలో ఈ శతాబ్దం ప్రారంభం నుండి అనేక ప్రదేశాల్లో అనేక గ్రంథమాలలు వెలసినవి. వీనిలో కొన్ని సంస్థలచే స్థాపింపబడినవి. కొన్ని గ్రంథమాలలు ప్రత్యేకమైన ఉద్దేశంతో వెలసినవి. కొందరు కేవలం నవలలను, కొందరు కేవలం నాటకాలను, కొందరు చారిత్రక గ్రంథాలను, కొందరు విజ్ఞానశాస్త్ర గ్రంథాలను, కొందరు కేవలం శృంగార గ్రంథాలను, మరికొందరు కేవలం బాలబాలికలకు ఉపయోగపడే గ్రంథాలను, కొందరు శైవమత గ్రంథాలను, మరికొందరు వైష్ణవమత గ్రంథాలను, కొందరన్ని తీరుల గ్రంథాలను తమ తమ గ్రంథమాలల ద్వారా ప్రకటించినారు.

కొందరు తాము స్వయంగా రాసిన గ్రంథాలనో లేదా తాము సంపాదించిన గ్రంథాలనో ప్రకటించగా కొందరు ఇతరుల గ్రంథాలను కూడ ప్రకటించినారు. ఈ గ్రంథమాలల పేర్లు కూడా ఆయా గ్రంథమాలల స్థాపకుల ఉద్దేశాలను తెలియజేస్తున్నవి. సంవత్సరానికి అముక సంఖ్య గ్రంథాలను ప్రకటించి ఆ గ్రంథమాలా సభ్యులకు తక్కువ వెలకు (తదితరులకు ఎక్కువ వెలకు) అందించటం చాలా గ్రంథమాలల ఉద్దేశంగా కనబడుతుంది. సభ్యత్వపు విరాళం కొందరు ముందుగా తీసికొనేవారు. మరికొందరు గ్రంథం అందించిన తరువాత తీసికొనేవారు. ప్రజల్లో విజ్ఞానం లేదా సాహిత్యం ప్రచారం చేయటమే వీరి ముఖ్యోద్దేశం. లాభాలు గడించవలెననే వ్యాపార దృష్టి చాలా తక్కువ. ఈనాడున్నన్ని వ్యాపార దృష్టి గల పుస్తక ప్రచురణ సంస్థలుగాని, సాహిత్య సంస్థలుగాని పూర్వం లేకుండేవి. అందుకే ప్రజాహితం కోరిన ఇటువంటి గ్రంథమాలలు అనేకం ఆ దినాల్లో ఉద్భవించినవి. పుస్తక వ్యాపార సంస్థలు బాగా పెరిగిపోయిన తరువాత వాటి పోటీకి తట్టుకోలేక కొన్ని గ్రంథమాలలు, స్థాపించిన పెద్దలు గతించడంతో కొన్ని గ్రంథమాలలు ఆగిపోయినవి. కొన్ని నామమాత్రావశిష్టాలు కాగా, మరికొన్ని ఈనాటికీ గ్రంథాలు ప్రకటిస్తున్నవి.

గ్రంథమాలలే కాక గ్రంథమండలుల పేరుతో కూడా అనేక సంస్థలు వెలసి చాలా గ్రంథాలు ప్రకటించడం జరిగింది. ఆయా సాహిత్య, వైజ్ఞానిక, ఇతిహాస, పరిశోధక సంస్థల పక్షాన కూడా అమూల్య గ్రంథాలనేకం ప్రకటించడం జరిగింది. ఐతే గ్రంథమాలల పేరుతో ప్రకటితమైన పుస్తకాల గూర్చి అందులోను నాకు లభించిన సమాచారం ఆధారంగా మాత్రమే చెప్పటం ప్రస్తుతోద్దేశం. ఈ గ్రంథమాలలో కొన్నింటిని స్థాపించిన వారి పేర్లు తెలియవు. కొన్నింటి స్థాపన కాలం తెలియదు. అందుకే ఈ గ్రంథమాలల చరిత్ర కాలక్రమం అనుసరించి రాయలేకపోతున్నాము. అకారాదిగా వీటి చరిత్ర సంగ్రహంగా నివేదిస్తాను.

**అణా గ్రంథమాల :**

పూర్వం హైదరాబాదు సంస్థానంలో నిజాం ప్రభుత్వం

డాక్టరు వెలగా వెంకటప్పయ్య, ఫోన్ : 08644 - 228585

వారు ప్రవేశపెట్టదలచిన రాజ్యాంగ సంస్కరణల గూర్చి దక్కన్ రేడియోద్వారా చేసిన ప్రకటన వినగానే ఆ సంస్కరణలు సరైనవో కావో ప్రజలకు అవి ఎంతవరకు మేలు చేస్తవో అని ప్రచారం చేయటానికై వెల్దుర్తి మాణిక్యరావు, కె.సి. గుప్త, గుండవరపు హనుమంతరావుల సహకారంతో 1938 లో హైదరాబాదులో అణా గ్రంథ మాలను స్థాపించినారు. ఈ గ్రంథమాలవారు ప్రకటించినవన్నీ చిన్న చిన్న గ్రంథాలే.

ఒక్కొక్క దాని వెల అణా. అందుకే దీనిపేరు అణా గ్రంథమాల. రాజ్యాంగ సంస్కరణలకు సంబంధించిన సాహిత్యంతో పాటు, కథలు, జీవితచరిత్రలు, కవిత్వ సంకలనాలు, రాజకీయ సిద్ధాంత గ్రంథాలు కూడా అణా గ్రంథమాల పక్షాన ప్రకటితమైనవి.

ఈ గ్రంథమాలవారు ప్రకటించిన గ్రంథాలలో *హైదరాబాదు రాజ్యాంగ సంస్కరణలు, ఆంధ్రవీరులు, అణాకథలు, స్వామి దయానంద సరస్వతి, సావర్కర్, జవహర్‌లాల్ నెహ్రూ జీవిత చరిత్రలు, కాంగ్రెసు చరిత్ర, కాళోజీ కథలు, ఎల్లోరా, అజంతా, మణిమేఖల, సోషలిజం, నా కొడుకు, జాగీరు సమస్యలు, మగ్దూం కే. నగ్మే (ఉర్దూ)* అనువంశికము – వాహకులు, *మొగలాయి కథలు, మాలతీ గుచ్ఛము, జాగీర్లు* ముఖ్యమైనవి. వీరు మొత్తం 40 గ్రంథాలు ప్రకటించినారు.

**అభినవాంధ్ర గ్రంథమాల :**

శ్రీపాద కామేశ్వరరావుగారు 1927లో రాజమహేంద్రవరంలో ఈ గ్రంథమాలను స్థాపించి సాహిత్య మీమాంస, నాటక విమర్శ మొదలైన విమర్శనాత్మక గ్రంథాలను ప్రకటించినారు. వారి మరణానంతరం ఈ గ్రంథమాల ఆగిపోయినది.

**అరుణశ్రీ గ్రంథమాల :**

శ్రీ మడిపడగ బలరామాచార్యులుగారీ గ్రంథమాలను 1953లో సికింద్రాబాదులో స్థాపించి సి. నారాయణరెడ్డిగారి *జలపాతం, అజంతా సుందరి,* పోణంగి శ్రీరామ అప్పారావుగారి *విశ్వభారతి,* కె.వి. రామకోటిశాస్త్రి గారి *ఆనంద చేతన,* మురయాగారి *సిల్కుచీర,* స్వీయ రచన *మురళీరవం* మొదలైన గ్రంథాలు ప్రకటించినారు. ఈ గ్రంథమాల ప్రస్తుతం నామ, మాత్రావశిష్టంగా ఉంది.

**అవ్వారి నారాయణ గ్రంథమాల :**

ఈ శతాబ్దమున వెలసిన గ్రంథమాల యిది. అనంతపురం మండలంలోని బుక్కరాయ సముద్రం వాస్తవ్యులైన అవ్వారి నారాయణగారీ గ్రంథమాలను స్థాపించి, రాప్తాటి ఓబిరెడ్డి, రాప్తాటి *నిర్వచన రామాయణము,* గుంటి సుబ్రహ్మణ్యశర్మ *జ్ఞానానంద శతకం,* కుంటిమద్ది శేషశర్మ *ముకుంద విలాసం,* తలమర్ల కళానిధి *గేయ సుమమాల,* కలచవీడు శేషాచార్యుల *మేఘ సందేశం,* గడియారం వెంకట శేషశాస్త్రి *వాల్మీకీయం,* ఇంకను అనంతపురం మండలం తెలుగు రచయితలు మొదలైన గ్రంథాలు ప్రకటించినారు. ఇది సజీవంగా ఉన్న గ్రంథమాల.

**ఆంధ్రకేసరి గ్రంథమాల :**

శ్రీ గుండవరపు హనుమంతరావుగారు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారిపై గల గౌరవానికి చిహ్నంగా ఈ గ్రంథమాలను హైదరాబాదులో 1939లో స్థాపించి *కమ్మతెమ్మెరలు* (కథల సంపుటి), రెండవ ప్రపంచ యుద్ధమా? రెండు భాగాలు, *తెలుగు పల్లె, స్రవంతి, (పద్య సంపుటి),* అనే గ్రంథాలు ప్రకటించినారు. 1940 నుండి 1947 వరకు *ఆంధ్రకేసరి* అనే మాసపత్రిక కూడా ఈ సంస్థ పక్షాన ప్రచురించినారు.

గ్రంథమాలను స్థాపించటానికి పూర్వం *ఆంధ్రకేసరి* అనే లిఖిత మాసపత్రికను 1934 నుండి 1939 వరకు వెలువరించేవారు. ఇప్పుడీ సంస్థ పనిచేయటం లేదు.

**ఆంధ్ర గ్రంథమాల :**


దేశోద్ధారక

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారీ గ్రంథమాలను చెన్నపురిలో 1924లో స్థాపించి *శతక మంజరి* (భక్తి సంపుటము) *పాల్కురికి సోమనాథుని బసవపురాణము, పండితారాధ్య చరిత్రములు.*

రాయసం వేటూరి *శివుని కమలాక్షి,* మడికి సింగన *సకల నీతి సమ్మతము,* పోసెట్టి *లింగకవి నవచోళ చరిత్ర,* వేటూరి ప్రభాకరశాస్త్రి *నీతినిధి, తెలుగు మెరుగులు,* పసుమర్తి కృష్ణమూర్తిశాస్త్రి *త్యాగరాజ స్వామి చరిత్రము, తిక్కన ఉద్యోగ పర్వము,* స్వీయ రచనయైన *ఆంధ్ర*

*వాఙ్మయ చరిత్ర*, తామే సంపాదించిన *ఆంధ్ర వాఙ్మయ సూచిక–ముద్రితాముద్రిత గ్రంథముల పట్టిక, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము* రెండు సంపుటాలు, కిళాంబి రంగాచార్యుల ధమ్మపదము, పొణకా పిచ్చిరెడ్డి *భీష్ముడు*, కుందూరి ఈశ్వరదత్తు *జీర్ణ విజయనగర చరిత్రము*, కోరాడ రామకృష్ణయ్య *ఆంధ్ర భారత కవితా విమర్శనము*, తలిసెట్టి రామారావు *భారతీయ చిత్రకళ* మొదలైన పెక్కు గ్రంథాలు ప్రకటించినారు.

నాగేశ్వరరావు పంతులుగారి తరువాత శివలెంక శంభుప్రసాద్‌గారీ గ్రంథమాలను కొంత కాలం నడిపించి బాల సాహిత్యానికి సంబంధించిన *రాజూ–పేద, టాంసాయర్, హకల్ బెరీఫిన్, విచిత్ర వ్యక్తి, కాంచన ద్వీపము, కౌంట్ ఆఫ్ మౌంట్ క్రిస్టో, డాన్ క్విక్సోట్, రెండు మహానగరాలు వంటి* గ్రంథాలు ప్రకటించి నారు. ప్రస్తుత మీ గ్రంథమాల ఆగిపోయినది.

**ఆంధ్ర చంద్రికా గ్రంథమాల :**


మాడపాటి

తెలంగాణా వైతాళికులు ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంత రావు పంతులుగారి షష్టిపూర్తి ఉత్సవాలు 1945లో జరిగినవి. అప్పుడు తెలంగాణా ప్రజానీకం మాడపాటి వారికి 6400 రూపాయలు భక్ష్య పాయసంగా సమర్పించినది.

మాడపాటివారు ఆ ధనంతో ఆంధ్ర చంద్రికా గ్రంథమాలను ప్రారంభించి ఖండవల్లి బాలేందు శేఖరం గారి *విస్మృత సామ్రాజ్యములు*, తామే రచించిన తెలంగాణా *ఆంధ్రోద్యమము ప్రథమ భాగం*, ఖండవల్లి లక్ష్మీరంజనం గారి *ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము*, ఆదిరాజు వీరభద్రరావుగారి *ప్రాచీనాంధ్ర నగరములు.*

తామే రచించిన *తెలంగాణా ఆంధ్రోద్యమము రెండవ భాగం*, బి.వి. రమణారావుగారి *వైజ్ఞానికుల జీవితాలు*, రాంపల్లి విశ్వేశ్వరరావుగారి *పౌర ధర్మములు* మొదలైన గ్రంథములు ప్రకటించినారు. ఈ గ్రంథమాలకు వచ్చిన ధనాన్ని బాంకులో వేసి అది రూ. 20,000 వరకు పెరిగిన తరువాత మాడపాటి వారు రాజా బహద్దరు వెంకట రామరెడ్డి మహిళా కళాశాల స్థాపనకు విరాళంగా ఇచ్చి గ్రంథమాలను ఆపి వేసినారు.

**ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల :**

మనదేశంలో వెలసిన ప్రాచీన గ్రంథమాలలో ఇది యొకటి. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో కొవ్వూరి చంద్రారెడ్డిగారీ సంస్థను 1-4-1911 నాడు స్థాపించిరి. చాగంటి శేషయ్య బాలాంత్రపు రామయ్య, తల్లాప్రగడ సూర్యనారాయణరావు, అయ్యగారి సూర్యనారాయణమూర్తి ప్రభృతులీ గ్రంథమాల స్థాపనమున సహకరించినవారు. దీనికి మహారాజుల పోషణ కూడ లభించినది. రెడ్డిగారి మరణానంతరం దీని భారాన్ని వెంకట పార్వతీశ్వర కవులు వహించినారు. దీని కార్యస్థానం క్రమంగా నిడుదవోలు, రాజమహేంద్రవరం, కాకినాడ, పిఠాపురంలకు మారినది. 1936లో దీని రజతోత్సవం జరిగినది. 1938లో Joint Stock Companyగా మారినది.

1943లో వెంకట పార్వతీశ్వర కవుల షష్టిపూర్తి ఉత్సవాలు జరిపినది. వారి *కావ్య కుసుమావళి* రెండు సంపుటాలు *ఆధునిక కావ్య సంకలన మహోదయం* అప్పుడు వెలువడినవే. ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల సామాన్య పాఠకులకు కూడా ఆసక్తి కలిగించే సాంఘిక నవలలు, చారిత్రక నవలలు, అపరాధ పరిశోధక నవలలు ఈ గ్రంథమాల పక్షాన వెలువడినవి.

బంకించంద్ర చటర్జీ రచించిన *దుర్గేశ నందిని, మృణాళిని, విషవృక్షం, ఇందిర, యుగళాంగుళీయం, రజని,* కృష్ణకాంతుని *మరణ శాసనం, రాధారాణి, రాజహంస* మొదలైన వానితోపాటు గోరా, *మాయావిని, మనోరమ, భూతగృహం, రహస్య శోధనం, రహస్య విప్లవం, జీవన్మృతి రహస్యం* వంటి నవలలు ఆంధ్రీకరింపబడినవి.

వెంకట పార్వతీశ్వర కవుల *వసుమతీ వసంతం, ప్రమదావనం, మాతృ మందిరం, బృందావనం, ఏకాంతసేవ, కావ్య కుసుమావళి, చిత్రకథా సుధాలహరి, హారావళి, బాల గీతావళి, నీతి కథావళి, గద్య కథామంజరి పద్య కథామంజరి, వసంత వాచకములు* ప్రచురితమైనవి.

ఇప్పుడీ గ్రంథమాల చాగంటి శేషయ్యగారి కుటుంబీకుల యాజమాన్యాన నామమాత్రావశేషంగా ఉన్నది.

**ఆర్య విజ్ఞాన గ్రంథమాల :**

బెజవాడలో కోట వెంకటాచలంగారు ఆర్య విజ్ఞాన

గ్రంథమాలను నెలకొల్పి తాము రచించిన కలిశక విజ్ఞానము (మూడు భాగాలు), ఆంధ్రుల పుట్టు పూర్వోత్తరాలు, అశోకుని కాలము, భారతీయ శకములు మొదలైన అమూల్య పరిశోధనాత్మక గ్రంథాలు ప్రకటించినారు. ఈ గ్రంథాలను తెలుగు ప్రజలు ఎంతగానో ఆదరించారు.

**కవితిలక గ్రంథమాల :**

కవి తిలక విద్వాన్ కంచనపల్లి కనకమ్మగారీ గ్రంథమాలను 1925లో బెజవాడలో స్థాపించి తాము రచించిన *శ్రీజీవ యాత్ర, అమృతసారము, ఆనంద సారము, శ్రీరామాయణ కథా సంగ్రహం, గౌతమ బుద్ధ చరిత్రము, పద్య కుసుమాంజలి, పద్యరత్న, అభిజ్ఞాన శాకుంతలము, రాధ, చక్కని కథలు, తోమాలియ, బోధ కథా సుధ, రంగ శతకము* మొదలైన వానితో పాటు దంటు సుబ్బావధాని గారి *ఆంధ్ర భామినీ విలాసము, దాస గీత, అంబికా చరణ సరోజపూజ, చిత్ర మాధవ నాటకము, ఆంధ్ర వైద్య విజ్ఞానము, అమృతానందనాథ స్వామి చరిత్రము,* దంటు శ్రీనివాసశర్మగారి *నాగభూషణ శతకము,* తులసీదాస చరిత్ర వంటి చాలా గ్రంథాలు ప్రకటించినారు. ఇప్పుడీ గ్రంథమాల ఆగిపోయినది.

**కామ గ్రంథమాల :**

ఎన్.చిన్నయ్య, సెట్టి లక్ష్మీనరసింహంగారలీ గ్రంథమాలను స్థాపించి అనేక *కామశాస్త్ర* గ్రంథాలు ప్రచురించినారు. ఈ గ్రంథాలలో చాలా వరకు అశ్లీలాలు కావటం చేత ఆనాటి బ్రిటన్ ప్రభుత్వం వీటి ప్రచురణకు అనుమతించలేదు.

కనుక పుదుచ్చేరి మొదలైన ఫ్రెంచి ప్రభుత్వ స్థావరాల్లో ఇవి అచ్చయ్యేవి. వీటిపై పిల్లలు చదువకూడదనే ఉద్దేశంతో పెద్దలకు మాత్రమే అనే సూచన కూడ అచ్చయ్యేది.

ఈ గ్రంథమాల పక్షాన ఎర్రన *రతి రహస్యము,* కొక్కోకుని *కొక్కోకము,* గోపీనాథ వెంకటకవి *బ్రహ్మానంద శతకం,* మాడభూషి వెంకటాచార్యుల రామావధూటి *తారావళి,* ప్రాచీన కవి *గణపతీయము,* తెనాలి రామకృష్ణుని *శప్ప విజయము,* తోట విజయ రాఘవ నాయకుని *శృంగార శతకము,* కూచిమంచి జగ్గ కవిచంద్ర *రేఖా విలాసము,* వివిధ కవుల *శృంగార పంచకము* కాళిదాసు *లంబోదర ప్రహసనము* మొదలైన గ్రంథాలు ప్రకటించినారు.

**గోదా గ్రంథమాల :**

కృష్ణా జిల్లా ముసునూరులో శ్రీమాన్ కె.టి.యల్ నరసింహాచార్యులుగారు 1957 లో ఈ గ్రంథమాలను స్థాపించి బాల సాహితి, భక్తి సాహితి, యువ సాహితి, శాఖల్లో దాదాపు 50 గ్రంథాలు ప్రకటించినారు. గోదా గ్రంథమాల వారి ముఖ్యమైన ప్రచురణలు, బాలసాహితిలో విరించిగారి *లోకమాన్యుడు,* దళిక సూర్యప్రకాశరావుగారి *జమునాలాలస దంపతులు,* మధురాంతకం దొరస్వామిగారి *దేశోద్ధారకుడు,* నరసింహాచార్యుల వారి *లోకమాత, మహర్షి వివేకానందుడు, అమరజ్యోతి* మొదలైనవి భక్తిసాహితిలో నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల వారి *పరకాల విలాసము, బిడాల మోక్షము* తి.న. చ.సం జగన్నాధ తిరువెంకటా చార్యుల వారి *రామానుజ శతకము,* నరసింహాచార్యులుగారి *వకుళ భూషణ నాయకి, ద్వాదశ సూరి చరిత్ర* మొదలైనవి. యువసాహితిలో నవకథా విపంచి, మధురాంతకం రాజారాం *కథలు,* సంజీవదేవ్ గారి *సమీక్షా రేఖలు,* కాకాని నరసింహారావుగారి *ఆంధ్రభోజుడు* మొదలైనవి. ఈ గ్రంథమాల సజీవంగా ఉన్నది.

**దేశోద్ధారక గ్రంథమాల :**

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి స్మృతి చిహ్నంగా వట్టికోట ఆళ్వారులస్వామిగారు 1938లో సికింద్రాబాదులో దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి కథలు, *నాటికలు, కావ్యాలు, వ్యాసాలు, జీవిత చరిత్రలు, వైజ్ఞానిక గ్రంథాలు* ప్రకటించినారు.

సురవరం ప్రతాపరెడ్డిగారి *హైందవ ధర్మవీరులు, ప్రాథమిక స్వత్వములు, గ్రంథాలయోద్యమము,* ఖండవల్లి బాలేందు శేఖరంగారి *కమాల్ పాషా జీవితం రెండు భాగాలు,* టాల్‌స్టాయ్ *ప్రజలు–ప్రభుత్వం* (అనువాదం), పులిగడ్డ వెంకట సుబ్బారావుగారి *ఔంధు సంస్థానం, బ్రెయిల్స్ ఫర్థ్ నా భారతదేశ యాత్ర* (అనువాదం), విష్ణుచక్రంగారి *గాంధీ మహాత్ముడు రెండు భాగాలు.*

భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి *కాంగ్రెసు సంస్థానాలు, సంస్థాన ప్రజల సమస్యలు,* వట్టికోట ఆళ్వారుస్వామిగారి *జైలులోపల (కథానికలు),* కాళోజీ నారాయణరావుగారి *నా గొడవ (గేయాలు),* అఖిలాంధ్ర కవుల *కవితా సంకలనం ఉదయ ఘంటలు,* వట్టికోట ఆళ్వారుస్వామిగారి *ప్రజల మనిషి (నవల),* నేదునూరి

గంగాధరంగారు సంపాదించిన *సెలయేరు,* వివిధ రచయితల *ఏకాంక నాటికలు, జీవనరంగం* రెండు భాగాలు.

దాశరథిగారి పునర్నవం, 34 కథా రచయితల కథలు పరిసరాల రెండు భాగాలు, 23 రచయితల వ్యాసాలు తెలంగాణా రెండు భాగాలు, పొట్లపల్లి రామారావుగారి ఆత్మనివేదన, ఆదిరాజు వీరభద్రరావుగారి *తెలంగాణం,* వానమామలై వరదాచార్యులు గారి *ఆహ్వానము,* హీరాలాల్ గారి *కథలు బ్రతుకు బాటలు,* కె.యల్. నరసింహారావుగారి *నాటికలు కళా సౌధం,* వివిధ రచయితల వ్యాసాలు *ప్రభాస* ముఖ్యమైన ప్రచురణలు.

1961లో వట్టికోట పరమపదించటంతో ఈ గ్రంథమాల ఆగిపోయింది.

**భారత గ్రంథమాల :**

గుంటూరులో శ్రీచతుర్వేదుల పార్థసారధిగారీ గ్రంథమాలను 1968లో స్థాపించినారు. ఆంధ్ర మహాభారతం చిన్న చిన్న భాగాలుగా అందరికి అందుబాటులో ఉండే విధంగా ప్రచురించటం వీరి ఆశయం. భారతంలో ఇప్పటికే చాలా భాగాలు ప్రచురించినారు.

ఇంకా కరపాత్ర స్వామిగారి *రాసలీలా రహస్యము* (సి. హెచ్. వీరభద్రరావుగారి అనువాదం), *కవి పరిచయములు, గీతామృత సారం, జ్యోతిష శాకుంతలము, జాతీయకవులు, పోతనామాత్యుడు, ప్రవరుడూ అన్నపూర్ణ, ఆంగ్ల కవులు, కవోష్ణ బాప్పురా కమనీయ హాసం* మొదలైనవి వీరి ప్రచురణలు. ఇది సజీవంగా ఉన్న సంస్థ.

**వాఙ్మయ వినోదినీ గ్రంథమాల :**

దోమా వెంకటస్వామి గుప్తగారీ గ్రంథమాలను 1931లో చెన్నపురిలో స్థాపించి బ్రహ్మేశ్వర పురాణము, పరకాల విలాసము, ప్రేమాభి రామము, బ్రహ్మవైవర్త పురాణము, చంద్రకళా సుదర్శనము, దూతం గదము మొదలైన గ్రంథాలు ప్రకటించినారు. ఈ గ్రంథమాల ఆగిపోయినది.



**గాడిచెర్ల హరిసర్వోత్తమరావు**

**విజ్ఞాన చంద్రికా గ్రంథమాల :**

మన దేశంలో వెలసిన మొట్టమొదటి గ్రంథమాల ఇది. దీని స్థాపకులు ఆంధ్ర జాతికి ప్రాతస్మరణీయు లైన కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, గాడిచెర్ల హరి సర్వోత్తమరావు, రావిచెట్టు రంగారావు. అయ్యదేవర కాళేశ్వరరావు, రాజా నాయకుని వెంకట రంగారావుగారలు. ఇది 1906లో ప్రారంభమైనది. ఆధునికాంధ్రంలో విజ్ఞాన చంద్రికలు వ్యాపించినది. ఈ గ్రంథమాలవారు ప్రకటించిన పుస్తకాల మూలంగానే. దేశ చరిత్రలు, పదార్థ విజ్ఞాన శాస్త్రం, రసాయన శాస్త్రం, జంతు శాస్త్రం, భూగర్భ శాస్త్రం, అర్థశాస్త్రం, చారిత్రక నవలలు– ఈ విధంగా తీరు గ్రంథాలు వెలువడి తెలుగు విజ్ఞాన ప్రసారానికి తెలుగు సంస్కృతీ వికాసానికి ఎంతో దోహదం చేసినవి.

గ్రంథాలు చెన్నైలో అచ్చైనా దీని కార్యస్థానం తొలి సంవత్సరాల్లో హైదరాబాదులోనే ఉండేది. దీనికి కారణం రావిచెట్టు రంగారావుగారు, నాయని వెంకట రంగారావుగారు, కార్యాలయ నిర్వాహకులు ఆదిరాజు వీరభద్రరావుగారు హైదరాబాదులో ఉండటమే.

హైదరాబాదులోని రాజకీయ నిర్బంధాల కారణంగా విజ్ఞాన చంద్రికా గ్రంథమాల కార్యాలయం 1908లో చెన్నైకి మారింది. ఆదిరాజు వారు కూడా కొంతకాలం మద్రాసులో ఉన్నారు. ఈ గ్రంథమాలకు సంపాదకులు కొమర్రాజు వారే. వారి మరణానంతరం ఆ బాధ్యతను గాడిచెర్లవారు, వేమూరివారు, ఆచంటవారు వహించినారు. 1916 నాటికి ఈ గ్రంథమాల పక్షాన దాదాపు 30 గ్రంథాలు అచ్చైనవి.

ప్రథమ ప్రపంచ సంగ్రామం మూలంగా ఈ గ్రంథమాల ఆగిపోగా 1924లో ఒకమారు, 1948లో మాడపాటి వారి మూలంగా మరొకమారు దీనిని పునరుద్ధరించటం జరిగింది. మొత్తం 46 గ్రంథాలు ప్రకటించిన ఈ మహా సంస్థ ఆయా పెద్ద తలలు రాలిపోవటం చేతనో, ఇతర కార్యవ్యగ్రులు కావటం చేతనో అన్ని గొప్ప సంస్థల వలెనే కాలగర్భంలో కలిసి పోయింది.

ఈ గ్రంథమాల పక్షాన వెలువడిన కొన్ని ముఖ్య గ్రంథాలు గాడిచెర్ల వారి *అబ్రహాం లింకన్,* కొమర్రాజు వారి *హిందూ మహాయుగం,* ఆచంట లక్ష్మీపతిగారి *జీవశాస్త్రం,* వేలాల సుబ్బారావుగారి *రాణీ సంయుక్త,* కొమర్రాజు వారి *మహమ్మదీయ మహాయుగం,* మంత్రిప్రగడ సాంబ శివరావుగారి *పదార్థ విజ్ఞాన శాస్త్రం,* వేమూరి విశ్వనాథశర్మ గారి *రసాయన శాస్త్రం,* చిలుకూరి వీరభద్రరావుగారి

*ఆంధ్రుల చరిత్ర ప్రథమ భాగం*, భోగరాజు నారాయణ మూర్తిగారి *విమలాదేవి*, ఆచంట వారి *కలరా*, *జంతుశాస్త్రం*, *వృక్షశాస్త్రం*, *శారీరశాస్త్రం*, *భౌతికశాస్త్రం ప్రథమ పాఠములు*.

కందుకూరి వారి *స్వీయ చరిత్ర ప్రథమ భాగం*, *ఢిల్లీ దర్బారు*, *భౌతికశాస్త్రం*, *ఆంధ్రులచరిత్ర ద్వితీయ భాగం*, *చంద్రగుప్త చక్రవర్తి చరిత్ర*, *చలిజ్వరం*, కట్టమంచి వారి *అర్థశాస్త్రం రెండు భాగాలు*, గోటేటి జోగిరాజుగారి *వ్యవసాయ శాస్త్రం రెండు భాగాలు*.

కేతవరపు వెంకటశాస్త్రిగారి *రాయచూరు యుద్ధం*, దుగ్గిరాల వారి *విజయనగర సామ్రాజ్యం*, కందుకూరి వారి *స్వీయ చరిత్ర ద్వితీయ భాగం*, కొమర్రాజు వారి *లక్ష్మణరాయ వ్యాసావళి*, అయ్యదేవర వారి *ఫ్రెంచి స్వాతంత్ర్య విజయం*, *అమెరికా సంయుక్త రాష్ట్రములు*, వేలూరి సత్యనారాయణగారి *బౌద్ధ మహాయుగం* మొదలైనవి.

**విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల :**



**ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు**

ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు సోదర పండిత కవులీ గ్రంథమాలను తమ స్వగ్రామం ఇనుగుర్తి (మానుకోట తాలూకా)లో 1926లో స్థాపించి *బ్రాహ్మణ సాహసము*, *భక్తిసార చరితము* మొదలైన గ్రంథాలు ప్రకటించినారు. అటు తరువాత రాజవైద్య పింగళి లింబాద్రి రెడ్డిగారీ గ్రంథమాలను స్వగ్రామం నెలమి కొండు (కరీంనగర మండలం) తరలించి తమ సంపాదకత్వంలో 1932 వరకు 21 గ్రంథాలు ప్రకటించినారు.

వారు ప్రకటించిన గ్రంథాలలో *రుద్రమదేవి*, *శౌర్యశక్తి*, *ముక్తలవ*, *సాంఘిక చరిత్ర*, *శకుంతల*, *విష చికిత్సలు*, *తోట*, *కాయగూరలు*, *పావని*, *హరిశ్చంద్ర* ముఖ్యమైనవి ఈ గ్రంథమాల ఇప్పుడు పనిచేయటం లేదు.

**విశ్వేశ్వర గ్రంథమాల :**

కోటీశ్వరులైన ఆకారపు నరసింగంగుప్తగారు ఓరుగల్లులో విశ్వేశ్వరాలయమును నిర్మించుటేకాక విశ్వేశ్వర గ్రంథమాలను స్థాపించి శైవమతానికి సంబంధించిన అనేక గ్రంథాలను ప్రకటించినారు. నీలకంఠారాధ్యుల *బ్రహ్మ సూత్ర భాష్యము*, ముదిగొండ కోటయ్య శాస్త్రి *శైవ సర్వస్వము*, ముదిగొండ నాగలింగ శాస్త్రి *శంభు శతకము*, *నలవిలాసము*, ఉమానంద నాథుని *నిత్యోత్సవ నిబంధము*, మల్లంపల్లి జ్వాలా వీరభద్రశాస్త్రి *శివ సందర్శన విధి*, మల్లంపల్లి కనకదుర్గా వరప్రసాద్ *శైవమతం అతి ప్రాచీనం*.

ముదిగొండ వీరభద్రారాధ్యుల *గౌరీ కల్యాణము*, *పుత్ర ప్రదానలీల*, ముదిగొండ జ్వాలాపతి లింగశాస్త్రి *కుమార కల్యాణము*, *శివతాండవ లీల*, *శైవ కల్పద్రుమము*, ఋషభ యోగి విరచిత *శివ కవచము*, *జ్ఞాన సుధారసము*, *లింగాష్టోత్తర శతనామాబ్జమాలిక*, మల్లంపల్లి వీరేశ్వర శర్మ *శంకరారాధ్య చరిత్ర కాంచీ ఖండము*.

ముదిగొండ సుబ్రహ్మణ్యశాస్త్రి *సాగరేశ్వర శతకము*, *కుమార విజయము*, ముదిగొండ వీరేశలింగశాస్త్రి గారు సంపాదించిన *స్త్రీల పాటలు*, *శివ భజన శ్లోకములు*, *గురుభజన శ్లోకములు*, *కాశీ విశ్వేశ్వర భజన కీర్తనలు* ముఖ్యమైనవి. ఈ గ్రంథమాల నామ మాత్రావశిష్టంగా ఉన్నది.

**వెలగలేటి గ్రంథమాల :**

శ్రీమాన్ వెలగలేటి నరసింహా చార్యులుగారీ గ్రంథమాలను 1972లో మానుకోటలో స్థాపించి విశిష్టాద్వైత సంప్రదాయానికి చెందిన గ్రంథాలను ప్రచు రిస్తున్నారు. ఇప్పటికి *భక్తామృతమ్*, *గారు పరంపరాదికము* మొదలైన గ్రంథాలు ప్రకటించినారు. ఇది సజీవంగా ఉన్న గ్రంథమాల.

**వేగుజుక్క గ్రంథమాల :**



**తాపీ ధర్మారావు**

ఇదికూడ మన తొలి గ్రంథ మాలల్లో ఒకటి. దీనికి స్థాపికులు భాగవతుల నృసింహ శర్మ, తాపీ ధర్మారావు గారలు. ఇది గంజాం మండలం బరంపురంలో వెలసిన గ్రంథమాల. దీని పక్షాన *ఉగ్ర భైరవము*, *పద్మరాగము*, *చవల*, *కాళీగట్టు రహస్యములు*, *విషమ రహస్యము*, *దుర్గాదాస్ కాంతా పహరణము*, *ఉత్తమ వంచకులు*, *నేనే, వాడే వీడు*, తాపీ ధర్మారావుగారి *ప్రొద్దుపొడుపు*, వారణాసి అచ్యుతరామ కవి

*సురతాణీ పరిణయము* మొదలైన గ్రంథాలు వెలువడినవి. ఈ గ్రంథమాల కాలం క్రిందనే ఆగిపోయినది.

**శారదాపీఠ గ్రంథమాల :**

పిల్లలమర్రి వెంకట హనుమంతరావుగారీ గ్రంథమాలను గుంటూరులో స్థాపించి స్వీయ రచనలైన *సాహిత్య సమాలోచనము, మాధురీ మహిమ, సాహిత్య సమీక్ష, శారదా విలాసము, ఇష్టాగోష్ఠి, ధూపదీపాలు, ఆంధ్ర సాహిత్య చరిత్ర, నవలా సర్వస్వము, సాహిత్య సంపద, మహోదయులు, రాగరేఖలు, మధుకణములు, కావ్యాలోకనము,* మొదలైన గ్రంథాలు ప్రకటించినారు. ఈ గ్రంథమాల ఆగిపోయినది.

**శివాగమ గ్రంథమాల :**

విశ్వేశ్వర గ్రంథమాలా స్థాపకులైన ఆకారం నరసింగం గుప్తగారే శివాగమ గ్రంథమాలను స్థాపించి మల్లంపల్లి జ్వాలా వీరభద్రశాస్త్రిగారు రచించిన *శివ సందర్శన విధి, శివ మహోత్సవ విధి, శివ ప్రతిష్ఠా విధి, శైవాగమకారిక, శివ సంప్రోక్షణ విధి* మొదలైన గ్రంథాలు ప్రకటించినారు.

**శుకశ్యామలా రామలింగేశ్వర గ్రంథమాల :**

ఈ గ్రంథమాల పక్షాన శివ రహస్య ఖండము రెండు భాగాలు, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి ఆంధ్ర స్కాందము, వీరభద్ర గణేశ్వరవ్రతాలు, వీరభద్రకవి విరచిత మహాస్కాందములోని *గౌరీ కల్యాణము* ప్రకటించబడినవి.

**శృంగార గ్రంథమాల :**

శృంగార రస ప్రధానమైన రచనలు ప్రచురించే ఉద్దేశంతో గంటి సూర్యనారాయణ శాస్త్రిగారీ గ్రంథమాలను చెన్నైలో స్థాపించి నెల్లూరి శివరామకవి *కామకళానిధి,* వెలిదిండ్ల వెంకటపతి *రాధామాధవ సంవాదము,* చితారు గంగాధర కవి *భల్లాణ చరిత్ర,* రఘునాథ రాయల *సావిత్రి.*

సముఖం వెంకట కృష్ణప్పనాయకుని *అహల్యా సంక్రదనము,* ఎడపాటి ఎర్రన *మల్హాణ చరిత్ర,* రేవూరి అనంతయజ్వ *గాధేయోపాఖ్యానము,* వెణుతుర్ల ఒడ్డెకవి *రసాలవాలము, శృంగారము,* అనే వివిధ కవుల *పద్య సంకలనము. శృంగార కంఠాభరణము* అనే వివిధ రచయితల *వ్యాస సంపుటి,* ముద్దుపళని *అష్టపదులు* మేలైన కాగితం మీద అందముగా ముద్రింపించి ప్రకటించినారు. ఈ గ్రంథమాల ఇప్పుడు లేదు.

**శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల :**

రాయలసీమ కవిపండితుల గ్రంథాలను ప్రకటించి ప్రచారం కలిగించే ఉద్దేశంతో బళ్ళారి పట్టణంలో ఘూళీ కృష్ణమూర్తి, దేవదానం, కల్లూరు అహోబలరావు అనే కవిత్రయం వారిచేత 1931 లో ఈ సంస్థ స్థాపించారు.

అభిమానుల నుండి, పదాన్యుల నుండి సేకరించిన విరాళాలే దీని మూలధనం, సంవత్సరానికి మూడు పుస్తకాలు ప్రకటించటం, ఆ మూడు పుస్తకాలను ఒక్క రూపాయి చందాకు ఇవ్వటం ధ్యేయంగా పెట్టుకొన్న సంస్థ ఇది. 1933 నాటికి 9 పుస్తకాలు ప్రకటించినారు.

ఈ సంస్థకు మూల స్తంభమైన కల్లూరు అహోబలరావుగారు ఉద్యోగరీత్యా 1934లో అనంతపురం వెళ్ళవలసి వచ్చింది. గ్రంథమాల కూడ అనంతపురం తరలింది. దేవదానం గారు కూడ కడపకు వెళ్ళిపోయినారు. గ్రంథ ప్రచురణ కుంటుపడింది.

కాని ఉగాది కానుకలు గ్రంథమాలకు అనుబంధంగా ప్రతి సంవత్సరం వెలువడుతుండేవి. 1953 నాటికి మరి నాలుగు పుస్తకాలు అచ్చయినవి. 1956 లో అహోబలరావుగారు హిందూపురం చేరుకున్నారు. 1957 లో ఈ గ్రంథ మాలను మరల ఉద్ధరించి 1975 నాటికి 10 గ్రంథాలు ప్రకటించినారు.

ఈ గ్రంథమాల వారు ఇప్పటివరకు ప్రకటించిన పుస్తకాలు *స్వార్థత్యాగము, భావతరంగములు, ప్రేమ సుందరి భా. 1, ప్రేమ సుందరి భా. 2, వేమ భూపాల విజయము, విప్ర నారాయణ నాటకము, మాధవాశ్రమము భా. 1, మాధవాశ్రమము భా. 2, కుముదవల్లి, పూదోట, రాయలసీమ, రత్నరాశి, స్వప్న వల్లభుడు, జ్ఞానవాశిష్ఠ రత్నములు, భక్త మందారము, అమృతాభిషేకము, షాజహాన్, తపోవనము, మయూర ప్రహసనము, భక్త పోతరాజీయము, వివేకానందము, ఉగాది స్వర్ణ భారతి, రాయలసీమ రచయితల చరిత్ర.*

బళ్ళారిలో పుట్టి అనంతపురంలో మొగ్గతొడిగి హిందూపురంలో అల్లిబిల్లిగా అల్లుకొని కావ్య సురభిళాలు వెదజల్లుతున్న శ్రీకృష్ణరాయ గ్రంథమాల రాయలసీమకు ఈనాటికీ సేవ చేస్తూ ఉండటం ప్రశంసనీయం.

## సుధా చౌహాన్

# నేల తల్లి కథ

– దేవరాజు మహారాజు

చాలా మంది చాలా రకాలుగా రచయిత లయ్యాలరు. కొంత మంది రచయిత్రులు కూడా అంతే! ఊహించని విధంగా రచయిత్రులై పొయ్యారు. సంచలనం సృష్టించారు. కొంతమంది ఊహించినట్టుగానే స్వయం కృషితో రచయిత్రలై సాహిత్య రంగంలో శాశ్వత విలువల్ని ప్రతిష్టించారు. కొందరు సృజనకారులైతే కొందరు పరిశోధకులయ్యారు. మరికొందరు జీవిత చరిత్రలు రాశారు. తాము రాసిన ఒకే ఒక్క గ్రంథంతో సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన వాళ్ళూ ఉన్నారు. ఆ కోవలోకే వస్తారు హిందీ రచయిత్రి సుధా చౌహాన్. ఈమె ప్రముఖ హిందీ కవయిత్రి సుభద్రాకుమారి చౌహాన్ కూతురు. సుభద్రా కుమారి ఆత్మకథ రాసుకోలేదు. ఆలోటు కూతురు పూర్తి చేశారు.

జాతీయోద్యమంలో కాంగ్రెస్ కార్యకర్తగా ముందు నిలిచిన సుభద్రకు తనదంటూ వ్యక్తిగత జీవితం పెద్దగా లేదు. తన భర్తతో పాటు జీవితం జాతికి అంకితం చేసిన త్యాగశీలి. ఆమె జీవిత కథ రాయడమంటే స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను వివరించడమే. సుధా చౌహాన్ చేపట్టిన కార్యక్రమం కూడా అదే. ఆమె తన తల్లి జీవిత కథలోంచే ఈ నేల తల్లి కథను కూడా వర్ణించారు. అదే "మిలా తేజ్ సే తేజ్" అనే ఉద్గ్రంథమైంది. అందులో తన తల్లిదండ్రులు ఈ దేశం కోసం చేసిన త్యాగాలు వివరించారు. పోరాట జీవిత నేపథ్యం లోంచి తన తల్లి సృజనాత్మక రచయిత్రిగా ఎలా ఎదిగారో ఆమె అందులో విశ్లేషించారు. తల్లి కథను అక్షరబద్ధం చేసిన ఈ తనయ హిందీ సాహిత్య రంగంలో లేదా భారతీయ సాహిత్య రంగంలో రచయిత్రిగా శాశ్వతంగా నిలిచిపోయారు.

సుధా చౌహాన్‌కు తల్లి జీవిత చరిత్ర రాసినందుకు మంచి గుర్తింపే లభించింది. అయితే ఆమె అందుకు మాత్రమే పరిమితం కాలేదు. ఆమె ఇతర రచనలు కూడా చేశారు. ముఖ్యంగా చిన్న పిల్లల కోసం ఎక్కువగా రాశారు. హిందీ బాల సాహిత్య కారుల్లో సుధా చౌహాన్‌ది పెద్ద పేరు. పిల్లల కోసం చిన్న చిన్న పాటలు, పద్యాలు, రైమ్స్, రాయడం ఆమెకు ఇష్టం. పిల్లల కోసం రాసిన కవిత్వం నాలుగు సంపుటాలుగా వెలువడ్డాయి. తల్లిదండ్రులు ఇద్దరూ సత్యాగ్రహాల్లో పాల్గొంటూ ఉండడం, జైళ్ళలో ఉంటూ ఉండడం వల్ల తన చెల్లాయిని, తమ్ముణ్ణి చూసుకుంటూ ఆమె ఎక్కువగా ఇంటి పట్టున ఉండాల్సి వచ్చేది. ఒక వైపు తల్లి తండ్రుల గురించిన ఆందోళన, మరో వైపు చిన్న పిల్లల సంరక్షణ! ఇంతా చేస్తే అప్పుడు ఆమె వయసు పదహారేళ్ళు.

1924లో పుట్టిన సుధా చౌహాన్. ఇరవై యేళ్ళ వయసులో 1944లో నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం నుండి పట్టా పుచ్చుకున్నారు. ఆ మరుసటి సంవత్సరమే 1945లో అమృత్‌రాయ్‌ని వివాహ మాడారు. అమృత్‌రాయ్ ప్రఖ్యాత ఉరుదూ నవలా కారుడైన ప్రేమ్‌చంద్ కుమారుడు. ఇటు పుట్టినింట్లో. అటు మెట్టినింట్లో కూడా సాహిత్య వాతావరణం ఉండడం వల్ల, పుట్టినింట్లో, అటు మెట్టినింట్లో కూడా సాహిత్య వాతావరణం ఉండడం వల్ల చర్చలు, వాదోపవాదాలు జరుగుతుండడం వల్ల సులభంగా రచయిత్రి కాగలిగారు. వివాహానంతరం ఆమె చదువును అశ్రద్ధ చేయలేరు.

1956లో బెనారస్ విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ డిగ్రీ సంపాదించారు. ఎక్కువ చదవడం, తక్కువ రాయడం అలవాటున్న సుధా చౌహాన్ స్థాయి గురించి, విలువల గురించి, కృషి చేశారు. రచనలు చేయాలని ఆరాట పడలేదు. సుభద్రా కుమారి చౌహాన్ జీవించిందే నలభైనాలుగేళ్ళు (1904–48) అందులో పెద్దకూతురు సుధపుట్టిన నాటికి (1924) ఆమె వయసు ఇరవై ఏళ్ళు. ఆమె మరణించే సమయానికి కూతురు సుధకు ఇరవై నాలుగేళ్ళు. తల్లి

డాక్టరు దేవరాజు మహారాజు, ఫోన్ : 9908633949

మరణించిన ఇరవై మూడేళ్ళకు అంటే 1975లో ఆమె "మిలా తేజ్ సే తేజ్" ప్రకటించారు. చారిత్రాత్మకమైన ఆ రచనలోంచి ఒక చిన్న భాగం చూద్దాం: మొదట్లో చాలా కాలం వరకు మా అమ్మా, నాన్నల గురించి సమాచారం అందేది కాదు. మా పరిస్థితి వారికి తెలుపడానికి వీలయ్యేది కాదు. చుట్టూ ఉన్న అశాంతి. భీభత్సం గురించి మాకు పెద్దగా అవగాహన లేదు. కాని మా అమ్మా నాన్నల్ని ప్రభుత్వం అరెస్ట్ చేయడం వల్ల మేమెంతో కోల్పోయాం. ఎంతో బాధపడ్డాం. ఎన్నో బాధలు అనుభవించాం. అయితే ఒకటి, తల్లిదండ్రులు జైలుకెళ్ళగా మేం పిల్లలం మాత్రమే "ఒంటిరగా" ఉంటూ, కష్టాలను భావించామంటే దేశ స్వాతంత్రోద్యమానికి మేం కూడా శాయశక్తులా కృషి చేశామన్న మాటే! ఆ భావంతో మా గురించి మేం గానీ, మా తల్లిదండ్రుల గురించి గాని మేం ఎప్పుడూ పెద్దగా ఆందోళ పడలేదు.

కొన్ని వారాల తర్వాత, అమ్మా నాన్నల నుండి విడివిడిగా ఉత్తరాలు వచ్చాయి. వారు క్షేమంగా ఉన్నారని, వారి గురించి ఆందోళన పడాల్సిన పని లేదని రాశారు. నేను చెప్పినట్టు నడుచుకోవాలని వారిద్దరికీ సూచించారు. ఇంకా ఆ ఉత్తరాల వల్ల తెలిసిందేమంటే వాళ్ళు జబల్ పూర్ జైల్లోనే ఉన్నారని, వారికి మేం వారానికి ఒక ఉత్తరం చొప్పున రాయొచ్చని రాశారు. ఆరోజుల్లోనే ఎవరో చెప్పగా విన్నాను. కొద్ది రోజుల్లోనే పోస్టల్ ఛార్జీలు పెరుగుతున్నాయని! అమ్మా, నాన్నలకు రాయడానికి మాకు బోలెడు ఉత్తరాలు కావాలి గనుక, పోస్టల్ రేట్లు పెరగక ముందే చాలా కవర్లు కొని పెట్టుకున్నాను. ఫలితంగా చాలా కాలం వరకు అదనంగా స్టాంపులు అంటించుకుంటూ వాడుకోవాల్సి వచ్చింది. అనుభవ రాహిత్యం కొంత, అమాయకత్వం కొంత కుటుంబ నిర్వహణ చాలా భారమని పించింది.

1941 నాటి వ్యక్తిగత సత్యాగ్రహ కార్యక్రమంలో మా అమ్మే మొట్టమొదటి మహిళా రాజకీయ ఖైదీ. ఆ తర్వాత జైల్లో చాలా మంది మహిళా ఖైదీలు ఆమెకు తోడైనారు. మధ్యప్రదేశ్ నుండి వచ్చిన రాజకీయ ఖైదీలంతా జబల్‌పూర్ జైల్లోనే ఉన్నారు. ఏ క్లాస్ కేటగిరిలో ఇద్దరే మహిళలు ఉండేవారు. జమునా లాల్ బజాజ్ కూతురు ఓం, ఆయన పెద్ద కోడలు సావిత్రీ బజాజ్, బి-క్లాస్ కేటగిరిలో మా అమ్మతో పాటు మరి కొంతమంది అక్కడే ఉండేవారు. నిరక్షరాస్యులు, దారిద్ర్యంలో కొట్టు మిట్టాడుతుండే వారెంతో మంది సి-క్లాస్‌లో ఉండేవారు. ఒక్కొక్క ఖైదీది ఒక్కొక్క కథ. వాళ్ళ పిల్లలంతా ఎక్కడెక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో... తల్లి ప్రేమ కరువై ఎంత దుర్భరంగా బతుకుతున్నారో...

ఈ నేల తల్లి చెర విడిపించడానికి తల్లులు చేసిన త్యాగాలు అనంతం... ●

## ప్రేలాపన

"ఆడుది యెక్కడ? సౌందర్యమెక్కడ? ఏ యాడుదానికైన సౌందర్యమున్నను సౌందర్యహీనమైన జాతియే స్త్రీజాతి. మగజాతియే సౌందర్య యుక్తమైనది. మగజాతి సౌందర్యము ముందాడుజాతి సౌందర్య మధమము - అత్యల్పము. నేనేమో వెఱ్ఱిముండా కొడుకును గావున నిట్లు చెప్పచున్నానని మీరనుకోవలదు. నేను వెఱ్ఱివాడననైన యెడల మీరు మాత్రమేల వెఱ్ఱివారు కారు? కొట్టులో నుండుటచే నేను వెఱ్ఱివాడనని మీరెంచుచున్నారు కాబోలు. మీరున్న కొట్టు నేనున్న కొట్టు కంటె బెద్దదగుటచే మీరు నాకంటె నెక్కువ వెఱ్ఱివారు. తెలిసినదా? పిచ్చిలేనివాడెవడు? ఒకడు మాటలాడు చున్నప్పడు తల నిట్టెయిట్టె యెగురవేయును. ఒకడు భుజము నెగురవేయును. మాటలాడు ప్రతి మనుజునికి గూడ నేదో యొక్క యూతపదముండి తీఱును. ఒకడు "ఏమి? ఏమి?" యని నడుమ నడుమ బనిలేకే ప్రయోజనము లేనిదే యనును. ఇది పిచ్చికాదా? ఒకడు "ఏమన్నాగాని- మతే గలిగితే- దేవుడు మీకు చాల మేలు చేస్తే" యని యిట్లేదో యొక్కటి మాటల కూతగా బలుకును. ఇది పిచ్చికాదా? పిచ్చివాడే కాకున్న యెడల దశరథునకు ముగ్గురు భార్యలు, మూడు వందల యుంపుడు కత్తెలెందుకు? ఎలిజబెత్ కెనిమిది వేల ఫ్రాక్కులు, తొమ్మిదివేల షర్టులు, పదకొండువేల కంఠబంధములు, పదునాలుగువేల కాలిజోళ్లెందులకు? ఇంత వఱకెందులకు? "నాకు బిచ్చి లేదురా మీ మొగములు మండ"నని తలగొట్టుకొన్ననైన నెవ్వడును వినడే! ఒక్క ముండాకొడుకు తిక్కయైన దీఱదే...

ఈ నక్షత్రములన్నియు నొక రాత్రి యూడి క్రింద బడిపోవగ మా తాత గారెక్కడి నక్షత్రములక్కడ తెల్లవారుసరికమర్చినారు. నక్షత్రశాలలోని దూరదర్శినీ యంత్రము చూచితివా? గెలీలియో అనునాతడు చంద్రునిలో నగ్ని పర్వతము లున్నట్లు కనిపెట్టినాడు గాని, తన తత్త్వములో నున్న తమాషా కనిపెట్టలేకపోయినాడు. జగమ్ మిథ్య పలాయనమ్ మిథ్య యని చాటుకొని పోయిన వినియోగము లేదు."

- పిచ్చివాడు (సాక్షి - పానుగంటి లక్ష్మీనరసింహారావు)



# అభ్యుదయ సూత్రాలు
# గూడవల్లి రామబ్రహ్మం చిత్రాలు

మనిషి అనేది సర్వనామమే. కాని ఆలోచనలు మాత్రం వ్యక్తిగతం. అభ్యుదయకరమైన ఆలోచనలు ఆచరణ కోసం దారులు వెతుకుతాయి. అంటే వాటికి ప్రచారం కావాలి. అందుకు ఒక మాధ్యమం కావాలన్నమాట. అక్కడే మొదలయింది అందుకు సాధనాల పరిశీలన- పత్రికలు- నాటకాలు- ఎన్నో కళారూపాలు- అభ్యుదయవాదులకు ప్రచారసాధనాలయ్యాయి.

అప్పడు వచ్చింది సినిమా- ఇదీ ఒక మాధ్యమమే. అది ఎక్కువ మందిని చేరగల అత్యంత శక్తిగల మాధ్యమం. పెట్టుబడి దారులు దీనిని సొమ్ము చేసుకోవటానికే అవకాశంగా చూశారు. అభ్యుదయ భావాలు గలవారు, సంస్కరణ కర్తలు ఇదే సినిమాను ఒక గొప్ప ప్రచారసాధనంగా ఉపయోగించ ప్రయత్నించారు. సినిమాకున్న బహుళ ప్రయోజనాలను చర్చించటానికి ఉద్దేశించిన వ్యాసం కాదిది. ఒక అభ్యుదయ ఆలోచనలుగల సంస్కర్త శైశవ దశలో వున్న సినిమాను ఓనమాలుకూడా రాకుండా ఎంతో సాహసంతో తన ఆలోచనల ఆచరణ ప్రచారానికి ఏవిధంగా వాహకంగా ఉపయోగించి, తన ఆశయాన్ని సాధించుకున్నాడో తెలుసుకోవాలంటే - గూడవల్లి రామబ్రహ్మం జీవితాన్ని తరచిచూడాలి. రామబ్రహ్మం, గాంధీ ఆశయాలను ప్రచారం చేసేందుకు, దేశస్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు, మహిళాభ్యుదయానికి తోడ్పడేందుకు, అంటరానితనాన్ని రూపుమాపేందుకు, సినిమాను ప్రచార సాధనంగా ఉపయోగించారు. ఇక్కడ ఒక ప్రమాదం కూడా వుంది. ఇప్పటికీ చిత్రసీమలోని లబ్దప్రతిష్టులు రామబ్రహ్మాన్ని తమకు ఆరాధ్యులు, తమ అభ్యున్నతికి వారు ఎంతో తపన పడ్డారు అని మనలను తప్పదోవ పట్టిస్తారు. కాని అసలు నిజం వేరుగా వుంది.

*'రూపాయిల లెక్కలు చూసుకునే వ్యాపారస్తుల చేతుల్లోనుంచి సినిమాను విడిపించాలి. మన అభ్యుదయ ఆలోచనలకు ఆశ్రయమిచ్చే సంపన్నుల అండతో ఇదే సినిమాను ప్రచార సాధనంగా ఉపయోగించాలి. జనాభ్యుదయానికి, సంఘశ్రేయస్సుకు, దేశ సంస్కరణకు సినిమాను సాధనంగా వాడుకోవాలి' అని రామబ్రహ్మం ఎంతో స్పష్టంగా, చిత్రసీమలోకి రాకముందే, నిర్దుష్టమైన అభిప్రాయంతో వున్నారు. ఆయనకు హీరోలతో, తారలతో పనిలేదు.*

పైన చెప్పిన ఆశయాలే గాక, రైతుల హక్కులను కాపాడటానికి, దేశాన్ని దాస్యశృంఖలాలనుంచి విముక్తి చేయటానికి సినిమాను ప్రచార సాధనంగా ఎంచుకున్నారు. ఈ ప్రస్థానాన్ని గమనించే ముందు రామబ్రహ్మం వ్యక్తిత్వాన్ని తెలుసుకోవాలి.

తరాలుగా కృష్ణాతీరం కళలకు పుట్టినిల్లుగా ప్రసిద్ధికెక్కింది. *సిద్ధేంద్రయోగి* కూచిపూడి భాగవతానికి, క్షేత్రయ్య మువ్వగోపాలపదాలకి ఈ ప్రాంతం పేరు గాంచింది. ఇంకా ఎందరో కవులూ, రచయితలూ, రంగస్థల కళాకారులకు నిలయమైంది. సాంప్రదాయబద్ధులైన తల్లిదండ్రుల నుంచి రామబ్రహ్మానికి సాహిత్యాభిరుచి వారసత్వ సంపదగా లభించింది. ఆ కారణంగానే, చిన్నప్పటి నుంచి అతనికి సాహిత్యం పట్ల మక్కువ, సాహిత్యవేత్తల పట్ల గౌరవం ఏర్పడ్డాయి. నాటకాలన్నా, రంగస్థల కళాకారులన్నా అతనికి అంతులేని అభిమానం! నందమూరుకు పొరుగునే ఉన్న గ్రామం ఇందుపల్లి. నందమూరుతో పోలిస్తే, ఈ ఊరు కాస్త పెద్దది! ఇందుపల్లికి రైల్వేస్టేషన్ ఉంది. నందమూరు గ్రామస్థులు వాళ్ళ రాకపోకలకు ఇందుపల్లి రైల్వేస్టేషన్‌కు తప్పనిసరిగా వస్తూండేవాళ్ళు. నందమూరుకి చెందిన పిల్లలు తమ ప్రాథమిక విద్యను పూర్తి చేయడానికి, ఇందుపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు రాక తప్పేదికాదు! అందువల్ల, రామబ్రహ్మం ఇందుపల్లిలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ముగించాడు. గుడివాడలో నున్న బోర్డ్ హైస్కూల్‌లో చేరాడు. ఒకనాడు స్కూలు మిత్రుడు హడావిడిగా రామబ్రహ్మం దగ్గరకి వచ్చి "రామబ్రహ్మం! మా ఊళ్ళో ఒక విశేషం జరిగింది.

గూడవల్లి రామబ్రహ్మం (1898-1946) తెలుగు ప్రజల సంస్కృతీ వికాసానికి, అభ్యుదయ మార్గానికి తోడ్పడిన మహనీయుల్లో ముఖ్యులు.

నిన్న మా ఊరికి ఒక విశ్వబ్రాహ్మణ పండితుడు వచ్చాడు. ఆయన రచ్చబండ దగ్గర నిలిచి, ఊళ్ళో జనం అంతా గుమిగూడగా, వాళ్ళందరితో 'వేదాలు, పురాణాలు, మనుస్మృతి వంటివన్నీ కేవలం కట్టుకథలు' అనీ, 'వాటిని స్వార్థపరులు కల్పించారనీ' చెప్తూ, వింతగా ప్రచారం మొదలు పెట్టాడు. ఆ తరువాత, మనుస్మృతి ప్రతిని ఒక దానిని తెప్పించి, ఊరి మధ్య, పదిమంది ముందూ, బహిరంగంగా, తగుల బెట్టించాడు. స్కూల్ అయిపోయిన తరువాత, నువ్వుకూడా నాతో పాటు మా ఊరికి వస్తావా? ఆ విశ్వబ్రాహ్మణుడి వింత ఉపన్యాసాన్ని విందువుగాని!"- అని అడిగాడు.

రామబ్రహ్మం, మిత్రుడు చెప్పిన విశేషాలు విని, ఎంతో ఉత్సుకత చెందాడు. సంచలనాలను సృష్టించే ఉపన్యాసాలు, వివాదాలను రేకెత్తించే సన్నివేశాలూ ఆ వయస్సులో కుర్రాళ్ళకి ఉత్సాహాన్ని ఇవ్వడంలో ఆశ్చర్యంలేదు! "స్కూల్ అయిపోగానే, ఇద్దరం మీ ఊరికి వెళ్దాము! మరిచిపోకుండా, మా తరగతి దగ్గరికి రా!" అన్నాడు రామబ్రహ్మం, ఎంతో ఉత్సాహంగా. స్కూల్ అయిన తరువాత ఇద్దరు మిత్రులు కాటూరికి బయలుదేరారు. ఆ సాయంత్రం కాటూరు రచ్చబండ దగ్గర, ముందురోజు కన్నా ఆవేశంతో రెచ్చిపోయి ఉపన్యసించాడు పండితుడు. అతనికి కులాల అసమానతల పరమరహస్యం ఏదో అర్థమైపోయి నట్లనిపించింది. ఆ పండితుడి ఆవేశపూరిత ప్రసంగానికి, రామబ్రహ్మం అడుగడుగునా కరతాళధ్వనులతో ప్రోత్సాహం అందించాడు.

కాటూరులో యీ పండితుడి ఉద్రేకపూరితమైన ఉపన్యాసాన్ని విన్న తరువాత, రామబ్రహ్మంలో నూతనోత్తేజం కలిగింది. తన చుట్టూ వున్న సమాజాన్ని సంస్కరించాలన్న బలీయమైన వాంఛ అతనిలో జనించింది. పొరుగూరిలో యీయన చేసిన ప్రచారాన్ని ఒక్కముక్క అయినా పొల్లుపోకుండా, నందమూరులో కూడా అతను ప్రచారం చేయసంకల్పించాడు. ఈ ప్రయత్నంలో, రామబ్రహ్మానికి అతని ధోరణిలోనే ఆలోచిస్తున్న నలుగురైదుగురు స్నేహితులు తోడ్పడ్డారు. 1918వ సంవత్సరంలో రామబ్రహ్మం గుడివాడలో హైస్కూలు చదువును ముగించి, బందరు జాతీయ కళాశాలలో ఇంటర్ మీడియటును చదవసాగేడు. జాతీయతా భావనలకి పుట్టినిల్లు ఆ కళాశాల! ఆ కారణంగానే, **గాంధీజీ** భారతప్రజలను సహాయ నిరాకరణోద్యమం సాగించమని పిలుపు ఇవ్వగానే, ఉద్రేక స్వభావి అయిన రామబ్రహ్మాన్ని జాతీయోద్యమం తీవ్రంగా ఆకర్షించింది. అతను ఆ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. బందరులోనే కాకుండా, నందమూరులోనూ, ఇందుపల్లిలోనూ మిత్రులను పోగేసుకొని, విదేశీ వస్త్రదహనం, పికెటింగులు వంటి అనేక కార్యక్రమాలలో అతను తిరుగుతూ వుండేవాడు.

కళాశాలలో వేదిక మీద నిలబడి, కంచుకంఠంతో దశదిశలూ మార్మోగేలా- 'స్వదేశానికి స్వాతంత్ర్యావశ్యకత ఎంతగా ఉందో'- రామబ్రహ్మం చాటి చెప్పాడు. ఉద్యమ ప్రభావంవల్ల, రామబ్రహ్మం చదువు కుంటుపడింది. రామబ్రహ్మం చదువుకి స్వస్తి చెప్పడం అతని తండ్రి వెంకయ్యగారిని తీవ్రంగా ఆలోచింపజేసింది. 1920వ సంవత్సరంలో గూడవల్లి వెంకయ్యగారు, కోగంటి నాగయ్యగారు పరస్పరం అన్ని విషయాలూ మాట్లాడుకున్నాక, పెద్దల సమక్షంలో తాంబూలాలు పుచ్చుకున్నారు. ఆ ఏడే నాగయ్యగారి కుమార్తె శారదాంబతో, రామబ్రహ్మం వివాహం జరిగిపోయింది.

* * *

బెజవాడలో పేరు మోసిన లాయరు కోవెలమూడి గోపాలకృష్ణయ్య తమ కుమార్తె వివాహం తలపెట్టారు. ఆయనకు అత్యంత సన్నిహితులలో రామబ్రహ్మం ఒకడు. అందువల్ల, పెళ్ళిపత్రికలను పంచడం దగ్గర నుంచి, పెళ్ళికి వచ్చిన బంధుమిత్రులు, అతిథులను ఆహ్వానించి, వారికి దగ్గర ఉండి సకల మర్యాదలూ జరపడం వరకూ- అన్ని బాధ్యతలూ గోపాలకృష్ణయ్య. రామబ్రహ్మం భుజస్కంధాలపైనే పెట్టేసారు. అప్పికట్ల గ్రామంలోని కొసరాజు రాఘవయ్య చౌదరి చిన్నప్పటి నుంచి కవిత్వం చెప్తూండేవాడు.

అందుకని అందరూ అతన్ని 'బాలకవి' అని అంటూండేవాళ్ళు. కుర్రా వెంకటసుబ్బారావు అనే కుర్రాడు, బాలకవి రాఘవయ్యతో ఉండేవాడు. ఆ కాలంలో, వివాహానికి కవులనూ, కళాకారులనూ సగౌరవంగా ఆహ్వానించి, సాహిత్యగోష్ఠులూ, సంగీత కచ్చేరీలూ, నృత్యప్రదర్శనల వంటి సాంస్కృతిక కార్య క్రమాలను ఏర్పాటు చేసే ఒక సత్సంప్రదాయం ఉంటుండేది. ఆ సంప్రదాయానికి అనుగుణంగానే, అప్పికట్లలోనున్న ముగ్గురు కవులకూ గోపాలకృష్ణయ్య తన కూతురి వివాహ మహోత్సవ ఆహ్వానపత్రికలను, రామబ్రహ్మం ప్రోద్బలంతో పంపించాడు. దగ్గర బంధువుని

పంపి, వాళ్ళని సాహిత్య గోష్ఠిలో పాల్గొనవసిందిగా, కబురుపెట్టాడు కూడా. అప్పికట్ల లోని ముగ్గురు కవులూ ఈ ఆహ్వానానికి ఎంతో ఆనందించి, పెళ్ళికి హుటాహుటిన బయలుదేరారు.

వాళ్ళని నూతక్కి రామశేషయ్య సాదరంగా ఆహ్వానించి "నేనూ ఈ పెళ్ళికే బయలుదేరి వస్తున్నాను! రండి! మధ్యదారిలోనే మా 'ఉప్పులూరు' ఉంది. అక్కడ కాస్త విశ్రాంతి తీసుకొని మరీ కోలవెన్నుకి... అదే, పెళ్ళి జరిగే ఊరికి మీరు వెళ్ళవచ్చును" అని అన్నారు. అందరూ రైలెక్కి 'ఉప్పులూరు' స్టేషనులో దిగారు. రామశేషయ్య ఇల్లు స్టేషన్‌కి దగ్గరే కావడం వల్ల, అంతా మాట్లాడుకుంటూ, వాళ్ళింటిదాకా నడక సాగించారు. స్నానాదులు ముగించి, కవిత్రయం నీటుగా డ్రెస్ చేసుకుని, వాకిట్లోకి ఇలా వచ్చీ రాగానే....

గుర్రబ్బండి వచ్చి, గుమ్మం ముందు ఆగింది. ఆ బండిలో నుంచి రామబ్రహ్మం క్రిందికి దిగి గడపలో అడుగుపెట్టిందే తరువాయి "అప్పికట్ల నుంచి కవులు వచ్చేరుట కదా! వారిని గోపాలకృష్ణయ్యగారు తీసుకొని రమ్మన్నారు!"– అని అన్నాడు. రామబ్రహ్మం గొంతు వినపడగానే, రామశేషయ్య లోపల నుంచి వాకిట్లోకి వచ్చి– "బాబూ! కాస్త ఆగు! కాఫీ, ఫలహారాలు తయారయి పోయేయి. మీరంతా టిఫిన్లు, కాఫీలు, తీసుకుని వెళ్ళండి!"– అని అందరికీ చెప్పాడు. "వెళ్ళండి! అని అంటున్నారు. మీరు మాతో రావడం లేదా?" అని రాఘవయ్య కంగారు పడుతూ రామశేషయ్యను ప్రశ్నించాడు." మీరు ముందు బయలుదేరండి. నేను మా ఆడవాళ్ళని తీసుకొని, మరో గంట తర్వాత, అక్కడికి వస్తాను!" అన్నాడు రామశేషయ్య కాస్త ఇబ్బంది పడుతూనే. "నా కాఫీ ఫలహారాలు అయిపోయాయి! పెళ్ళి వారి ఇంటి నుంచే వస్తున్నాను కదా!" – అన్నాడు రామబ్రహ్మం.

అతను అన్నది సహేతుకంగా ఉండడం వల్ల, ఇంక ఎవరూ రామబ్రహ్మన్ని బలవంతం చేయలేదు. రాఘవయ్య, పున్నయ్య, సుబ్బారావు, రామబ్రహ్మం గుర్రపు బండిలో ఎక్కి కూర్చున్నారు. రామశేషయ్య వాళ్ళని వీధి గుమ్మందాకా వచ్చి సాగనంపేడు. బండి కదలబోతూ ఉండగా...

"రామశేషయ్యగారూ! కంగ్రాట్స్! మీరు ఈ మధ్యే బి.ఏ. పాసయ్యేరట కదా!"– అన్నాడు రామబ్రహ్మం. "థ్యాంక్స్ రామబ్రహ్మం!"– అన్నాడు రామశేషయ్య. బండి కోలవెన్ను వైపుగా పరుగులు తీసింది. ఆ విధంగా కవులతో పరిచయం కలిగింది. ముఖ్యంగా కొసరాజు రాఘవయ్య అంటే ప్రత్యేక అభిమానం పెంచుకున్నాడు, రామబ్రహ్మం.

* * *

తరువాత బెజవాడలో ఫ్రెండ్స్ అండ్ కో పేరుతో వ్యాపారంపెట్టి ఎంతో మంది స్నేహితులను సంపాదించి పెట్టుబడి అంతా పోగొట్టుకుని అప్పులతో పాటు రామబ్రహ్మం మంచితనాన్ని నిలబెట్టుకున్నాడు. మధ్యలో ఒకసారి మద్రాసువెళ్ళి కొన్నాళ్ళ తర్వాత బెజవాడ వచ్చి స్నేహితుల సలహా సంప్రదింపులతో అప్పులు తీర్చి తీరుబడిగా వున్నపుడు కొసరాజు రాఘవయ్య, కుప్పుస్వామితో పాటు గుంటూరు నుంచి వచ్చి, బెజవాడలో మకాం వేశారన్న వర్తమానం రామబ్రహ్మనికి అందింది. కుప్పుస్వామి గారిది వాస్తవానికి స్వస్థలం కారంచేడు.

అయినా ఇవాళ ఆయన బెజవాడలో ఉంటే, రేపు రేపల్లెలో ఉంటారో, చీరాలలో ఉంటారో, గుంటూరులో ఉంటారో ఆయనకే కాదు, ఆయనని పుట్టించిన ఆ బ్రహ్మదేవుడికి కూడా తెలియదు. ఎన్నెన్నో రాజకీయ, సాంఘిక, ధార్మిక కార్యకలాపాలను, ఆయన తన నెత్తిన వేసుకుంటారు. ఆ పనులలో తలమునకలుగా ఉండి, మగ్గంలో కండెలాగ, అటూ ఇటూ హడావుడిగా, కాళ్ళల్లో చక్రాలు ఉన్నట్లుగా, తిరుగుతూ ఉంటారు. "మీరు అందరి మనిషే కాదు, అందని మనిషి కూడా!" అంటుంటాడు సరదాగా కొసరాజు ఆయనతో.

"ఏం చేయనయ్యా! నాకు మీ కవుల్లాగే, ఒకే చోట నిలయవిద్వాంసుడిలా కుదురుగా ఉండాలనే ఉంటుంది! కానీ, కుదిరి చావటం లేదు!"– అని ఆయన విసుగ్గా అంటూంటాడు. కొసరాజు నవ్వుతుంటాడు. వారి మాటలకి.

కొసరాజు రాఘవయ్య వారి ఇంట్లో పెర్మనెంట్ గెస్టు. ఊళ్ళు తిరిగి తిరిగి అలసిపోయి, ఓ రెండ్రోజులు ఆయనగాని, ఇంట్లో విశ్రాంతి తీసుకోవడమన్నది తటస్థిస్తే, కొసరాజు ఆయనకి ఆస్థానకవిలా, తన సరసన ఉండి తీరవలసిందే! రాఘవయ్య ఆయనకి కేవలం ఆస్థాన కవి మాత్రమే కాదు. సరదా కబుర్లు చెప్తూ, నవ్వించే ఆస్థాన విదూషకుడు, సరసమైన జానపదగేయాలను పాడి, వినిపించే ఆస్థాన గాయకుడు, సమస్యలలో తగు సలహాలను ఇచ్చే నర్మసచివుడు కూడా! కొసరాజు మాటకి ఆయన చాల విలువను ఇస్తారు.

మద్రాసు నుంచి వచ్చిన క్రొత్తలోనే రామబ్రహ్మాన్ని రాఘవయ్య కలిసి – "రామబ్రహ్మం! ఒకసారి కుప్పుస్వామిని కలిసి, వారికి, నీ పరిస్థితిని చెప్పు! ఆయనకి, నేనూ ఓ మాట చెప్తాను! ఆయన నీకు ఏదో దారి చూపించకమానరు! నీ ఆర్థిక పరిస్థితులు కొంత వరకూ అయినా కుదుటపడతాయి!" – అని చిలక్కిచెప్పినట్లుగా చెప్పాడు.

అయితే, స్వాభిమాన సంపన్నుడు అయిన రామబ్రహ్మానికి, ఎవరికి ఏది కావలసివచ్చినా, ఆయాచితంగా ఇచ్చేయడం తప్ప, 'దేహీ' అని అడిగే అలవాటు లేదు! అందువల్ల, అతనికి కుప్పుస్వామిగారిని కలిసి, తన పరిస్థితిని ఆయనకి చెప్పు కొని, సహాయాన్ని అర్థించాలంటే, ఆత్మాభిమానం అడ్డు వచ్చింది. అలా అర్థించటం, ఏదో లేకితనం అనిపించింది అతనికి. దాంతో రామబ్రహ్మం నామోషీగా భావించి, రాఘవయ్య సలహాని పెడచివిని పెట్టాడు.

అయితే, రాఘవయ్య ఏదైనా తలుచుకున్నాడూ అంటే, ఒకంతట దాన్ని వదలి పెట్టే రకం కాదాయె. ప్రస్తుతం, ఒకటికి ముమ్మారు కబుర్లు పంపించి, రామబ్రహ్మం కుప్పుస్వామి గారిని కలిసేందుకు రాఘవయ్య అతని మీద వత్తిడిని పెంచాడు. దాంతో రామబ్రహ్మానికి ఇక కుప్పుస్వామిని కలవక తప్పలేదు. రామబ్రహ్మం ఆయన దగ్గరకి రావడానికి ముందే, రాఘవయ్య తగిన రంగం సిద్ధం చేశాడు.

కుప్పుస్వామిగారు పై పై సానుభూతి మాత్రమే చూపించే మనిషి కాదు. అందుకనే, వారం తిరగకముందే, రామబ్రహ్మం కోసం రాఘవయ్య చౌదరిని బెజవాడకి పంపించి, పిలిపించారు. రామబ్రహ్మం కుప్పుస్వామిగారి దగ్గరికి వచ్చి, కుర్చీలో దిగులుగా కూర్చున్నాడు. అన్యమనస్కంగానే కాఫీ, ఫలహారాలను ముగించాడు.

ఆ కబుర్లు, ఈ కబుర్లు అయిన తరువాత, కుప్పుస్వామిగారే ముందుగా చొరవ తీసుకుంటూ "కొసరాజు జరిగిన సంగతులు అన్నీ నాకు వివరంగా చెప్పాడు. జరిగిన వాటికి బాధపడటం మానేయ్! అదంతా విధి కృతం!" అని అన్నారు. రామబ్రహ్మం తల భూమిలో కూరుకు పోయింది బాధతోనూ, సిగ్గుతోనూ. కుప్పు స్వామిగారు అతని పరిస్థితిని చూసి, తనూ బాధపడుతూ నిట్టూర్చి, ఆపై తను చెప్పదలుచుకున్న దానిని ఇలా కొనసాగించారు...

రామబ్రహ్మం, రాఘవయ్య, కుప్పుస్వామిగారు మాత్రమే, ఆనాడు హాలులో ఉన్నారు. ఎటువంటి ఉపోద్ఘాతము లేకుండా, నేరుగా అసలు విషయాన్ని ప్రస్తావిస్తూ రామబ్రహ్మంతో ఇలా అన్నారు. " నాయనా! రామబ్రహ్మం! నీకు ఒక మాట చెబుతా! విను! బెజవాడలో ఉండి, నువ్వు చేసేది ఏమీ లేదు కదా! ఓ వేళ ఉన్నా, అది పువ్వులు అమ్మిన చోట కట్టెలు అమ్మినట్లుగా ఉంటుంది. కాబట్టి నువ్వు వెంటనే నీ భార్యను తీసుకొని, చీరాలకు వచ్చేసెయ్! రైల్వేస్టేషన్ దగ్గరే మామేడ ఉంది. అందులో మీరు ఉండండి. మీ సంసారానికి కావలసిన సంబారాలు అన్నీ కారంచేడులోని మా ఇంటి వద్ద నుంచి పంపించే ఏర్పాటు చేస్తాను. తరువాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం.

రామబ్రహ్మం కుప్పుస్వామిగారి ప్రతిపాదనకి మారు మాట్లాడకుండా, తలపంకిస్తూ అంగీకరించాడు. రాఘవయ్య "కుప్పుస్వామి గారూ! మీ ఆలోచన చాలా బాగుంది!" అంటూ ఆయనని అభినందించాడు. ఆ అభినందన ఒక విధంగా రామబ్రహ్మాన్ని పరోక్షంగా ప్రోత్సాహించడానికే అన్న సంగతి అటు రామబ్రహ్మం, ఇటు కుప్పుస్వామిగారూ గ్రహించినా, గ్రహించనట్లే ఊరుకున్నారు. మరో వారంరోజులకి....

రామబ్రహ్మం తన భార్య శారదాంబతో సహా చీరాలకు వచ్చేశాడు. రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న కుప్పుస్వామిగారి మేడ, ఆ దంపతులకు అన్ని విధాలా సౌకర్యంగా ఉంది. శారదాంబకి భర్తమాటే వేదం! పెళ్ళి అయిన నాటి నుంచి ఈనాటి వరకూ, ఆయన ఏది చెప్తే అది చేయడమే తప్ప, 'ఎందుకు?' 'ఏమిటి?' అని ఎదురు అడిగిన పాపాన, ఆవిడ ఏనాడూ పోయి ఎరుగదు. ఇంటి పరిస్థితి ఏమిటో కనుక్కోకుండా, వేళకాని వేళలో, రామబ్రహ్మం, ఇంటికి ఎంతమంది అతిథులను వెంటబెట్టుకొని వచ్చినా, ఆవిడ ఒక్కమాట అయినా అనేది కాదు! ఏ పాట్లు పడేదో, ఎలా వాళ్ళందరికీ వడ్డించేదో, ఆవిడకూ, అంతటి శాంతమూర్తిని పుట్టించిన ఆ పరమాత్ముడికీ మాత్రమే ఎరుక!


శారదాంబ

* * *

మద్రాసులో పరిచయం అయిన సముద్రాల రాఘవాచార్యులు రామబ్రహ్మాన్ని కలుసుకొని చాల రోజులు అవడం వల్ల, మిత్రుణ్ణి వెతుక్కుంటూ, చీరాలకి వచ్చేసాడు.

మిత్రులు ఇద్దరూ భోజనాలు ముగించి, డాబా మీద కుర్చీలు వేసుకొని కూర్చుని, కష్టసుఖాలు పరస్పరం చెప్పుకోసాగారు. ఆ ఉభయుల సంభాషణ ఈ విధంగా కొన సాగింది…"బ్రదర్! నీ పరిస్థితులు కూడ అంత బాగా లేవని విన్నాను! ప్రస్తుతం ఏం చేస్తున్నావు?" రామబ్రహ్మం ప్రశ్నకి సముద్రాల నిదానంగా, అంతవరకూ జరిగిన సంగతులను పూసగుచ్చిన పద్ధతిలో చెప్పసాగాడు.

"ఆ మధ్య మీ కుప్పుస్వామిగారు రేపల్లె క్యాంపుకి వచ్చేరు. అక్కడ ఆయనకు గొప్ప సన్మానం జరిగింది. ఆ సన్మానసభలో నేను ఆయన్ని ప్రశంసిస్తూ కొన్ని పద్యాలు చదివాను. సభానిర్వాహకుల బలవంతం మీద. సభానంతరం కుప్పుస్వామిగారికి నా కవిత్వం బాగా నచ్చి– 'ఆ కుర్రాడెవరు? ఏం చేస్తున్నాడు?' అని నా గురించి వారినీ, వీరినీ వాకబు చేసారట. ఆ తరువాత, నాకు ఎవరో ఆ సంగతి చెప్పేరు. 'సరే! ఇదేదో బాగుంది!' అని నేను అనుకున్నాను.

మరో పదిరోజుల తర్వాత, గుంటూరు వెళ్ళి, కుప్పుస్వామిగారిని కలిసాను. నా పరిస్థితులు ఆయనకి చెప్పుకున్నాను. నాకు ఏదైనా సాయం చేయమని అర్థించాను.

నా అభ్యర్థనను విని ఆయన కొన్ని క్షణాలు యోచించి – సముద్రాల! నీకు 'ఉభయ భాషా ప్రవీణ' వంటి డిగ్రీ ఏదయినా ఉండి ఉంటే, ఏ హైస్కూల్‌లో అయినా తెలుగు పండితుడుగానో, సంస్కృత పండితుడిగానో, ఉద్యోగం వేయించగలిగే వాడిని! డిగ్రీలు లేకపోవడం వల్ల అటువంటి వీలు ఏదీ లేదు! అయినా, ఫరవాలేదు! నువ్వు నిరాశ చెందవలసిన అవసరం లేదు. నేను ఒక విషయం చెప్తాను! విను! మా అబ్బాయి బెంగుళూరు నుంచి, ఇంటర్ మీడియట్ చదడటం కోసం ఇక్కడికి వచ్చేడు. వాడి పేరు చంద్రమౌళి.

మా వాడు బెంగుళూరులోని యూరోపియన్ స్కూల్‌లో చదువు కున్నాడు గనుక, వాడి తెలుగు పరిజ్ఞానం అంతంత మాత్రమే. నువ్వు మా అబ్బాయికి తెలుగులో తర్ఫీదు ఇయ్యి! కాస్త సాహిత్యాభిరుచి ఏర్పడేలా శ్రద్ధ తీసుకో! నీ గౌరవ వేతనం దండిగానే ఉండేలా నేను చూసుకుంటాను. ప్రస్తుతానికి నీకూ ఒక జీవనభృతి ఉంటుంది! మా వాడికీ తెలుగు భాషమీద ఆసక్తి కలుగుతుంది! ఆ తరువాత సంగతి తరువాత చూసుకుందాం, అని అన్నారు. నేను అందుకు ఒప్పుకున్నాను.

* * *

గుంటూరులో కుప్పుస్వామిగారింట్లో త్రిపురనేని రామస్వామి చౌదరి, రామబ్రహ్మం, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు వంటి ప్రముఖులు సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో, వాళ్ళంతా 'చిలుకూరి వీరభద్రరావు' రాసిన *ఆంధ్రుల చరిత్ర* ను గురించి తీవ్రంగా చర్చించు కోసాగారు.

"*ఆంధ్రుల చరిత్ర* అంటే, వివిధ కులాలకు చెందిన రాజులూ, వారి పరిపాలనా విశేషాలూ, ఆ పరిపాలనా కాలంలో వారు చేసిన సాహిత్యపోషణా వంటి అంశాలు అన్నీ అందులో ఉండాలి! లేకపోయినట్లయితే, అది సమగ్రం అనిపించుకోదు!" అన్నాడు రామస్వామి చౌదరి.

"అలా అంటే ఎలా కుదురుతుంది? ఆంధ్రదేశాన్ని రెడ్లు, వెలమలు, కమ్మవారూ వంటి వివిధ కులాలవారు పాలించారు. ఒక మనిషి ఒంటి చేత్తో వీళ్ళందరి చరిత్రనూ వెలికి తీయాలంటే, ఏ మనిషికి అయినా ఒక జీవితకాలం సరిపోదు! అంతా తలో చెయ్యి వేయాలి!" అన్నారు ఉన్నవవారు. "మీరు అన్నమాట బాగుంది! కట్టమంచి రామలింగా రెడ్డి గారు *రెడ్ల చరిత్ర*ను త్రవ్వి తీయించడానికి నడుం కట్టారట.

అలా చేస్తే, ఆ రెడ్ల చరిత్ర కూడా ఆంధ్రుల సమగ్ర చరిత్రకి ఉపయోగపడుతుంది కదా! ఇలా ఎవరికి వాళ్ళు, ఆయా కులాలకి సంబంధించిన చరిత్ర పరిశోధనకి పూనుకుంటే, పిల్లకాలువలన్నీ కలిసి, ఒక మహానది రూపం దాల్చినట్లు, సమగ్రమైన చరిత్ర తయారవకమానదు!" అన్నాడు రామబ్రహ్మం, ఉన్నవ వారి మాటలతో ఏకీభవిస్తూ.

"ఇంత మంది ఇక్కడ ఉన్నాం కదా! మనం కమ్మవారి చరిత్రను గురించి ఎందుకు పరిశోధన జరిపించకూడదూ? ఈ మహత్కార్యానికి అయ్యే ఖర్చంతా నేను పెట్టుకుంటాను. మీరంతా ఏమంటారు?" అంటూ కుప్పుస్వామిగారు, ఆ సమావేశంలో పాల్గొన్న వారినందరినీ అడిగారు.

అక్కడ ఆసీనులైన వారంతా "చాలా బాగుంది, మీ ఆలోచన!" అని కుప్పుస్వామిగారిని అభినందించారు. అనుకున్నంత తేలిక కాదు! ఈ పరిశోధన జరగాలీ అంటే, రాత్రింబగళ్ళు తాళపత్ర గ్రంథాలనూ, కైఫీయత్తులనూ, శాసనాలనూ పరిశీలించాలి. ఈ విధమైన సమాచారం అంతా మనకి మద్రాసులోని ఓరియంటల్ లైబ్రరీలో మాత్రమే లభిస్తుంది. కనుక, ఏ పరిశోధకుడు అయినా, మద్రాసులోనే కాపురం పెట్టి వుండాలి. ఇవన్నీ జరిగినప్పుడే మాత్రమే

కమ్మవారి చరిత్రను గురించిన పరిశోధన సాధ్యం అవుతుంది!" అన్నాడు రామబ్రహ్మం, సాలోచనగా. కుప్పుస్వామి ఫక్కున నవ్వారు, అతని మాటలకి. ఆ తరువాత ఆయన–

"భలేవాడివయ్యా రామబ్రహ్మం! కష్టపడకుండా, పనులు జరిగిపోతాయని మేము మాత్రం అన్నామా? ఆ మధ్య జరిగిన 'కమ్మ మహాజన సభ'లో నువ్వు ఏమన్నావ్? మన కమ్మవారికీ ఒక చరిత్ర ఉంది.

దాన్ని మనం శ్రమించి వెలికి తీయాలి! అలా బయటికి తీసిన కమ్మవారి చరిత్రను అచ్చువేయాలి! అదీ యిదీ అని పెద్ద ఉపన్యాసాన్నిచ్చి, తీరా ఇప్పుడు 'కష్టం' అంటూ అంగలారుస్తావా? నీ సంగతి ఏమీ బావులేదు సుమా" అని రామబ్రహ్మాన్ని హాస్యంగా మందలించారు. రామబ్రహ్మం మరేమీ మాట్లాడలేదు. ఆయన ఒక క్షణం ఆగి– "బాబూ! రామబ్రహ్మం! నువ్వూ, సముద్రాలా ముందు మద్రాసుకి బయలుదేరి వెళ్ళండి. రామస్వామిగారు అప్పుడప్పుడూ మీ దగ్గరకు వస్తూ ఉంటారు. మీరు చేసే పనిని పర్యవేక్షిస్తూ తగు సూచనలనూ, సలహాలనూ ఇస్తూ ఉంటారు. మీరు ఉండడానికి భోజన వసతి సదుపాయాలన్నీ నేను ఏర్పాటు చేస్తాను! నువ్వు మరేమీ సంశయించ వద్దు!"– అని చెప్పారు. రామబ్రహ్మం ప్రక్కనే కూర్చున్న కొసరాజును ఆయన దగ్గరికి పిలిచి –

"రాఘవయ్యా! నువ్వు వెంటనే నీ భార్యను తీసుకొని మద్రాసుకు ప్రయాణం కట్టు! అక్కడ ఒక మంచి ఇల్లు అద్దెకు తీసుకో! నువ్వూ, రామబ్రహ్మం, సముద్రాలా, రామస్వామిగారూ ఈ పరిశోధనా కార్యక్రమాన్ని సాగించండి! మీకు డబ్బు అవసరమయినప్పుడల్లా ఓ కార్డు ముక్క రాసిపడెయ్యండి! నేను డబ్బు పంపుతూ ఉంటాను!" అని అతనికి చెప్పారు. కొసరాజు – 'అలాగే' అన్నాడు. వినయంగా.

అందరూ కుప్పుస్వామిగారి నిర్ణయాలను ఆమోదించేరు. కమ్మవారి చరిత్ర పరిశోధనకి, ఈ విధంగా నాంది ప్రస్తావన జరిగింది. కొసరాజు రాఘవయ్య, కుప్పుస్వామిగారికి ఇచ్చిన మాట ప్రకారం, సత్వరమే మద్రాసుకు ప్రయాణం కట్టాడు. అతను మద్రాసులో దిగిన తరువాత, ట్రిప్లికేన్ బెల్సురోడ్డులో, రెండవ నెంబరు ఇల్లును అద్దెకు తీసుకున్నాడు. మరి కొన్ని రోజులలో, అందరూ ఆ ఇంట్లో మకాం పెట్టేరు. ఒక్క రామబ్రహ్మం తప్ప. అతను రేపో మాపో రానున్నాడు.

మద్రాసుకి ప్రయాణం అయ్యేటప్పుడు, కుప్పుస్వామిగారు రామబ్రహ్మానికి పరిశోధన నిమిత్తం, తాంబూలంలో వెయ్యి నూటపదహార్లు ఒక పళ్ళెంలో పెట్టియిచ్చారు. రామబ్రహ్మం ఆ డబ్బుని కళ్ళకు అద్దుకొని, జేబులో పెట్టుకున్నాడు. కుప్పుస్వామిగారి ఇంటినుంచి బయటికి వచ్చి, రామబ్రహ్మం రోడ్డు మీద పడ్డాడు.

పర్సులో నుంచి ఒక వెండి రూపాయిని తీసి. దానిని పరిశీలనగా చూశాడు. 'ఫ్రెండ్స్ అండ్ కో'ను ప్రారంభించినపుడు, మొట్టమొదట బోణీ చేస్తూ, ఎవరో ఒక రిస్టువాచిని కొని, ఇచ్చిన డబ్బులో, ఆ కొత్త రూపాయిని దాచుకున్నాడు. 'తన స్వతంత్రార్జనలో మిగిలిన ఆఖరురూపాయి ఇదే!' అలా అనుకోగానే, అతని మనసంతా దిగులుతో నిండిపోయింది.

**ఎవరో పిలిచినట్లయి, ఉలిక్కిపడి, ఎదురుగా చూసేడు. రామబ్రహ్మం ముందు చేయిజాచి, ఒక బిచ్చగత్తె నిలబడింది. ముదివగ్గు, నడుము వంగిపోయి, పళ్ళూడిపోయి, బోసి నోటితో, ఆశగా రామబ్రహ్మంకేసి చూస్తోంది, ఆ వృద్ధురాలు. రామబ్రహ్మం హృదయం ద్రవించిపోయింది. ఆ బిచ్చగత్తెని చూసీ చూడగానే మరుక్షణం, తన చేతిలో మిగిలున్న ఆ ఒక్క వెండి రూపాయిని ఆమె చేతిలో పెట్టేసి, చక చకా ముందుకు నడిచాడు.**

* * *

రామబ్రహ్మం శారదాంబను తీసుకొని, మద్రాసుకి వచ్చేసేడు. పగలంతా ఓరియంటల్ లైబ్రరీలో పాత రికార్డులనూ, గ్రంథాలనూ తిరగవేస్తూ, పరిశోధనలో తలమునకలై పోయేవాడు. సాయంకాలం పూట, కాస్త తీరిక చిక్కితే, కొసరాజుతో పాటు మునిస్వామి నాయుడు ఇంటికి వెళుతూ ఉండే వాడు.

'కాకతీయులు కమ్మవారా? వెలమలా?' 'నీడు', 'నాయుడు' ఇలాంటి అంతిమ పదాల పేర్లు కలవారు అందరూ ఏక జాతీయు లేనా? 'చాగి' వారు 'సాగి' వారు ఒకరేనా?

ఇలా ఎన్నెన్నో సందేహాలు, ఈ పరిశోధన క్రమంలో రామ బ్రహ్మాన్ని ఉక్కిరి బిక్కిరి చేసేవి. ఆయన మునిస్వామినాయుడితో గంటల తరబడి చర్చిస్తూ ఉండేవాడు.

**_'సమదర్శిని' నుంచి 'ప్రజామిత్ర' వరకూ సాగిన ప్రస్థానం:_**

ఒకరోజు..."రామబ్రహ్మం! చరిత్ర పరిశోధన పట్ల నీ

## ద్వితీయాంధ్ర మహాసభ లో రామబ్రహ్మం

దేవరకొండలో సమావేశమైన ద్వితీయాంధ్ర మహాసభా సందేశ వివరములను తెలుపుటకుగాను హైద్రాబాదు ఆంధ్ర జనసంఘపక్షమున శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయమందు 13 మార్చి 1931న శుక్రవారము సాయంకాలము ఒక బహిరంగసభ జరుపబడినది. శ్రీయుతులు సురవరం ప్రతాపరెడ్డిగారు, మాడపాటి హనుమంతరావుగారు, కొండా వెంకట రంగారెడ్డిగారు, సూర్యప్రకాశరావుగారు, ఇల్లిందుల సీతారామారావుగారు, గాడేపల్లి సత్యవతీదేవిగారు, మాడపాటి మాణిక్యమ్మగారు, బూర్గుల రామకృష్ణారావుగారు, మందుముల రామచంద్రరావుగారు, మారేమండ రామారావుగారు, గూడవల్లి రామబ్రహ్మంగారు మున్నగు వారు సుమారు 200 మంది విచ్చేసియుండిరి. శ్రీయుత సురవరం ప్రతాపరెడ్డిగారు అధ్యక్షత వహించిరి.

మొట్టమొదట మారేమండ రామారావుగారు ఎం.ఎ. ఉపన్యసించిరి. రామారావుగారు ఆంధ్రోద్యమములో పనిచేయుచున్న కొందరు వ్యక్తులను ప్రశంసించుచు విచిత్ర ఫక్కిని చిత్రించిరి. తరువాత శ్రీయుత గూడవల్లి రామబ్రహ్మంగారు మాట్లాడిరి. వీరు బెజవాడ కాపురస్తులుగా సుప్రసిద్ధ ఆంధ్రప్రముఖులు. ఇచ్చటి సోదరాంధ్రుల ప్రీతిచే ద్వితీయాంధ్ర మహాజనసభకేతెంచారు. దారిపొడుగునను నిజాము పోలీసువారు వీరికి కలిగించిన ఇక్కట్టులను ఒడలు జలదరించునట్లు వర్ణించిరి. ద్వితీయాంధ్రమహాసభ సందర్శనము వారికానందము కలిగించినది. బ్రిటీషు ప్రాంతములో జరుగు ఆంధ్ర సభలకన్న నిది మిక్కిలిప్రాతినిధ్యవంతమగు సభయని వారియభిప్రాయము. ఏలయన వివిధ తరగతుల వారు, వివిధ వృత్తులవారు, ఒక్క వేదికపై నిలిచి తమతమ కష్టనిష్టూరములను చెప్పుకొనుట గణనీయ విషయము. ముఖ్యముగా వెట్టిచాకిరిని గూర్చిన తీర్మానము వారికి నచ్చినది. చాకలి వీరన్నమొర, పటేలుగారి యుపన్యాసము, ఆంధ్రమహాసభ యొక్క యాదర్శము ఆంధ్రజాతి యొక్క వికాసమనుట ఎట్లు స్పష్టము చేయుచున్నదో వివరించిరి.

ఇచ్చటి పరిస్థితులననుసరించి నిజాము రాష్ట్రాంధ్రులు ప్రత్యేక సభల నేర్పాటు చేసికొనుట సమంజసమైనట్లు దేవరకొండ సభను దర్శించిన తరువాత రామబ్రహ్మంగారు గ్రహించిరి. ఇట్లు ప్రత్యేకసభలను జరిపినంతమాత్రాన బ్రిటీషు ఆంధ్రులువేరు, నిజామాంధ్రులువేరు అనుభావమునకు అవకాశము లేదనియు, ఇచ్చట ఉన్న బ్రిటీషాంధ్రులు ఈ యుద్యమమునకు తోడ్పడవలెననియు రామబ్రహ్మంగారు హెచ్చరించిరి. ఈ సభా కార్యక్రమాలను ఫిల్మ్‌గా రామబ్రహ్మం చిత్రీకరించారు.

**– జితేంద్రబాబు**

శ్రద్ధాసక్తులు నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్నాయి! నువ్వు మా *సమదర్శిని* పత్రికలో సహాయ సంపాదకుడిగా చేరు! నువ్వు ఇంత దాకా పరిశోధించిన అంశాలను, వ్యాసాలరూపంలో మా పత్రికలో ప్రచురించు! నీ సందేహాలను ఆ వ్యాసాలలో పరిశోధకుల ముందు ఉంచు! చరిత్ర పరిశోధకులు నీ సందేహాలను తీర్చినా తీర్చవచ్చును. పాఠకులు నీకు మరికొంత అదనపు సమాచారాన్ని అందించవచ్చును" అని మునుస్వామి నాయుడు అన్నారు.

రామబ్రహ్మానికి ఆ సలహా బాగా నచ్చింది. వెంటనే, సమదర్శిని పత్రికలో సహాయ సంపాదకుడిగా అతను చేరిపోయేడు.

* * *

బ్రాహ్మణేతర ఉద్యమం *జస్టిస్ పార్టీ*గా కొత్తరూపును సంతరించుకున్న అనంతరం, తమ పార్టీ ఆశయాల ప్రచారం కోసం *సమదర్శిని* పత్రికను ఆరంభించింది. మొదట్లో ఈ పత్రికకి పింజల సుబ్రహ్మణ్య శెట్టి ప్రచురణకర్తగా, సంపాదకుడుగా ఉండేవాడు. వీరు వేలుపాలెం నుంచి తమిళ ప్రాంతానికి వెళ్ళి స్థిరపడ్డ తెలుగువారు. ఈ పత్రికకు వాస్తవానికి సంపాదకత్వ బాధ్యతలను గానాల రామ్మూర్తి నిర్వహిస్తూ ఉండేవాడు. వీరు గుంటూరు ప్రాంతం వారు.

*జస్టిస్‌పార్టీ* వెలువరించే పత్రికలకి రామబ్రహ్మం, దువ్వూరి రామిరెడ్డి సంపాదకవర్గంలో ఉండి పని చేశారు. *సమదర్శిని* కొంతకాలం దినపత్రికగానూ, ద్వైవార పత్రికగా మరికొంత కాలం వచ్చేది. ఉగాది సంచికలకు వివిధ

అంశాలతో, ప్రముఖ పండితుల వ్యాసాలతో, ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ ప్రచురించేవారు. ఇరవయ్యో శతాబ్దం పూర్వార్థంలోని ప్రసిద్ధ రచయిత లందరూ యిందులో రాస్తూండేవారు. అప్పట్లో బ్రాహ్మణేతర ఉద్యమంలోని మంచివైపు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ఆకర్షితులై 'ఈ ఉద్యమాన్ని మనమెందుకు సమర్థించకూడదు?' అంటూ వ్యాసాలు రాశారు.




ప్రజామిత్ర

సంక్రాంతిసంచిక

(బహుధాన్య)

మా—

పోషకులకు

పాఠకులకు

ప్రకటనకర్తలకు

సర్వశ్రేయములను సహకార్ప

'ప్రజామిత్ర'

పుట్టినరోజు పండగ

... ...

ఈ శుభసంక్రాంతి సమయమున



*

సర్వేశ్వరుని

వినయవినమితుడనై ప్రార్థిస్తూ వున్నాను.

'ప్రజామిత్ర' 1939 సంక్రాంతి సంచిక ముఖచిత్రం, మొదటి పుట

సంక్రాంతి కానుక

ఆంధ్రలోకానికి ఈ ప్రత్యేక సంచిక నా సంక్రాంతి కానుక.

సంక్రాంతి కర్షక కార్మికుల పండుగ; ప్రజామిత్ర కర్షక కార్మికుల పత్రిక. సంక్రాంతికీ, కర్షక కార్మికులకూ, ప్రజామిత్రకూ వున్న అవినాభావ సంబంధానికి ప్రత్యక్షరూప మీప్రత్యేక సంచిక.

కర్షక కార్మికులకు సంతోషదాయకమైన సంక్రాంతి పర్వదిన సందర్భంలో వారి ఆనందంలో పాల్గొనాలనే తలంపేకాకుండా, ఈ ప్రత్యేక సంచికను వెలువరించడంలో ఇంకొక వుద్దేశంకూడా వున్నది.

సంక్రాంతి ప్రజామిత్రకు పుట్టినరోజు. అంచేత ఈ ప్రత్యేకసంచిక ద్వారా ప్రజామిత్ర తన పుట్టినరోజు పండుగను చేసుకుంటున్నది.

కూడినంతవరకు ఆంధ్రదేశానికి సేవచెయ్యాలనే ఉద్దేశంతో ఆరు సంవత్సరాలనాడు ఈ పత్రిక ప్రారంభమైంది. ఈ ఆరు సంవత్సరాలలోనూ ఆంధ్రమహాజను లిచ్చిన తోడ్పాటును, చూపిన ఉత్సాహాన్ని, ప్రకటించిన ప్రేమను బట్టిచూస్తే, ప్రజామిత్ర తన వుద్దేశ్యసాఫల్యాన్ని చేసుకుంటున్నదని స్పష్టపడుతున్నది.

ప్రజామిత్ర ఏ రాజకీయపక్షానికీ చెందిన పత్రికకాదు. దానిది ఒకటే పక్షము—అది కర్షక కార్మికపక్షము; ఒకటే లక్ష్యము—అది ప్రతిఫలాపేక్ష కాని ప్రజాసేవ; ఒకటేమార్గము—అది జంకుగొంకులులేని సత్యవిమర్శనము.

పత్రికా నిర్వహణము సులభమైనపని కాదు. కాని, ఆంధ్రమహాజనుల ఆదరాభిమానాలతో ప్రజామిత్రను రానున్న సంవత్సరములో ఇంకను అభివృద్ధి పరచి, ఆదర్శప్రాయంగా చెయ్యాలనే నా ఆశయం.

కొత్త సంవత్సరంలో ఆంధ్రరాష్ట్రసముపార్జన ఆందోళనానికి నా సర్వశక్తుల్ని కేంద్రీకరించి ప్రజామిత్రద్వారా కృషిచెయ్యాలని నా సంకల్పం.

మా ప్రధాన పోషకులకు, శ్రేయోభిలాషులకు, పాఠకులకు, ప్రకటనకర్తలకు సంక్రాంతి శుభదాయకమూ, ఆనందసంధాయకమూ కావాలని కోరుతున్నాను.

సంపాదకుడు, వ్యవస్థాపకుడు

'ప్రజామిత్ర' 1939, సంక్రాంతి సంచికలో రామబ్రహ్మంగారి సంపాదకీయం

జమీందార్లతో సన్నిహిత సంబంధాలు ఉండడం, అన్నింటికీమించి అంతకుపూర్వం, జస్టిస్ పార్టీకి చెందిన బొబ్బిలి రాజాకు ఆంతరంగిక కార్యదర్శిగానూ, మేనేజరుగానూ పని చేయడం వంటివన్నీ కారణాలైనందు వల్ల, తాపీ ధర్మారావు *సమదర్శిని* పత్రికకి సంపాదకత్వం బాధ్యతను స్వీకరించవలసి వచ్చింది. ఉప సంపాదకుడిగా రామబ్రహ్మం చేరాడు. అప్పుడది ద్వైవార పత్రిక.

*సమదర్శిని* జైళ్ళలో ఉండే కాంగ్రెసు వాళ్ళకు సత్యాగ్రహ వార్తలను అందించే ఏకైక పత్రిక అయింది. ఇది *జస్టిస్ పార్టీ* రాజకీయ ప్రచార వేదికగా ఉన్నా, సాహిత్య పరంగా చూస్తే మౌలిక రచనలెన్నో అందులో అచ్చవు తూండేవి. చలం, ముద్దుకృష్ణ, పురిపండా, ఉన్నవ మొదలైన సాహిత్యకారుల రచనలు *సమదర్శిని*లో ప్రచురింపబడేవి. ఈ పత్రికలో అనేక విషయాలకు సంబంధించిన ఛాయా చిత్రాలు కూడా అచ్చేసేవారు.

*సమదర్శిని* పత్రికకి తాపీ ధర్మారావు సంపాదకుడిగా ఉండేవాడు. ఆకస్మాత్తుగా అతనికి మందసా రాజుగారి అబ్బాయికి చదువు చెప్పే సదవకాశం లభించింది. దాంతో ఆయన పత్రిక సంపాదకుడి ఉద్యోగాన్నీ, మద్రాసునీ విడిచిపెట్టి మందసాకి వెళ్ళిపోయేరు. పత్రికను నిర్వహించే సామర్థ్యాన్ని యీ సరికే రామబ్రహ్మం పుష్కలంగా గడించడంవల్ల, అలా తాపీ ధర్మారావు పత్రికని వదిలిపెట్టి వెళ్ళగానే, ఇలా రామబ్రహ్మం సమదర్శిని పత్రికకి సంపాదకుడు కావడం తటస్థించింది.

గూడవల్లి రామబ్రహ్మం సంపాదకత్వంలో *సమదర్శిని* పత్రిక, ఒక వినూత్న శోభను సంతరించుకుంది. రామబ్రహ్మం పరిశోధన వ్యాసాలు ఎన్నెన్నో ఈ పత్రికలలో ప్రచురింపబడటం జరిగింది. రామబ్రహ్మం చరిత్ర పరిశోధన వ్యాసాలు, ఎంత పరిణత స్థాయిలో ఉండేవి. అంటే, 'ప్రజోత్పత్తి' ఉగాది సంచికలో ప్రచురితమైన 'అరయుడు విప్పర్లవారు' అనే వ్యాసం ఒక్కటి చదివితే చాలు! మి

మిగతా వచ్చే సంచికలో....

# సృజన – నేటి ఆవశ్యకత

– కె. బాలకృష్ణారెడ్డి

"నన్నెవరాపలేరీవేళ నా ధాటికోపలేరీవేళ
నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు
నా ఇచ్ఛయేగాక నా కేటి వెరపు"

ఒకనాడు భావకవిత్వాన్ని నిరసించినవేళ, భావ కవితామేస్త్రి దేవులపల్లి కృష్ణశాస్త్రి గుండెలోంచి ఉప్పొంగిన కవితా ధార ఇది.

ఆయన హృదయంలో ప్రభవించిన కవితావేశమిది. ఆ కవితా వనాంతరాలలో ఆ పూదోటలలో ఈ నాటికీ విహరించేవాళ్ళు కోకొల్లలు.

మనసును ఝుమ్మనిపించే భావాలు, మమతానురాగాలు, మాధుర్యాలు ఆయన కవిత్వంనిండా ఎన్నటికీ వసివాడని విరి మల్లెలు.

— 0 —

భావ కవిత్వం అనుభూతి కవిత్వం. మనిషికి కావలసింది ఆనందం, ఆహ్లాదం, దిగులు విచారం లేని జీవితం. సుఖశాంతులతో అలరారే జీవనం.

భావకవిత్వానికి లతలు, తరులు, విరులు, గిరులు వంటి ప్రకృతి ప్రసాదించిన లలిత లలిత లావణ్య విభవాలు అపూర్వ సాధనాలు.

నేను భావకవిత్వ నిర్వచనంగాని, ఉపోద్ఘాతం గాని చెప్పబోవడం లేదు. అది అందరికి తెలిసిందే అందుకే భావకవిత్వం ఆవశ్యకత దాని ప్రయోజనం గురించి చెప్పాలనుకొంటున్నాను భావకవిత్వంలో సైతం ఇతర ప్రక్రియల జోలికి పోకుండా ప్రణయ కవిత్వం, ప్రేమ కవిత్వం గురించి పృచ్ఛ చేస్తాను.

— 0 —

తనను తాను ప్రేమించుకొననివాడు లోకాన్ని ప్రేమించలేడు
తనను తాను మరచిపోయినవాడు సమాజానికి పనికిరాడు
నేడు మనిషి, మనసున్నదని మరిచిపోయాడు, అందులో మమత ఉన్నదని మరచిపోయాడు

మమతానురాగాలలో జీవనరాగం పొదిగి ఉన్నదనీ మరిచిపోయాడు

మంటలకడ్డంగా పడి నడిచి వెళ్తున్నాడు. పరుగుల జీవితంలో ఇరుగుపొరుగునే కాదు తనని తాను మరిచిపోయాడు

దానికోసమే రమణీయ భావకవిత్వం అవసరం ఎంతో ఉంది. ముందుగా తనకొక మనసున్నదని గుర్తించాలి. మనసును విస్మరించిన జీవితం ఒక ఎడారి

జీవనస్పృహ కోల్పోయిన మనిషికి సమాజ స్పృహ ఉండదు. అంతులేని, 'ఆకలి'గొన్నవాడికి ఎంత తిన్నా కడుపు నిండదు

— 0 —

ఈ సందర్భంగా మనసు, హృదయం, గుండె ఈ మూడింటి తారతమ్యాలను వాటి పసితనాలను అంతరాలను గురించిన కవిత ఒకటి ముచ్చటిస్తాను

'అందరికి గుండె ఉంటుంది వందేళ్ళు బతికుండాలి కాబట్టి

కొందరికే హృదయం ఉంటుంది రాగద్వేషాలు మోయాలి కాబట్టి

అతి కొద్దిమందికే మనసుంటుంది మల్లెల పరిమళాలలో చుట్టి'

గుండెకు సంబంధించినవి పలు రోగాలు బిపి, కొలెస్ట్రాల్, మధుమేహం, ఒత్తిడి, మృత్యువు

హృదయాన్నంటిపెట్టుకొని ఉండేవి రాగద్వేషాలు, అరిషడ్వర్గాలు, ఉత్పాతాలు, ఉన్మాదాలు

ఇక మనస్సు మనసు మందిరంలో అభిమానం అనురాగ ప్రేమ ప్రణయం ఆరాధన అనుబంధం ఆర్ద్రత ఇలా

మనసు విశిష్ఠత అది అందుకే ఇది మనసు కవిత్వం అనికూడా అని నా భావన

'తనువుకెన్ని గాయాలైనా మాసిపోవునేలాగైనా

మనసుకొక్క గాయమైనా మాసిపోదు చితిలోనైనా'

'మనసులేని బ్రతుకొక నరకం

మనిషికెక్కడ ఉన్నది స్వర్గం

మరణమేనా దానికి మార్గం'

అలనాటి పాటలన్నీ భావకవితా దీపికలే. మనసును ఝుమ్మనిపించే మలయపవన మాలికలే ఆనాడు ప్రబంధాలు, రమణీయ కావ్యాలెన్నో భావుకత నింపుకొని మనసుచుట్టూ మనిషిచుట్టూ పరిభ్రమించాయి.

అందుకే అవి పది కాలాలపాటు మనగలిగాయి, చిరంజీవులయినాయి, చిరస్మరణీయాలైనాయి

ఎందుకు చెబుతున్నానంటే మనసుకు సంబంధించినది భావ కవిత్వమని-

గుండెకు సంబంధించినది అభ్యుదయ కవిత్వమని నా అభిప్రాయం

— 0 —

ప్రేమలు ఆప్యాయతలు అనురాగాలు అనుబంధాలు విస్మరించిన మనిషి – అసలు మనిషి ఎలా ఔతాడు

నేడు అన్ని సంబంధాలు అంతర్ధానమై ఆర్థిక సంబంధాలు మిగిలిపోవడానికి కారణం.

మనిషిలో ఇగిరిపోయిన ఆర్ద్రత, మరుగుపడి పోయిన మానవత'

ఇంటిని గెలిచి రచ్చ గెలవమన్నారు

ముందుగా మనసును తెలుసుకోవాలి. మనసును గెలుచుకోవాలి నిన్ను నువ్వు సంస్కరించుకోవాలి

ఆ తర్వాతనే దేశం, సమాజం, లోకం, విశ్వం గురించి ఆలోచిద్దాం

ఆనందంగా జీవించడం నలుగురికీ ఆనందం పంచడం ఇరుగు పొరుగును ప్రేమించడం

ఈ సుగుణాలు అంతర్ధానమైపోవడానికి కారణం పరుగుల జీవితం కావచ్చు

ముంచుకొచ్చిన ప్రపంచీకరణ కావచ్చు

తొలినాటి భావాలు మరలా చిగురు తొడగాలంటే భావకవిత్వం పునరుద్ధరించడం ఒకటే ఏకైక మార్గం

— 0 —

మనిషికి జీవనస్పృహ కలిగించాలి. ప్రతిక్షణం ప్రతి నిముషం పరమానందంగా జీవితం గడిపేమార్గం అన్వేషించాలి.

నేనంటుంటాను ప్రతి నిమిషాన్ని తేనెలో ముంచి ప్రతిరోజు గడిపేయాలని, ఆ తియ్యదనంలో అనుదినము తాధాత్మ్యం చెందాలని

సినారె తన సిద్ధాంత గ్రంథం "సంప్రదాయాలు ప్రయోగాలు"లో ప్రకృతి కవి వర్డ్స్వవర్త్ యొక్క మనోభావాలను ఇలా వివరించారు

"ఉద్రేకము నుదుకెత్తించెడు వస్తువును తీసికొని కావ్యమల్లడం తనపని కాదని

నెత్తురు గడ్డకట్టించెడు భయానక గాథలల్లే శక్తి తనకు లేదని

ఆమని నీడలో కూర్చొని రసాత్మలకు సరళ సంగీతమందించుటలో తనకు ఆనందముందని"

అలనాటి భావకవితా ప్రాశస్త్యాన్ని ప్రాభవం వైదుష్యం ఆవశ్యకతని మాత్రమే వివరిస్తున్నాను.

దేవులపల్లి తన భావగీతాలతో పాటలతో మన హృదయాలలో, మన నాల్కలపై ఈ నాటికీ నర్తిస్తూనే ఉన్నాడు

అదీ భావ కవిత్వం గొప్పదనం. ఇంకా రాయప్రోలు, నండూరి, విశ్వనాథ, గురజాడ, వేదుల, నాయని

తమ భావకవితారీతులతో వెదజల్లిన అసమాన

కవితాధార మన ముంగిళ్ళలో నేటికీ అలరిస్తూనే ఉంది.

ఆ పాటలే పూలతోటలే, సడిసేయని గాలులే, మనసున ఊగిన మల్లెల మాలలే మన

హృదయాలలో ఇంకా పదిలంగా ఉన్నాయి

మనసుని రవళించాలేగాని హృదయాన్ని వెలిగించగలగాలే కాని,

వేకువ వెలుగు అందాలలో, రేకులు విచ్చిన కుసుమాలలో, పెదవిని మీటిన దరహాసాలలో

తుమ్మెద పాటల ఇతిహాసాలలో,

అరమూసిన కన్నుల బాసలలో, అరుదెంచిన మధుమాసాలలో, ఎక్కడ చూచినా అద్భుత

సౌందర్యం అపురూప లావణ్యం

ఆర్జన జీవన పరమావధియై, ఆనందం కనుమరుగైన జీవితాలలో, కదలే ఊహలు లేవు

కన్నుల బాసలు లేవు, వెన్నెల విన్యాసాలు తెలియవు, హృదయాలు ఊయలలూగవు,

ఎక్కడ చూచినా మనసును విసిరేసినవాళ్ళు, మమతను మసిచేసినవాళ్ళు,

కలలను తరిమేసిన వాళ్ళు, మాధుర్యాన్ని చిదిమేసినవాళ్ళు......

అంతరంగంలో లాలిత్యం, ప్రేమతత్వం కనుమరుగువుతున్నవేళ, పెదవులపై చిరునవ్వులు

మాయమౌతున్నవేళ,

జడత్వం ఆవరించుకొన్న మనిషిని తట్టిలేపి, అందాలను అద్భుతాలను తెలిజేసేదే,

మనం మరచిపోయిన మమత, మమకారం, ఆరాధన, అనురాగం, సౌందర్యం, లావణ్యం,

ప్రతి హృదయంలో ప్రతిష్ట చేసేదే భావకవిత్వం.

— 0 —

కాలాలు మారిపోతుంటాయి, ఇజాలు చెదిరిపోతుంటాయి, కవిత్వ రీతులు వేయి పాయలుగా

సాగుతుంటాయి

కొన్ని అంతర్థానమైపోతుంటాయి. కాని మనసుకు సంబంధించిన ఈ కవిత్వం మాత్రం

శాశ్వతం నిత్యనూతనం

ఎల్లవేళలా మనసు నిత్యనూతనంగా ఉండాలని ఆనందంతో ఓలలాడాలని నా అభిప్రాయం.

అప్పుడే మనిషి శాంతి సుఖ జీవనం సాగిస్తాడు

ప్రకృతిలో మమేకమైనప్పుడు మాత్రమే ఇది సంభవం.

మనిషి సమాజాన్ని ప్రభావితం చేస్తాడు.

తన లోపల అలజడి ఆందోళన చెలరేగినవేళ, సమాజంకూడా ఛిన్నాభిన్నం ఔతుంది

అస్తవ్యస్తం ఔతుంది

భావకవిత్వంలోనే సౌలభ్యం, సౌకుమార్యం, సౌమనస్యం అదే

మనిషిని మనిషిగా మలిచేందుకు మానవత్వం వికసింపజేసేందుకు ఈ కవిత్వం ఆవశ్యకత

ఎంతైనా ఉంది

— 0 —

అందుకే నేను ఈ మార్గాన్ని ఎంచుకొన్నాను.

దాదాపు 90 శాతం మంది కవులు, అనుసరిస్తున్న మార్గాన్నికాక, ఈ పూలదారిని

నడిచిపోతున్నాను.

ఎన్నో హృదయాలను రవళిస్తూ పాటలుగా ప్రణయ కవితలుగా సాగిపోతున్నాను.

అయితే నాదొక విన్నపం ఏ మార్గం ఎంచుకొనే కవికయినా నిష్ఠురత అవసరం, ఏదైతే తను

ఆచరిస్తాడో అదే రాయాలి

అవినీతిలో, అక్రమార్జనలలో నిరంతరం సంచరించేవాడు అనుబంధాలు, ఆత్మీయతలు

విస్మరించినవాడు అసలు ఏ కవిత్వం రాయకూడదు

కవి సమాజానికి ఆదర్శం కావాలి, తను ఆచరించేదే పాటించేదే నలుగురికి చెప్పాలి అదే అసలైన

కవిత్వం

— 0 —

తనను తాను ప్రేమించినవాడు సాటి మనిషిని ద్వేషించలేడు. దాచుకోడానికి దోచుకోడానికి

సాహసించడు

అందుకే మూలాలను శుద్ధిచేసే కర్తవ్యం కవులందరిపైన ఉంది. ముఖ్యంగా మనసును ప్రభావితం

చేసే భావకవులమీద ఉంది

శతాబ్దాలనాడు సమాజంలో అశాంతి లేదు, అత్యాశలు లేవు, దుర్మార్గాలు లేవు, దురాగతాలు

లేవు

అందుకే అభ్యుదయ కవిత్వం ఆవశ్యకత ఆనాడు లేదు

మనిషి మానవత మరిచిపోయినందుకు గర్జిస్తూ, నిర్జిస్తూ, నిరసిస్తూ నేటి కవిత్వం అవతరించింది.

దయనీయమైన పరిస్థితి ఏమిటంటే ప్రస్తుతం

ఎవరికీ ఏ కవిత్వం రుచించదు. ఏ కావ్యం కనిపించదు

అక్షరాల గవాక్షాలు అగుపించవు. పుస్తకాలు అర్థం కావు

సాహిత్యం సరిపడదు. అందుకే విలువలు దిగజారిపోయాయి

ఈ గతిని సరిదిద్దాలంటే భావ కవిత్వం ప్రేమకవిత్వం ఒకటే శరణ్యం

— 0 —

సున్నితత్వం అలవడినపుడే ఏ మనిషికైనా ప్రేమించడం, సమాజాన్ని ప్రేమించడం సాధ్యమౌతుంది

ముఖ్యంగా దేశంగాని సమాజంగాని వ్యక్తి ఆలోచనలనుబట్టి రూపుదిద్దుకొంటుంది. రక్కసి భావాలు చెలరేగితే దేశం మొత్తం అస్తవ్యస్తమౌతుంది

"బుద్ధదేవుని భూమిలో పుట్టినావు
సహజమగు ప్రేమ నీలోన చచ్చెనేమొ
అందమును హత్యచేసెడి హంతకుండ
మైల పడిపోయెనోయి నీ మనుజ జన్మ."

పూలకూ మనసుందని, గుచ్చితే గాయమౌతుందని, సున్నితంగా హెచ్చరిస్తారు తన పుష్పవిలాపం కావ్యంలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు

ఈ నాలుగు పాదాలు వింటే ఏ హృదయం కరిగి నీరై ప్రవహించదు?

పూలకూ ప్రాణం ఉందని గుండె గాయం ఔతుందని హెచ్చరించిన తీరు

ఆ పూలతోనే నేరుగా దయనీయంగా ఆవేదన పలికించిన తీరు అద్భుతం అనన్యం

నేడు మనిషి గుండె రాయిగా మారిన వైనాలు, మనిషి కసాయిగా మారిన దృశ్యాలు, క్రౌర్యం నడి బజారులో కవాతు చేస్తున్న సన్నివేశాలు.

ప్రేమ పేరుతో గొంతు కోస్తున్న సంఘటనలు, ప్రేమించలేదని యాసిడ్ దాడులు

ఏ సంస్కారానికి సంకేతాలు – ఏ మానవతకి తార్కాణాలు

ఉన్నత విలువలు సంతరించుకొనాలంటే సున్నితత్వం అలవడాలి. ఇందుకు మనకు కవిత్వం ఒకటే దోహదం చేస్తుందనే నా అభిప్రాయం

— 0 —

మనసనేది మొద్దుబారి పోయింది. మనిషి బుద్ధి మారిపోయింది

సౌమనస్యం, సౌకుమార్యం, సమభావం సుదూరతీరాలకు పారిపోయింది

ఫలితం మానవత్వం మటుమాయమైంది, మృగలక్షణం జూలు విదిల్చింది

అందుకే మనిషి మూలాలనుండి కదలిక రావాలంటే, మనసు మూలాలలో చికిత్స జరగాలి

సున్నితమైన భావాలు మొలకెత్తాలి, సుందర మనోమందిరాలు నెలకొనాలి

మనిషిని సంస్కరించే దిశగా, మమతలు అంకురించే దిశగా, ఎన్నో కావ్యాలు రావాలి, రాయాలి
ఈ పాటికే వందల వేల కావ్యాలు మన భాండాగారాలలో నిర్దయగా పడి ఉన్నాయి
అంగట్లో అన్నీ ఉన్నా.... అన్న చందంగా ఏ ఆదరణ నోచుకోని విధంగా,
అసలు మనసనేది గొప్ప సృష్టి
ఆ దైవం మనిషికి ప్రసాదించిన అద్భుత వరం
అందులో మమకారాలు, మలయానిలాలు, మధుమాసాలు, మందహాసాలు పుష్కలంగా పొదిగి ఉన్నాయి
అయితే మనసు తలుపులు మూసి, చీకటి గుయ్యారంచేసి, మారణకాండను సృష్టించే వారేగాని
మమతానురాగాలు మరిచి, మానవత్వపు తొడుగులు విడిచి,
మరీచికలవైపు నడిచిపోయేవారే గాని
ఆ అద్భుతాలను ఉపయోగించుకొనేదెందరు అసలు ఆ స్పృహ కలిగిన వారెందరు

— 0 —

వేరు పురుగు వృక్షాన్ని భక్షిస్తుంటే, చీడపట్టిందని ఆకుల్ని రేకుల్ని
ఔషధాలతో అభిషేకిస్తే ఏం లాభం
దేహమంతా పరుగులు తీసే రక్తంలో దోషం ఉంటే పైపైని లేపనాలు ఏం ప్రయోజనం
రుజాగ్రస్తమైన మూలాలను కనిపెట్టి, శుద్ధిచేయాలి
మరుగున పడిపోయిన మనసును వెదికిపట్టి, బుద్ధినేర్పాలి
భావకవిత్వమొక్కటే ఈ మహత్కార్యాన్ని సాధిస్తుంది
ఆర్ద్రమైన అనురాగ గీతమొక్కటిచాలు మనసు మందారమై వికసిస్తుంది.
కళ్ళెత్తితే చాలు కనకాభిషేకాలు, గుండె గొంతుకలోన కొట్లాడుతాది / ఎలుతురంతా మేసి ఏరు
నెమరేసింది / ఎన్నెలంతా సొగసు ఏటిపాలేనటర
నీ చరణకమలాల నీడయేచాలు ఎందుకోయీ స్వామి బృందావనాలు / ఏనాటిదో ఈ బంధం
ఎరుగరాని అనుబంధం - ఎన్ని యుగాలైనా ఇది ఇగిరిపోని గంధం /
చిక్కు పడిన కురులు చూచి సిగ్గు ముంచుకు వచ్చెరా /
రేయి గడిపిన హాయినంతా మనసు నెమరు వేసెరా
ఆనాటి కాలం, ఏనాటికైనా తిరిగి వస్తుందని ఆశిస్తూ
ఎంకి నాయుడుబావ, శశికళ, కిన్నెరసాని వంటి ప్రణయమూర్తులు తెలుగునాట ఇంటింటా
నడయాడాలని కోరుకొంటూ
ఆలుమగల అనురాగాలు, ఆరాధనలు మునుపటివలె ప్రతి ఇంటా వెల్లివిరియాలని విశ్వసిస్తూ
సృజనకవిత ఒక్కటే ఈ మహత్కార్యాన్ని సాధిస్తుందని, పూర్వవైభవం నెలకొంటుందని ఆశిస్తూ.... మి

# రాబందుల సందడి

– ఎ.కె.

అది వంద ఎకరాల చెఱువు. అట్లాంటి చెఱువులు చాలానే ఉన్నాయి. ఒకప్పుడు అన్ని ప్రక్కల నుంచి వర్షపు నీరు వచ్చి ప్రాణంతో ఉండేవి. ఇప్పుడు ఎటునుంచీ నీరు రావడంలేదు. ఉన్న నీటిలో ప్రాణవాయువు లేక చెఱువులో వున్న చెట్లు మోడులైపోయినాయి. ఒక్క ఆకూ లేక అస్థిపంజరాలమాదిరి ఆకాశం వైపు చేతులు చాచి దీనంగా నిలిచాయి. ఆ చెట్ల మీద రాబందుల కుటుంబాలు బంధువులతో పాటు ఉంటున్నాయి. అటు వంటి సందర్భంలో...

ఒక రాబందు కుటుంబంలోని తల్లి రాబందు పిల్లపక్షులతో, తండ్రి రాబందుతో ఫ్యామిలీ మీటింగు పెట్టింది. 'చూడండి పిల్లలూ మీకు రెక్కలు వచ్చాయి... ముక్కులూ వచ్చాయి. ఇంక మేము పెద్ద వాళ్ళమైపోయాం. మీకు కోసం ఆహారం తెచ్చి పెట్టే ఓపిక లేదు. అందుకని మీరందరూ ఇక మీకోసమే కాకుండా మా కోసం కూడా ఆహారం తేవాలి. అందుకోసం మీకు కొన్ని మెళకువలు చెప్పదలిచాము. అంతా విన్న తరువాత సందేహాలు ఉంటే అడగవచ్చు'... అని మొదలుపెట్టి– 'మనకు బలమైన కాళ్ళున్నాయి. వాటికి వాడి గోళ్ళున్నాయి. కోడిపిల్లల్ని, కుందేళ్ళను, తేలికగా తెచ్చుకోవచ్చు. చెట్లమీద గూళ్ళల్లో ఉన్న పావురాలపిల్లలను అనాయాసంగా తెచ్చుకోవచ్చు. ఇదంతా కొంత శ్రమతో కూడిన పనే. వీటి రుచి కూడా అంతంత మాత్రమే. కాని అన్నికంటే రుచిగల ఆహారం.. ఆహా! తలుచుకుంటేనే నాలుక చొంగకారిపోతుంది, అదే మనిషి మాంసం! ఎన్ని సార్లు మీకు  గోరు ముద్దలు చేసి తినిపించలేదు', అంటూ కళ్ళు మూసుకొని లొట్టలేసింది తల్లి రాబందు.

అన్నేళ్ళు బతికిన తల్లికే తిండియావ చావకపోతే ఇక పిల్లల సంగతి చెప్పేదేముంది? 'తెచ్చిపెట్టావు సరే ఎక్కడదొరుకుతుందో చెప్పలేదు? తొందరగా చెప్పమ్మా ఆకలేస్తుంది.' అని పిల్లరాబందులు అరిచాయి. వాటి అరుపులతో చెఱువులో అలలు లేచాయి. తల్లి రాబందు 'మనిషి మాంసం రాబందులకోసం ప్రకృతి సృష్టించిన ప్రత్యేకమైన ఆహారం.' అని ఇంకేదో చెప్పబోతుండగా పిల్లలు 'కబుర్లు కాదు దొరికే చోటు చెప్పు' అని తల్లి రెక్కలు లాగాయి. 'సరేగాని, నువ్వు కోళ్లు, కుందేళ్లు తెచ్చావు కాని ఎప్పుడూ మనిషిని తీసుకురాలేదే' అని ఒక అతివాద పిల్ల అరిచింది. 'మీరు మనిషిని చూడలేదుగదా, మనిషి చాలా పెద్ద జంతువు. దాన్ని చంపటం మోసుకు రావటం మనవల్ల కాదు' అని తల్లి రాబందు అంటుండగా ఒక హేతువాద పక్షిపిల్ల 'మరి అంత పెద్దగా ఉంటే నువ్వెట్లా చంపావు?' అని అడిగింది. ఇంకో హింసావాద పిల్ల 'అయితే మనం మనిషి మాంసం తెచ్చుకోలేమా? ఆకలితో చావాల్సిందేనా?' అని కేకలు పెట్టింది. 'మనం పెద్దపులులు, తోడేళ్ళ జోలికి పోముకదా, మరి అంత పెద్ద జంతువైన మనిషిమాత్రం ఎట్లా దొరుకుతుంది. నాకు ఇప్పుడే చెప్పు' అని ఒక వితండవాద పక్షిపిల్ల గీ పెట్టింది. 'మనం రాబందులం. మనిషి ఎంత పెద్దజంతువైనా చంపేస్తాం. అంత శక్తి, యుక్తి మన వంశంలోనే ఉంది.' అని పాడింది ఒక వంశోద్ధారక రాబందు.

'అలా కాదు పిల్లలూ నేను చెప్పేది వినండి. మనకు మనిషిని చంపగల శక్తి లేదు. కాని మనిషికి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. అవే గనక లేకపోతే మనకు మనిషి మాంసం రుచే తెలిసేదికాదు. మన పూర్వీకులైన జ్ఞానులు ఈ లక్షణాలు కనిపెట్టి మనకు కొన్ని సూచనలు యిచ్చారు. మనిషి భాషలో ఏమంటారో కాని, మనిషిలో ఒకరకమైన కోపం, అసహనం, స్వార్థం ఉన్నాయి. నా ఎరుకలో ఈ భూమి మీద మరే జంతువుకు ఈ లక్షణాలు లేవు. రెండు మనుషుల మందలు అలాంటి కోపంతో ఎదురెదురుగా కలబడ్డాయంటే భూమి అదిరిపోతుంది. అరుపులతో చెవులు మ్రోగిపోతాయి. ఆ ప్రదేశమంతా మంటల్లో మసై పోతుంది అంతే. ఆ తరువాత మనకు కావలసినంత మనిషి మాంసం ముక్కలు ముక్కలుగా దొరుకు తుంది. మనతెలివి తేటలన్నీ ఎదురెదురుగా నిలుచున్న ఆ మనిషి మందలను ఆకాశం నుంచి చూసి గుర్తించగలగటమే. ఇంక ఆహారానికి కొదవేముంది. నువ్వు ఆ దగ్గరకు చేరుకోక ముందే వాళ్ళ కేకలతో పాటు మనిషి నెత్తుటి వాసన నీ ముక్కుపుటాల్లోకి వస్తుంది. ఆ వెంటనే ముక్క ముక్కలైన మనుషుల గుంపులు మనకు కనువిందు చేస్తాయి.' ఎందుకు అని ప్రశ్నించటం అలవాటైన హేతువాద రాబందు 'అమ్మా! అసలు జంతువు మరో జంతువుని చంపేదే ఆకలి వేసినప్పుడు తినడానికే కదా! మరి మనుషులెందుకు ఇలా చంపుకుని తినకుండా పోతారు?' అని అడిగింది.

'పులులు జింకల్ని, తోడేళ్ళు మేకలని చంపి తింటాయి. మనం వాటి ఆకలి తీరిందాకా దగ్గరకు కూడా వెళ్ళలేముకదా' అని ఒక అతివాద పక్షి అంది. తల్లి రాబందు 'మీలాంటి జిజ్ఞాసువులైన సంతతని కన్నందుకు గర్విస్తున్నాను. ఆకలికో

ఆహారానికో కాక కేవలం కోపంతో, ద్వేషంతో చంపుకునే జంతువులు మనుషులే! మనం చంపకుండా తమను తామే చంపుకునే వింత లక్షణాన్ని మనుషులకి ప్రకృతి కేవలం మనకోసమే ఇచ్చినట్లుంది. అందుకని మా సలహా ఏమంటే మనుషుల్ని ఆ గుంపుల కదలికల్ని కనిపెడుతూ ఉండాలి. మనం ఎట్లాగూ వాటిని చంపలేము. ఎత్తుకు రాలేము. కాని ఎదురెదురుగా మోహరించి అరుచుకుంటూ చంపుకుంటు న్నాయంటే మనపంట పండినట్లే. మా పెద్ద వాళ్లు మా తరానికిచ్చిన హితబోధ ఇదే, మీకు చెప్తున్నాను.' 'అసలు ఆహారం కోసం కానప్పుడు అవి ఎందుకు చంపు కుంటున్నాయి? ఒక ప్రాణిని మరొక ప్రాణిని కారణం లేకుండా చంపటమనేది నా ఊహకే అందటం లేదు' అని హేతువాద రాబందు ముక్కు ప్రశ్నలాగా పెట్టింది.

అప్పుడు తల్లి రాబందు 'భేష్ అయిన ప్రశ్న వేశావు నాబంగారు కొండ. నేను ఇలాగే ప్రశ్నించాను మన పెద్దల్ని . ఆహారం కోసం కానప్పుడు మనుషులు పరస్పరం ఎందుకు చంపుకుంటాయి అనే ప్రశ్నకు సమాధానం మహా మహా మేధావి రాబందులకు కూడా అంతుబట్టలేదు. ఆ ప్రశ్నకు సమాధానం తెలిసిన రోజున రాబందుల నాగరికతలో నూతన శకం ప్రారంభమౌతుంది. ఎందుకంటే అప్పుడు మనం మన అవసరాన్ని బట్టి వాటికి చంపుకోవాటానికి ప్రేరణ కలిగించ వచ్చు. అయితే నా అనుభవంలో తెలుసుకున్న దేమిటంటే మనకు ఆ జ్ఞానం, సమాధానం అవసరంలేదు. ఇప్పటికే అవి ఎంతగా చంపుకుంటున్నాయంటే మనలాంటి గుంపులు ఎన్ని తరాలు తిన్నా తరగనంత మనిషి మాంసం ఈ భూమ్మీద దొరుకుతుంది. మన పూర్వీకుడు, ఈకలు ఊడిన జ్ఞాని రాబందు ఒక ప్రతిపాదన చేశాడు. ఆహారం కోసం కాకుండా పరస్పరం చంపుకుంటున్నాయి కాబట్టి ఇవి జంతు జాతికి చెందవు. బహుశా ఇవి నడిచే చెట్లు కావచ్చు. ఎందుకంటే తుఫాను గాలికి నేలకు రాలిన చెట్ల కాయలు కొన్ని పక్షులకు జంతువులకు ఆహారం అవుతున్నాయి కదా. అలాగే కోపంతో ఊగిపోతూ, ఉద్రేకాలతో నరుక్కుంటున్న మనుషులు మనకు ఆహారం అవుతున్నాయి. మందలుగా వెళ్ళినప్పుడు ఒక మనిషి ఇచ్చిన ఆజ్ఞను బట్టి మిగతా మనుషులు ఎదుటి గుంపు మీదకి లంఘిస్తాయి. అప్పుడు బరిసెలతోనూ, కత్తులతోనూ చంపుకుంటాయి. ఎవరో గుఱ్ఱం మీద అరుస్తుంటారు. మందలు మందలుగా మనుషులు నరుక్కుంటూ పోతారు. అప్పుడే మనకు విందు. తెగిన చేతులు, విడిపోయిన తలలు, ఎగజిమ్మే నెత్తురు అబ్బా! ఎంతం పండగ.

'రాను రాను ఈ పద్ధతి మారిపోయింది. మా తరము వచ్చే సరికి పేలుడు పదార్థాలు వచ్చాయి. గుళ్ళు గుచ్చుకుంటున్నాయి. అయితే దూరం నుంచే వీళ్ళు ఒకళ్ల నొకళ్ళు చంపుకుంటున్నారు. ఈ పేలుడు మూలంగా మాసం రుచి మారి పోతుంది. కొంత కమురు కంపు కొడుతుంది. కాని మెల్లగా మీకు అది అలవాటైపోతుందిలే. ఆకాశం నుంచి గెద్దల్లా కొన్ని రకాల గుంపులు కింద వాళ్ళమీద నిప్పులు పోస్తాయి. అంత శరీరం చెల్లా చెదరయిపోతుంది. ఆ ముక్కలన్నీ ఏరుకుని తినాలి. ఇవన్నీ మీరు అనుభవం మీద నేర్చుకుంటారు. అయితే ఎన్ని రకాలుగా కొట్టుకున్నా ఒకరినొకరు చంపుకోవటం ఈ మనుషులకు మహా ఇష్టం. ఎన్ని వేల సంవత్సరాల నుంచో ఇలా జరుగుతుంది కాబట్టే మన జాతికి తిండికి లోటే లేదు. ఒకడి మాట ఒకడు ఎందుకు వినడో తెలీదు. మనిషి దృఢంగానే ఉంటాడు. నిటారుగా నిలబడి పరిగెత్త గలడు కూడా. అసలు రహస్యం ఈ మనిషిని ఏ జంతువు తినదు. అందుకని మనకు పండగ.

'ఇప్పటి తరానికి కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. గుంపులు కొట్టుకు చచ్చినా, కాల్చుకు చచ్చినా వెంటనే వాలి పోతాం కదా మనం. కాని మనకంటే ముందు వాలి పోతున్నారు. కెమేరాలు, వైర్లు, లైట్లు పట్టుకొని. (ఈ మాటలన్నీ వృద్ధ రాబందు పరిశోధించి నేర్పాడు) వీళ్ళు చచ్చిపోయేవాడ్ని పలకరించి, లేదంటే గుడ్లు తేలవేసిన వాడి నోట్లో అదేదో నల్లటిది పెట్టి మాట్లాడమంటారు. ఇవన్నీ మనకు ఆలస్యం చేసేవే. కాని ఈ తంతు చూట్టానికి బావుంటుంది. ఆరిపోయిన ఆహారం రుచిగా ఉండదు. మనిషి మాంసం బిగుసుకు పోతే తినబుద్ధి కాదు. ఎంత ఊరికినే కష్టపడకుండా వచ్చినా రుచిగా లేకపోతే తినలేం కదా.

'మన జ్ఞాని మరొక విషయం చెప్పాడు. ఇదివరకటి లాగ ఇప్పుడు వాహనాల క్రింద పడిన వాళ్లను వదిలి పోవటం లేదు. వాళ్ళ అవయవాలు తీసి అమ్ముకుంటారని.' అని అమ్మ రాబందు ముగించింది.

'అమ్మో కొన్నాళ్ళు పోతే మనకు మనిషి మాంసం దొరకదేమో' అని పిల్ల రాబందులు గోల పెట్టాయి. వీటి గోల సద్దుమణగక ముందే 'అదుగో మనిషి నెత్తుటి వాసన! అడవిలోంచి వస్తుంది పదండి' అంటూ రెక్కలు విదిలించి ఆకాశంలోకి ఎగిరింది తల్లి రాబందు. పిల్ల రాబందులు కూడా రెక్కలు టప టప లాడించి పైకి లేచాయి. చెట్లు అస్థిపంజరాల్లాగా, చెఱువు స్మశానం లాగా ఉండిపోయాయి.

(ము.పా.సా- స్ఫూర్తి)

# సంజీవదేవ్ స్వీయచరిత్ర

‘తుమ్మపూడి’ సంజీవదేవ్ స్వీయచరిత్ర. విడివిడిగా ఇంతకు పూర్వం పుస్తకరూపంలో వచ్చిన మూడు సంపుటాలయిన తెగిన జ్ఞాపకాలు (సంజీవదేవ్ 4వ సం॥ నుంచి 1950 వరకూ) స్మృతిబింబాలు (1950 నుంచి 1960 వరకూ) గతంలోకి (1960 నుంచి 1965 వరకూ) కలిసి ఒకటిగా వచ్చిన బృహత్ సంపుటమిది. రాజాచంద్ర ఫౌండేషన్‌వారు సంజీవదేవ్‌తో ప్రత్యక్ష పరిచయము, స్నేహమున్న జుజ్జరపు చంద్రమౌళి, వారి సతీమణి ఝాన్సీగార్ల సహకారంతో సౌందర్యాన్వేషకులకు, కళారాధకులకు సమర్పించిన కానుక. ఇది సంజీవదేవ్ రచనలను ప్రేమించి వారి అభిప్రాయాలను గౌరవించే వారికిదొక అక్షయపాత్ర. సంజీవదేవ్ పుస్తక ప్రారంభంలోనే చెప్పినట్లు ఇది ఆయన స్మృతి, విస్మృతికి చెందిన అనుభవసారం.



వ్యక్తిగతంగా తనకు సాహిత్య విభాగాల్లో స్వీయ జీవిత చరిత్రలంటే ఎక్కువ మక్కువ అని ఆయనే చెప్పుకున్నారు. ఎవరి స్వంత మాటలలో వారి జీవన గాథలను వినటం ఆయనకేకాదు మనందరికీ ఆనంద దాయకం. సంజీవదేవ్ సృజనశీలి. ఆయన శైలిలో ఒక ప్రత్యేక ఒరవడి ఉంటుంది. ఆయన తర్కంలో చమత్కారం పాలెక్కువ. ఆయన ఆస్తికత్వం గురించి వ్రాస్తే అందులో నాస్తికత్వపు ఛాయలు కనిపిస్తాయి. నాస్తికత్వం గురించి వ్రాస్తే అందులో ఆస్తికత్వపు నీడలుంటాయి.

“నేను జడవాదిని, కారణం జడం అనేది చేతనమే / నేను చేతనవాదిని కారణం చేతన అనేది జడమే.

ఈ సత్యమే నా రచనకు వర్తిస్తుంది” అని ఆయన చెప్పుకుంటారు. అందుచేతనే ఆయన స్వీయచరిత్ర చదివిన కొందరు పాఠకులాయనకు ఇవి వాస్తవాలా, కల్పనలా అని ప్రశ్నించారని ఆయన చెప్పుకున్నారు Fact is always stranger than fiction అన్నది జగమెరిగిన సత్యమయినా అది సంజీవదేవ్ శైలిలో మరింత వింత పోకడలకుపోయి చదువుతున్నప్పుడు మనలో ఉత్కంఠత రేపుతుంది. అందుకే ఆయన స్మృతి బింబాలలో కన్నీటిజల్లులు, పన్నీటిజాలులు అన్నీ ప్రత్యక్షం అవుతాయి. ఇవి జీవితంలో జరిగినవాటికి ప్రతిబింబాలు కావు. జరిగిన స్మృతులకు ప్రతిబింబాలు అన్నాడాయన.

స్వీయ చరిత్రను గ్రథస్థం చేయటంలో రచయిత వీలయినంత వరకూ ఎక్కువ విషయాలు, తనకు సంబంధించిన అన్ని విషయాలు చెప్పాలనే లౌల్యానికి గురవుతారు. కానీ ఈ మనో వైకల్యాన్ని ఆయన అధిగమించగలిగాడు. సంజీవదేవ్ ప్రకృతి ప్రేమికుడు, సౌందర్యారాధకుడు, సత్యాన్వేషి, లలితకళ పై ప్రేమే కాదు, ప్రజ్ఞకలవాడు కూడా.

అందుకనే ఆయన జీవిత చరిత్రలో కవులు, రచయితలు, చిత్రకారులు, శిల్పకారులు, తాత్వికులు ఇలా ఎందరో భిన్నవ్యక్తులు, వ్యక్తిత్వాలు గోచరిస్తాయి. ఆయన ఒక వ్యక్తిగురించి వ్రాస్తే ఆ వ్యక్తి యొక్క బహిర్, అంతర్ రూపులను, మానసిక రూపాలను మనముందు బొమ్మగట్టి ఉంచుతాడు. ‘మనిషి అంటే ప్రధానంగా స్వరూప స్వభావాల కూడికయే’ అంటాడు సంజీవదేవ్. ఆ వ్యక్తి గురించి చదివినపుడు ఆ వ్యక్తి మనకు పరిచయస్తుడులా అనిపిస్తాడు. అంత ఆత్మీయమైన శైలి ఆయనది.

ఈ జీవిత చరిత్రలో అంతర్భాగంగా ఎన్నో కళా విశేషాలు దాగున్నాయి. చరిత్రకు పనికివచ్చే పరిశీలున్నాయి. రచన పూర్తి పాజిటివ్ దృక్పథంలోనే సాగుతుంది. ఎందుకంటే ఆయన వ్యక్తిగత జీవితంలో అందం, ఆనందం, ఆత్మీయతల పాలెక్కువ కాబట్టి. ఆయన జీవితకాలంలో ఆయనకు సమకాలికులుగా జీవించటం అదృష్టం అన్నవారున్నారు. ఇక వారితో చెలిమి, సాంగత్యం ఉన్నవారి గురించి చెప్పేదేముంది.

అంతా ఒక ఉన్నత సంస్కారానికి చిహ్నం. ఆయన మూడు భాగాలుగానున్న ఈ జీవిత చరిత్రను 1965 సం॥ నాటికి ముగించారు. ఆ తరువాత ఆయన సాహిత్య వ్యాసాంగమంతా, వ్యాసాలు, ఉత్తరాల రూపంలో వున్నా, వ్యక్తిగత జీవితానికి సంబంధించి వ్రాసినది అతి తక్కువ. ఈ విషయం గురించి చెబుతూ "1965వ సంవత్సరము తరువాత నా జీవితంలో ఘటనా వైచిత్రి తక్కువ, ఆలోచన జీవితం, అనుభూతి జీవితం, రచనాజీవితం, ఉపన్యాస జీవితం ఎక్కువ. అప్పుడిక స్వీయ చరిత్ర రచన నీరసంగా, ఎండుగా తడుతుంది" అని పేర్కొన్నారు. ఈ విషయం చెప్పిన తరువాత మరో 35 సం॥లు జీవించారాయన.

అశేష జీవితకాలంలో మరికొందరు విశిష్ట వ్యక్తులు ఆయనను కలిసి ఉంటారు. ఆయనపై వారి ప్రభావం, వారిపై ఆయన ప్రభావం తప్పకుండా ఉండి ఉండాలి. అలానే కొత్తగా వచ్చిన కొత్త కళా శైలులను, ప్రక్రియలను ఆయన గమనించే ఉంటారు. నూతన సంగీత రాగ, లయలను వినే వుంటారు. కానీ ఆయన నిర్లిప్తతతో ఉండి ఉంటాడని మనమెవ్వరమూ అనుకోవటంలేదు. జీవితాన్ని, కళను, నిరంతరం శ్వాసించిన, వ్యక్తి అది లేకుండా క్షణంకూడా ఉండలేదు. ఆయన అనుభూతికి గురికాకుండా స్తబ్దంగా ఉండలేదు. ఆ దివ్యాను భూతులను డైరీల రూపంలోనో, మరో విధంగానో ఎక్కడో ఉండి వుంటాయి. ఆ నిక్షిప్తమైన నిధిని మనం కనుగొని బయట పెట్టాలి. ఆ రసానందాన్ని అందరి పరం చేయాలి. సంజీవదేవ్ జీవితాన్ని సౌందర్యంతో మిళితం చేసుకున్న రాజర్షి. ఆయనలో ఒక తార్కికుడు, ఒక మార్మికుడు, ఒక తత్త్వవేత్త వున్నారు. ఆయన రాసిన ప్రతిపదం అర్థవంతం. ప్రతి వాక్యంలోనూ ఆయన మనకేదో సందేశాన్నిస్తున్నాడనిపిస్తుంది. మానవుడు వ్యక్తికంటె ఎక్కువగా అవ్యక్తి.

కారణం మానవుడు వ్యక్తపరచే దానికంటే వ్యక్తపరచందే అధికం...సంజీవదేవ్ లలిత సుకుమారమైన భావాలు కలిగివున్నవాడు కావటంతో ఆయనలో చాలా సున్నితమైన సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉంది. ఈ రచనలో అది దోబూచులాడుతూ మనకి కనిపిస్తుంది. దాన్ని మనం గమనించాలి.

## సంజీవదేవ్ చిరంజీవి

కాదు కాదది తుమ్మపూడి!
అది సంజీవ దేవుని రమ్యపురి!!
ఈ పల్లెన విరజల్లిన
కవితా విరి పరిమళాలు
రసరంజిత హృదయాలకు
సుందరతర ఉదయాలు!

ప్రకృతినే మహతిచేసి
మధుశృతులను మీటె నిచట
రసరేఖలు ప్రసరించిన
సంజీవుని రచనాలు

భరతావని నలుదిక్కుల
హిమపర్వత తరులందున
బహు మిత్రుల సహవాసిగ
నివసించిన ఋషీశ్వరుడు
సంజీవదేవ్ శ్రమజీవుడు

పలుభాషల కోవిదుడై
లలిత కళల శోభితుడై
నలుదిక్కుల పలుతావుల
రసగుళికలు వెదజల్లిన
సంజీవుడు కృషీవలుడు

అతని గద్యరచన చదవ
పద్యంగా వినిపించును
అతని పద్య రచనచూడ
గద్యంలా గమయించును

పద్యం, గద్యం, సాహిత్యం
తర్కం, తాత్విక విజ్ఞానం
చిత్రరచన వ్యాసంగం
సంచలనాత్మక విన్యాసం
సంజీవ దేవుని మణిహారం

సూర్యదేవర సంజీవదేవ్
ఒక రసమయ జీవనది
రసమయ సాహితీ ప్రతిధ్వని
సురచనా సుందర చరిత
తుమ్మపూడినే రస మయసభగా
మార్చేసిన ఘనజీవుడు

బహుభాషా కోవిదుడై
విఖ్యాతుల, మేధావుల స్నేహితుడై
ప్రవృత్తిని ప్రకృతిలో మేళవించి
దివికేగిన సంజీవదేవ్
సూర్యుని వలె చిరంజీవి.

- యస్.వి.ఎల్

# చదవండి...




✦ **చిత్రగ్రంథి :** రచయిత సుధామ. అనేక రంగాలలో పేరుగాంచిన సుధామ అనేక విషయాలపై చేసిన కవితా గానమిది. సున్నితమైన శైలి సూటిగా చెప్పే ధోరణితో ఈ 60 కవితలు మనల్ని అలరిస్తాయి. *పుస్తకం పేజీలు: 134, వెల: ₹ 100/-, ఫోన్ : 9848276929*




✦ **కవిత్వం వింత భాష :** కవితా సంపుటి. రచయిత రఘువర్మ. రచయిత చిత్రకారుడు కూడా కావటంతో కొన్ని కవితలకు పక్కనే బొమ్మలు కూడా వేసుకున్నారు. 1972 నుంచి ఇప్పటి వరకూ తాను వ్రాసిన వివిధ అంశాలపై వ్రాసిన కవితల సంపుటిది. *పుస్తకం పేజీలు: 70, వెల: ₹ 40/-, అన్ని పుస్తకాల షాపులలోనూ లభ్యం.*



✦ **వెలుగునీడలు, భార్యాభర్తలు :** ఈ రెండు సినీ పుస్తకాలకు రచయిత ముళ్ళపూడి వెంకటరమణ వెండితెర సంభాషణలను యథాతథంగా స్క్రిప్ట్‌గా కాకుండా ఒక నవలగా మలిచి కొత్త ప్రయోగం చేశారు. ముళ్ళపూడి వారి ఈ కొత్త శైలి వల్ల సినిమా చూసిన వారికి సినిమా రెండవ సారి చూస్తున్నట్లు కళ్ళకు కడుతుంది. సినిమా చూడని వారికి నవల చదివిన అనుభవం కలుగుతుంది. ఈ పుస్తకాల ప్రచురణ కర్తలు శాంతా బయోటెక్స్ వరప్రసాద్ రెడ్డి, ఎమ్బీయస్ ప్రసాద్. వెలుగునీడలు- పేజీలు 100. వెల : *₹ 40/-*, భార్యాభర్తలు- పేజీలు 110. వెల: *₹ 40/-,*




✦ **టార్గెట్ :** రచయిత ఎమ్బీయస్ ప్రసాద్. ఇది ఒక నేర ప్రవృత్తికి చెందిన కథయినా మానవసంబంధాల ఆధారంగా కథ చెప్పబడింది. *సాక్షి* దినపత్రిక ఆదివారం అనుబంధంతో ఫన్‌డేలో సీరియల్‌గా వచ్చిన రచన. *పుస్తకం పేజీలు: 150, వెల : ₹ 60/-, ఫోన్ : 040-23047638.*




✦ **గుబాలింపు :** రచన, కార్టూన్లు బాలి. ప్రసిద్ధ ఇల్లస్ట్రేటర్ బాలి గీసిన కార్టూన్ల సంకలనం. ఆలస్యంగా పుస్తక రూపంలో వచ్చిన ఈ సంకలనం అందరూ కొని చదువ దగ్గది. ప్రచురణ కర్త వరప్రసాదరెడ్డి, సంచాలకుడు ఎమ్బీయస్ ప్రసాద్ అభినందనీయులు. *పుస్తకం పేజీలు: 154, వెల: ₹ 75/-, ఫోన్ : 9848276929.*

✦ **సాహు జీవితం రచనలు-పరిశీలన :** రచయిత వి.ఆర్.శర్మ. డాక్టర్ బన్న అయిలయ్య పర్యవేక్షణలో ఎం.ఫిల్ పట్టాకోసం సమర్పించిన పరిశోధనా వ్యాసం. సాహు ఒక వ్యక్తికాదు, అందువలననే ఆయనను సామాజిక శక్తిగా రచయిత పరిచయం చేశారు. సాహు జీవితచరిత్రను ఎన్నో కోణాల్నుంచి పరిశీలించి, పరిశోధించి మన ముందుంచారు. భవిష్యత్ తరాలకు సాహు ఎవరో, సామాజిక, సాహిత్య పరంగా ఆయన కృషి ఏమిటో క్షేత్ర పర్యటన చేసి అనేక విశేషాలను తెలియజేశారు. రచయిత కృషి అభినందనీయం. *పుస్తకం పేజీలు: 140, వెల : 90/-, ఫోన్ : 9391036987.*

✦ **ఆధునిక కథా సరిత్సాగరం-కరీంనగర్ జిల్లా కథలు :** సంపాదకులు బి.ఎస్. రాములు, వనమాల చంద్రశేఖర్. ఈ కథల సంపుటిలో వైవిధ్యపూరితమైన, తెలంగాణ సమాజ చిత్రణ ఉంది. యువతరం కథలతో పాటు, సీనియర్ కథకుల కథలు కూడా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా కథల సిరిస్‌లో ఇది మూడవది. పుస్తకం పేజీలు: 148, వెల: 90/–, ఫోన్: 9704708980 / 9391036987.




✦ **అపరాజిత :** రచయిత ఇసబెల్ అలెండి వ్రాసిన డాటర్ ఆఫ్ పార్ట్యూన్ అన్న నవలకు ముక్తవరం వారి స్వేచ్ఛానుసరణ. గాబ్రియల్ గార్సియా మార్క్వెజ్ తో పోల్చతగిన రచయిత్రి అలెండి. ప్రపంచ సాహిత్యం పై మక్కువ వున్న వారు తప్పక చదవ వలసిన నవల. *పేజీలు 200, వెల : ₹ 100/-.*




✦ **కథలు-కథకులు :** జాక్ లండన్ మొదలుగా 10 మంది ప్రసిద్ధి గాంచిన ప్రపంచ రచయితల కథా సంపుటి. ప్రతి కథకు దాని నేపథ్యంతో పాటు, రచయితను పాఠకులకు క్లుప్తంగా పరిచయం చేయటంలో ఈ పుస్తకంలోని కథలకు నిండుతనం వచ్చింది. మానవ వ్యక్తిత్వం అంతరంగాలను ఒడిసి పట్టుకునే కథలివి... రచయిత ప్రపంచ సాహిత్యాన్ని విస్తృతంగా పఠించిన ముక్తవరం పార్థసారథి. *పేజీలు 140, వెల : ₹ 80/-.*




✦ **మరణోపనిషత్ :** రష్యన్ రచయిత లియోటాల్‌స్టాయ్ రచించిన Dealth of Evan Ilyich కు ముక్తవరం వారి స్వేచ్ఛానువాదం. *పేజీలు 110, వెల : ₹ 80/-.*




✦ **మీరే డిటెక్టివ్ కాలక్షేపానికి పొడుపు కథలు :** రచయిత ముక్తవరం పార్థసారథి. హాస్యం లో తర్కాన్ని రంగరించి తయారు చేసిన డిటెక్టివ్ గుళికలు, రచయిత కాలక్షేపానికని మర్యాదకోసం అన్నా, ఇవి మేధకు పని చెబుతాయి. *పేజీలు 120, వెల : ₹ 80/-.*

*పైన పేర్కొన్న ముక్తవరం పార్థసారథి గారి పుస్తకాలు ప్రజాశక్తి, విశాలాంధ్ర, నవోదయ బుక్‌స్టాల్స్ లో లభ్యమవుతాయి.*




✦ **హైద్రాబాద్ జనజీవితంలో ఉర్దూసామెతలు:** రచయిత పరవస్తు లోకేశ్వర్. హైద్రాబాద్ నగర ప్రజలు తెలుగులో మాట్లాడుతూ, ఉన్నట్లుండి ఉర్దూ సామెతలను తమ సంభాషణలోకి అలవోకగా చొప్పించి మాట్లాడటం క్రిందటితరం నగరవాసులకు తెలియంది కాదు. కాలగమనంలో ఇంగ్లీషు భాష ఆధిక్యత పెరగటంతో అవి నెమ్మదిగా కాలగతిలో కరిగిపోయాయి. లోకేశ్వర్ వాటిని ఒడిసి పట్టుకుని మన సంస్కృతికి అతను తనవంతుకృషి చేశారు. ఈ సామెతలను 7 వర్గాలుగా ప్రచురించ బడ్డాయి. పేజీలు 42, వెల *: ₹ 30/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 91606808717లో సంప్రదించండి.*

✦ **1857 హైద్రాబాద్ తిరుగుబాటు గాథలు:** రచయిత పరవస్తు లోకేశ్వర్. 1857 తిరుగుబాటు గురించి వింటే ప్రతి భారతీయుడి హృదయం ఉప్పొంగుతుంది. మరీ ముఖ్యంగా హైద్రాబాద్ వీరుల గురించి విన్నపుడు. ఆనాటి హిందూ ముస్లిం ఐక్యత మళ్ళీ ఈనాడు కూడా సాధించటం కోసం ఈ కథలను వ్రాసేనన్నాడు రచయిత. ఈ పుస్తకంలోని విషయాలు చదివినపుడు ఎంతటి త్యాగఫలం నిష్ప్రయోజనమైందీ ఈ నాడు అనిపిస్తుంది. పేజీలు 75, వెల *: ₹ 50/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 91606808717లో సంప్రదించండి.*

## అప్పుడు - ఇప్పుడు



సనాతన సంక్రమ నవీనములు పూర్వ వర్తమాన వందనములు



వైదిక కర్ణాటక మాధ్యమిక మిశ్రిత పాశ్చాత్యములు



బాలబాలికల సనాతన నవీన వైఖరులు

చిత్రకారుడు: **తలిశెట్టి రామారావు**

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు** ₹

| | | | |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 | " " | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-3 | " " | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 8. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమూహ | " " | 60.00 |
| 10. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 11. | సిద్ధార్థ | " " | 50.00 |
| 12. | నాలో నేను | " " | 30.00 |
| 13. | కథాంజలి-1 | *ఎస్సారె* | 80.00 |
| 14. | కథాంజలి-2 | " " | 110.00 |
| 15. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 16. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 17. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |
| 18. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 19. | గురవాయణం | డాక్టర్ *గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 11. | నూరేళ్ళ తెలుగు కథ - మహ్మద్ ఖదీర్ బాబు | |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందప్రశ్నలు - *బోధ చైతన్య* | 150.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం: జె. లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం - బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు - ఈమని శివనాగిరెడ్డి | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |
| 2. | యతిగీతం- స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

***మిసిమి** విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..............................................................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..............................................................................

వీథి ..............................................................................

పేట ..............................................................................

ఊరు ..............................................................................

పిన్ ..............................................................................

సెల్ ..............................................................................

**3. సంతకం :** ..............................................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi




అందానికి అలంకారం కాళహస్తి కలంకారి

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



అమ్మ